వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

నవంబర్ 2006 64 రు. 10

- ఫోకస్ : హైదరాబాద్ అభివృద్ధి - మంచీ చెడూ
  నాలుగు వ్యాసాలు
- యాభై ఏళ్ళ ఆంధ్రప్రదేశ్ - విజయాలు, వైఫల్యాలు
  ప్రముఖుల అభిప్రాయమాలిక
- తెలంగాణ పై రెండు వ్యాసాలు
- కొత్త విశ్వసనీయతా యత్నం లోక్ సత్తా
- ఉన్నత విద్యార్జన - దళితుల జన్మ హక్కు

తెలుగునాట సామాజిక పరిశోధనా రంగంలో కొత్త ప్రయోగం
సిడిఆర్‌సి - వీక్షణం స్వల్పకాలిక ఉపకార వేతనాలు

తెలుగు సమాజం తన గురించి తాను చేసుకునే అన్వేషణకు మార్గాలు కల్పించడానికీ, ఆ అన్వేషణను వ్యక్తీకరించడానికీ ఏర్పడిన సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్ (సిడిఆర్‌సి), రాజకీయార్థిక సామాజిక మాసపత్రిక వీక్షణం తెలుగునాట సామాజిక పరిశోధనా రంగంలో కొత్త వెలుగులు ప్రసరింపజేయడానికి ఒక కొత్త ప్రయోగానికి పూనుకుంటున్నాయి. తెలుగు సమాజంలో వివరమైన, లోతయిన పరిశోధన అవసరమయిన అనేక సమస్యలపై తగిన సమయం తీసుకుని పరిశోధన జరపడం కొరకు స్వల్పకాలిక ఉపకార వేతనాలను ప్రకటిస్తున్నాయి.

అనంతపురం కరువు, మహబూబ్‌నగర్ వలసలు, నల్లగొండ ఫ్లోరైడ్, నల్లమల చెంచుల దుర్భర జీవనం, కడప యురేనియం, సిరిసిల్ల చేనేత కార్మికుల ఆత్మహత్యలు, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ వల్ల మూతబడిన పరిశ్రమల కార్మికుల వెతలు, రైతుల ఆత్మహత్యలు, బాక్సైట్ తవ్వకాలు, వన్ ఆఫ్ సెవెంటీ చట్టం, హైదరాబాద్ పరిసర భూములు, కొల్లేరు ఆక్రమణలు, పోలవరం .... ఆంధ్రప్రదేశ్‌లో వివరంగా అధ్యయనం చేయవలసిన సామాజిక, రాజకీయార్థిక అంశాలకు కొదవలేదు. ఇవి కాక మరెన్నో సామాజిక అంశాలు కూడ ఉండవచ్చు. కాని ఈ అంశాలలో చాలా వాటిపైన అడపాదడపా పత్రికావ్యాసాలు, వార్తలు తప్ప వివరమైన, సమస్యను అన్ని కోణాల నుంచి చర్చించే పూర్తి స్థాయి అధ్యయనాలు లేవు.

ఈ స్వల్ప కాలిక ఉపకార వేతనం...

- ★ పరిశోధనా విద్యార్థికి నెలరోజుల వ్యవధి ఇస్తుంది.
- ★ ఖర్చులతో కలిపి రు. 10,000 ఉపకార వేతనం ఇస్తుంది. (ఇందులో రు. 4,000 ఖర్చులకు సరిపోవచ్చునని, రు. 6,000 పారితోషికం అని అంచనా)
- ★ పరిశోధనా విద్యార్థి వ్యవధి ముగియగానే వీక్షణం కు ఒక వ్యాసం/నివేదిక రాయవలసి ఉంటుంది.
- ★ మరొక నెల రోజుల వ్యవధిలో అదే అంశం మీద వివరంగా దాదాపు 80-100 పేజీల అధ్యయన నివేదికను సమర్పించవలసి ఉంటుంది.
- ★ ఆ పుస్తకానికి గణాంకాల పట్టికలు, వివరణలు చేర్చి, ప్రచురించి, విస్తృతంగా ప్రచారం కల్పించే బాధ్యతను వీక్షణం పబ్లికేషన్స్ తీసుకుంటుంది.

సామాజిక శాస్త్ర విద్యార్థులకు, పాత్రికేయులకు, పరిశోధకులకు, ఆలోచనాపరులకు అపూర్వమైన అవకాశం.

వెంటనే మీ దరఖాస్తులు పంపండి. మీ రచనా, పరిశోధనా అనుభవం, మీరు ఎంచుకునే సామాజిక అధ్యయనాంశం, ఆ అంశాన్ని అధ్యయనం చేయడానికి మీకున్న అర్హతలు, అవకాశాలు తెలియజేయండి.

ఎడిటర్, 'వీక్షణం'
సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రీసెర్చ్ అండ్ కమ్యూనికేషన్,
మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.
ఫోన్/ఫ్యాక్స్ : 040 - 66843495

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రీసెర్చ్ అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ

64 నవంబర్ 2006


వార్షిక చందా: రు.120 విడి ప్రతి : రు. 10

సంపాదకీయం

అఫ్జల్ మరణశిక్ష - రాజకీయ మొరటుదనం


దేశ రాజకీయ రంగస్థలం మీద జరుగుతున్న నిరర్థక, అనాలోచిత, అప్రజాస్వామిక చర్చలెన్నిటికో ప్రతినిధిగా, నిదర్శనంగా నిలుస్తుంది ప్రస్తుతం అఫ్జల్ గురు ఉరిశిక్ష విషయంలో జరుగుతున్న చర్చ. ఒక మనిషిని చంపవలసిందేనని ఊరూవాడా ఏకమయ్యేట్టు గగ్గోలు పెడుతున్న రాజకీయపక్షాలూ, ప్రచారసాధనాలూ తమ డిమాండ్‌లోని అమానుషత్వం గురించి ఒక్క క్షణం పాటయినా ఆలోచిస్తున్నట్టులేదు. చట్టంలో మరణశిక్ష ఉన్నందువల్ల, రాజ్యాంగం కూడ జీవించే హక్కుకు మినహాయింపుల గురించి మాట్లాడినందువల్ల మరణశిక్ష న్యాయబద్ధమైనది కాకపోయినా చట్టబద్ధమైన దేనని వాదించే వాళ్లుకూడ ఉండవచ్చు. కాని చట్టబద్ధ పాలన కూడ, రాజ్యాంగం కూడ నిష్పాక్షికమైన, హేతుబద్ధమైన, న్యాయమైన విచారణ క్రమం ఉండాలనే అంటాయి. మహమ్మద్ అఫ్జల్ గురు అనే ఒకానొక ఖైదీని ఉరితీసినంత మాత్రాన భారత పార్లమెంటు ప్రతిష్ఠ పునరుజ్జీవం పొందుతుందో లేదో తెలియదు గాని, ఆ ఉరి భారత చట్టబద్ధ పాలనకు మాత్రం మచ్చ తెస్తుంది. ఎందుకంటే ఆ మరణశిక్షలో నిష్పాక్షికత లేదు, హేతుబద్ధతలేదు, న్యాయబద్ధతలేదు. అఫ్జల్‌గురు మరణశిక్ష అనేక ప్రశ్నలను తొక్కిపెట్టి, దాటవేసి, దౌర్జన్యంతో తోసిరాజని ముందుకు సాగుతోంది. మొట్టమొదట, అఫ్జల్ గురు ఒకప్పటి మిలిటెంటే, సరెండర్ అయిన మిలిటెంటే తప్ప, నేరం జరిగినప్పటికి మిలిటెంట్ కాదని, అందువల్ల అతణ్ణి తీవ్రవాద చట్టం కింద విచారించలేమని కింది నుంచి పైదాకా అన్ని న్యాయస్థానాలూ చెప్పాయి. అయినా అతణ్ణి వ్యతిరేకిస్తున్న శక్తులు ఇంకా అతణ్ణి తీవ్రవాదిగానే గుర్తిస్తున్నాయి. రెండు, అతనికి కింద విచారణ జరిగిన న్యాయస్థానంలో సరైన న్యాయ సహాయం అందలేదు. ఆ న్యాయ సహాయం అందని స్థితిలో, కేవలం అనుమాన ప్రమాణం పైన అతణ్ణి కుట్రదారుగా నిర్ధారించడం జరిగింది. అసలు పార్లమెంటు మీద దాడే ఒక డ్రామాగా భావించే ప్రజాభిప్రాయం కూడ ఉండగా, అందులో పాల్గొన్న వారందరినీ కాల్చివేసి, సాక్ష్యం లేకుండా చేసి, వారికి సహాయం చేశాడన్న నేరం మీద అఫ్జల్‌కు మరణశిక్ష విధించారు. కాశ్మీర్‌లోని ఒక పోలీసు అధికారి చెప్పిన మీదటనే ఆ సహాయం చేశానని, అందుకు తన దగ్గర సాక్ష్యాలున్నాయని అఫ్జల్ చెపుతున్నా ఆ గోడును వినిపించుకున్న వాళ్లేలేరు. శతఘ్నుల కొనుగోలులో, శవపేటికల కొనుగోలులో, ప్రశ్నలడిగే అవకాశాల అమ్మకంలో, విశ్వాస పరీక్షలో వోట్ల అమ్మకంలో మన ప్రధాన మంత్రులు, మంత్రులు, పార్లమెంటు సభ్యులు పోగొట్టగలిగిన పార్లమెంటు ప్రతిష్ఠ కన్న ఎక్కువ అఫ్జల్ ఎట్లా పోగొట్టగలిగాడో చెప్పగలిగే వాళ్లెవరూ లేరు. కేవలం ముస్లిం అయినందువల్ల ఏ సాక్ష్యం లేకపోయినా అతనికి మరణశిక్షా విధించవచ్చు. మరణశిక్షను అమలు చేయమని గగ్గోలు పెట్టవచ్చు. 'ఇప్పుడిప్పుడే కాశ్మీర్‌లో శాంతి స్థాపన ప్రయత్నాలు మెరుగుపడుతున్నాయి. గతంలో మక్బూల్‌భట్ ఉరివల్ల గాయపడిన కాశ్మీరీ జనహృదయం అక్కడి హింసాకాండకు కారణమయింది. అందువల్ల ఇప్పుడు సరయిన కారణాలు లేకుండా, సాక్ష్యాధారాలు లేకుండా అఫ్జల్‌ను ఉరితీసి మరొకసారి కాశ్మీర్ అల్లకల్లోలం కావడానికి దారి తీయవద్దు' అని కాశ్మీర్ నాయకులు చేస్తున్న హేతుబద్ధమైన వాదనలు, దేశద్రోహకరంగా వినిపిస్తున్నాయి. మానవీయమైన స్పందనలు, హేతుబద్ధమైన వాదనలు, చారిత్రక, సామాజిక కారణాలు అర్థం కానంత, అర్థం చేసుకోలేనంత మొరటుబారి పోయిందా ఈ దేశ రాజకీయం? అరవై ఏళ్ల సొంత పాలన మనను ఎక్కడినుంచి ఎక్కడికి తీసుకుపోతోంది? ◆

లోపలి పేజీల్లో...



హైదరాబాద్ అభివృద్ధి మంచీ చెడూ

తెలుగు ప్రజల మహానగరంగా, ఆంధ్రప్రదేశ్ రాజధానిగా, 400 ఏళ్ల చరిత్రగల సంకీర్ణ సంస్కృతుల మిశ్రమ నగరంగా, దేశంలో ఐదో ప్రధాన నగరంగా, ఇటీవల ప్రపంచీకరణ శక్తుల దృష్టిని ఎక్కువగా ఆకర్షిస్తున్న నగరంగా హైదరాబాద్‌కు చాలా ప్రాధాన్యత ఉంది. చరిత్రలో హైదరాబాద్ అనేక మలుపులు తిరిగి అనేక స్వభావాలు సంతరించుకుని ఇవాళ ఉన్న స్థితికి వచ్చి నిలిచింది. ఇది అభివృద్ధా, పతనమా?



'వీక్షణం'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు.
'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష సామాజిక, ఆర్థిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో
అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040 - 66843495
ప్రింటర్స్ : చరితా ఇంప్రెషన్స్, ఆజామాబాద్, హైదరాబాద్.

సహాయ సంపాదకులు : డి.వి.రామకృష్ణారావు
సర్క్యులేషన్ మేనేజర్ : వై.రామచంద్రం 9949391028
కంపోజింగ్ & లే ఔట్ : సి. రాజశేఖర్

పాఠకుల వీక్షణం

వీక్షణానికి అభినందనలు. వీక్షణం అందిన ప్రతిసారి నేను పత్రికను చాల శ్రద్ధతో చదువుతాను. ఇందులో వచ్చే వ్యాసాలన్ని నేర్చుకోదగ్గవిగాను, తెలుసుకోదగ్గవిగాను ఉంటున్నాయి. ఈ కృషికి మిమ్మల్ని, మీ సహ ఉద్యోగుల్ని, రచయితలను మనసారా అభినందిస్తున్నాను. లోతైన పరిశీలనతో రాస్తున్న రచయిలందరికీ అభినందనలు. ముగ్ధుల్నిగావించే శైలితో, పూర్తి వివరాలతో ఉంటున్నాయి.

వీక్షణం గత కొన్ని సంవత్సరాలలో గుర్తించదగ్గ మార్పులతో ఎప్పటికప్పుడు తనను మెరుగుపర్చుకుంటూ పాఠకుల ముందుకొస్తోంది. పత్రిక ద్వారా సంస్థాగత ఎదుగుదల కూడ కనబడుతోంది. తెలుగు పత్రికారంగంలో దీనికి సరితూగే పత్రిక మరొకటి లేదు. నా బాల్యాన్ని తలుచుకుంటే ఇలాంటిదే (ఖాసా వారి) 'స్వతంత్ర' మద్రాస్ నుంచి వచ్చేది. కాని వీక్షణం అంతకన్నా చాల ఎక్కువ. పేజీలకు పేజీలుగా ఇంగ్లీష్‌లో వచ్చే ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ (ఇపిడబ్ల్యూ) కన్నాచాలా సరళంగాను, అర్థం చేసుకోగలిగేదిగాను ఉంటోంది. క్రమం తప్పకుండా వీక్షణం సాధిస్తున్న విజయాలకు అన్ని వైపులనుండి సహకారం, ప్రోత్సాహం అందించదగ్గదని అనుకుంటున్నాను.

వీక్షణాన్ని మరింత ముందుకు తీసుకుపోవడానికి, పటిష్టపరచడానికి నా వంతుగా కొన్ని సలహాలను, ఆలోచనలను నేను హైదరాబాద్ వచ్చినప్పుడు చర్చిస్తా.

ఎన్. భాస్కర రావు
సెంటర్ ఫర్ మీడియా స్టడీస్, న్యూ ఢిల్లీ

వీక్షణం సెప్టెంబర్ 2006 సంచికలో 'కోర్టు తీర్పులు-సమాజం పై ప్రభావం' అన్న అంశం పై రచయితలు చెప్పినట్లు కోర్టులు కూడ సమాజంలో భాగమే కనుక ప్రపంచీకరణ ప్రభావం వాటిపై పడడంలో విశేషమేమిలేదు. ఆ మాటకొస్తే అవినీతి పర్వంలో కూడ కోర్టుల పాత్రనూ కాదనలేం. కాకపోతే కోర్టులొక ఇనెవిటబల్ ఈవిల్ అన్నారే అది మాత్రం వాస్తవం.


19వ శతాబ్దంలో కార్మికులు సాగించిన పోరాటాలకు చట్టబద్ధత లేదు కాని అందులో సామాజికాంశం, మానవతావాదం ఇమిడి ఉన్నాయి. అందుకే ఆ విలువలు ఇప్పటికీ నిలిచివున్నాయి. అందుకే 'మేడే'లు జరుపుకొంటున్నాం. ఏవో కొన్ని సందర్భాలలో తప్ప మామూలుగా పని చేసుకొనిపోయే కార్మికులకు, ఉద్యోగులకు వారి ఉద్యోగ రక్షణకు అవసరమైన చట్టాలున్నాయి. కాని ఎటొచ్చీ ఆ చట్టాలను ఆయుధంగా ట్రేడ్ యూనియన్ నాయకులు ఎవరి కోసం ఉపయోగించాలనుకొంటున్నారనేదే మనం ఆలోచించాల్సింది. యూనియన్లో మిలిటెంటు సభ్యులు అంటే ఆఫీసులో (ముఖ్యంగా ప్రభుత్వ ఆఫీసుల్లో, పబ్లిక్ రంగ సంస్థల్లో ప్రత్యేకంగా బ్యాంకుల్లో) సరిగ్గా పని చేయనివారు. అసలు పని చేయనివారు. ఇంకా మాట్లాడితే ఆఫీసులో పెత్తనం చెలాయించేవారు. ఇంత చేసినా వీరందరికి ఉద్యోగ భద్రత వుంది. కాని వీరిలో కొంతమంది అవినీతి, నేరాల కారణంగా ఇబ్బందుల్లో పడతారు. వీరంతా ఎంతో కొంత చదువుకున్నవారు, ప్రభుత్వోద్యోగాల్లో వుండేవారు. బాధ్యత గల పౌరులుగా, ప్రజలకు కనీస సేవలు అందించాల్సినవారు. ఉపాధ్యాయులు, డాక్టర్లు, బ్యాంకు ఉద్యోగుల్లాంటి వారి సేవలు సమాజానికి ఎంత అవసరమో తెలియనిది కాదు. ఆఫీసులో పనులు మామూలుగా జరుగుతున్నంతకాలం యాజమాన్యం, పై అధికారులు అంతగా పట్టించుకోరు. అలసత్వం, అవినీతి హద్దులు దాటి, దాని ప్రభావం తోటి ఉద్యోగులపైనా, సంస్థ పైన పడేటప్పుడు మాత్రమే యాజమాన్యం మేలుకొంటుంది. కచ్చితమైన నేరారోపణ కోసం వెదకాలి. అది ఎప్పటికోగాని దొరకదు. ఒక్కోసారి అసలే దొరకదు. యూనియన్ నాయకుల అండతో అవన్నీ అధిగమించేస్తారు. కాదంటే ఆ మేనేజర్ అక్కడ నుండి ట్రాన్స్‌ఫర్. నిజాయితీగా వుంటే ఉద్యోగి గాని, అధికారిగాని పడే ఇబ్బందులు ఎన్నో. దురుసుగా ప్రవర్తించిన నాయకులెందరో. మేనేజింగ్ డైరెక్టరు గది తలుపును కాలితో తన్ని లోనికి వెళ్లిన నాయకులున్న ట్రేడ్ యూనియన్లు మనవి. యూనియన్ల ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు, పోస్టింగులు ఇస్తారు. వారి కనుసన్నలలోనే అధికార్లు మెదలుతారు. ఇలాంటి వాతవరణానికి కారకులెవరు? కారణాలేమిటి? ప్రైవేటీకరణ మంచిదేనని సామాన్య ప్రజల చేత అనిపించినదెవరు? రైతులు దేశానికి వెన్నెముక, అన్నదాత అనేవారికి ఏ డిపార్టుమెంట్ సహాయపడుతోంది? కరెంటు ఆఫీసా, తాలూకాఫీసా, వ్యవసాయ శాఖా, రిజిస్ట్రారు ఆఫీసా ఎవరు? ప్రకృతి ఎలాగు ప్రతి సంవత్సరం అతివృష్టి, అనావృష్టి రూపంలో కన్నెర్ర చేస్తూనే వుంటుంది. తోటి మానవులంకూడానా? చెప్పుకొంటే ప్రాక్టికల్ ఇబ్బందులు ఎన్నో. 26వ పేజీలో 2వ లైను – 'ప్రజలకు అసౌకర్యాలు.... ఉద్యోగాన్ని హరించే ప్రమాదం ఏర్పడుతోంది'. ఏ సమస్యనయినా, సామాజిక రుగ్మతనైనా అన్ని కోణాల్నుంచి పరిశీలించాలి. ఇది మేధావులు గుర్తించాల్సిన అంశం. వ్యాసాల్లో ఈ అంశం ప్రస్తావించి వుంటే బాగుండేది. సంపాదక వర్గం ఈ విషయమై ఆలోచించాల్సిందిగా కోరతాను. ఎందుకంటే గతంలో కూడ బి.సి. రిజర్వేషన్ల పై ఇలాంటి వ్యాసాలే వచ్చాయి. పత్రికలో సమాజానికి మార్గదర్శకమైన రచనలకు ప్రాధాన్యతిస్తారని ఆశిస్తాను.


చెలంచర్ల భాస్కర రెడ్డి
నెల్లూరు
(క్యాంప్ నార్త్ సాల్ట్ లేక్ సిటీ, అమెరికా)

తెలంగాణ విడిపోవడం సరియైనదని అన్నదమ్ములవలె విడిపోవచ్చునని కొంతమంది మేధావులు, రాజకీయ నాయకులు, కొన్ని పార్టీలు ప్రచారంలో పెట్టారు. అదేమంటే తెలంగాణ ప్రజల్లో ఆ కోరిక బలంగా వున్నదని సమర్థించుకుంటున్నారు. ఆంధ్రవాళ్లు అన్యాయం చేశారని, తెలంగాణకు అన్యాయం జరిగినదని ప్రజల్లో విద్వేషం పెంచుతున్నారు. 610 జి.వో. అమలుకాలేదని, పెద్దమనుషుల ఒప్పందం అమలు చేయలేదని ఆంధ్ర వాళ్లవలనే జరగలేదని ప్రజల్లో ద్వేషాన్ని పెంచుతున్నారు. ఈ రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాలలో అంతామంచే వున్నది. ఈ పాలక వర్గాలు ఆదేశిక సూత్రాల కోసం పనిచేస్తే 50 సంవత్సరాలలో ఈ ప్రజలకు విద్య, ఆరోగ్యం, ఆర్థిక సమానత్వాన్ని అందించలేదు. ఎన్నో చట్టాలు, రాజ్యాంగాలు అమలుకు నోచుకోకుండా వున్నాయి. ఇవన్నీ తెలంగాణా మేధావులకు కాని రాజకీయ నాయకులకుగాని తెలియదా? 610 జి.వో., ముల్కీ నిబంధనలు, పెద్దమనుషుల ఒప్పందాలే గుర్తుకొస్తున్నాయి. తెలంగాణ శ్రమజీవులకే కాదు, ఆంధ్ర శ్రమజీవులకు దేశంలో శ్రమజీవులకు, ప్రపంచంలోని శ్రమజీవులకు ఎన్నో శతాబ్దాల నుండి అన్యాయం జరుగుతూనే వున్నది. దోపిడి జరుగుతూనే ఉన్నది. శ్రమ జీవులు దోపిడికి వ్యతిరేకంగా రాజ్యాధికారం కోసం శ్రమిస్తూనే వున్నారు. ఆ క్రమంలో తమ ప్రాణాలను కూడా త్యాగం చేస్తున్నారు. ఈ దేశానికి కార్మికశాఖ మంత్రిగా వున్న కె. చంద్రశేఖర రావు గారు దేశంలోని శ్రమ జీవులకోసం గాక కనీసం తెలంగాణ శ్రమజీవుల కోసమైనా వైద్యశాల నిర్మించవచ్చు. ప్రాథమిక విద్యాలయాలు స్థాపించవచ్చు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలించవచ్చు. శ్రమ దోపిడి నివారించడానికి తగిన కృషి చేయవచ్చు. వారు చేస్తానంటే ప్రధానమంత్రి కాని, మంత్రివర్గం కాని వద్దన్నారా? భాష వుంది కదాని జివోలు నాలుక గీచుకోవడానికే పనికి వస్తాయని తెలంగాణ ప్రజల్లో విద్వేషాలు రగల్చడం సరియైనది కాదు. ఎన్నో మంచి చట్టాలు


(మిగతా 42వ పేజీలో...)

కొత్తపుస్తకాలు













- **మార్క్సిజం సామాజిక శాస్త్రాలు** - (మార్క్సిజం అండ్ సోషల్ సైన్సెస్) మారిస్ డాబ్ - అనువాదం : ముక్తవరపు పార్థసారథి - లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ ప్రచురణ, 16 పేజీలు, 1/10 డెమీ, రు. 3.
- **పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మక మార్పులు దాని సామాజిక పరివర్తనా సిద్ధాంతాలు** - (స్ట్రక్చరల్ చేంజస్ ఇన్ ది ఎకానమీ ఆఫ్ కపిటలిజమ్ అండ్ థియరీస్ ఆఫ్ ఇట్స్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్) ఎ.జి. మైలైకోవిస్కీ - అనువాదం : సి. పటేల్ - లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ ప్రచురణ, 50 పేజీలు, 1/8 డెమీ, రు. 15.
- **చారిత్రక భౌతికవాదం** - (హిస్టారికల్ మెటీరియలిజం) డెవిడ్ మాక్‌లెల్లన్ - అనువాదం : నిడమర్తి ఉమారాజేశ్వరరావు - లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ ప్రచురణ, 18 పేజీలు, 1/8 డెమీ, రు. 5.
- **నయా ఉదారవాదం కల్పన, వాస్తవం** - (నియోలిబరలిజం మిథ్స్ అండ్ రియాలిటి) మార్టిన్ హర్ట్, లాండ్స్‌బెర్గ్ - అనువాదం : కె. వెంకటేశ్వర్లు - లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ ప్రచురణ, 16 పేజీలు, 1/8 డెమీ, రు. 4.


పై నాలుగు పుస్తకాల ప్రతులకు : లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్, 5-85-4/బి, పండరీపురం, 1వ లైను, గుంటూరు - 522 002.

- **తెలంగాణ సాహిత్య స్వరూపాలు** - సంపాదకులు : డా.టి. శ్రీరంగస్వామి, ప్రజాహిత ప్రచురణ, 51 పేజీలు, 1/8 డెమీ, రు. 40, ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
- **వాస్తు జ్యోతిషాల నిజ స్వరూపం** - దగాకోరు శాస్త్రాలు - మూఢనమ్మకాలు - విద్వాన్ తెన్నేటి - ప్రజాహిత ప్రచురణ, 171 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
- **సీమ నానీలు** - రాచపాళెం చంద్రశేఖర రెడ్డి - శిల్పి ప్రచురణ, 31 పేజీలు, 1/8 డెమీ, రు. 30, ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
- **కథాంశం** - తెలుగు కథానికా సాహిత్య విమర్శ - రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, 258 పేజీలు, 1/8 డెమీ, రు. 93, ప్రతులకు : ఆర్. లక్ష్మి 28-3-169, తారకనాథ్ కాలనీ, అనంతపురం - 515 001. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
- **చర్చ** - తెలుగు సాహిత్య విమర్శ, పరిశోధనల మీద వ్యాసాలు - రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, 196 పేజీలు, 1/8 డెమీ, రు. 65, ప్రతులకు : ఆర్. లక్ష్మి 28-3-169, తారకనాథ్ కాలనీ, అనంతపురం - 515 001.
- **ప్రముఖ భాషాశాస్త్రవేత్తలు** - ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న - దళిత సాహిత్య పీఠం ప్రచురణ, 119 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు : శ్రీమతి వి. పార్వతి, 4-39-12/3, మునిసిఫ్ వారి వీధి, పెదవాల్తేరు, విశాఖపట్నం - 17, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్











యాభై ఏళ్ల ఆంధ్రప్రదేశ్ - విజయాలు వైఫల్యాలు

వీక్షణం నవంబర్ 2005 సంచిక నుంచి ప్రారంభించి ఆంధ్రప్రదేశ్ స్వర్ణోత్సవాలను జరుపుతోంది. నవంబర్ 2005 సంచికలో అన్ని రంగాల ప్రముఖులతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి మీద వ్యాసాలు ప్రచురించాం. అప్పటినుంచి ప్రతినెలా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సంబంధించిన గణాంకాలు గాని, వ్యాసాలు గాని ప్రచురిస్తూనే ఉన్నాం. ఇప్పుడు స్వర్ణోత్సవాల ముగింపు సందర్భంగా ఒక ప్రత్యేక అభిప్రాయమాలికను ప్రచురిస్తున్నాం. రాష్ట్రంలో ఎంపిక చేసిన కొంతమంది విశిష్ట వ్యక్తులు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి తీరుతెన్నులపై మేం అడిగిన ప్రశ్నలకు స్పందనగా తెలియజేసిన జవాబులివి. మా ప్రశ్నలు : 1. మీ దృష్టిలో యాభై ఏళ్ల ఆంధ్రప్రదేశ్ ఏయే రంగాలలో విజయాలు సాధించింది? 2. ఆంధ్రప్రదేశ్ ఏ రంగాలలో విజయం సాధించలేకపోయింది? 3. ఇవాళ్టి ఆంధ్రప్రదేశ్ ను మీరు ఎట్లా బేరీజు వేస్తారు? 4. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు గురించి మీ ఆలోచనలు, కలలు, ఊహలు ఏమిటి?

రాష్ట్రం గురించి, రాష్ట్రాభివృద్ధి గురించి, ప్రజా సంక్షేమం గురించి రాజకీయ నాయకులు, పత్రికా సంపాదకులు, సామాజిక శాస్త్రవేత్తలు, రచయితలు ఏమనుకుంటున్నారో చూడండి - సం.

ఆంధ్రప్రదేశ్ దేశంలోకెల్లా మొట్టమొదటి భాషా ప్రయుక్త రాష్ట్రంగా అవతరించిన తరువాత, గత అర్ధశతాబ్దికాలంలో అత్యాధునిక ఇన్ఫర్మేషన్ టెక్నాలజీతో సహా విభిన్న రంగాలలో అనూహ్యమైన అభివృద్ధిని సాధించగలిగింది. ఈ ప్రగతి సాధన వెనుక ఎంతోమంది జాతీయ నాయకుల దూరదృష్టి, తరతరాల తెలుగుజాతి నిత్య చైతన్య పురాప్రాభవస్ఫూర్తితో బాటు పట్టుదలతో, వినూత్న విధానాలతో పాటుపడే లక్షలాది రైతాంగం శ్రమదమాదులు, వెన్నెముకలాంటి యువతరం కృషి, మహిళా చైతన్యం, శాస్త్ర సాంకేతిక రంగాల్లో జాతివేసిన ముందడుగు నిబిడీకృతమైవున్నాయి.

ఎంత అభివృద్ధిని సాధించినప్పటికి, నా దృష్టిలో ఆ అభివృద్ధి ఫలితాలు పల్లెల్లో, మారుమూల గ్రామాలలో రైతుకుటుంబాలలోను, బలహీనవర్గాల నిరుపేదల జీవితాల్లోనూ ప్రతిబింబించినప్పుడే మనం సాధించిన వికాసానికి సార్థకతవుంటుంది.

గత రెండున్నర సంవత్సరాల కాలంలో దాదాపు రెండున్నర దశాబ్దాల అభ్యున్నతిని అందించి ఆంధ్రప్రదేశ్‌ను హరితాంధ్రప్రదేశ్‌గా రూపొందించడానికి, గ్రామీణ పేద జీవితాలలో కొత్త వెలుగులు నింపడానికి అహోరాత్రాలు పాటుపడుతున్న విషయం అందరికీ విదితమే.

సాధించిన విజయాలతో సంతృప్తిపడకుండా నిరంతరం శ్రమిస్తూ ఆంధ్రప్రదేశ్ సమగ్ర సమతుల సర్వతోముఖ వికాసానికి, సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి కృషి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం.

మా ప్రభుత్వం అన్ని రంగాలకు సమ ప్రాధాన్యం ఇస్తుంది. ముఖ్యంగా మౌలిక అభివృద్ధి రంగాలైన నీటిపారుదల, విద్యుచ్ఛక్తి, రోడ్లు, కమ్యూనికేషన్లు, విద్య, వైద్యం, గ్రామీణ వికాసం ప్రధానంగా చేపట్టి, అభివృద్ధి పనులతోబాటు యువజనుల ఉపాధి కల్పనకు, శ్రమజీవుల దైనందిన ఉపాధికి, బలహీనవర్గాల సంక్షేమానికి పెద్ద పీట వేయటం జరుగుతోంది.

అయితే గత దశాబ్దంలో వివిధ కారణాలవల్ల ముఖ్యమైన వ్యవసాయం, నీటిపారుదల, రైతు సంక్షేమం, విద్యుచ్ఛక్తి వంటి కీలక రంగాలను పక్కనపెట్టి, పెద్ద పెద్ద నగరాలలో వేల కోట్ల రూపాయల పెట్టుబడులతోకూడిన అత్యాధునిక రంగాలకు, సదుపాయాలకు ప్రాధాన్యం ఇవ్వటంతో, ఆ తరువాత గ్రామాల్లో పేద రైతులు ఆత్మహత్యలు చేసుకోవడంవరకూ పరిస్థితి దిగజారింది. నిరుద్యోగులకు, శ్రమజీవులకు ఉపాధి కరువై గ్రామాలనుంచి పట్టణాలకు వలసలు పోవడం అధికమైంది. ఈ స్థితిని చక్కదిద్దడానికి గత రెండున్నర సంవత్సరాల కాలంలో మేం నిరంతరం, అనుక్షణం చిత్తశుద్ధితో కృషిచేయడంతో ఈనాడు మన రాష్ట్రం వివిధ రంగాలలో దేశంలోని పలు రాష్ట్రాలకు మార్గదర్శకంగా, ఒక ఆదర్శంగా నిలిచింది.

ముఖ్యంగా 'జలయజ్ఞం' కింద సుమారు రు. 50 వేల కోట్ల అంచనాతో 30 పైగా నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి, లక్షలాది హెక్టార్లను సాగులోకి తెచ్చి, బీళ్లను, బంజర్లను సస్యశ్యామలం చేయడానికి శ్రీకారం జరిగింది. ఈ దశాబ్దం అంతంనాటికి రాష్ట్రాన్ని విద్యుత్ రంగంలో మిగులు విద్యుత్ రాష్ట్రంగా మలిచేందుకు తీవ్రంగా యత్నాలు జరుగుతున్నాయి.

నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణ స్వర్ణోత్సవ ఘట్టంలో వేడుకలు జరుపుకొంటున్న ఈ సమయంలో రాష్ట్ర ఆవిర్భావానికి ప్రాణత్యాగం చేసిన త్యాగధనుడు ఆంధ్రకేసరి పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో, గతతరం జాతీయ నాయకులైన ఆంధ్రకేసరి ప్రకాశం, పట్టాభి, బులుసు సాంబమూర్తి, మాడపాటి, దుర్గాబాయమ్మ, అయ్యదేవర, నీలం సంజీవరెడ్డి, దామోదరం సంజీవయ్య, కడప కోటిరెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి, కొండా వెంకటరంగారెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి వంటి అనేకమంది మహనీయుల అడుగుజాడలో మనం ఎన్నో మెట్లు పైకి ఎదగగలిగాము, ఇంకా సాధించాల్సిన ఉన్నత శిఖరాలు ఎన్నెన్నోవున్నాయి.

ఇవాళ్టి ఆంధ్రప్రదేశ్ మౌలికంగా గ్రామాల స్థాయినుంచి అన్ని రంగాలలోనూ, రాష్ట్ర వ్యాప్తంగా వినూత్నచైతన్యంతో ముందంజవేస్తోంది. అయితే మనం శాస్త్రసాంకేతిక రంగాలలో, లేబొరేటరీలలో, సిద్ధాంత గ్రంథాలలో నమోదుచేసిన అభివృద్ధి యొక్క ఫలితాలు పల్లెల్లో పేద కుటుంబంలో ప్రతి వ్యక్తి జీవితంలోనూ ప్రతిబింబించాలన్నదే నా ఆశయం. అందుకే నా జీవితం అంకితం.

నా ఆలోచనా, ఆశయం, అభిమతం అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ ఒక్కటే. అధికారంలోలేని సమయంలోకూడా నేను వందలాది గ్రామాలలో పాదయాత్రచేసి, రైతులు, శ్రమజీవులు, బలహీనవర్గాలు, నిరుపేదలు, యువజనులు, మహిళలు ఎన్ని కష్టనష్టాలను అనుభవిస్తున్నారో, వారి ఇబ్బందులు, సమస్యలు ఏమిటో ముఖాముఖి అడిగి తెలుసుకొన్న

విషయం విదితమే. ఇప్పటికీ పదేపదే నేను వారివద్దకు వెళ్లడమేకాకుండా, అధికారయంత్రాంగాన్ని, ప్రజాప్రతినిధులను గ్రామాలలో సామాన్య జనజీవన సమస్యలు తెలుసుకోవాలని, వాటి పరిష్కారానికి పాటు పడాలని పదేపదే గుర్తు చేస్తున్న విషయం తెలియనిదికాదు.

భవిష్యత్తులో మన రాష్ట్రం తరతరాల పేదరికపు చీకట్ల తెరలను, పొరలను ఛేదిస్తూ, దేశంలోని అన్ని ప్రాంతాలవారికి ఆదర్శప్రాయంగా నిలవాలన్నదే నా ఆకాంక్ష.

డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

*****

రాజకీయార్థిక సామాజిక మాసపత్రిక 'వీక్షణం' రాష్ట్ర స్వర్ణోత్సవాల ముగింపు సందర్భంగా వివిధ రంగాలకు చెందిన వ్యక్తుల అభిప్రాయాలను ఎంపికచేసి ఒక ప్రత్యేక సంచికగా వెలువరించడం సంతోషదాయకం.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణ జరిగి ఐదు దశాబ్దాలు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్రంలో వివిధ రంగాలలో సాధించిన విజయాలు, వైఫల్యాలను బేరీజు వేసినట్లయితే అభివృద్ధిలో మనం ఎంతో ముందుకు వెళ్లినట్లు కనిపించినా అనేక లక్ష్యాలను అందుకోవడంలో వెనుకబడ్డామని చెప్పక తప్పదు. పుష్కలమైన సహజ వనరులు, మానవ వనరులు కలిగి 'దేశానికే అన్నపూర్ణ' (రైస్ బౌల్ ఆఫ్ ఇండియా)గా పేరు తెచ్చుకున్న మన రాష్ట్రంలో నేడు వ్యవసాయం, ఆరోగ్యం, విద్య, పరిశ్రమలు వంటి ప్రధాన రంగాలలో సంక్షోభ పరిస్థితులు ఏర్పడడం ఆందోళన కలిగిస్తుంది. రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల సంక్షేమం నేడు విస్మరణకు గురికావడం చూస్తున్నాం. అదే విధంగా సామాజిక న్యాయం అమలుకావడంలేదు. ఇవన్నీ సమాజంలో నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. పేదల బ్రతుకు దుర్భరంగా మారింది. ముఖ్యంగా ఆరోగ్య రంగంలో నెలకొన్న దయనీయ పరిస్థితులు ఇంతకుముందెన్నడూ చూడలేదు. ప్రాధాన్యతలలో, సమస్యల పరిష్కారంలో రాజకీయ చిత్తశుద్ధి లోపిస్తే తాత్కాలిక రాజకీయ ప్రయోజనాలకు ప్రాకులాడితే ప్రజలు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందన్న వాస్తవం కళ్ల ముందు కనిపిస్తోంది.

ఆంధ్రప్రదేశ్‌కు ఉజ్వల భవిష్యత్ ఉందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇక్కడున్న మానవ వనరులను సద్వినియోగం చేసుకోగలిగి, విజ్ఞాన సమాజాన్ని రూపొందించి, అన్ని వర్గాలు సుఖ సంతోషాలతో మెరుగైన జీవన ప్రమాణాలతో జీవించగలిగే పరిస్థితులను ఏర్పరచగలిగితే దేశంలోనే మన రాష్ట్రం అగ్రగామి కాగలదని నేను ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను.

- నారా చంద్రబాబునాయుడు

తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు

*****

ఆంధ్రప్రదేశ్‌ను 'అన్నపూర్ణ'గా పిలుస్తారు. భారతదేశపు ధాన్యాగారం అని అంటారు. ఇది నిజం. రెండు జీవనదులు - కృష్ణా, గోదావరి - రాష్ట్రానికి వ్యవసాయం ఉత్పాదకతలో ప్రముఖ స్థానాన్ని సంపాదించి పెట్టాయి. వ్యవసాయ రంగంలో గత యాభై సంవత్సరాలలో రాష్ట్రం ఇంకా ఎంతో ప్రగతి సాధించగలిగి ఉండేది. కానీ రాష్ట్రాన్ని ఇంతవరకూ పరిపాలించిన పార్టీలు, నాయకులు అవగాహన లోపం కారణంగా రాష్ట్రం అభివృద్ధిలో ఎంతో వెనుకబడిపోయింది.

రాష్ట్రానికి విశాలమైన సముద్రతీరం ఉన్నది. ఖనిజ నిక్షేపాలు అపారం, తీరప్రాంతాన్ని, భూగర్భ వనరులను వినియోగించుకోవడంలో రాష్ట్రం వెనుకబడిపోయింది. మనకంటే ఆలస్యంగా ఏర్పడ్డ గుజరాత్ లాంటి రాష్ట్రాలు అభివృద్ధిలో మనల్ని ఎన్నడో దాటేశాయి.

వృథాగా సముద్రంలో కలిసిపోతున్న గోదావరి జలాలను పూర్తిగా వినియోగించుకునేందుకు పథకాలు, ప్రణాళికలు సిద్ధం చేసి వాటిని సక్రమంగా, సమర్థవంతంగా అమలుచేసి ఉంటే రాష్ట్రంలోని ప్రతి ఎకరానికి నీరందించగలిగి ఉండేవారం. నిజమైన హరిత విప్లవాన్ని సాధించగలిగి ఉండేవారం. వృథాగా ఒక బొట్టు నీరు కూడా సముద్రంలోకి వెళ్లకపోయేది. ప్రతి ఎకరానికి సాగునీరు, ప్రతి మనిషికీ తాగునీరు అందేది.

నదీ జలాల వినియోగం సక్రమంగా జరగని కారణంగా మరో ప్రమాదం రాష్ట్రాన్ని ముంచెత్తింది. జల విద్యుత్ ఉత్పాదన గణనీయంగా పడిపోవడంతో మెట్ట ప్రాంత రైతులకు భూగర్భ జలాలు అందడంలేదు. కరెంట్ తీగలే ఉరితాళ్లు అయ్యాయి.

పాలకుల అవగాహన లోపం, పరిపాలనలో అవినీతి, ఆలోచనా రహిత విధానాల కారణంగా అన్నపూర్ణ ఆంధ్రప్రదేశ్ కాస్తా ఆత్మహత్యల ప్రదేశ్‌గా మారిపోయింది. గత దశాబ్ద కాలంలో రాష్ట్రంలో దాదాపు ఏడు వేల మంది రైతుల ఆత్మహత్యలు చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రైతుల ఆత్మహత్యలు దారుణం. ఇలాంటి దౌర్భాగ్యకర పరిస్థితులను వెంటనే నిలువరించాలి.

రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న మరో సమస్య తీవ్రవాదం. గత నలభై సంవత్సరాలుగా మావోయిస్టులుగా రూపాంతరం చెందిన నక్సలైట్ల హింసా రాజకీయాలతో రాష్ట్రం అట్టుడికి పోతున్నది. ఈ సమస్య పెచ్చరిల్లడానికి కూడా గత ప్రభుత్వాలే కారణం. మావోయిస్టు సమస్యపై నాయకులకు, ప్రభుత్వాలకు ఒక అవగాహన లేకుండా పోయింది. అధికారాన్ని దక్కించుకోవాలనుకునే పార్టీలు నక్సలైట్లతో రహస్య ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఒక్కోసారి నిషేధం విధించారు. ఒక్కోసారి నిషేధం ఎత్తివేశారు. నక్సలైట్ల హింసాకాండలో వేలాదిమంది అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. పులిమీద పుట్రలాగా మావోయిస్టుల హింసలకు తోడు ఇపుడు జిహాది తీవ్రవాదం రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తున్నది. పాకిస్తాన్ గూఢచార సంస్థ ఐ.ఎస్.ఐ.కు రాష్ట్రం ప్రధాన కేంద్రంగా మారింది. దేశంలో ఎక్కడ విధ్వంసాన్ని సృష్టించాలన్నా హైదరాబాద్ లేదా చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కుట్రలు పన్నుతున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రాష్ట్రం తీవ్రంగా దెబ్బతింటుంది.

గత యాభై సంవత్సరాలలో జరిగిన మరొక దారుణం ఉన్నది. అధికార పార్టీలు, ముఖ్యంగా కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేందుకు చేయని ప్రయత్నం లేదు. మొదట్లో కుల రాజకీయాలు నడిపాయి. ఆ తర్వాత ప్రజలను ప్రలోభపెట్టే మార్గాలు అనుసరించాయి. అటు పిమ్మట దౌర్జన్యకర పరిస్థితులకు దిగారు. వీటిల్లో

మరింత నైపుణ్యం సంపాదించడంతో పాటు ఇపుడు ధన బలాన్ని విపరీతంగా చూపిస్తున్నాయి. ఎన్నికల ఓటర్ల లిస్టులను తారుమారు చేయడం నుంచి మొదలుపెడితే ప్రతి అంచెలోనూ రిగ్గింగును వ్యవస్థీకృతం చేశారు. దీని కారణంగా ప్రజాస్వామ్య వ్యవస్థ పరిహాసం పాలవుతున్నది.

అధికార వికేంద్రీకరణ కాగితాలకే పరిమితం అయిపోగా, అధికార కేంద్రీకరణ జరగడంతో సామాజిక వైరుధ్యాలు వైషమ్యాలు విపరీతంగా తలెత్తాయి. ధనికుడు మరింత ధనికుడు అవుతుండగా, పేదవాడు మరింత పేదవాడుగా అవుతున్నాడు. సామాజిక, ఆర్థిక వైషమ్యాలు పెరగడం ఏ సమాజానికి మంచిదికాదు. వీలైనంత తొందరగా వీటిని నివారించాలి.

అక్షరాస్యతతోపాటు అనేక ప్రాధాన్యతా రంగాల్లో రాష్ట్రం వెనుకబడి పోయినప్పటికీ అంతా అరాచకమే, దుర్మార్గమే అని చెప్పడమే నా ఉద్దేశ్యం కాదు. రాష్ట్రం ఎంతో కొంత వికాసాన్ని సాధించింది. అయితే ఈ అభివృద్ధి పాలకుల కారణంగా వచ్చింది కాదు. ప్రజలే ఇందుకు కారకులు. చైతన్యవంతులైన రాష్ట్ర ప్రజలు అనేక సామాజిక, ఆర్థిక విప్లవాలకు శ్రీకారం చుట్టారు. నెల్లూరు జిల్లా దూబగుంట నుంచి రోశమ్మ సారా వ్యతిరేక ఉద్యమం చేపట్టినా, మహిళలు స్వయం ప్రేరితులై స్వయం సహాయక బృందాలు ఏర్పరచుకొని రూపాయితో మొదలు పెట్టి సహకార బ్యాంకుల రీతిలో ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తుండడం, మావోయిస్టుల హింసాకాండకు వ్యతిరేకంగా గ్రామస్తులే స్వయం ప్రేరణతో తిరగబడడం ఈ రాష్ట్ర ప్రజల చైతన్యాన్ని తెలియజేస్తున్నది. మన రైతులు చాలా ప్రోగ్రెసివ్ రైతులు. వ్యవసాయ రంగంలో వినూత్న పద్ధతులను అనుసరించారు. విప్లవాత్మక మార్పులు సాధించారు. ఆ ప్రజా చైతన్యం కారణంగానే ప్రజాస్వామ్యం ఇంకా బతికి బట్ట కట్టగలుగుతున్నది.

ఇవ్వాల్టి ఆంధ్రప్రదేశ్‌ను బేరీజు వేయాలంటే తెలెత్తే మొదటి ప్రశ్న దేనితో బేరీజు వేయాలి అని? రాష్ట్రం ఏర్పడిన యాభై సంవత్సరాల తరువాత ఉండవలిసిన పరిస్థితులతో పోలిస్తే ప్రస్తుతం ఉన్న పరిస్థితులకు సారూప్యంలేదు. ఎన్నో రెట్లు వెనుకబడి ఉన్నాం.

నేను ఆశావాదిని. రాష్ట్ర భవిష్యత్తుపై ఎన్నో ఆశలు ఉన్నవాడిని. రాష్ట్రం వీలైనంత వేగంగా అభివృద్ధి దిశలో ముందుకు సాగాలని కోరుకునేవాడిని. అన్ని రంగాలకు సమతుల్య అభివృద్ధి సాధించాలన్నది నా ఆకాంక్ష. ఈ నా కోరిక తీరేందుకు ముందుగా చేపట్టాల్సిన ప్రధాన కార్యం - నదీ జలాల పూర్తి స్థాయి సద్వినియోగం. ఒక్క చుక్క నదీజలం వృథా కాకూడదు. గోదావరి జలాలను రాష్ట్రమంతటా ప్రవహింపచేయాలి. ఇది అసాధ్యమైన పనేమి కాదు. కొద్దిపాటి చిత్తశుద్ధి ఉంటే, నైపుణ్యానికి మనకు కొదవలేదు. కావాల్సిందల్లా రాజకీయ చిత్తశుద్ధి, మనోబలం. రాష్ట్రాన్ని పాలించిన పాలకులకు ఆ చిత్తశుద్ధి లేదు. మనోబలం లేదు. రాష్ట్రానికున్న తీరప్రాంతం, భూగర్భ వనరులను సక్రమంగా వినియోగించుకొని ఉంటే నిరుద్యోగ సమస్యతోపాటు అనేక సమస్యలు పరిష్కారమయి ఉండేవి.

ఏ రోజున నదీ జలాలు పూర్తిస్థాయిలో వినియోగం అవుతాయో ఆ రోజున ఆంధ్రప్రదేశ్ స్వర్గసీమగా మారుతుంది. అలా మారాలన్నదే నా కోరిక. బలమైన ఆకాంక్ష.

- నల్లు ఇంద్రసేనారెడ్డి

భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు

*****

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విఫలమైన ప్రయోగం. ఒకవేళ సఫలమై ఉంటే ఇన్ని తీవ్రవాద పార్టీలు, నక్సలైటు పార్టీలు ఎందుకు వస్తాయి? తెలంగాణ ఉద్యమం కూడా నిరంతరంగా ఎందుకు కొనసాగుతోంది?

యాభై ఏళ్లలో తీవ్రంగా నష్టపోయింది తెలంగాణ. ఒక ఉదాహరణ చెప్పుకుంటే, కాకతీయులు, అసఫ్ జాహిల కాలంలో పద్దెనిది లక్షల ఎకరాలకు నీరందింది, ఈ రోజు పది లక్షల ఎకరాలకు కూడా నీరు అందడం లేదు.

ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ బాగుపడ్డదా, బతికి చెడ్డదా చెప్పనక్కర్లేదు. రైతుల ఆత్మహత్యలు, వృత్తి పరమైన ఆత్మహత్యలు సమాజంపై వికృతమైన ప్రభావం చూపుతున్నాయి. ఈరాష్ట్రంలో దురదృష్టవశాత్తు రావలసిన రాజకీయ పరిణతి కూడా రాలేదు. ఎవరు ముఖ్యమంత్రి అయినా భూ కుంభకోణాలు, టెండర్ల కుంభకోణాలు. తీవ్రమైన అవినీతి వేళ్లూనుకుంది. ప్రజాస్వామ్యం నిజంగా ఉందంటారా? సామాన్యుడు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉందా? ఆంధ్రప్రదేశ్ ఒక రాష్ట్రంగా ఇంక ఎక్కువ కాలం ఉంటుందని అనుకోవడం లేదు. ఆంధ్రప్రదేశ్ పుట్టుకే మోసాలతో, కుట్రలతో ఏర్పడింది. సదాభిప్రాయంతో ఏర్పడితే ఈ ఉద్యమాలు ఉండవు. ఆంధ్రప్రదేశ్ ఒక రాష్ట్రంగా ఇంక ఎంత మాత్రం మనుగడ సాధించలేదు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తథ్యం. యాభై యేళ్లుగా ప్రాంతీయ వివక్ష కొనసాగింది కాబట్టి, ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రజలు కోరుకుంటున్నారు. దేశ స్థాయిలోనూ తెలంగాణ వివక్షకు గురయిందని అందరికీ అర్థమయింది. పార్లమెంట్‌లో మెజారిటీ పార్టీలు తెలంగాణకు అండగా వస్తున్నారు. వారందరి కోరిక ఫలించేరోజు దగ్గర్లోనే ఉంది. ఐతే ఈ విడిపోవడం శత్రుభావంతో కాక, సోదరభావంతో జరిగితే మంచిది.

- కె. చంద్రశేఖర రావు

తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షులు

*****

ముక్కలుచెక్కలుగా ఉన్న తెలుగు ప్రజలు సమైక్య రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడి యాభై ఏళ్లు పూర్తయ్యాయి. ఈ అర్ధ శతాబ్దంలో అద్భుతమైన రాజకీయ ఆర్థిక సామాజిక పరిణామాలు జరిగాయి. ఇరిగేషన్ ప్రాజెక్టులు, విద్యాసంస్థలు, రోడ్లు, విద్యుచ్ఛక్తి, విభిన్న రకాల అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. అంతులేని సంపద సృష్టించబడింది. కాని పంపిణీ జరగలేదు. పేదలు-ధనికుల మధ్య వ్యత్యాసం పెరిగింది. అరవై ఏళ్ల స్వాతంత్రం తర్వాత, యాభై ఏళ్ల స్వంత భాషా ప్రయుక్త రాష్ట్ర అవతరణ తర్వాత దాదాపు 40 శాతం ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువన నివసిస్తున్నారు. ఇంకా 35 శాతం నిరక్షరాస్యులున్నారు. దున్నేవారికి భూమి దొరకలేదు. నిరుద్యోగం పెరిగింది. అసంతృప్తి, ఆగ్రహం పెరుగుతున్నాయి.

రాష్ట్రంలో ప్రాంతీయ అసమానతలు పెరిగాయి. అసమానత అనుమానాలను, ప్రాంతీయ విద్వేషాలను పెంచుతోంది. సమతుల్య

అభివృద్ధి జరగనంతకాలం, భౌగోళిక, రాజకీయ సమైక్య రాష్ట్రం వున్నా, ప్రాంతాల మధ్య ఏర్పడాల్సిన భావ సమైక్యత సాధ్యంకాదు.

ఇదొక బాధాకరమైన చేదుసత్యం.ఐదు దశాబ్దాల ఆంధ్రప్రదేశ్ చరిత్ర తీపిచేదుల సమ్మిశ్రితం.సాధించిన దానికంటే సాధించాల్సింది చాలాఉంది.

- సురవరం సుధాకర రెడ్డి

భారత కమ్యూనిస్టు పార్టీ పార్లమెంట్ సభ్యులు

*****

ఆంధ్రప్రదేశ్ ఎప్పుడూ అభివృద్ధిలో మధ్యస్త రాష్ట్రంగానే ఉంటూ వచ్చింది. అనేక అభివృద్ధి చెందిన రాష్ట్రాలతో పోల్చినప్పుడు భౌతిక, మానవ వనరులలో ఏమాత్రం తీసిపోనిదైనప్పటికీ ఆంధ్రప్రదేశ్ వాటిని వినియోగించుకుని అభివృద్ధిని సాధించటంలో వెనకబడుతూనే వచ్చింది.

అక్షరాస్యతలో ఇప్పటికీ 61 శాతం (2001 సెన్సెస్) లోనే ఉన్నాం. ఆరోగ్య సూచికల్లో వెనకబడి ఉన్నాం. ఈ విషయాల్లో దక్షిణాది రాష్ట్రాలు మననెప్పుడో దాటిపోయాయి. పట్టణ జనాభా శాతం ఆధునిక అభివృద్ధికి ఒక కొలబద్దగా చెబుతుంటారు, ఇప్పటికి ఆంధ్రప్రదేశ్‌లో 27 శాతం అయితే, పట్టణ జనాభా నిలకడగా ఉన్నది. మిగిలిన దక్షిణాది రాష్ట్రాలు 40 శాతాన్ని దాటిపోతున్నాయి. బాల శ్రామికుల సంఖ్యలో, ఆత్మహత్యల సంఖ్యలో మన రాష్ట్రమే అగ్రభాగాన ఉండడం మనం సిగ్గుపడే విషయం. తాజా గణాంకాల ప్రకారం దేశంలోనే మన రాష్ట్రంలో ప్రజలు ముఖ్యంగా రైతులు ఎక్కువ అప్పుల భారం మోస్తున్నారు. ఇవన్నీ పరిశీలించినప్పుడు మానవ వనరులు వినియోగంలో, కనీస అవసరాల కల్పనలో ఇప్పటికీ ఎంత వెనకబడి ఉన్నామో అర్థమౌతుంది.

ఐ.టి. రంగంలో రాష్ట్రం బాగా పురోగమించిందన్న విషయం నిజమైనప్పటికీ, సర్వీసురంగం అభివృద్ధి సుస్థిరాభివృద్ధి కాదు. వస్తూత్పత్తి రంగం అభివృద్ధి ఆధారంగా ఆర్థికాభివృద్ధి ఉండాలి. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ఘోరంగా వెనకబడిపోయింది. సమీప భవిష్యత్తులో మార్పు వస్తుందని అనుకోలేం. నూటికి అరవై మంది ప్రజలు ఆధారపడి బతుకుతున్న వ్యవసాయరంగం స్తబ్దుగా ఉంది. హరిత విప్లవం మూలంగా కొన్ని ప్రాంతాలు గతంలో పురోగమించినప్పటికీ ఇప్పుడు రాష్ట్రంలో వ్యవసాయం ఉత్పత్తిలో, ఉత్పాదకతలో వెనకబడిపోతున్నది. లాభసాటిగా లేదు. చిన్నకారు, సన్నకారు రైతులు దివాలా తీస్తున్నారు. మళ్లీ కౌల్దారీ పద్ధతి పెరిగిపోతున్నది. వివిధ రంగాల మధ్య నెలకొన్న అసమతౌల్యాన్ని, స్తబ్దతనీ బద్దలుకొట్టక తప్పదు. ఆంధ్రప్రదేశ్ ఇప్పుడున్న వ్యవస్థలోనైనా పురోగమించటం సాధ్యంకాదు. ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో భూస్వామ్య వ్యవసాయ సంబంధాలు, కరడుగట్టిన కులవ్యవస్థ సామాజిక సంబంధాలు, ఉత్పత్తిశక్తుల అభివృద్ధికి ఆటంకంగా ఉన్నాయి. వీటిని బద్దలు కొట్టందే పురోగమనం సాధ్యం కాదు.

గత దశాబ్దంలో సరళీకరణ విధానాలను అమలు జరపటంలో ప్రపంచబ్యాంక్ మన రాష్ట్రాన్ని ప్రయోగశాలగా ఎంచుకున్నది. గత తెలుగుదేశం ప్రభుత్వం ప్రపంచబ్యాంక్ సంస్కరణలను అత్యుత్సాహంతో అమలు జరిపింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అదే బాటన ప్రయాణం చేస్తున్నది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ప్రైవేటు వ్యాపార ప్రయోజనాలకోసం పూర్తిగా పునర్వ్యవస్థీకరిస్తున్నది. దీని మూలంగా కొద్దిమంది ధనవంతులు మరింత ధనవంతులవుతుంటే అత్యధిక ప్రజల పరిస్థితి దిగజారిపోతోంది. ప్రజల మధ్య ఆర్థిక వ్యత్యాసాలు, ప్రాంతాల మధ్య అసమానతలు, బలహీనవర్గాల జీవిత విచ్ఛిన్నం, ఉద్యోగులు కార్మికులలో అభద్రతా భావం, విచ్చలవిడి అవినీతి, ప్రభుత్వంలో నిరంకుశ పోకడలు, అసాంఘిక శక్తులకు ఊతం వంటి అనేక దుష్పరిణామాలు గత దశాబ్దంలో తీవ్రమయ్యాయి. ఇవి ఇంకా పెరుగుతాయి. ప్రారంభంలో సంస్కరణలు మేలు చేస్తాయని, అభివృద్ధి అందరికీ దక్కుతుందనీ భ్రమలు కల్గించాయి. క్రమంగా అనుభవంలో సంస్కరణలు తమ జీవితాన్ని విచ్ఛిన్నం చేస్తాయని ప్రజలు తెలుసుకుంటున్నారు. సంస్కరణల దుష్ప్రభావం తమపై ప్రత్యక్షంగా పడినప్పుడు ప్రతిఘటిస్తున్నారు. గతంలో విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం, ఇప్పుడు జరుగుతున్న నిర్వాసితుల పోరాటాలు పెరుగుతున్న ప్రతిఘటనకు నిదర్శనమే. రాబోయే కాలంలో సంస్కరణల పురోగమనానికి వాటిని అడ్డుకునే ప్రతిఘటనకు, అడ్డుకునే శక్తులకు మధ్య ఒక పెద్ద ఘర్షణ అయ్యే అవకాశం ఉంది. ఈ ఘర్షణలో ప్రజలు తాత్కాలిక విజయాలు, పాక్షిక విజయాలు ఇప్పుడు సాధిస్తున్నారు.మరింత ఐక్యత, మరింత స్పష్టత ప్రత్యామ్నయ విధానంవైపు ప్రజలను సమీకరించగలిగితే, ప్రజానుకూలమైన అభివృద్ధివైపు మళ్లించగలుగుతాం. అటువంటి ఐక్యతను సాధించటం నేటి కర్తవ్యం. దానికోసం ప్రయత్నం చెయ్యడం మన బాధ్యత. గతంలో కమ్యూనిస్టు పార్టీ విశాలాంధ్రలో ప్రజారాజ్యమని ఆశించింది.అయితే ప్రజలరాజ్యం రాలేదు.ప్రజలు పాలకులుగా ఉండే రాజ్యంకోసం,ఉండే రాజ్యం సాధనకోసం కృషిచేయడానికి ప్రయత్నం చేస్తాం.

గత యాభై ఏళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో సాధించబడిన మార్పులు పరిమాణాత్మకమైనవే. నీటి పారుదల సౌకర్యాలు పెరిగాయి. నాగార్జునసాగర్, శ్రీశైలం, శ్రీరామ్‌సాగర్ వంటి కొన్ని భారీ ప్రాజెక్టులు నిర్మాణమయ్యాయి. పంప్‌సెట్ సాంకేతిక పరిజ్ఞానం వచ్చాక అనేక జిల్లాల్లో వ్యవసాయంలో తీవ్రమైన మార్పు వచ్చింది. ప్రభుత్వరంగ ప్రోత్సాహం వలన హైదరాబాద్, విశాఖపట్నం చుట్టూ కొంత పారిశ్రామికత జరిగింది. పరిశ్రమల్లో పెట్టుబడులు పెట్టే సంప్రదాయానికి భిన్నంగా మన రాష్ట్రంలోని జనాలు వినోద రంగంలో ప్రవేశించారు. మంచి పట్టు సంపాదించారు. కాంట్రాక్టర్లుగా అభివృద్ధి అయ్యారు. పారిశ్రామికాభివృద్ధి మాత్రం పెట్టుబడులు లేక కునారిల్లిపోయింది.

- బి.వి. రాఘవులు

భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి

*****

అభివృద్ధికి మూలమైన మౌలిక సదుపాయాలు కల్పించుకోవడంలో కొంత పురోగతిని సాధించాం. ఉదాహరణకు నాగార్జునసాగర్, శ్రీశైలం, పోచంపాడు, జూరాల మొదలైన ప్రాజెక్టులు. అలాగే విద్యుత్ శక్తి ఉత్పాదనకు సంబంధించి కొంత అభివృద్ధిని సాధించుకున్నాం. విద్యుత్ ఉత్పాదన కొంతవరకూ పెంచుకోగలిగాం, నివాస వసతులను కల్పించుకున్నాం.

విద్యారంగంలో వసతులు,సదుపాయాలు,మంచినీటి సదుపాయాలు, నాటికి నేటికి పోల్చుకోనంతగా పెరిగిపోయాయి. వైద్య వసతులు పెరిగాయి. అయితే ఇంతవరకూ సాధించిన అభివృద్ధి సమాజంలో కొందరికే మేలు చేస్తున్నాయి. గణనీయమైన సంఖ్యలో పేదవర్గాలు

అభివృద్ధి ఫలితాలను అందుకోలేపోతున్నాయి.

వైఫల్యాలను చూస్తే - మనుషుల మధ్య అంతరాలు అనూహ్యంగా పెరిగిపోయాయి. అత్యంత సంపన్నుడికి, అత్యంత దరిద్రుడికి మధ్య అంతరం నేడు మనకున్న ప్రజాస్వామ్య వ్యవస్థ పూడ్చలేదనే భావం విస్తరిస్తున్నది. దేశ మొత్తంలో ఇదే పరిస్థితి కావచ్చునేమో గాని, మన రాష్ట్రానికి సంబంధించినంత వరకూ ఇది చాలా స్పష్టంగా కన్పిస్తున్న అభివృద్ధి వైఫల్యం.

అనూహ్యంగా అవినీతి పెరిగిపోయింది. డబ్బులిచ్చి శాసన, పార్లమెంట్ సభ్యత్వాలు కొంటున్నారనే అభిప్రాయం ప్రజలకు కలుగుతున్నది. ఓటుకు డబ్బు తీసుకుంటే తప్పేమిటని ప్రశ్నించే వాళ్లు కనబడుతున్నారు. డబ్బులిస్తే ఏ పనయినా అవుతుందనే అభిప్రాయం జనంలో వ్యాపించింది. 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడినపుడుగాని, 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడినపుడుగాని తెలుగునాట ఎక్కడా ఎవరూ ఇంతటి అవినీతి ప్రబలుతుందని ఊహించలేదు. గడిచిన 50 ఏళ్లలో సాధించిన అభివృద్ధికి, ఆర్థిక రంగంలో సాధించిన అభివృద్ధికి, ఇదే కాలంలో చూసిన నైతిక పతనానికి ఏమైన సంబంధం ఉన్నదేమో ఏ విశ్వవిద్యాలయంగాని, స్వచ్ఛంద సంస్థగాని పరిశీలించినట్లు కనిపించదు. అభివృద్ధి ఒకసమాజం నైతికంగా ఎదగడానికి కూడా ఉపయోగపడినపుడే సార్థకమవుతుంది. అలా సాగకపోవడానికి బాధ్యత అన్ని రాజకీయ పక్షాలూ పంచుకోవల్సిందే.

మతం పేరిట, కులం పేరిట సమాజం ఇంతగా చీలిపోతుందని 50 ఏళ్ల కిందట నేనుగాని, నా ఈడువాళ్లు గాని ఊహించలేదు. కళ్లెదుట సంభవిస్తున్న ఈ విపరిణామాన్ని ఎవరూ ఎందుకు పట్టించుకోవడం లేదో తెలియడం లేదు. అధికారంలోకి రావడానికి రాజకీయ పార్టీలు మతాన్ని కులాన్ని నిస్సిగ్గుగా వాడుకుంటున్నపుడు ప్రజలు మతం పద్ధతిలో, కులం పద్ధతిలో ఆలోచించడాన్ని తప్పు పట్టలేం.

నేటి వ్యవస్థలో ప్రజలు తమ ఆర్థిక, సాంఘిక, నైతిక స్థితిగతులను మెరుగు పరచుకోవడం సాధ్యం కాదేమో అనే భావన యువతలో కలుగుతున్నది. ఈ భావన తొలిగి, ఇప్పుడున్న రాజ్యాంగ వ్యవస్థలో పరిస్థితులను మెరుగుపరచుకోవడం సాధ్యమని ఏ రాజకీయ పార్టీ అయినా, ఏ నాయకులైనా హామీ ఇస్తే, మాట ఇచ్చి నిలుపుకుంటే చూడాలని వుంది. ప్రజలను కూడా డబ్బుతో పెడమార్గాన్ని పట్టించే ధోరణి అంతమయితే చూడాలనిఉంది.

అక్రమ మార్గాల్లో అంతులేకుండా ధనాన్ని సంపాదిస్తున్న వ్యక్తులూ, సంస్థలూ అట్టడుగున పేదరికంలో మగ్గుతున్న మనుషుల మనోభావాలను గుర్తించక తప్పని అపూర్వ పరిణామాలు రాక తప్పదు.

- పొత్తూరి వెంకటేశ్వర రావు

సీనియర్ పాత్రికేయులు

*****

విశాలాంధ్ర ఉద్యమ స్ఫూర్తి ఆంధ్రప్రదేశ్ అవతరణ అనంతరం కొనసాగి ఉంటే, స్వర్ణోత్సవ సందర్భంలో సమైక్యం ప్రశ్నార్థకమై ఉండేది కాదు. అక్షర క్రమంలోనే కాకుండా ప్రగతిపథంలో సైతం అగ్రగామిగా ఉండేది. హృదయవైశాల్యం లేని నాయకులు పాలకులైన కారణంగా సమైక్య యాత్రకు ఆదిలోనే విఘ్నాలు ఎదురైనాయి. భావసమైక్య సాధనకు గట్టి ప్రయత్నం జరగనేలేదు. అన్ని ప్రాంతాలవారూ, అన్ని వర్గాల ప్రజలూ మనస్ఫూర్తిగా కోరుకుంటేనే సమైక్య రాష్ట్రం వర్ధిల్లుతుంది. కలసి ఉండటం వల్ల సుఖం ఉన్నదని అందరూ భావించాలి. కలసి ఉండటంలో స్వప్రయోజనం ఉన్నదని అందరూ భావించాలి. అందరికోసం ఒక్కడూ ఒక్కడికోసం అందరూ అనే భావన బలపడాలి. అటువంటి భావాన్ని పాదుకొల్పడానికి అరకొర ప్రయత్నాలు చాలవు. విశాలాంధ్ర ఉద్యమాన్నే ఈ దిశగా కొనసాగించవలసింది. భిన్నత్వాన్ని సమాదరించకపోగా నిరసించడం, ఆచారవ్యవహారాలలో వైవిధ్యాన్ని స్వాగతించకపోగా అవహేళన చేయడం వల్ల కొన్ని ప్రాంతాలవారు ఇతర ప్రాంతాలవారిపై ఆధిక్యాన్ని ప్రదర్శిస్తున్నారనే ఊహాపోహలకు దారితీశాయి. నీటివనరుల పంపిణీలో అభివృద్ధి నిధుల వ్యయంలో ప్రాంతీయ వివక్ష చూపుతున్నారనే ఆరోపణలు అయిదు దశాబ్దాలుగా వినిపిస్తూనే ఉన్నాయి. ప్రత్యేక తెలంగాణ, ప్రత్యేకాంధ్ర ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగసి శాంతించిన తర్వాత కూడా రాజకీయ నాయకులలో, సామాజిక నాయకులలో జ్ఞానోదయం కలగలేదు. న్యాయంగా, ధర్మంగా వ్యవహరించే ప్రయత్నం జరగలేదు. తమ గురించీ, తమ బంధువుల గురించీ, తమ స్నేహితుల గురించీ, తమ ప్రాంతానికి చెందినవారి గురించీ, తమ పార్టీ కార్యకర్తల గురించీ ఆలోచించిన వారే పాలకులైనారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలనూ, అన్ని వర్గాలనూ సమదృష్టితో చూసినవారు కరువైనారు. వెనుకబడిన ప్రాంతాలనూ వర్గాలనూ అభివృద్ధి చేయడానికి ప్రత్యేక కృషి చేయాలన్న ధ్యాస లేకపోయింది. చట్టబద్ధ పాలన లోపించడం వల్ల భూస్వాములూ, రాజకీయ నాయకులూ, ప్రభుత్వ ఉన్నతాధికారులూ కలసి కుమ్మక్కై ప్రజలను దోచుకున్న ప్రాంతాలలో తిరుగుబాటు సంభవించింది. దాని స్వభావాన్నీ, మూలాలనూ అర్థం చేసుకోలేక లేదా అర్థం చేసుకోవడానికి నిరాకరించి బలప్రయోగం చేయడంతో వేలాదిమంది యువతీయువకులు నేలకొరిగారు. పోలీసు ఉద్యోగులూ మరణించారు. ఈ మారణహోమం నాలుగు దశాబ్దాలుగా సాగుతూనే ఉంది. ఆర్థిక సంస్కరణల మోజులో పడి ప్రభుత్వ రంగాన్ని పనికట్టుకొని భ్రష్టుపట్టించిన ఘనత ఈ రాష్ట్రానికే దక్కుతుంది. ప్రసిద్ధమైన ప్రభుత్వరంగ పరిశ్రమలు మూతపడినాయి. వ్యవసాయ రంగం నిర్లక్ష్యానికి గురై వందలాది మంది రైతులు ఆత్మహత్యను ఆశ్రయించారు. సమాచార సాంకేతికరంగం, సేవలరంగం వర్ధిల్లడం, రాష్ట్రానికి చెందిన యువతీయువకులు ఐటీ రంగంలో ప్రపంచంలో మేటి ప్రవీణులుగా రాణించడం సంతోషించదగిన పరిణామాలు. ప్రభుత్వరంగం బలహీనపడకుండా ఉంటే, వ్యవసాయరంగాన్ని ప్రభుత్వం ప్రోత్సహించి ఉంటే రాష్ట్ర ప్రగతి మరింత వేగంగా అభివృద్ధి చెంది ఉండేది.

రాష్ట్ర సమైక్యాన్నీ, సమగ్రతనూ పరిరక్షించేందుకు ఇప్పటికీ సమయం మించిపోలేదు. మహబూబ్‌నగర్ జిల్లా వలసలను నిరోధించడానికి చర్యలు తీసుకోవలసిందిగా తీరాంధ్ర, సీమాంధ్ర శాసనసభ్యులు ప్రభుత్వం ఒత్తిడి తేవాలి. అనంతపురం వెతలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేసేందుకు తీరాంధ్ర, తెలంగాణ ప్రాంతాల శాసనసభ్యులు నడుంబిగించాలి. విజయనగరం జిల్లాలో పేదరికాన్ని పారదోలడానికీ, పల్నాడులో ప్రగతి సాధించడానికి సీమాంధ్ర, తెలంగాణ నాయకులు ఉద్యమించాలి. అటువంటి సమైక్య స్ఫూర్తిని

ప్రస్తుత పాలకులు రగిలించగలిగితే ఆంధ్రప్రదేశ్ సమైక్యంగా కొనసాగుతుంది. శాసనసభ్యులు ఎవరి నియోజకవర్గం గురించి వారు ఆలోచిస్తే, రాజకీయ పార్టీల నాయకులు ఏ గూటి కాడ ఆ పాట పాడుతూ పోతే, కపట రాజకీయానికి పట్టం కట్టి ఎప్పటికప్పుడు పబ్బం గడుపుకోవడమే ఆత్మవంచనకూ, పరవంచనకూ ఒడిగడుతూ ఉంటే, నేలబారు రాజకీయాలలోనే మునిగి తేలుతూ ఉంటే ఆంధ్రప్రదేశ్‌ను ఎవ్వరూ రక్షించలేరు. రాష్ట్రంలో వనరులకు కొదువలేదు. ప్రజల శక్తియుక్తులకు లోటు లేదు. కేవలం రాజకీయ నాయకత్వ వైఫల్యం కారణంగా ప్రాంతాలమధ్యా, వర్గాల మధ్యా దూరాలు పెరుగుతూ వచ్చాయి. కలహించుకుంటూ కలసి కాపురం చేయడం కంటే విడిపోయి సుఖంగా బతకడం మేలనే అభిప్రాయం అన్ని ప్రాంతాలలో బలపడే పరిస్థితులు ప్రబలుతున్నాయి.

తెలుగువారు సుఖశాంతులతో, సిరిసంపదలతో, ఆత్మగౌరవంతో జీవించాలంటే ఈ విచ్ఛిన్నకర ధోరణులు అంతం కావాలి. పీడన, దోపిడి, హింసకు అవకాశం లేని సమాజాన్ని నిర్మించడానికి నిజాయితీగా, చిత్తశుద్ధితో కృషి జరగాలి. దళితుల, వెనుకబడిన ప్రజల ఆర్థిక, సామాజిక, రాజకీయ అభ్యున్నతికి అన్ని వర్గాల వారూ సమష్టిగా ప్రయత్నించాలి.

– కె. రామచంద్రమూర్తి

సంపాదకులు, ఆంధ్రజ్యోతి

*****

యాభై ఏళ్ల ఆంధ్రప్రదేశ్‌లో విజయాలు సాధించిన రంగాలలో ప్రధానంగా రోడ్లు, టెలికమ్యూనికేషన్స్ గూర్చి చెప్పుకోవచ్చు. పారిశ్రామికంగా కొంత విజయాన్ని సాధించినా, ప్రపంచీకరణ, ఆర్థిక సంస్కరణలు, ప్రైవేటీకరణపై పెరుగుతున్న మోజులో ఈ ప్రగతికి తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయి. విద్య, ఆరోగ్యం, మంచినీటి సదుపాయాల కల్పన, నీటిపారుదల, వ్యవసాయరంగంలో ఆశించిన ప్రగతి సాధించలేకపోయింది.

మారుతున్న ప్రపంచ క్రమంలో ప్రజల జీవన స్థాయి మెరుగుదలకు మన రాష్ట్రం మరింత కృషి చేయాల్సివుంది. సాధించిన ప్రగతి ఫలాలు సామాన్యులకు లభిండమన్నది ప్రధానం. రాష్ట్ర ప్రగతిలో సమగ్రత లోపించింది. ధనిక, పేద అంతరాలు మరింత పెరుగుతున్నాయి. ప్రజల కనీస అవసరాలు తీరడంలేదు. రాష్ట్రంలో నెలకొన్న ఖనిజ సంపదను, నీటి లభ్యతను వినియోగించుకోవడంలో వైఫల్యం స్పష్టంగా గోచరిస్తోంది. నేటి ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు మార్గంగా కన్పిస్తున్నప్పటికీ ఇప్పుడది గాలిబుడగల్లాంటి 'రియల్ ఎస్టేట్' పై కేంద్రీకరించడం అత్యంత ప్రమాదకరం. నీటి పారుదల, వ్యవసాయరంగం పై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రీకరించింది, కాని అమలు చోటు చేసుకుంటున్న సంఘటనలు ఆందోళనకరంగా వున్నాయి. పేదల భూ సమస్యపై అవగాహన కొరవడింది.

రాష్ట్రంలో అత్యధిక జనాభా గ్రామీణ ప్రాంతంలో నెలకొనివుంది. నీటి పారుదల, వ్యవసాయ రంగంలో సమతుల్యాభివృద్ధి, పేదరికం దిగువన వున్న జనాభాకు దోహదపడే, కనీస అవసరాలైన విద్య, ఆరోగ్యం పై కేంద్రీకరణ, భూ సమస్య పరిష్కారం, నిజమైన అధికార వికేంద్రీకరణ, పాలనరంగంలో, పోలీస్ వ్యవస్థలో మార్పులతో గూడిన ప్రజాస్వామ్య కనీస ప్రమాణాల పాటింపు, పంటలకు గిట్టుబాటు ధర, ఎన్నికల వ్యవస్థలో సమూల మార్పు, అంగడి సరుకుగా మారిన విద్యా వ్యవస్థకు అడ్డుకట్ట, కులాల ఆట కట్టింపు ఇంకా జరగాల్సి ఉన్నాయి.

– కె. శ్రీనివాస రెడ్డి

సంపాదకులు, విశాలాంధ్ర

*****

అర్ధశతాబ్దికాలంలో ఆంధ్రప్రదేశ్ ఏయే రంగాల్లో విజయం సాధించిందనే విషయం ఒక్కసారి సింహావలోకనం చేసుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది. తెలుగు జాతి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా ఉందని చెప్పలేం. అభివృద్ధి అనేది కేవలం కాగితాల మీద లెక్కలతో కొలిచే వస్తువు కాదు. ఈ యాభైఏళ్ల కాలంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వచ్చిన పరిణామాలు, తుఫానులు, కరువులు కాటకాల వంటి వైపరీత్యాలు, దేశ వ్యాప్త పరిణామాల నేపథ్యం నుండి రాష్ట్రాభివృద్ధిని విడదీసి చూడలేం. తెలుగు వారికి ఒక రాష్ట్రం కావాలనే ఆకాంక్షతో మొదలైన తెలుగు జాతి ప్రస్థానం, తెలంగాణ రాష్ట్రం కావాలి అనే దశకు వచ్చింది. ఈ మధ్య కాలంలో తెలుగు జాతి సాధించింది ఏమీ లేదా? వ్యవసాయం, వాణిజ్యం, పారిశ్రామిక రంగాల్లో గణనీయమైన అభివృద్ధిని సాధించిందనే చెప్పవచ్చు. విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, సామాజిక రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించింది. అదే సమయంలో ఒక రంగం అభివృద్ధి సాధించిన తరుణంలో మరో రంగం వెనుకబడి ఉండవచ్చు. అలాగే, ఒక ప్రాంతం అభివృద్ధి సాధించిన తరుణంలో మరో ప్రాంతం వెనకబడి ఉండవచ్చు. ఉదాహరణకు కాటన్ బ్యారేజీలు రాకముందు ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల పరిస్థితి వేరు. వరదలకు కొట్టుకు పోయే పంటలు, వర్షాధారపు పంటల మీద ఆధారపడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలు, లింకు చెరువుల ద్వారా వ్యవసాయం చేసిన తెలంగాణ జిల్లా కంటే వెనకబడి ఉండేవి. కాటన్ బ్యారేజీ రాకతో గోదావరి జిల్లాల్లో వ్యవసాయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. వ్యవసాయం నుండి వచ్చిన అదనపు పెట్టుబడి వ్యాపార, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లోకి తరలింది. తెలంగాణా జిల్లాల్లో చెరువుల ద్వారా వ్యవసాయం తగ్గిపోవడం, తెలంగాణకు ఇరిగేషన్ ప్రాజెక్టులపై పాలకుల అలక్ష్యం కారణంగా అభివృద్ధి అసమతౌల్యం చివరికి నేటి తెలంగాణ నినాదానికి దారితీసింది. యాభై ఏళ్లలో తెలుగు జాతి అభివృద్ధి చెందినప్పటికీ, అసమతౌల్యం ప్రాంతీయ వాదానికి దారితీసిందని చెప్పక తప్పదు. ఈ పొరపాటును సరిదిద్దే ప్రయత్నం ఇప్పుడు జరుగుతోంది. జలయజ్ఞం, ఆధునిక వ్యవసాయ పద్ధతులతో తెలంగాణ కోస్తాకంటే ఎక్కువ అభివృద్ధి చెందడానికి అనువైన పరిస్థితులు ఇప్పుడు కనిపిస్తున్నాయి. రాష్ట్రం సమగ్ర అభివృద్ధి దిశలో పయనిస్తోంది.

ఏ రంగాల్లో విజయం సాధించలేకపోయిందనే ప్రశ్నకు చప్పున సమాధానం చెప్పలేం. వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధించాం. వ్యవసాయోత్పత్తి పెరిగింది. మరి రైతుల ఆత్మహత్యలు ఎందుకు

జరుగుతున్నాయి. వ్యవసాయం చేయడం ఒక వ్యసనమైన వారు తప్ప మిగతా వారు వ్యవసాయం చేయడానికి భయపడే పరిస్థితి ఎందుకు వచ్చింది. విద్య, వైద్యం ఇంకా అట్టడుగు జనానికి అందుబాటులో రాలేదు. అందుచేత ఈ రంగాల్లో అభివృద్ధి సాధించినా, వెనుకబడి ఉన్నట్టే లెక్క. ఇవ్వాల్టి ఆంధ్రప్రదేశ్‌ను అనతికాలంలోనే ఉజ్వలమైన భవిష్యత్తులోకి అడుగు పెట్టే రాష్ట్రంగా నమ్ముతాను. ఇటు సాగునీటి ప్రాజెక్టులతో మరో ఏడులక్షల ఎకరాలు సాగులోకి రాబోతున్నాయి. ఫ్యాబ్ సిటీ, ఆర్థిక మండళ్లు, రాష్ట్రం నలుమూలలా కొత్త పరిశ్రమలూ రాబోతున్నాయి. అది వరకూ రాష్ట్రంలో ప్రైవేట్ రంగానికి ఇక్కడ వ్యవసాయంలో అదనపు సొమ్ము మాత్రమే పెట్టుబడి. ఇప్పుడు దేశవిదేశాల నుండి పెట్టుబడి ప్రవహిస్తోంది. ఐటి రంగంలో మనం దేశంలోనే ప్రత్యేకతను నిలబెట్టుకున్నాం. ఇప్పుడు విదేశీ పెట్టుబడులకు మరింత అనువైన వాతావరణం ఉంది.

తెలుగు రైతు వ్యవసాయం చేయడమంటే దివాళా తీయడమనే పరిస్థితి నుంచి ఐటి కంటే వ్యవసాయమే లాభసాటి వృత్తి అని చెప్పగల పరిస్థితి రావాలి. తెలుగు వాడుగా పుట్టినందుకు ప్రతిఒక్కర్రూ గర్వపడేలా వ్యక్తులుగా, జాతిగా తెలుగుజాతి సర్వతోముఖంగా వికసించాలి. అంతేకాదు, వ్యవసాయ రంగంలోనూ విదేశీ పెట్టుబడులను ఆకర్షించే పరిస్థితి రావాలి. అప్పుడు మళ్లీ ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణగా, ప్రపంచానికే అన్నదాతగా అవతరిస్తుంది. గతమెంతో ఘనకీర్తి కలిగిన తెలుగునాడు నిజంగా భవిష్యత్తును కూడా ఉజ్వలంగా మలచుకుని 'చెయ్యెత్తి జైకొట్ట' గల స్థితి వస్తుందని ఆశిద్దాం.

– ముళ్ళపూడి సదాశివశర్మ
సంపాదకులు, ఆంధ్రప్రభ

*****

యాభై ఏళ్ల ఆంధ్రప్రదేశ్‌లో నేను గుర్తించే ఒక గొప్ప విషయం గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా మహిళల్లో 'స్వయం సహాయక బృందాలు'. బలహీనవర్గాలకు ఇది సహాయకారిగా ఉంటోంది. అలాగే పంచాయతీ రాజ్ వ్యవస్థలో స్త్రీల భాగస్వామ్యం కూడ చెప్పుకోదగ్గది. న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో జరిగిన ఒక సమావేశానికి కర్నూలు జిల్లానుంచి ఒక మహిళా గ్రామ సర్పంచ్ ప్రతినిధిగా పోవడం హర్షించదగ్గది. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ పరిశ్రమలకు, ఐటి రంగానికి హైదరాబాద్ ముఖ్య కేంద్రం అయింది. ఐటి రంగంలో చెప్పుకోదగ్గ పురోగతి కనబడుతోంది.

రికార్డుస్థాయి ఉత్పత్తితో ఒకప్పుడు ధాన్యాగారంగా ఆంధ్రప్రదేశ్ వాసికెక్కింది. అయితే ఆనాటి ఎంతో కాలం నిలువలేదు. మనకు వ్యవసాయానికి నీళ్లు అందించడంలో తీవ్రమైన వైఫల్యం కనబడుతోంది. ఆర్థిక రంగ సంస్కరణలు, పారిశ్రామిక రంగంలో అభివృద్ధి వలన జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చినా నీటిపారుదల పూర్తిగా నిర్లక్ష్యం కావింపబడింది. గత యాభై ఏళ్లలో ఎన్నో ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరిగినా వాటిలో పూర్తయినవి బహు తక్కువ. ఈ స్థితి తరువాత కాలంలో వ్యవసాయ రంగ సంక్షోభానికి దారి తీసింది. తప్పని పరిస్థితుల్లో రైతులు భూగర్భ జలాలను విచ్చలవిడిగా బోరుబావుల ద్వారా ఉపయోగించుకునే పరిస్థితికి నెట్టివేయబడ్డారు. మెట్ట ప్రాంతాలలో భూమిలోని నీటి మట్టం ప్రమాదకర స్థాయికి పడిపోయింది. వ్యవసాయ రంగ సంక్షోభం వందలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకునే లాగ పురికొల్పింది.

గోదావరి, కృష్ణా జలాల వినియోగం సక్రమంగా జరగటం లేదు. నీళ్ల కేటాయింపులు ప్రాంతీయ పక్షపాతంతో జరగడం మూలాన, అత్యధిక పరీవాహక ప్రాంతం కలిగి ఉండి కూడా తెలంగాణ ప్రాంతం నష్టపోయింది. సహజంగానే ఈ పరిస్థితి ప్రాంతీయ అసమానతలకు దారితీయడమే కాక తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ బలంగా ముందుకు వచ్చింది. నీటి ప్రాజెక్టుల విషయానికి వస్తే, ప్రత్యేకంగా తెలంగాణ నిర్లక్ష్యం కావించబడింది. కొట్టొచ్చినట్లు కనబడే అతి పెద్ద వైఫల్యం ఏమంటే, వివిధ ప్రాంతాల మధ్య సమైక్యత సాధించడం. కళింగాంధ్ర, ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ ప్రాంతలలో అసమతుల్య అభివృద్ధి కనబడుతోంది. ఒకవేళ ఏమైన అభివృద్ధి సాధించినా అది ప్రాంతీయ అసమానతగానూ, వేరే ప్రాంత ప్రజలు బాధపడేదిగానూ మాత్రమే ఉంది. ఈ భావన వారి ఉద్యోగాల్లో చూడవచ్చు. ఇతర ప్రాంతాలపై తమ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ, తమ భాషా సంస్కృతులే గొప్పవనే భేషజాన్ని, ఇతరుల పట్ల చిన్నచూపును ఆంధ్ర ప్రాంతం వారు ప్రదర్శిస్తున్నారు. ఈ చిన్న చూపు తెలంగాణ భాషను అచ్చులోనూ, ఎలక్ట్రానిక్ మీడియాలోను, అవమానకర రీతిలో చూపుతున్న వ్యక్తీకరణలో చూడవచ్చు.

తెలంగాణ ప్రాంత ప్రజలకు ఉద్యోగాల్లో ఆంధ్ర ప్రాంతం వారితో సమానంగా అవకాశాలు కలిగించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి. జి.ఓ610ని అమలు చేయడంలోనూ విఫలమయ్యాయి. తెలంగాణ ప్రజల పట్ల తీవ్రమైన వివక్ష, వారి ప్రాంతం పట్ల పక్షపాత ధోరణి మనకు కనపడుతుంది.

దళితులు, ఆదివాసీలు, ముస్లింల హక్కులు పరిరక్షించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. సామాన్యుల పౌర, మానవ హక్కులు కాపాడడంలో ఘోరంగా విఫలమయ్యాయి. ఇప్పటికీ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను మన రాష్ట్రంలో ఏర్పాటు చేయలేకపోయారు. ఇప్పుడు ఉన్న రాష్ట్ర మానవ హక్కుల కమిటీ మానవ హక్కుల కమిషన్‌కు ప్రత్యామ్నాయం ఎంత మాత్రం కాదు. పౌర మానవ హక్కులు హరించబడడం రాష్ట్రానికి ఒక మచ్చ.

భాషా రాష్ట్రాల ఏర్పాటు తొలిదశలో ఫజల్ అలీ కమిషన్ సరిగానే ఆలోచించి, సంయుక్త విశాలాంధ్రలో తెలంగాణ విలీనాన్ని సమర్థించలేదు. కమిషన్ తెలంగాణ ప్రాంత ప్రజల ఆకాంక్షల రక్షణకు ఎన్నో సూచనలు చేసింది. అయితే అవి ఏవీ అమలుకు నోచుకోలేదు. వీటన్నిటి పరిణామమే నేటి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్. ఈ డిమాండ్ ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా ఒక పెద్ద ప్రశ్న అయితే మన ముందు ఉంది.

– జాహిద్‌అలీ ఖాన్
సంపాదకులు, సియాసత్

*****

నగరంలోని కార్లు, అపార్ట్‌మెంట్లు ప్రగతికి కొలమానం కావు. ఎంతమంది పేదవాళ్లు స్కూళ్లలో చేరి చదవగలుగుతున్నారు, నిరుద్యోగం ఎంత తగ్గింది. గ్రామాల్లో జనం జీవన ప్రమాణాలు ఎలా ఉన్నాయి

అనేదాని బట్టి అభివృద్ధి గురించి మాట్లాడుకోగలం. అలాచూస్తే ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి కనబడటంలేదు. కాలేజీలు, చదువులు, అన్నీ ఉన్నట్లే ఉంది.

మన రాజ్యాంగం పేదవాళ్లకోసం, వాళ్ల భవితరాల బాగుకోసం రాసుకున్న రాజ్యాంగం, దానిలోని మౌలిక బాధ్యతలను ఎంతవరకు అమలు పరుస్తున్నారనేది ప్రశ్న. ఈ కోణంలో పరిశీలిస్తే పెద్దగా అభివృద్ధి అయినట్లు కనిపించడంలేదు. అందులో ఈ దశకం ఆత్మహత్యలు ఎక్కువయ్యాయి. ప్రజా ఉద్యమాలూ ఎక్కువ అయ్యాయి. జనం బతుకుదెరువు వెతుక్కుంటూ వలసపోతున్నారు. అమర్త్యసేన్ ఈ ఆత్మహత్యలను రాజకీయ వైఫల్యప్రేరిత హత్యలుగా (ఐడియలాజికల్ క్రైమ్స్) పేర్కొన్నాడు. నలభై - నలభై ఐదు ఏళ్లుగా నక్సలైట్ ఉద్యమం ఉంది. ఏర్పడ్డది, బలపడ్డది, ఇలా బలపడుతూ, క్షీణిస్తూ, బలపడుతూ ఈ రాష్ట్రంలో ఉన్నది. దీన్ని ఆర్థిక విధానాలతో ఎదుర్కోవాలే కాని కేవలం పోలీసు శాఖకు వదిలేసే ఉద్యమం కాదు. వారిపై అణచివేత విధానం,ఎన్‌కౌంటర్‌ల పేరుతో కాల్చేస్తున్నారు.ఎన్‌కౌంటర్ పేరిట ఒక హత్య జరిగితే అది కేవలం నక్సలైట్ ఉద్యమానికి పరిమితమవ్వదు. విచ్చలవిడిగా ప్రవర్తించవచ్చని ప్రభుత్వం పోలీసుశాఖను ఆదేశిస్తే, పోలీసుశాఖ పనిచేసే తీరు అన్ని రంగాల్లో వికృత రూపం తీసుకుంటుంది. అది విధానకర్తలు గమనించడం లేదు. పోలీసుశాఖ సరిగా పనిచేయక పోవడానికి ఇది ఒక ముఖ్య కారణంగా కూర్చుంది. వాళ్లు సృష్టించిన కోబ్రాలు చంపుతుంటే దానికి జవాబుదారీ లేకుండా ఉంటే ఒక ప్రభుత్వశాఖ జవాబుదారి లేకుండా హత్యలకు పూనుకుంటే ఎంతవరకూ అది ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తుందో మనం అర్థం చేసుకోవచ్చు. అమానుషంగా చంపి ఆ పీనుగును అక్కడే పడేసిపోతే, ఈ సమాజానికి ఎలాంటి విలువలున్నాయనేది అర్థం అవుతుంది. ఇలాంటి వికృత స్వరూపం ప్రభుత్వంలో చొరబడకూడదని ఎన్.టి.ఆర్. కాలం నుంచి మొన్నటి చర్చల వరకూ మేము మాట్లాడాం కూడా. రైతులకు 'సుస్థిరజీవనం' ఏర్పాటు చేస్తే ఇలాంటి ఉద్యమాలు తగ్గుతాయని చెన్నారెడ్డితోనూ మాట్లాడాం, అయినా కూడా దీనిని గురించి పట్టించుకోలేదు. ప్రజల ఒత్తిడిమీద చంద్రబాబు నాయుడు హయాంలో ఆఖరిదశలో ఆయనకూడ చర్చలకు ఒప్పుకోవాల్సి వచ్చింది. చర్చలనేది ప్రజల ఒత్తిడివలన కాంగ్రెస్ మానిఫెస్టోలో, ఎన్నికల రాజకీయాల్లో ఒక అంశంగా మారింది. చర్చలు జరిగినాయి. ఆ తొమ్మిదినెలలు, చర్చలకు ముందు ఆరు నెలలు, తరువాత ఒక మూడు నెలలు హింస అనేది లేకుండా, నాకు తెలిసి నలభైఐదు ఏళ్లలో మొదటిసారిగా అలాంటి వాతావరణం వచ్చింది. ఎన్.టి.ఆర్, వై.ఎస్.ఆర్.ల కాలంలో కొద్దికాలం హింస లేకుండా ఉంది. ఈ అక్టోబర్‌తో చర్చలకాలానికి రెండు ఏళ్లు అయిపోయాయి.

ఇప్పుడు స్పెషల్ ఎకనమిక్ జోన్స్ అని ఏర్పరచాలని చట్టం చేసుకున్నారు. ప్రపంచీకరణకు వసతులు కల్పిస్తున్నారు, కార్మిక హక్కులంతా తొలిగించేస్తున్నారు. ఉద్యోగ భద్రత లేదు. రాజ్యాంగంలో ఉండే ఆర్థిక విధానానికి భిన్నంగా, ప్రపంచీకరణ ఆర్థిక విధానాన్ని తీసుకువచ్చి, రాజ్యాంగంలోని హక్కులను కాలరాచే ప్రయత్నంలో ఉన్నారు. పేదల ఆధీనంలో ఉన్న భూములు తీసుకున్నారు. గోల్ఫ్ కోర్సులకో, ఫాస్ట్‌ట్రాక్‌లకో గుంజుకుంటున్నారు. పేదోళ్లకు ఇళ్ల స్థలాలు లేవు. ఉంటున్న స్థలాన్నీ ఖాళీ చేయిస్తున్నారు. ఇరవై శాతం ధనికవర్గానికి వసుతులు కల్పిస్తున్నారు. నగరాల్లో మనుషులు నడిచే స్థలాలు లేకుండా కార్ల సంఖ్య పెరిగింది. అందంగా షాపింగ్ మాల్స్ వచ్చినాయి. పేదలకు తినడానికి మాత్రం తిండిలేదు. కోర్టు కూడా ఈ ప్రపంచీకరణ విధానాన్నే పేదల వ్యాజ్యాలలో అనుసరిస్తోంది. వాళ్లకు కోర్టులో చోటులేదు. న్యాయానికి చోటులేదు. ఇటు ప్రభుత్వం వాళ్ల గురించి పట్టించుకోవడం లేదు. దీంట్లో చిరకాల ఆకాంక్ష ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం. యాభైల్లో అందరూ ఏమనుకున్నామంటే భాష ఒకటే కాబట్టి విశాలాంధ్ర ఉండాలనుకొన్నాం. లింగ్విస్టిక్ స్టేట్స్ మూవ్‌మెంట్‌తో అప్పుడలా అనుకున్నాం. భాష ఒకటయినంత మాత్రాన ఒక రాష్ట్రంగానే ఉండాలనేది తప్పని ఇప్పుడు అర్థమౌతోంది. రెండునదులు తెలంగాణలో ప్రవహించినా తాగునీరు, సాగునీరు లేవు. 1968లో ఉద్యమం ఒక వెల్లువలా వచ్చింది. అప్పుడే ఈ ఉద్యమాన్ని బలంగా నడిపి ఉంటే వేరే రాష్ట్రం వచ్చేది. కానీ రాజకీయ నాయకులు అమ్ముడుపోయారు. ఆ ఉద్యమం వచ్చేనాటికి కోస్తా జిల్లా నుంచి వలసవచ్చి ఆస్తులు కొనుక్కున్నారు. ఇక్కడ ఉన్న కూలీలు వలసపోతే, అక్కడి ధనికులు ఆస్తులుకొన్నారు. అప్పటికే ఆంధ్ర జనాలు చాలా మందే వచ్చినారు. ఇప్పుడు మళ్లీ వచ్చింది అదే ఉద్యమం. హైదరాబాద్‌లో కొన్ని ప్రాంతాలు విజయవాడ మాదిరి ఉంటాయి.

చిన్నరాష్ట్రాలయితేనే మేలు అన్నది అనుభవంలో తెలుసుకున్నాం. నిర్వహణ సులభం. నీళ్ల చుట్టూ రాజకీయాలు తిరుగుతున్నాయి. ఇంటర్ స్టేట్ వాటర్ ట్రిబ్యునల్ రాష్ట్రానికి ఎన్ని నీళ్లో నిర్ణయిస్తుంది కాని, నదులు పారే ప్రాంతానికి ఎన్ని నీళ్లివ్వాలని తేల్చలేదు. అందువల్ల నీళ్లతో రాజకీయాలు వచ్చేసాయి. ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ ప్రజాస్వామ్యాన్ని పెంపొందించడానికి దోహద పడుతుంది. ఒక విధంగా చూస్తే తెలంగాణ ప్రజలకు వాళ్ల రాష్ట్రాన్ని, వాళ్ల వనరులను ఎలా పెంచుకోవాలనే హక్కు ఉంది. వాళ్లకు రాష్ట్రం కావాలా, వద్దా అనేది వాళ్లు నిర్ణయించుకోవాలి. వేరే ప్రాంతాల వాళ్లు నిర్ణయించేది కాదు. రాజకీయాలు ఎంత క్షీణించి పోయాయంటే సోనియాగాంధీ తెలంగాణరాష్ట్రం ఇస్తుందని, ఆమె జాగీరు అన్నట్లు మాట్లాడుతున్నారు. అంటే లాబీయింగ్ వలన తెలంగాణ రాష్ట్రం వస్తుందనేది ఒక అప్రజాస్వామిక ఎత్తుగడ. ప్రజాఉద్యమాల మీద నమ్మకం లేని వాళ్లు ఇలాంటి అపోహలతో అగచాట్లు పడుతుంటారు. అంటే ఒక పక్క రైతుల సేద్యానికి సౌకర్యాలు లేవు, నీళ్లు లేవు, విద్యుత్, మంచి విత్తనాలు లేవు. వాళ్లు అప్పులపాలయి ఆత్మహత్యలకు పూనుకుంటున్నారు. పేదలు వాళ్ల నివాస స్థలం నుంచీ ఖాళీ చేయించ బడుతున్నారు. పేదవాళ్లు చదివే హక్కు లేకుండాపోయింది. పేద ప్రజానీకం పట్టణాలకు వలసవచ్చి బిచ్చగాళ్లవుతున్నారు. ఇటువంటి పరిస్థితులు ఆంధ్రప్రదేశ్ ప్రొగ్రెస్‌ను సూచిస్తోందా అనేది ప్రశ్న? అభివృద్ధి అంటే ఏమిటి?

- కె.జి. కన్నబిరాన్

పౌరహక్కుల ఉద్యమ నాయకులు

* * * * *

ప్రభుత్వం అంటూ నడవడానికి ఎన్నో కొన్ని పనులు చేయాల్సి వస్తుంది. సాధారణ పరిపాలన సాగటం కోసం కూడా కొన్ని పనులు చేయాల్సి వస్తుంది. ప్రజల అవసరాల కోసం కొన్ని ప్రభుత్వ సంస్థలు

ఏర్పడటం, వాటి నిర్మాణానికి కావల్సిన నదుపాయాలు కలగజేసుకోవటంతో కొన్ని పనులుజరుగుతుంటాయి. రోడ్లు వేయటం, కొత్త బస్సులు వేయటం, బస్సుషెల్టర్‌లు నిర్మించడం గ్రామాల్లో కొత్తగా విద్యుత్ దీపాలు వెలిగించడం లాంటివి మామూలు పరిపాలనకు సంబంధించి తప్పనిసరిగా చేయాల్సిన పనులే. వీటిని మనం పురోగతి అనిగాని, అభివృద్ధి అనిగాని అనలేం. కొన్ని ప్రాజెక్ట్‌లు వచ్చి ఉండవచ్చు. కొన్ని మెట్ట ప్రాంతాలకు నీరు అందించి ఉండవచ్చు. ఇవన్నీ కూడా పరిపాలన చేపట్టడానికి ఎన్నికైన ప్రభుత్వం తన పరిపాలన సాగించుకోవటానికి తాను నియమించిన ఉద్యోగుల చేత పని చేయించుకోవటం సాధారణ విషయం. పని చక్కగా జరుగుతుంటే మంచి ప్రభుత్వం అనుకుంటాం. అక్కడక్కడా కొన్ని సంక్షేమ పథకాలను ప్రవేశపెడితే జనం ఎంతో సంబరపడిపోతారు. అలాగే కొన్ని రేషన్ కార్డుల సంఖ్య పెంచినా, చవకధరకు ఆహారధాన్యాలు పంచినా ప్రజలు ఎంతో ఆనందిస్తారు. ఇది మంచి ప్రభుత్వం అనుకుంటారు. ఇదే మనం గత యాభై ఏళ్లుగా చూస్తున్న ప్రభుత్వ నడక. ఇంతకు మించి ప్రధానమైన పౌరజీవన ప్రమాణాన్ని పెంచటం కాని, వారు తమకాళ్లపై నిలబడగలిగిన వనరులను అందించటం గాని జరగటం లేదు. గ్రామాల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. పాలకులు, అధికారులు అందరూ నగరాల చుట్టూ, పట్టణాల చుట్టూ స్థిరపడటంతోనూ పాలనాకేంద్రాలు అక్కడే ఉండటంతోనూ నగరం, పట్టణాలు మెరుగవుతున్నట్లు మనకు కన్పిస్తాయి. కానీ గ్రామాల పరిస్థితి ఘోరమే. రోజూ కూలి దొరకదు, చేయటానికి పని దొరకదు, అంటే తిండిలేనట్లే. మొత్తం దేశంలోనే వంద జిల్లాలలో ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టి సంవత్సారానికి వందరోజులు మాత్రమే పనికి హామీ కలిగిస్తానని చెప్పడం జాతి దౌర్భాగ్య పరిస్థితికి ప్రబల నిదర్శనం. గ్రామాలు విడచి పట్టణాల కొచ్చి అత్యంత దయనీయమైన పరిస్థితిలో ప్రజలు రోడ్లమీద బతుకుతున్నారంటే మన పురోగతి గురించి చెప్పుకోవటానికి సిగ్గుపడాలి. పాఠశాలలు మూతపడిపోతున్నాయి, ఆస్పత్రిలో మందులు ఉండవు, డాక్టర్లు ఉండరు. ప్రజల ఆరోగ్య పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతున్నది. మరోపక్క కార్పొరేట్ విద్యాసంస్థలు, కార్పొరేట్ హాస్పిటల్స్ పెరిగిపోతున్నాయి. ఎవరిని చంపి, ఎవరిని బ్రతికిస్తున్నారో మనకు అర్థమవుతూనే ఉంది. భూమిసమస్య సమస్యలాగనే ఉన్నది. పేదవానికి భూమి దొరికే ఆశలే లేవు. దొరికిన భూమి అన్యాక్రాంతమైపోతుంది. దాన్ని తీసుకుని తిరిగి పేదవానికి అందించే ప్రయత్నాలు లేవు. ప్రజలకు ఉపయోగకరమైన పథకాలుగాని, చట్టాలుగాని అమలుకు నోచుకోవడం లేదు. చట్టాలు అమలుకాకుండా పోవడమే కాకుండా మరోపక్క పోలీసు నిర్బంధం విపరీతంగా ఉన్నది. ఎన్‌కౌంటర్‌లు మరీ ఎక్కువ అవుతున్నాయి. అవి చాలదన్నట్లుగా దుర్భర దారిద్ర్యంలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. లంచగొండితనం విపరీతంగా పెరుగుతున్నది. ప్రజలకు సంబంధించిన అభివృద్ధి మాట ఎలా ఉన్నా నగరాలలో, పట్టణాలలో భూమి ధర ఆకాశానికంటడం చూస్తే, పాలకుల దాహం అంతుపట్టడం లేదు. ప్రజల జీవన పరిస్థితి మెరుగు పడిననాడు బతకడానికి ఆధారాలు వారికి దొరికిన నాడు, మంచి ఆరోగ్యంగా బతకగలిగిన నాడు, తమ పిల్లలను అంతో ఇంతో చదివించు కోగలిగిననాడు, నిర్బంధ వాతావరణం లేకుండా హాయిగా నిద్రపోగలిగిన నాడు మనం అభివృద్ధిని సాధించామని చెప్పుకోవచ్చు. అవి నాకు కనబడటంలేదు. నైరాశ్యంతో చెప్పుతున్న మాటలు కావివి. ప్రజలకు సేవలు జరగాలని ఆకాంక్షతోను, చెయ్యగలిగి ఉన్నప్పటికీ ప్రభుత్వాలు చేయటం లేదనే బాధతోనూ చెబుతున్న మాటలివి.

– బొజ్జాతారకం

సీనియర్ న్యాయవాది

*****

తెలుగు మాతృభాషగా ఉన్న ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలన్న కోరిక 1913లో ప్రారంభమై, 1953 నాటికి ఆంధ్రరాష్ట్రం అవతరణతో ఫలించింది. అప్పటికింకా, హైదరాబాద్ రాష్ట్రంలోని తెలుగు ప్రజలు నిజాం నిరంకుశ పాలనలో మగ్గుతున్నారు. తెలంగాణ రైతాంగ పోరాటం వీరిని విముక్తులను చేసి, 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' ఆశయంతో 1956లో 'ఆంధ్రప్రదేశ్' అవతరించింది.

ప్రత్యేక రాష్ట్రం కావాలని ఎందుకు కోరుకున్నారు?రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో వేరొకరి పెత్తనం లేకుండా, స్వతంత్రంగా అభివృద్ధి సాధించాలన్నది వారి కోరిక. ఇది పాక్షికంగానైనా నెరవేరిందా? 50 సంవత్సరాలు చరిత్ర గమనంలో తక్కువ కాలమేమి కాదు.అర్ధశతాబ్ది కాలంలో ఒక మైలురాయి.పెరుగుతున్న శాస్త్ర సాంకేతిక విజ్ఞాన సహాయంతో, సమాజంలో మార్పులు వేగవంతమవుతున్న నేడు, దానికి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి జరిగిందా?

పై ప్రశ్నకు సమాధానం ఒకటి రెండు మాటల్లో చెప్పటం సాధ్యం కాదు. అభివృద్ధి ఏమీ జరగలేదనడం ఎంత అవాస్తవికమో, సర్వంలోనూ అభివృద్ధి సాధించిందనడం కూడా వాస్తవం కాదు. కాకుంటే స్థూలంగా కొన్ని విషయాలు విశ్లేషించుకోవచ్చు. రాజకీయార్థిక సామాజిక మార్పులు, భారతదేశంలో అంతర్భాగంగా పరిశీలించాల్సి ఉంటుంది. సమాజంలోని అధిక సంఖ్యాకులైన బడుగువర్గాలకు కనీస అవసరాలు తీరాయా? కడుపు నిండా మూడు పూటలా అన్నం, ఉండడానికి చిన్న గృహవసతి, విద్య, వైద్య సౌకర్యాలు నేడున్నాయా? నిజం చెప్పాలంటే, యాభై ఏళ్ల తర్వాత ఈ సౌకర్యాలకు అసంఖ్యాక ప్రజానీకం దూరంగా ఉంటున్నారు. విద్య, వైద్యం పూర్తిగా ప్రైవేటీకరణకు గురయ్యాయి. ఇవీ, వాటికి తోడు శుభ్రమైన గాలి, నీరు, చట్టబద్ధమైన సుపరిపాలన, పౌరులకు స్వేచ్ఛా స్వాతంత్రాలు, రక్షణ ఉండాలి. ఇవి నేడున్నాయా? గ్రామాలు ఖాళీచేసి, రైతులు, చేనేత కార్మికులు, ఇంకా ఎందరో బడుగు జీవులు, పట్టణాలకు వలసపోతున్నారు. ఎందుకు పట్టణాలు నివాసయోగ్యం కాని మురికికూపాలుగా, నేర అడ్డాలుగా తయారవుతున్నాయి? ఇవి మౌలిక సమస్యలు, వీటిని పరిష్కరించడంలో ఆంధ్రప్రదేశ్‌ని ఇన్నేళ్లు పాలించిన రాజకీయ పార్టీలు విఫలమయ్యాయి. ఆర్థికాభివృద్ధి జరగడం లేదని ఎవర అనరు? 8.5 శాతం సాలు అభివృద్ధి రేటు, అపారమైన విదేశీద్రవ్య నిధులు, సెన్సెక్స్ పాయింట్ల పెంపుదలలను ఉదాహరణలుగా చెపుతున్నారు. పెరిగిపోతున్న షాపింగ్ కాంప్లెక్సులు, రకరకాల పెద్దకార్లు, విలాసవంతమైన రెస్టారెంట్లు ఇంకా, ఇంకా ఇవన్నీ ఎవరికి? ఎంతశాతం ప్రజలకు? అభివృద్ధికి మానవకోణం ఎక్కడుంది? అదిలేని సమాజం, ఒక అగ్గిపర్వతంపై కూర్చున్న వ్యవస్థ వంటిది.

ప్రత్యేక రాష్ట్రంలో భాషా, చరిత్ర, సంస్కృతులు పరిఢవిల్లుతాయని అప్పట్లో అందరం కలలుకన్నాం. ప్రజలభాషలో పరిపాలన జరుగుతున్నదా? ఎందుకు జరగడం లేదు? పొరుగున ఉన్న దక్షిణాది రాష్ట్రాల్లో సక్రమంగా అమలు జరుపుతున్నప్పుడు, ఇక్కడేందుకు అమలు జరగడం లేదు. తెలుగు వారి చరిత్ర, సంస్కృతుల గూర్చి, భాషా, సారస్వతాల గూర్చి కృషిసల్పి, మన సాంస్కృతిక వారసత్వమైన జానపద సాహిత్య, కళారూపాలను కాపాడుకొని, వృద్ధిపరచుకొంటున్నామా? రోజురోజుకూ ఆర్థికంగా చితికిపోయి, అధ్యాపక ప్రమాణాలు కోల్పోతున్నందువలన విశ్వవిద్యాలయాల్లో మొక్కుబడిగా జరుగుతున్న అకడమిక్ పరిశోధన మినహాయిస్తే, మౌలికంగా ఈ రంగాల్లో జరిగిన సీరియస్ పరిశోధనలెక్కడున్నాయి? విశ్వవిద్యాలయ స్థాయి వరకూ తెలుగు మాధ్యమంలో బోధన జరగడం అభినందించ దగ్గ విషయం. కానీ, దీనికావల్సిన ప్రామాణిక గ్రంథాలు ఇంకా రావాల్సి ఉంది. కొద్దో గొప్పో తమ తమ రంగాల్లో కృషి చేస్తూ లలిత, ప్రదర్శన కళలను, సాహిత్యానికి కృషి చేస్తున్న అకాడమీలను రద్దు చేశారు. ఈ రంగాల్లో ఉన్నవారందరికీ ఒక వేదికంటూ లేదు.

ఇలా చెప్పుకుంటూ పోతే, గొంగళి మీద అన్నం తింటూ వెంట్రుకలు ఏరినట్లుంటుంది. ఎందుకిలా జరుగుతోంది? పాలకులకు ఇంతకీ శ్రద్ధ దేని మీద వున్నట్టు? పదవులపై, అధికారంపై, దాన్ని కాపాడుకోవడానికి పన్నే ఎత్తుగడల పైవుంది. పరస్పర దూషణలలో, నిరర్థకమైన కార్యక్రమాలలో, పసలేని వాదనలతో, విమర్శలతో కాలం వెళ్లబుచ్చుతున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమన్వయపర్చి, అన్ని ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడకపోవడం అనేకానేక సమస్యలకు దోహదం చేసినట్లయింది. ధనం, అధికారం శాశ్వతంగా నిలుస్తాయా? ప్రజలకు చేసిన మేళ్లు శాశ్వతంగా వుంటాయా? ప్రజలు ఇవన్నీ గమనించలేదనుకోవడం పొరబాటే! కాకుంటే సమయ సందర్భాలు రావాలి. ప్రజాచైతన్యాన్ని సమీకృతంచేసి, దిశానిర్దేశం చేయగల సంస్థాగత నిర్మాణం, సమానత్వం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. అప్పుడే మనం 1956లో నిర్మించదలుచుకొన్న విశాలాంధ్రలో ప్రజారాజ్యాన్ని సాధించుకోగలం.

– వకుళాభరణం రామకృష్ణ
చరిత్రకారులు

*****

ఆంధ్రప్రదేశ్ గత యాభై ఏళ్లలో సాధించిన ప్రగతి కేవలం ఉత్పత్తి శక్తుల పెరుగుదల కోణం నుండి పరిశీలిస్తే ఈ విజయాలు ప్రధానంగా ఆహారోత్పత్తి రంగంలో కనిపిస్తాయి. ఈ రాష్ట్రం 'హరిత విప్లవం' వలన లాభపడ్డ రాష్ట్రాలలో ఒకటి. ఆంధ్రరాష్ట్రంలో 19వ శతాబ్దంలోనే కృష్ణా గోదావరి నదుల మీద ఆనకట్టలు కట్టడం వలన, నీటి పారుదల వసతుల ఆధారమైన హరిత విప్లవం, ఉత్పత్తిలో చాలా పరిమాణాత్మకమైన మార్పులు తీసుకువచ్చింది. హరిత విప్లవం వల్ల చాలా కొత్త సమస్యలు వ్యవసాయ రంగం ఎదుర్కొవాల్సి వచ్చింది, ఇంకా ఎదుర్కొంటున్నది కూడ. అయితే ఆహార ధాన్యాల ఉత్పత్తి కోణం నుండి మాత్రం రాష్ట్రం స్వయం సమృద్ధిని సాధించడమే కాక వాటిని ఎగుమతులు చేయడం కూడా మనం చూస్తున్నాం. అలాగే పారిశ్రామిక రంగంలో కూడా చాలా ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి మెరుగుగానే ఉంది. ముఖ్యంగా 1960, 70 దశాబ్దాలలో కేంద్ర ప్రభుత్వ చొరవతో ఏర్పడ్డ ప్రభుత్వ రంగ సంస్థలు, ముఖ్యంగా పరిశోధనా సంస్థలు రాష్ట్రాన్ని కొంత ముందుకు తీసుకెళ్లాయి. కొన్ని పరిశోధనా రంగాల్లో న్యూట్రిషన్, మందుల తయారీ, దేశ రక్షణ, సిసిఎంబి, డిఎన్ఎ లాంటి రంగాల్లో జరిగిన పరిశోధన రాష్ట్రాన్ని దేశ పటంలో ఒక ప్రత్యేక స్థానంలో నిలబెట్టాయి. చంద్రబాబు హయాంలో ఐటి కి ప్రత్యేకమైన రాయతీలు, వసతులు కల్పించడంవలన రాష్ట్రానికి అంతర్జాతీయ ప్రఖ్యాతి, ప్రతిష్ఠ వచ్చింది. అయితే ఈ రంగంలో బెంగుళూరు, చెన్నయి, పూణె పట్టణాలు మనకంటె చాలా ముందు ఉన్నా మన రాష్ట్రానికి వాస్తవ ప్రగతి కంటె ఎక్కువ ప్రచారం జరిగింది. ఉన్నత విద్యారంగంలో కూడ పదమూడు విశ్వవిద్యాలయాలు సామాజిక రంగంలో నెలకొల్పడం వలన కొంత విద్యా అవకాశాలు పెరిగాయి. గత దశాబ్ద కాలంగా ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ ప్రభావం వలన మనం నిర్మించుకున్న విశ్వవిద్యాలయాలను విధ్వంసం చేసుకుంటున్నాం. ఇది ప్రపంచబ్యాంక్ ఆదేశాలు మేరకు జరిగిందని కూడ గమనించాలి. 1970వ దశాబ్దంలోనే వెనుకబడిన తరగతులకు విద్యలో ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడం వలన ఈ వర్గాల నుండి చాలా మంది విధ్యాధికులు, మేధావులు తయారయి జాతీయ అంతర్జాతీయ వేధోమధనంలో పాలుపంచుకోగల్గుతున్నారు.

ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విశ్వరూపాన్ని మనం హైదరాబాదు నగరంలో దర్శించుకోవచ్చు. విశాలమైన రోడ్లు వీటిని ఇంకా విశాలంగా మార్చడానికి కోట్ల విలువచేసే కట్టడాలు కూల్చడాలు, కొత్తగా కడుతున్న బంగళాలు, స్టార్ హోటళ్లు, సూపర్ బజార్‌లను, మాల్‌లను, ఫాస్ట్ ఫుడ్ హోటళ్లను చూసి ఇది ఒక పాశ్చాత్య ప్రపంచంలో భాగమా అనిపించేంత మార్పు వచ్చింది. దీనిని అభివృద్ధి అని చాలా మంది భ్రమిస్తున్నారు. ఇది నిజమైన అభివృద్ధేనా అనే ప్రశ్నే తట్టనివారికి ఇది విస్మయాన్ని కలిగిస్తున్న అభివృద్ధి.

విజయాలు సాధించని రంగాలకు వస్తే పైన పేర్కొన్న అభివృద్ధి చిత్రపటం ఒక్కసారి చిన్నాభిన్నం అయిపోతోంది. అన్ని వైఫల్యాల్లో కెల్లా అతి పెద్ద వైఫల్యం సామాన్యమైన మనిషి హుందాగా, గౌరవంగా, స్వేచ్ఛగా, భద్రతతో జీవించలేకపోవడం. అందమైన అభివృద్ధి మధ్య అందవికారమైన మనిషి. మనిషిని కేంద్రంగా పరిగణించని ఏ అభివృద్ధి అయినా అందవిహీనంగా ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టబడటం వలన రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. చాలా అభివృద్ధి చెందింది అన్న హైదరాబాద్ నగరంలో జరుగుతున్న అన్యాయాలు, క్రూర హింసలు, చంపడాలు. ఆత్మహత్యలు, దోపిడీలు, స్త్రీలపై హింస, శరీరాన్ని అమ్ముకుంటున్న అసహాయులైన స్త్రీలు, నిరంతరం పౌరుడిని వేధిస్తున్న పోలీసులు, గుండాలు, మాఫియా. ఇవి సామాజిక అభివృద్ధి దృష్ట్యా చాలా ప్రిమిటివ్ లేదా అనాగరిక సమాజ లక్షణాలు. రాత్రింబవళ్లు శ్రమిస్తున్న మనిషికి కడుపునిండా తిండి, తలదాచుకోవడానికి స్థలం కూడా లేని అభివృద్ధి మనది. మనుషులను మనుషులుగా చూడలేని పాలకులు, పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం మన వైఫల్యాలలో అతి పెద్ద వైఫల్యం.

పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, రోజూ పెరుగుతున్న అసమానతలు వీటిని దాచడానికి లేదా దాటడానికి నిరంతర అణిచివేత సమాజ గర్భంలోని తీవ్ర సంక్షోభాన్ని చాటుతున్నాయి. ఈ పరిస్థితికి వ్యతిరేకంగా శాంతియుత ఉద్యమాలు మొదల్కొని, ప్రతిఘటనా ఉద్యమాలనుండి, సాయుధ పోరాటాల ద్వారా తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతూనే ఉంది. ఈ అసంతృప్తి మూలాలకు వెళ్ళడానికి సిద్ధంగా లేని పాలకులు దీనిని బలప్రయోగం ద్వారా, పోలీసు యంత్రాంగానికి కొత్త అధికారాల, ఆయుధాల, నిరంతర కొత్త నియామకాల ద్వారా తమ మనుగడను కాపాడుకోవాలంకునుటున్నారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదు అని అనేవాళ్లు అణిచివేతకు కూడా ఆస్కారం లేదని అంగీకరించాలి. అయితే క్రియాత్మక, సృజనాత్మక రాజకీయాలను సృష్టించుకోలేక పోవడం తెలుగు ప్రజల చారిత్రకమైన వైఫల్యం. శాంతి చర్చల ద్వారా ప్రజల మౌలికమైన సమస్యలను రాజకీయ ఎజెండాలోకి తీసుకురావడానికి చేసిన పౌరసమాజ ప్రయత్నాన్ని, ప్రయోగాన్ని కాపాడుకోలేక పోవడం తెలుగు ప్రజల దురదృష్టం. ఈ వైఫల్యాల వలన హింస-ప్రతిహింస విషవలయంలో చిక్కుకున్న రాష్ట్ర భవిష్యత్తు కొంత అంధకారంగానే ఉంది. ఇలా జరగడానికి ఒక కారణం రాష్ట్ర రాజకీయాల్లో మాఫియా చాలా కీలకమైన స్థాయికి ఎదిగింది. రాజ్యాధికార పునాదులు మాఫియా వర్గంతో ఏర్పడడం వలన త్వరలో ఆరోగ్యకర రాజకీయాలు వికసిస్తాయని అనిపించడం లేదు.

రాష్ట్రాభివృద్ధిని మొత్తంగా అంచనా వేస్తే, తెలుగు సమాజం ఒకవైపు సంక్షోభభరితంగా ఉంది. ఇక్కడ మనకు తెలియని హింస, చిత్రహింస, దుర్మార్గం, దోపిడీ, రాజ్యక్రూరత్వం లేదు. అలాగే ఇక్కడ లేని ఉద్యమం ఎక్కడా లేదు. ఇక్కడ జరుగుతున్న ప్రయోగాలు,తీవ్రమైన సిద్ధాంతపరమైన చర్చలు బహుశా దేశంలో ఎక్కడా జరగడం లేదు. ఇక్కడ దుర్మార్గులు ఎంత క్రూరంగా ఉన్నారో అంతకు మించి త్యాగాలు చేసేవాళ్లు ఉన్నారు. సమాజం పట్ల, మనుషుల పట్ల నిరంతరంగా ఆలోచిస్తున్నవాళ్లు స్పందిస్తున్నవాళ్లు ఉన్నారు. మాట్లాడేవాళ్లు ఉన్నారు. సాహసంగా మాట్లాడే మేధావులు ఉన్నారు. అత్యున్నతమైన నిజాయితీగల వాళ్లు ఉన్నారు. అద్భుతమైన సాహిత్య సృష్టి చేస్తున్న సాహిత్య స్రష్టలున్నారు. ఎంత చెడినా సజీవమైన ప్రచార సాధనాలు ఉన్నవి. అలాగే దిగజారిన మనుషులు, అసహ్యకర నూతన ఆర్థిక వర్గం, వాళ్ల జుగుప్సాకర జీవన విధానాలున్నాయి. పెరుగుతున్న మాఫియా, అశ్లీల సాహిత్యం, మానవత్వాన్ని మంట కలుపుతూ యువతరాన్ని పిచ్చిలోకి నెట్టుతున్న సినిమాలు ఉన్నాయి. రెండు సామాజిక వాస్తవాల, విలువల, ప్రపంచాల మధ్యన ఘర్షణ, సంఘర్షణ ఉంది. సమాజం ఎటు పోతుందో చూడాలి.

భవిష్యత్తు ప్రస్తుత సమాజ గర్భంలోనుండే పుడుతుంది. రాబోయే కాలంలో అన్ని రకాల సామాజిక సంబంధాలు - కుటుంబం, ఆస్తి, స్త్రీ పురుష సంబంధాలు, కులపర అసమానతలు, ప్రాంతీయ అస్తిత్వాలు - మానవీకరింపబడాలి. ఇది సాధించడానికి ఒక ప్రజాస్వామ్య, మానవీయ, ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి ఎదగాలి. ఆశయాలతో, ఆదర్శాలతో నిండి త్యాగానికి సిద్ధంగా ఉన్న కొత్త యువతరం రావాలి. సమానత్వ భావన, సమష్టి జీవనం అనే ప్రాతిపదిక మీద నూతన ప్రాపంచిక దృక్పథం అన్ని రంగాలను ప్రభావితం చేయగలగాలి. సృజనాత్మకమైన తెలుగు ప్రజలు మానవ పరిణామ క్రమాన్ని ముందుకు తీసుకుపోవడానికి విశ్వాసం, సిద్ధాంతం, ఆచరణ వెలుగులో కృషి చేయగలగాలి. మనిషి మనిషిని మనిషిగా చూసే ఉదాత్త ఉన్నత మానవవిలువల పునాది మీద నూతన సమాజ నిర్మాణం కావాలన్నదే నా కల...

- జి. హరగోపాల్
రాజనీతి శాస్త్రవేత్త

*****

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ వెనక నాయకులు చేసుకున్న ఒడంబడికలు, కొంత మధ్యతరగతి ఆకాంక్షలు ఉన్నాయి. తర్వాత దశలో ఆస్ఫూర్తి పూర్తిగా కొరవడం మనం చూస్తాం. ఇంగ్లీషుకు వ్యతిరేకంగా ఇక్కడ ఉర్దూవస్తే, ఉర్దూని కాదంటూ తెలుగు భాషోద్యమాలు వచ్చాయి. బయలుదేరిన ఉద్దేశ్యాలు ఇప్పుడు పూర్తిగా కనుమరుగయిపోయి పాలకులకు, పాలితులకు మధ్య తీవ్రమైన అఖాతం ఏర్పడింది. పాలనా నిర్వాహకులు ఎవరూ తెలుగులో సామాన్యజనానికి అర్థమయ్యేలా మాట్లాడే పరిస్థితి లేదు. ఇప్పుడు తెలుగు భాష ఎవరి దగ్గర సురక్షితంగా ఉందంటే, కష్టజీవుల వద్ద, రైతుల స్థాయిలోనే తప్ప పై స్థాయి వచ్చేసరికి భాషా స్ఫూర్తి లేదు.

భాషకు ఇవ్వాల్సిన ప్రాధన్యత ఇంతవరకూ ఇవ్వనేలేదు. అదేగనుక తమిళనాడు, బెంగాల్ రాష్ట్రాలకొస్తే చాలా బలంగా వారు తమిళం, బెంగాలీలనే ఉపయోగిస్తారు. ఎందువల్లనో మనదగ్గర జరగలేదు. అది జరగకుండా ఇంగ్లీషుకు ప్రాధాన్యత ఇచ్చారు. ఇవ్వాల్టి రోజున ఆంధ్రప్రదేశ్ ఎన్ని రాష్ట్రాలుగా అవుతుందనేది సమస్యకాదు, పాలకులకు పాలితులకు మధ్య దూరం తగ్గాలంటే, చెరిపేయాలంటే మాత్రం ప్రజల భాష (తెలుగు) లోనే ఉండాలి. ప్రజల రాజ్యం అంటే ప్రజల భాషలో మాట్లాడేదయి ఉండాలి. భాషాపరంగా ఏమీ సాధించలేదు. కొన్ని వార్తా పత్రికలు, విరసం లాంటి సంస్థలు ప్రాంతీయ భాషను కేంద్రంగా చేసుకొని సాహిత్యపరంగా ముందుకు తీసుకువచ్చారు.

ఎలాగో కష్టపడి రావిశాస్త్రి గారు మాండలికం తీసుకొచ్చారు. ప్రాంతీయ సంస్కృతి మీద కూడా గౌరవం ఉండాలి. ఒక జిల్లాలో మాట్లాడేది, ఇంకోజిల్లాకు అర్థం కాదు. ఒక జిల్లాలోని పాలకుడికి (కలెక్టర్, ఎస్.పి.) పాలితుడికి భాషలో దూరం ఉంది. 'బాంచెన్ దొర' అంటే 'బానిసను దొర' అనే విషయం చాలామందికి తెలియదు. భాష ఏకీకరణ జరగనపుడు సంస్కృతి ఏకీకరణ జరగదు. పబ్లిషింగ్ హౌజ్‌లు విజయవాడలో ఉండడం వల్ల పుస్తకాల భాష కృష్ణాజిల్లాల భాష అయ్యింది.

పాలకులకు ప్రజలకు మధ్య ఒక రకమైన దూరం ఉంటే, ప్రజలకు ప్రజలకు మధ్య ఇంకోరకమైన దూరం ఉంది. ఈ వ్యత్యాసాలను పరిష్కరించడంలో ఈ యాభై ఏళ్లలో ఒక పెద్ద వైఫల్యం జరిగింది. రాజ్యానికి తెలుగుపై గర్వం లేదు. తెలుగు భాషపై గౌరవం ఉంటే, వివిధ మాండలికాల వైవిధ్యాన్ని గౌరవించగలిగేవారు.

దేశం- రాజ్యభావనకి ఒకే భాష, ఒకే సంస్కృతి, ఒకే మార్కెట్ ఉండాలి. భాష లేకుండా కల్చర్ ఉండదు. కల్చర్ లేకుండా మార్కెట్ ఉండదు. హైటెక్ సిటీ వంటివి గ్లోబలైజేషన్ కల్చర్ ఎక్స్‌టెన్షన్ మాత్రమే.

ఒక మనిషిలో గొప్పదనం కావాలంటే, ఆత్మగౌరవం ఉండాలి. భాషపైన గౌరవం లేకుండా ఆత్మగౌరవం ఎలా ఉంటుంది? ఇది ఆత్మగౌరవంలేని రాష్ట్రం. తెలుగువాళ్లు తెలుగులో మాట్లాడడం ఆత్మగౌరవంగా భావించరు. అదే ఇవ్వాల్టి ఆంధ్రప్రదేశ్ వైఫల్యం. ఇంగ్లీషుకు ప్రాధాన్యత ఇచ్చి చాలాకాలమే అయ్యింది. భాషకు ఉత్పత్తి శక్తిలో, ఉత్పత్తి క్రమంలో రాజ్యాంగంలో అవసరం, ప్రాధాన్యత ఉంటుంది. అది లేకుండా చేసేసారు. జ్ఞానాన్ని వాడుకభాషలో ప్రచారం చేసే క్రమమే దారి తప్పిపోయింది. విద్యకు ఆ పాత్ర ఉంటుంది. అది లేకుండా పోయింది. ఇక్కడ డెంగూ దోమకు గ్రామానికి వెళ్లే డాక్టర్లు లేరు. ఎన్.ఆర్.ఐ. డాక్టర్ అవడంలో వాళ్లకున్న అవసరాలు వేరు. వాళ్ల ఉపయోగం విదేశాల్లోగాని ఇక్కడలేదు. ఐటిలో, ఇంజనీరింగ్‌లో, వైద్యంలో వచ్చిన వెలుగులు ఎక్కడో ప్రసరించగా ఇక్కడ చీకటి మిగిలిపోయింది. వీటన్నిటికి సంబంధం మూలాల్లో భాషతో ముడిపడి ఉంది. పాతతరం వైఫల్యాలను, కొత్తతరం సరిచేసుకుని ఏమైనా ముందుకు పోతుందన్న ఆశ ఉంది.

– ఆర్.ఎస్. రావు

అర్థశాస్త్రవేత్త

* * * * *

ఈ యాభై ఏళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని రంగాల్లో మేలైనటువంటి ఫలితాలను సాధించడం జరిగింది. కాని ఇది కేవలం భౌతికంగాను, సంఖ్యా పరంగాను జరిగిన అభివృద్ధి మాత్రమే. ఇది నిజమైన అభివృద్ధి కాదు. ప్రజల సంక్షేమానికి అంతగా ఉపయోగపడలేదు. విద్యారంగాన్ని తీసుకుంటే గత యాభై ఏళ్లలో వేలాది ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు తదితర వృత్తి పరమైనటువంటి కళాశాలలు స్థాపించడం జరిగింది. వీటిలో అత్యధిక భాగం ప్రైవేట్ రంగంలో ఉన్నాయి. విద్య వ్యాపారీకరణ జరిగింది. అందువల్ల పేదవర్గాల ప్రజలకు విద్య అందనంత దూరంగా జరిగిపోతోంది. విద్యాప్రమాణాలు కూడా పూర్తిగా క్షీణించాయి. విద్యారంగంలో విలువలకు స్థానమే లేకుండా పోయింది. మాతృభాషను తాత్సారం చేయడం జరుగుతోంది. అనేక వేలమంది యువకులు, వృత్తి పరమైనటువంటి డిగ్రీలు, సంప్రదాయకమైన డిగ్రీలు కలిగినవాళ్లు కూడా నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి సరియైనటువంటి కార్యక్రమాలు చేపట్టలేదు. వైద్యరంగానికి వస్తే లక్షలాది ప్రజలు, ముఖ్యంగా పేదవారు అనారోగ్యంతో నరకయాతనలు అనుభవిస్తున్నారు. రాష్ట్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, నగరాల్లో ప్రభుత్వ రంగంలో అనేక ఆస్పత్రులు నెలకొల్పారు. ఇవి ప్రజలకు నిరుపయోగంగా తయారయినాయి. డాక్టర్లు లేరు, మందులు లేవు, ఆరోగ్యరంగానికి నిధులకొరత ఉన్నది. అంతేకాక రాష్ట్రంలో కొన్నేళ్ల వరకు మలేరియా రోగాన్ని పూర్తిగా నిర్మూలించడం జరిగింది. కాని ఇటీవలి సంవత్సరాల్లో విజృంభిస్తోంది. దీనికి తోడుగా చికున్ గున్యా, డెంగ్యూ వ్యాధులతో పాటు అనేక విష జ్వరాలు జన్నాని పీల్చిపిప్పి చేస్తున్నాయి.వీటి నివారణకు ప్రభుత్వం చేసిన కృషి నామ మాత్రమే. ఈ రోగాలకు ప్రధానమైన కారణాలు, పరిసరాల అపరిశుభ్రత, శుద్ధమైన తాగునీరు లేకపోవడమే. ఈ రెంటిని సరిగా కాపాడకపోవడం ప్రభుత్వ వైఫల్యమే. వ్యవసాయ రంగానికొస్తే రాష్ట్రం ఏర్పడిన మొదటిదశలో వ్యవసాయ ఉత్పత్తి పెరుగదల కొంత జరిగింది. 1965 నుంచి 1990 వరకు వ్యవసాయం పెరుగదల చాలా బాగా జరిగింది. దీనికి ప్రభుత్వం తోడ్పాటు, సహకారం, ఉపకరించాయి. కానీ ప్రభుత్వ విధానాలు 1991 నుంచి వ్యవసాయ రంగానికి వ్యతిరేకంగా ఉన్నాయి. అందువల్ల వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిపోయింది. రైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం ప్రపంచబ్యాంక్ విధానాలు. ముఖ్యంగా వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరణ చేయడం ప్రధానమైనది. ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు కూడా వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యత నిస్తున్నామని చెబుతున్నాయి. కానీ ఇది వాస్తవం కాదు. ఏవో పైపై మెరుగులు మాత్రమే చేపడుతూ, తూతూ మంత్రాలు పఠిస్తున్నారు. వ్యవసాయాభివృద్ధి జరగాలంటే ప్రభుత్వ విధానాల్లో సమూలమైన మార్పులు రావాలి. అందులో భూసంస్కరణలు, భూపంపకాలు, కౌలుదారులకు రక్షణ ముఖ్యమైనవి. రైతులకు కావలసిన రుణ సదుపాయం ప్రభుత్వరంగ సంస్థలనుండి రైతాంగానికి అవసరమైనంత మేరకు నాలుగు శాతం వడ్డీ ఇస్తూ, రైతు ఉత్పత్తులకు గిట్టుబాటుధర కల్పించినప్పుడే ఇది సాధ్యమవుతుంది.

పారిశ్రామిక రంగం అభివృద్ధి కూడా ఈ యాభై ఏళ్లలో నామమాత్రమే. ఇటీవల కాలంలో దేశీయ, బహుళజాతి కంపెనీల లాభాల కొరకు గనుల తవ్వకాన్ని భారీగా చేపడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలి కాలంలో రైతులనుండి అభివృద్ధి పేరుతో ప్రత్యేక ఆర్థిక మండళ్లు, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి జోన్లు, పరిశ్రమలు, సాగునీటి ప్రాజెక్టులు వంటి పేరుతో రైతుల భూములను లాక్కొంటూ పెట్టుబడి దారులకు ఊడిగం చేస్తోంది. గత యాభై ఏళ్లలో రాష్ట్రంలో వివిధ వర్గాల ప్రజల మధ్య సాంఘిక, అసమానతలు పెరిగిపోయాయి. రాష్ట్రంలో రాజ్యహింస వికటాట్టహాసం చేస్తోంది. ప్రజల నోళ్లను నొక్కుతూ ప్రజా ఉద్యమాలను ప్రభుత్వం నలిపేస్తున్నది. ఈ పరిస్థితులు మారాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వ విధానాల్లో ముఖ్యంగా ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణలను నిర్ద్వందంగా వ్యతిరేకించాల్సిన అవసరంఉంది. ఈ రాష్ట్రం అభివృద్ధి కావాలంటే నిజమైనటువంటి ప్రజా అనుకూల విధానాలను అవలంబిస్తూ, ప్రజల హక్కులను పరిరక్షించాల్సిన అవసరం ఉంది.

– డా. కె.ఆర్. చౌదరి

వ్యవసాయ శాస్త్రవేత్త

* * * * *

వ్యవసాయ ప్రధాన రాష్ట్రం కాబట్టి ధాన్యానికి కొదవ లేదు. రైతులకుండాల్సిన సదుపాయాలు లేవు. వారు ఆత్మహత్యలు చేసుకోవడం ఒక దౌర్భాగ్య పరిస్థితి. వ్యవసాయ రంగంలో పెట్టుబడులు పెరిగి, గిట్టుబాటు కాక ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరం. అక్షరాస్యత వంద శాతం సాధించబడలేదు. ప్రాథమిక విద్య పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యింది. పాఠశాలల భవనాల నిర్మాణం ఎక్కడా జరగలేదు. కూలిపోతే మూసేద్దామని చూస్తున్నారు. కాని నిర్మాణ ప్రసక్తిలేదు. పారిశ్రామిక అభివృద్ధి సున్న. నిరుద్యోగం పెరిగిపోతోంది. ఐటి రంగంలో విద్య, ఉద్యోగాలు పెరిగాయంటే ప్రభుత్వ ప్రమేయంకన్న ప్రైవేట్ వ్యక్తులు, బయటశక్తులు ఎక్కువ కారణంగా కనిపిస్తున్నది. పేదరికం పెరిగిపోయింది. పేదలకు, ధనికులకు మధ్య అంతరం పెరిగిపోతోంది. అంతర్జాతీయ విమానాశ్రయం, రింగ్‌రోడ్డు అంటున్నారు కాని ఉన్న

రోడ్లు దీనావస్థలో ఉన్నాయి. చెత్త సమస్య పరిష్కరించబడడమే లేదు. రోగాలు పెరిగి, వైద్యసదుపాయాలు లేకుండా ఉంది పరిస్థితి. జనాభా పెరుగుదల తోపాటు జరగాల్సిన అభివృద్ధి ఏ రంగంలోనూ కనిపించుటలేదు. కావలసినంత కరెంట్ ఉత్పత్తిలేదు.

ఇటువంటి పరిస్థితుల్లో ప్రపంచీకరణ అని మాట్లాడడం హాస్యాస్పందంగా అన్పిస్తోంది. అవినీతి, అక్రమాలు, అన్యాయాలు పెరుగుతున్నాయే గాని తగ్గడం లేదు. మొత్తంగా పరిస్థితి చాలా నిరాశాజనకంగా ఉంది. యాభై ఏళ్ల సందర్భంగా వెనక్కి తిరిగి చూస్తే ఏళ్లు గడిచినా, అభివృద్ధి శూన్యమనిస్తోంది.

మనలాగే యాభై ఏళ్లకింద స్వాతంత్ర్యం సంపాదించిన సింగపూర్, కొరియా, థాయిల్యాండ్‌లను చూస్తే మనం అభివృద్ధి సాధిస్తున్న దేశంగా శాశ్వతంగా నిలచి ఉన్నాం.

స్త్రీలలో చైతన్యం పెరిగింది. యువతలో చైతన్యం కనిపిస్తోంది. బాధ్యతాయుతంగా ఆలోచిస్తున్నారు, అది ఆశాజనకంగా అనిపిస్తోంది. మీడియా కూడా బాధ్యతగా వ్యవహరించడం వలన ఆశాజనకంగా అనిపిస్తున్నాయి.

-ముదిగంటి సుజాతారెడ్డి
రచయిత్రి

*****

యాభై ఏళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్ ఏర్పడినపుడు రాష్ట్ర అభివృద్ధి గురించి ఉన్న ఆశలకు, ఆలోచనలకు ఇప్పుడున ఆంధ్రప్రదేశ్ ఉన్న స్థితికి సంబంధమేలేదు. ప్రాజెక్టులు, పరిశ్రమలు, అన్ని ప్రాంతాలకు సమానాభివృద్ధి తెలుగు భాషాభివృద్ధి ఇవన్నీ ఆనాటి ఆశలు అనుకుంటే, వాటిలో కొన్ని మాత్రమే కార్యరూపం దాల్చాయి. హైదరాబాద్‌లో పబ్లిక్ సెక్టార్ పరిశ్రమలు దాదాపు మూతబడ్డాయి. ప్రాజెక్టులు పూర్తి కాలేదు. ప్రాంతీయ అసమానతలు పెరుగుతున్నాయి. తెలుగు భాష బోధనా ఉద్యమంగా, పాలనా భాషగా సయితం అభివృద్ధి చెందలేదు. అయితే ప్రజా పోరాటాలు మాత్రం జరుగుతూనే ఉన్నాయి. పాలకులు అభివృద్ధి అనుకునే దానికి, ప్రజలు అభివృద్ధి అనుకునేదానికి మధ్య ఉన్న అంతరం ఈ పోరాటాల్లో కనిపిస్తోంది. రాబోయే కాలంలో రాష్ట్రం రెండు లేదా మూడు రాష్ట్రాలుగా విభజించబడినా ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రజలకు కావలసిన అభివృద్ధి జరుగుతుందనే నమ్మకం కలగడంలేదు.

చదుకున్న స్త్రీల సంఖ్య, ఉద్యోగాలు చేసే స్త్రీల సంఖ్య పెరిగినా స్త్రీలలో నిరక్షరాస్యత శాతం ఎక్కుగానే ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో స్త్రీలపై జరిగే హింస కూడా ఎక్కువగానే ఉంది. దానితో పాటు స్త్రీవాద ఆలోచనలు, మహిళా ఉద్యమాలు కూడా రాష్ట్రంలో బలంగానే ఉన్నాయి.

ప్రజల్లో రాజకీయ చైతన్యం ఉంది. వారిని అభివృద్ధి వైపు నడిపించే రాజకీయాల మీద ఆశ పెట్టుకోవడం తప్ప చేయగలిగింది లేదు.

- ఓల్గా
రచయిత్రి

*****

తెలుగునేల మీద కష్టం చేసి బతికే ప్రజల దృష్టితో ఆలోచించినప్పుడు ఆంధ్రప్రదేశ్ ఏ రంగంలోనూ విజయం సాధించలేదు. ఆంధ్రప్రదేశ్ తెలుగుమాట కాదు. జాతిగా ఇది మన తొలి అపజయం. అంతకన్నా వలస పాలనకాలంలో విభజింపబడి, వేరయినందువల్ల గాయపడి తెలుగుజాతి ఒకటి కావాలని ఏర్పడిన భావన ఆంధ్రప్రదేశ్ ఏర్పడే క్రమంలోనే బలహీనపడుతూ వచ్చింది. ఇవాళ రెండుప్రాంతాలు ఎన్నడూ ఒకటికావు, రెండు తెలుగులు ఎన్నడూ ఒకటి కావు అని భావించే ఒక తరం ఏర్పడడానికి ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తీరే దోహదం చేసింది.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడేనాటికే కేంద్రంలో ఉన్న నెహ్రూ ప్రభుత్వానికి పబ్లిక్ సెక్టార్ మీద, భారీ నీటి ప్రాజెక్టుల మీద దృష్టి ఉంది గనుక నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి ప్రాజెక్టులు వచ్చాయి గాని, కాకతీయుల కాలం నుంచీ ఆసఫ్‌జాహీల కాలందాకా ఒక సంప్రదాయంగా కొనసాగిన చిన్ననీటి వనరుల పరిరక్షణ పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యింది. అట్లాగే మెట్ట పంటలు పూర్తిగా నిర్లక్ష్యమయ్యాయి. తెలంగాణకు అలవాటు కాని మార్కెట్ విధానం వచ్చి రైతు వివేకాన్ని అర్థరహితం చేసింది. ఇంక పబ్లిక్ సెక్టార్ 1991 నుంచీ ఉద్దేశ్యపూర్వకంగా నష్టాలకు గురిచేయబడుతూ నైజాం కాలంలోని డి.బి.ఆర్. మిల్స్, అజాంజాహి మిల్స్ వంటి వస్త్ర పరిశ్రమలు, ఆల్విన్ కంపెనీ, నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ వంటి చక్కెర ఫ్యాక్టరీలు అన్నీ మూతబడిపోయాయి. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత వచ్చిన ఐ.డి.పి.ఎల్, ఎచ్.ఎం.టి, రిపబ్లికన్ ఫోర్జ్, రసాయనిక ఎరువుల ఫ్యాక్టరీ వంటివన్నీ మూతపడడమో, జ్వరపడడమో జరిగింది. చేనేత కార్మిక రంగం పూర్తిగా దెబ్బతిని పోయింది. సృష్టికర్త అయిన రైతు ఆత్మహత్య చేసుకుంటున్నాడు. నిరుద్యోగం పెరిగింది.

ఎన్.టి.ఆర్. పాలన నుంచి మొదలై ఒక పథకం ప్రకారం విద్యా, వైద్యరంగాలను ప్రైవేట్ పరం చేస్తూ కేవలం సామ్రాజ్యవాద ప్రయోజనాల దృష్టితో కార్పొరేట్ రంగంలో మాత్రమే విద్యను, వైద్యాన్నీ కేంద్రీకృతం చేసే కుట్ర ప్రారంభమై దాదాపు పూర్తి కావచ్చింది. ఇవాళ నవయువకులైన లక్షలాది మంది ఇంటర్మీడియెట్ విద్యార్థుల భవిష్యత్‌ను 60 శాతం మేర నిర్ణయించే అధికారం నాలుగు కార్పొరేట్ కాలేజీల చేతిలో ఉన్నదంటే విద్యారంగం ఎంతప్రమాదకర స్థితిలో ఉందో ఊహించుకోవచ్చు.

ఇవ్వాల్టి ఆంధ్రప్రదేశ్‌ను సామ్రాజ్యవాద స్వభావంలో భాగమైన అసమ అభివృద్ధికి ఒక నగ్నమైన ఉదాహరణగా నేను బేరీజు వేస్తాను. ఆంధ్రప్రదేశ్ స్వభావరీత్యా ఐదు రాష్ట్రాలుగా ఉన్నది. పాలకులు, కృష్ణా గోదావరి డెల్టా ప్రాంతపు సంపన్న వర్గాలు, కులాలు ఈ యాభై ఏళ్లలో అమెరికా, యూరప్‌లోని ఎన్.ఆర్.ఐ. లతో కలుపుకుంటే వీళ్లు సామ్రాజ్యవాదానికి సమర్థులైన దళారులుగా మారారు. ఈ దళారుల పాలనకింద ఈ ప్రాంతాలకు చెందిన దళితులు, అట్టడుగు కులాల ప్రజలతో సహా తెలంగాణ, కళింగాంధ్ర, రాయలసీమ, పలనాడు చివరకు కృష్ణా గోదావరి జిల్లాల మెట్ట ప్రాంతాలు కూడా దోపిడికీ గురవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఆదిలాబాద్ మొదలు శ్రీకాకుళం వరకూ, తిరిగి ఇటు నల్లమల అటవీ ప్రాంతమంతా బహుళజాతి కంపెనీల లాభాల రేస్ కోర్సు అయ్యింది. గోండులు, కోయలు మొదలు చెంచులవరకూ ఆదివాసులందరూ బలిపశువులయ్యారు. మైదాన ప్రాంతాల్లో తెలంగాణ 1996 నుంచీ ప్రపంచబ్యాంక్ ప్రయోగశాలగా మారింది. జలయజ్ఞం పేరుతో రక్తయజ్ఞానికి సమిధ అవుతున్నది.

సమీప భవిష్యత్‌లోనే ఇక ఆంధ్రప్రదేశ్ ఉండదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడుతుంది. అప్పుడు కోస్తా పాలకుల దోపిడీకీ వ్యతిరేకంగా పోరాడాల్సిన ప్రధాన బాధ్యత కళింగాంధ్ర, పలనాడు, రాయలసీమ ప్రజలపై పడుతుంది. ఆ మూడు ప్రాంతాలలోనూ కళింగాంధ్రకు శ్రీకాకుళం, పలనాడు - రాయలసీమకు నల్లమల దిశానిర్దేశం చేసే ఉన్నాయి కనుక తెలంగాణ రాష్ట్రం కొరకు 1969 నుంచీ జరుగుతున్న పోరాటాల వల్లనే అక్కడి పోరాటాలకు కూడా ఒక ప్రాపంచిక దృక్పథం స్పష్టంగానే ఉంటుందని నేను భావిస్తున్నాను. ప్రపంచం భవిష్యత్తు గురించి చెపుతూ గురజాడ 'కేంద్రం పడమటి నుంచీ తూర్పుకు మారాలి' అన్నాడు. గురజాడ రేపటి చరిత్ర ఎవరు రాస్తారో చెప్పాడు. ఈ రెండు అంశాలను నక్సల్‌బరీ, శ్రీకాకుళం మన ముందు ఎజెండాగా ఉంచాయి. ఏ రూపంలో, ఏ తాత్కాలిక పరిష్కారాల కొరకు పోరాటాలు జరిగినా నడిపించే ప్రాపంచిక దృక్పథం అదే. అది మాత్రమే ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాల పోరాడే ప్రజల ఆలోచనలు, కలలు, ఊహలను సాకారం చేస్తుంది.

- వరవరరావు

విప్లవకవి

*****

ఇప్పటికి ఉన్న ప్రధాన ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ హయాంలో వచ్చినవే. కాంగ్రెస్ ఒక రాజకీయ పార్టీగా అంతర్గత కుమ్ములాటలున్నా, ఆ పార్టీ అస్థిరతకు ఈ అంతర్గత కలహాలు దాని జీవశక్తిని తొలిచివేస్తున్నప్పటికీ, సమర్థులైన ముఖ్యమంత్రుల హయాంలో కొన్ని నిర్దిష్టమైన పథకాలు, ప్రాజెక్టులు కొంతవరకూ అమలులోకి వచ్చాయి. ఆమేరకు రాష్ట్రాభివృద్ధి పరిమితమైన స్థాయిలోనైనా జరిగిందనేది వాస్తవం. గ్రామీణాభివృద్ధి పథకాలకు కమ్యూనిటీ డెవలెప్‌మెంట్ స్కీమ్స్‌కు పునాదులు కూడా కాంగ్రెస్ హయాంలో పడినవే. అలాగే విద్యుచ్ఛక్తి రంగంలో కూడా సాధించిన పరిమితమైన అభివృద్ధి కూడా కాంగ్రెస్ హయాంలోనే. ఎటుతిరిగి రాష్ట్రంలో ప్రాథమిక విద్యా, వైద్య రంగాల విషయంలో ఆశించిన అభివృద్ధి జరగలేదు. నిరక్షరాస్యత జాతీయ స్థాయికన్నా ఒక మెట్టు ఎక్కువగానే రాష్ట్రంలో ఉంది. పైగా ఈ రెండు రంగాల మీదే గతపదేళ్ల వ్యవధిలో ప్రపంచబ్యాంక్ ప్రజావ్యతిరేక సంస్కరణలు అమలులోకి వచ్చిన తరువాత, ప్రజా బాహుళ్యాన్ని ప్రత్యక్షంగా ప్రభావితం చేసే ఈ రెండు రంగాలకూ బడ్జెట్ కేటాయింపులలో కోత పడడమే గాక, ఈ రెండు రంగాలను నానాటికీ ప్రైవేటీకరించడంతో సామాన్యప్రజానీకానికి నదుపాయాలన్నీ దూరమవుతున్నాయి. ఆదిలో పరిశ్రమలు కూడా ఉన్నంతలో ప్రభుత్వరంగంలో పురోగతి సాధించింది కూడా కాంగ్రెస్ హయాంలోనేనని చెప్పుకోవాలి. అయితే ఇటీవలి కాలంలో ప్రజావ్యతిరేక సంస్కరణలు అమలులోకి వచ్చాక ప్రభుత్వరంగ సంస్థలను ప్రపంచ బ్యాంక్ ఆదేశాల మేరకు ప్రైవేటీకరించడమో లేదా ఖాయిలా బడిన పరిశ్రమల పేరిట మూసివేయడమో లేదా జాయింట్ వెంచర్స్ పేరిట మల్టీనేషనల్ కంపెనీలకు అప్పగించడమో ముమ్మరంగా సాగుతోంది. ఈ విధానం, ఈ పోకడలు భారత స్వాతంత్ర్య సమర ప్రాథమిక లక్ష్యాలకు విరుద్ధమైనవే కాకుండా, స్వాతంత్ర్యం తరువాత 1948లో, 1956లో కేంద్రప్రభుత్వం స్పష్టమైనలక్ష్యాలతో రూపొందించిన పారిశ్రామిక తీర్మానాల ఆదేశాలకు కూడా పూర్తిగా భిన్నమైనవి. ప్రపంచ బ్యాంక్ సంస్కరణలు 1991లో పాలకులు ఆచరణలో పెట్టేనాటివరకూ, అంతవరకూ ఉన్న కనీసపు మిశ్రమ ఆర్థికవ్యవస్థ కూడా కేంద్రం నుంచి రాష్ట్రాల వరకూ చెదిరిపోయింది. ఇప్పుడు సాగుతున్న విధానాలు ప్రపంచబ్యాంక్‌వి తప్ప, స్వతంత్ర భారత ప్రభుత్వానివి మాత్రం కావు.

అందువల్ల కేంద్ర విధానాలొకటి, రాష్ట్ర విధానాలొకటి కావు. అందులోనూ ముఖ్యంగా గత పదేళ్లుగా ప్రపంచ బ్యాంక్ చేస్తున్న ప్రయత్నం ఆంధ్రప్రదేశ్‌ను ఇతర రాష్ట్రాలకు 'ఆదర్శంగా' చూపెట్టాలని. దీని ఫలితంగా జరుగుతున్న పని అభివృద్ధి పేరిట, పేదరిక నిర్మూలన పేరిట నూటికి తొంభై మంది ప్రయోజనాలకు విరుద్ధమైన ప్రగతి నిరోధక చర్యలూ, దారిద్ర్యాన్ని పెంచడం, పంచడం. ఉద్యోగులను తొలగించడమే ప్రగతిమార్గంలో ఒక మైలురాయిగా పాలకులు భావిస్తున్నారు. కార్మికులకు సువర్ణకరచాలనం (గోల్డెన్ హ్యాండ్ షేక్) అనే ముద్దుపేరు పెట్టి వారిని మురిసిపోమంటున్నారు. ఐచ్ఛిక ఉద్యోగ విరమణ అనే ముద్రను (వి.ఆర్.ఎస్.) బలవంతంగా రుద్ది, 'ఇది మాకు సంబంధం లేదు' వారి ఇష్టంతోనే వెళ్లిపోతున్నారని అతి తెలివితేటలు ప్రదర్శిస్తున్నారు. నిజానికి బ్యాంక్ సంస్కరణల ద్వారా జరుగుతున్నపని, ప్రసిద్ధ అంతర్జాతీయ ఆర్థికవేత్త స్టిగ్‌లిజ్ చెప్పినట్టు 'ఇది గ్లోబలైజేషన్ కాదు (ప్రపంచీకరణకాదు) బ్రైబరైజేషన్(లంచాల వ్యవస్థీకరణ)'.

నిశిత పరిశీలకురాలు, ప్రముఖ పాత్రికేయులు అయిన చిత్రా సుబ్రహ్మణ్యం తన గ్రంథానికి 'ఇండియా ఈజ్ ఫర్ సేల్' (అమ్మకానికి సిద్ధంగా ఉన్న భారత దేశం) అని ఎందుకు పేరు పెట్టుకున్నారోగాని, అది ఈ రోజున నిజమై కూర్చుంటోంది. ఈ నిజంలో హెచ్చువాటా గత పదేళ్లలోనూ ఆంధ్రప్రదేశ్‌దేనని చెప్పాలి.

ఆంధ్రప్రదేశ్ స్వర్ణాంధ్రప్రదేశ్‌గా, హరితాంధ్రప్రదేశ్‌గా కలలో మాత్రమే మిగలకూడదని, ప్రపంచబ్యాంక్ సంస్కరణల ద్వారా కాకుండా ప్రజాహితమైన దేశవాళీ సంస్కరణల ద్వారా స్థానిక వనరులూ, స్థానిక శ్రమశక్తి, అంగబలం ఆధారంగా సర్వతో ముఖాభివృద్ధికి అవసరమైన ప్రణాళికా రచనద్వారా మాత్రమే రాష్ట్రాన్ని శుభప్రదమైన మార్గంవైపుకు పాలకులు నడిపించాలని ఆశిద్దాం.

- ఎ.బి.కె. ప్రసాద్

అధ్యక్షులు, అధికార భాషా సంఘం

*****

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన యాభై సంవత్సరాల పరిణామాలను నెమరువేసుకుంటే ఇటు గర్వం, అటు విచారం కలుగుతుంది. ఎందుకు గర్వించాలో ప్రభుత్వ విశ్లేషణలు వివరంగా తెలియజేస్తాయి. వాటిని మళ్లీ ఇక్కడ ఉదహరించడం చర్వితచరణం అవుతుంది.

అభివృద్ధిని ఎలా కాదనలేమో, ఆ అభివృద్ధి ఫలితాలు సామాన్య ప్రజలకు అందలేదనేది కాదనలేం. పేదలకు,సంపన్నులకు మధ్య అంతరం పెరగడంతో సామాజిక అశాంతి చోటుచేసుకుంది. అది దినదిన ప్రవర్ధమానమౌతోంది. మావోయిస్ట్ ఉద్యమంలో, మార్కెట్ యార్డుల మీద, రైతాంగం దాడులు చేయడంలో, పట్టణాల్లో జరుగుతున్న ప్రదర్శనల్లో ఇది కనబడుతుంది. గత దశాబ్దం ఆఖరు దశకంలో ప్రపంచబ్యాంక్ పెత్తనం ప్రారంభం కావడంతో సామాన్యుల జీవనస్థాయి మరింత దిగజారింది.

1956లో రాష్ట్రంలో ఏఏ జిల్లాలు వెనకబడి ఉన్నాయో ఆ జిల్లాలన్నీ ఈ నాటికీ వెనుకబడి ఉండడం కొట్టవచ్చినట్లు కనబడుతుంది. దీని ఫలితమే వేర్పాటువాదం. అభివృద్ధి చెందిన జిల్లాలను కొంతకాలం పక్కనపెట్టి, వెనకబడిన జిల్లాలు, ప్రాంతాలను ఫోకస్‌గా పెట్టుకుని అభివృద్ధి కార్యక్రమాలను ఆ ప్రాంతాల్లోనే కేంద్రీకరించడమే నరైన పరిష్కారమౌతుంది.

- వి. హనుమంతరావు

ప్రధాన సంపాదకులు, వీక్షణం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే...!

కొన్ని అనుమానాలు, ప్రశ్నలు, సూచనలు

- దుర్గం రవీందర్

1

తెలంగాణ ఇవ్వడం అంటే గత యాభై ఏళ్లుగా తెలంగాణను వంచించి కొందరు సంపాదించుకున్న అపార సంపదపై కొంత భద్రత కోల్పోవడం, ఏర్పడే కొత్త తెలంగాణ రాష్ట్రంలో ఉండి ఓ ఏడాది రెండేళ్లు వారు అస్థిరతకు గురి కావడం, ఏటా రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ ఖర్చులపై వస్తున్న పెద్ద వాటా కోల్పోవడం, దీంతో ఇప్పుడు వారికి అందుతున్న మూటల సైజు తగ్గుతుంది. ప్రతిమూటలో రెండు వాటాలు అవుతాయి. అందుకే అధికార పీఠానికి చేరువుగా ఉన్న ఎవరికీ కూడ రాష్ట్రం విడిపోవడం ఇష్టంగా లేదు. తెలంగాణ రాకపోవడానికి కాంగ్రెస్‌ను నిందించనక్కరలేదు. ఒక్క వ్యక్తిని వేలు ఎత్తి చూపనక్కరలేదు. తెలంగాణలో ఆస్తులను కూడ బెట్టిన ఏ ఒక్క వ్యక్తి కూడా ఆయన ఆస్తికి పూర్తి భద్రత ఏర్పడే వరకు కొత్త రాష్ట్రాన్ని ఏర్పడనివ్వడు.

తెలంగాణలో పెట్టుబడి పెట్టిన లక్షల కోట్లకు పూర్తి భద్రత కల్పించుకునే వరకు కూడా వారు తెలంగాణ ఏర్పడనివ్వరు. అవసరం అయితే సైన్యాన్ని అయినా దింపుతారు. వేల మందిని ఊచకోత కోస్తారు గాని ఆస్తులను వదులుకోరు. రాబోయే లాభాన్నే వదులుకోడానికి సిద్ధంగా లేని వారు ఎన్నో మాయోపాయలతో తెలంగాణ వారి పొట్టలుకొట్టి సంపాదించుకున్న సంపదను ఎలా వదులుకుంటారు. వైఎస్ రాజశేఖర రెడ్డి, చంద్రబాబు నాయుడు, రామోజీరావు, నేదురుమల్లి, వెంకయ్య నాయుడు, జి.ఎస్.గుప్త, జి.వి.కె. కృష్ణారెడ్డి, ఐ.వి.ఆర్.సి.ఎల్. సుధీర్‌రెడ్డి, సుబ్బిరామిరెడ్డి - రాజగోపాల్, జి.ఎం.ఆర్. మల్లిఖార్జునరావు తదితర వ్యాపారస్తులు, సమైక్య వాదులందరూ కలిసి రాష్ట్రాన్ని వల్లకాడుగా మారుస్తారు. ఉద్యమ నాయకులను బెదిరిస్తారు. జైళ్లలో పెడతారు. వారిపై బురదచల్లి నీరు గార్చ ప్రయత్నిస్తారు. అవసరమైతే ఎన్ని ప్రాణాలనైనా తీస్తారు. ఎక్కడా ఏ సందూ దొరకకపోతే తమ వారి ప్రాణాలనైనా అర్పిస్తారు. కాని ఇక్కడ వారి పరమైన ఒక ఎకరం భూమి కూడా వారు వదులుకోరు. వారికే కాదు, ఆస్తి, పాస్తులున్న ఎవరికైనా వాటిపై ఉన్న ప్రేమ అలాంటిది. ఇది చరిత్రలో ఎన్నో సార్లు రుజువైంది.

చంద్రబాబును, తెలుగుదేశం పార్టీని ఓడించే, ఛేదించే, ఏ ఇతర అస్త్రం కాంగ్రెస్ వారికి లభ్యమైన కూడా తెలంగాణ రాదు. అద్భుతమో, దురదృష్టం కొద్దో చంద్రబాబు రాజకీయాలకు దూరంగా పోయినా తెలంగాణ రాదు. ఎందుకంటే ఢిల్లీ కాంగ్రెస్ వారి గురి తెలుగుదేశం సాధించబోయే పార్లమెంటు సీట్ల మీదనే ఉంటుంది. ఆ తర్వాతనే రాష్ట్ర కాంగ్రెస్ ప్రయోజనాలను వారు లెక్కిస్తారు. తనకు కచ్చితమైన ప్రయోజనం, ఖ్యాతి ఉంటుంది అనుకుంటే తప్ప జాతీయ కాంగ్రెస్ తెలంగాణను ఇవ్వదు. 1969లో అప్పుడు 400 మందిని బలిపెట్టి కూడా ఉద్యమాన్ని ఎలా నీరు గార్చారో, అలాగే ఇప్పుడు నాలుగువేల మందినైనా బలి తీసుకుని ఉద్యమాన్ని నీరు గార్చగల తంత్రం, కౄరత్వం కాంగ్రెస్‌కే కాదు, అధికారం ముందు వ్యక్తుల ధన, మాన ప్రాణాలు ఎప్పుడూ తృణప్రాయమే.

తెలంగాణ ప్రజలు సెంటిమెంట్‌తో కూడిన ఉద్యమం చేస్తున్నారని భయపడి కేంద్రం ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పర్చదు. కేసిఆర్ లాంటి వ్యక్తి నాయకత్వం వహిస్తున్నాడని బెదిరి అసలే ఇవ్వరు. కేంద్రంలో ఏ పార్టీ ఉన్నా ఇదే పరిస్థితి ఉంటుంది. అధికారంలో ఉన్న పార్టీకి తక్షణ ప్రయోజనం ఉంటుంది అనుకుంటేనే వారు కొత్త రాష్ట్రాన్ని ఇస్తారు.

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ నుండి దాదాపు 35 పార్లమెంట్ సీట్లు కాంగ్రెస్‌కు గ్యారంటిగా వస్తాయి అనుకుంటే సోనియా గాంధీ తెలంగాణను ఇవ్వనే ఇవ్వదు. ఈ లెక్కన తెలంగాణ వారు చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని తెలుగుదేశం పార్టీని మరింత బలపడాలని కోరుకోవాలి. అధికార పార్టీ వైఎస్ రాజశేఖర రెడ్డి మరిన్నీ పొరపాట్లు చేసి జనాదరణ కోల్పోవాలని కోరుకోవాలి.

వస్తాయో రావో తెలియని మంత్రి పదవులపై ఆశతో ఉన్న తెలంగాణ కాంగ్రెస్ శాసనసభ్యులకు కూడా విభజన ప్రస్తుతానికి ఇష్టంగా లేదు. రంగారెడ్డి, హైదరాబాదుల్లో నిరుద్యోగ యువత కొందరు ఇప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారంతో తెల్ల బట్టలు వేసుకొని కమీషన్లతో కళకళ లాడుతున్నారు. వీరికి కూడా తెలంగాణ ఉద్యమం రుచించడంలేదు. వీరికి తప్ప ఈ గడ్డన పుట్టిన ప్రతి బిడ్డకు తెలంగాణ రాష్ట్రం తక్షణం అవిష్కృతం కావాలని ఉన్నది మరి ఇంత మంది మనోభావాలకు, ఆవేశాలకు ఉద్యమాలకు నేనే కర్తనని భవిష్యత్తులో టిఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర రావు(కెసిఆర్) చేయబోయే కర్ర పెత్తనాన్ని ఎవరైనా ఆపగలరా?

2

బలప్రయోగం జరగకుండా వచ్చే రాజ్యాధికారం వల్ల నిజమైన అధికారం సక్రమించదన్నది ఒక పాత రాజకీయ సూత్రం. ఈ ఆధునిక కాలంలో సూత్రాలు అర్థాలు మారాయి. వారసత్వపు అధికార సంక్రమణకు కూడా ఈ సూత్రం మినహాయింపు కావచ్చు. ఒక వర్గం రాజకీయవాదులకే మేలు జరిగేలా వ్యూహాత్మకంగా కాగితాలపై అవిష్కృతమయ్యే తెలంగాణా వల్ల ప్రజలకు నిజంగా లాభం కలుగుతుందా అన్నది ఒక అనుమానం, కలిగితే ఎవరికి కలుగుతుందన్నది ఇంకో అనుమానం. గ్లోబలైజేషన్ కరాళ నృత్యం చేస్తున్నప్పుడు ప్రత్యేక రాష్ట్రం తెలంగాణ వారిని ఏ మేరకు దరి చేర్చగలదు. సగటు తెలంగాణ రైతు కోల్పోయిన భూమిని, బ్రతుకును ఎలా ఇప్పించగలదన్నది గట్టి అనుమానం.

దేశంలోని ఒక ప్రాంతపు వ్యక్తి ఇతర ఏ ప్రాంతానికైనా వచ్చి ఏ పని అయినా చేసుకుని బ్రతికే హక్కు ఉంటుంది. కాబట్టి కొత్తగా ఏర్పడిన తెలంగాణలోకి చొచ్చుకువచ్చే ఇతర ప్రాంతాల వారిని ఎలా ఆపగలరు. 1956 తర్వాత మొదలైన వలసలు నేటిదాకా నిరాటంకంగా సాగుతునే ఉన్నాయి. 1969లో చెన్నారెడ్డి ఉద్యమం చల్లారిన తర్వాత లక్షలాది

ఆంధ్ర, రాయలసీమ జనాలు తెలంగాణకు తరలివచ్చి సెటిల్ అయిపోయారు. ఉద్యమం ఎగసి చల్లారిన ప్రతిసారి ఈ వలసదారుల ఆక్రమణలు పెరిగాయి కాని తగ్గలేదు. అలాగే తెలంగాణ వచ్చాకా ఇక ఏ డిస్ట్రిబెన్స్ ఉండదని, కొత్త రాష్ట్రం తెలంగాణలోకి వచ్చే వారిని ఎలా నిరుత్సాహ పర్చగలరు, నిలువరించగలరు. సగటు తెలంగాణ పౌరుడికి ఎంత ప్రయోజనం కలగబోతుంది. సామాన్యుడికి, అమాయకుడికి ఒనగూడే లాభం ఏమిటి?

యాభై ఏళ్ల స్వతంత్ర భారతదేశం రాష్ట్రంలోని దాదాపు కోటి మంది కింది కులాల వారికి కనీసం ఒక రూపాయి ప్రయోజనం కూడా కల్గించ లేకపోయింది. 1806లో వారి అమ్మమ్మ, నానమ్మలు ఎలాంటి జీవనాన్ని గడిపారో 2006లో వారి మనవలు, మునిమనవలు అదే రకపు జీవితాన్ని గడుపుతున్నారు. ఆ స్వతంత్ర భారత్‌లోనే కల్గని ప్రయోజనం 2008లో ఒక రాష్ట్రంగా ఏర్పడబోయే 'తెలంగాణ'లో వీరికి ఏదేనా ప్రయోజనం కలుగుతుందా?

హైదరాబాదు నగరాన్ని వారే అభివృద్ధి చేశారట? ఇక్కడ తొండలు గబ్బిలాలు తప్ప ఏమి ఉండేవి కావుట. గోరటి వెంకన్న పాటలో రాసినట్లు ఏమిలేని నగరానికి, తెలంగాణ పల్లెలకు వీరు ఏం చేయడానికి వచ్చారో మరి? వారే నేడు హైదరాబాదును వదలనే వదలం అని భీష్మ ప్రతిజ్ఞలు చేస్తున్నారు. అవసరమైతే ఉమ్మడి రాజధాని లేదా కేంద్ర పాలిత ప్రాంతం చేయాలన్నది వారి యోచన. ఇది జటిలమైన విషయమే. దీని పరిష్కారంలో అనేక మెలికలు, నష్టపరిహారాలు, గొడవలు జరగడం తథ్యం! కొత్త తెలంగాణ రాష్ట్రంలో ఆంధ్ర సెటిలర్స్ ఏమవుతారు? కొత్తగా ఇతర సెటిలర్స్ రాకుండా ఏమయినా విధాన నిర్ణయాలు చేస్తారా? మార్కెట్‌లలో తిష్టవేసిన మార్వాడి, గుజరాతి, సింధీలను ఏం చేస్తారు? ఇవన్నీ ఆలోచించి, తేనె తుట్టె కదిపినట్లు అవుతుందనుకుంటే తేనె లేని ఉత్తి మైనపు తేనె పట్టును సాధించుకుని ఏం చేసుకొంటారు? అలాంటప్పుడు ఉత్తుత్తి విభజన రేఖను గీసుకోవడం ఎందుకు?

1960 ముందు నుండి ఇక్కడే ఉండి పిల్లల్ని కని సెటిల్ అయిన వారిని ఎలా డిస్క్రిమినేట్ చేయగలరు. డిస్టబ్ చేయగలరు. మరి వారందరు అలాగే ఉంటే, వారిని ఎన్నికల్లో పోటి చేయకుండా నిలువరించడం సాధ్యం కాదు కదా? అలా కాల క్రమంలో శాసనసభలో మెజార్టీ సభ్యులు సెటిలర్సె ఎన్నికయితే ఆ సభలో సగటు తెలంగాణ వ్యక్తికి మేలు జరిగే నిర్ణయాలు తీసుకోగలరా?

నిజాం కాలం నుండి చెరకు, తదితర వ్యాపార పంటల సాగుకు, ఆరుతడి పంటల సాగుకు ఆంధ్రవారి వలసను ప్రోత్సహించింది. బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా ఆంధ్ర ప్రాంతం నుండి ఉపాధ్యాయులను ఇక్కడికి ఆహ్వానించాడు. అక్కడి అర, ఒక ఎకరం పొలాన్ని అమ్మి ఇక్కడ నాలుగైదు ఎకరాలు కొని శ్రమపడి, చమటోడ్చి కొందరు ఇక్కడే స్థిరపడ్డారు. ఇలా స్థిరపడిన వారిలో కొందరు బాగా ఎదిగారు. మరికొందరు రాజకీయాల్లో చేరారు. నిజానికి పూర్తిగా ఇక్కడే స్థిరపడిపోయిన వారితో పేచీలేమి లేవు. ఇబ్బందల్లా వేళ్లను ఇంకా కోస్తా, ఆంధ్రలోనే ఉంచుకుని ఇక్కడ వికసిస్తున్న వారి గురించే. నెల్లూరు, రాయలసీమ రెడ్లు, నాయుడ్లు, మార్వాడి, గుజరాతి, సింధి, తదితరులందరు ఇక్కడి ప్రభుత్వాలను శాసించే స్థితికి ఎదిగారు. వీరివల్ల సామాన్య తెలంగాణకు నష్టం జరుగుతున్నది.

నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్, నల్గొండ, ఖమ్మంల్లో సెటిలర్స్ తెలంగాణ రాష్ట్రంలో శాసనసభ్యులుగా గెలవరని అనుకోవడానికి లేదు. వారు మంత్రులు కూడా అవుతారు. ఆదిలాబాద్ జిల్లా మారుమూలన ఉన్న చెన్నూర్‌లో గత ఇరవై ఏళ్లుగా పాగా వేసి శాసనసభ్యులుగా గెలుస్తున్న సెటిలర్స్‌ను ఎలా కాదంటారు? హైదరాబాద్ నగరంలో ఏర్పడబోయే కొత్త అసెంబ్లీ నియోజకవర్గాల్లో కనీసం రెండు స్థానాల్లో అయిన సెటిలర్స్ గెలిచే అవకాశం ఉంది. నిజామాబాద్‌లో రెండు, ఖమ్మంలో రెండు, ఆదిలాబాద్‌లో ఒకటి రెండు, నల్గొండలో రెండు, పాలమూరులో ఒకటి, మెదక్‌లో ఒకటి, ఇలా వారు అసెంబ్లీని ప్రభావితం చేసేటన్నీ సీట్లు సాధించే అవకాశం ఉంది.

తెలంగాణ వస్తే ఎక్సస్‌గా ఉన్న పలువురు ఆఫీసర్లు, ఉద్యోగులు కొత్త రాజధానికి తరలి వెళ్తారు. విశాఖ, విజయవాడనో కొత్త రాజధానిగా వేగంగా అభివృద్ధి చెందుతుంది. భూమి బ్రోకర్లు ఇక్కడి దుకాణాలు ఇలాగే ఉంచి కొత్త రాజధానిలో కొత్త దుకాణాలు తెరుస్తారు. దాన్ని బ్రాంచ్ ఆఫీసు అంటారు. కావాలంటే అక్కడో చిన్న ఇల్లు పెడ్తారు. అంతేకాని నైజాం రాష్ట్ర విలీనం నాటి రోజుల్లో లాగ సెటిలర్స్ ఒక్క ఎకరం భూమిని కాని, ఒక్క ఇల్లును కాని విడిచిపెట్టి వెళ్లరు. మహా అయితే కొంత కాలం భూములు, ఇండ్ల ధరలు పెరగకుండా నిలకడగా ఉంటాయి. కొత్త రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో పాలకులు హడావిడి చేసి క్రమంగా ఒ ఆరు నెలల్లో చల్లబడతారు. అక్కడక్కడ కొందరికి చిన్న ఉద్యోగాలు వస్తేరావచ్చు. ఒకరిద్దరికి పెద్ద ఉద్యోగాలు రావచ్చు. వందల సంఖ్యలో కాంట్రాక్టర్లు, రాజకీయ బేహారులు బాగుపడవచ్చు.

ఈనాడు కార్యాలయాలు సోలార్ కంచె రక్షణలో నిక్షేపంగా ఉంటాయి. ఫిల్మ్‌సిటీ అలాగే ఉంటుంది. మార్గదర్శి కొత్త చిగుళ్ల వేస్తుంది. కళాంజలి, బ్రిష్ షాపులు జిల్లాకు ఒకటి కొత్తగా వెలయవచ్చు. చందన బొమ్మనలు కొత్త దనాన్ని సంతరించుకుంటాయి. రామానాయుడు, అక్కినేని, కృష్ణ, జి.వి. కృష్ణారెడ్డి, సుబ్బిరామిరెడ్డి తదితరులు ఇక్కడి ఆస్తులను స్టూడియోలను ఇలాగే ఉంచి కొత్త రాజధానిలో వీలయినంత ఎక్కువ భూములు తక్కువ ధరలకు కొని, ఆక్రమించుకొని, సినిమా వ్యాపారం మొదలు పెడ్తారు. ప్రతి పరిణామాన్ని, ఉద్యమాన్ని ప్రయోజనాత్మకంగా, వ్యాపారంగా మలుచుకొనే ఒడుపు వారికుంది. ఆవేశపడి చప్పున చల్లారే గుణం తెలంగాణ వారికి ఉంది.

తెలంగాణలో మేం రూలింగ్ క్లాస్ వారము, మా సంఖ్య ఇతర రూలింగ్ క్లాస్ కులాలకన్నా ఎక్కువ, ఊరూర పెత్తనం మాదే అనుకుంటూ, కొంత రాజకీయ పరిజ్ఞానం, అనుభవం ఉన్న రెడ్లకు నిండా ఒక శాతంగా లేని వెలమ నాయకుడి ఆధ్వర్యంలో తెలంగాణ రావడం సూతారం ఇష్టం లేదు. తెస్తే మా పార్టీ తేవాలి, మా నాయకత్వంలో తెలంగాణా రావాలి అని వారనుకుంటున్నారు. తెలంగాణ ఆవిష్కరణలో మా ప్రమేయం ఉంటే బాగుంటుంది అని భారతీయ జనతా పార్టీ మరోవైపు ఆశ పడ్తున్నది. ఇది అత్యాశ ఏమి కాదు. ఒక ఓటు రెండు రాష్ట్రాలు అన్న వారి అప్పటి రెండు నాలుకను సవరదీసుకుని ఇప్పుడు దీర్ఘాలు రాగాలు తీస్తున్నారు. చంద్రబాబుతో పాటు వేదిక మీద అద్వాని మొన్న మొన్న మాట్లాడిన మాట ఏమిటి, ఈ మధ్య

ఆయన మాట్లాడిన మాటలు ఏమిటి. రాజకీయ ప్రయోజనం, తంత్రం, ముందు ఇలా మాటలు మార్చడం, ఏ ఎండకు ఆ గొడుగు పట్టడం లాంటి అంశాలు రాజకీయవాదులకు చాలా చిన్నవి.

మేం సిద్ధాంత రీత్యా చిన్న రాష్ట్రాలకు వ్యతిరేకం కానీ కాంగ్రెస్ ఇస్తానంటే వద్దనం, మా అంతట మేం ఎప్పుడు దీన్ని ప్రతిపాదించం, సమర్థించం అని ఉభయ కమ్యూనిస్టులు స్పష్టంగానే చెబుతున్నారు. స్థానిక పరిస్థితులు తెలియక సమైక్య వాదం జీర్ణించుకున్న సీతారాం ఏచూరి లాంటి వారు ఢిల్లీలో కూర్చుని అప్పుడప్పుడు సమైక్య వాదాన్ని వినిపిస్తున్నారు.

3

హైదరాబాద్ అందరి రాజధాని అనుకొని ఆంధ్ర ప్రాంతంలో ఉన్న ఊర్లోని ఇల్లు, భూములు అమ్ముకొని పలువురు హైదరాబాద్‌కు వచ్చారు. విద్యా ఉద్యోగ అవకాశాలున్నాయని ఇక్కడే సెటిల్ అయ్యారు. అలా 1956 నుండి ఈ వలసలు నిరంతరంగా జరుగుతున్నాయి. అలాంటి వారిని ఇప్పుడు డిస్ట్రబ్ చేయడం ఒకరకంగా అన్యాయమే. 'కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం' అనే సామెతలా ఉంది పరిస్థితి. యాభై ఏళ్లుగా సమస్యను ముదరనిచ్చి, మిన్నకుండి ఇప్పుడు పరిష్కారం కావాలంటే బోలెడంత అరిష్టం జరగవచ్చు. సమస్యపట్ల అటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇటు ఉద్యమకారులకు ఎవరికీ స్పష్టమైన అవగాహన లేదు. కనీసం ఇప్పుడైనా సమస్యను శాస్త్రీయంగా, లోతుగా, విభిన్న కోణాల్లో అధ్యయనం చేద్దామన్న ఆలోచన ఎవరకి లేకపోవడం ఎంత ఆశ్చర్యమో.

అప్పుడెప్పుడో నైజాం కాలంలో ఆదిలాబాద్ అడవుల్లోని గోండుల్లో అశాంతి ప్రబలి, వారు ఎదురుతిరిగినప్పుడు బాబెఝురి కాల్పుల్లో కొమురంభీం అనే గిరిజన వీరుడు మరణించాడు. గిరిజనుల్లో బోలెండంత అశాంతి ప్రబలింది. పరిస్థితి అదుపులోకి తేవడానికి నైజాం 'హెమన్‌డార్ఫ్' అనే మానవ పరిణామ శాస్త్రవేత్తను సమస్య అధ్యయనానికి నియమించాడు. ఆ మాత్రపు శాస్త్రీయ దృక్పథం రాయలసీమ రెడ్డి ప్రభువులకు కోస్తా పాలకులకు లేకపోవడం ఆశ్చర్యమే.

ఇదేమి చిన్న, సన్న సమస్యకాదు. ఊపేక్షిస్తే ఎంతో ఉపద్రవం ముంచుకు రావచ్చు. బోలెడంత ప్రాణ, ఆస్తినష్టం జరగవచ్చు. పౌరజీవనం అస్తవ్యస్తం కావచ్చు. ఇది పరమ సున్నితమైన సమస్య. ఒకరికి చావు బతుకుల సమస్య, ఇంకొకరికి సెంటిమెంట్ వ్యవహారం. మరికొందరికి కడుపు కాలుతున్న సందర్భం. అటు చంద్రబాబుకు, ఇటు వై.ఎస్. రాజశేఖర రెడ్డికి, మరోవైపు కె. చంద్రశేఖరరావుకు పై నుంచి చూసే పెద్ద చౌదరి, రెడ్డి, రాజు, వెలమ, కోట్లకు ఎదిగిన బీసి కుటుంబాలకు, ఆస్తులకు ఏమీకాదు. అందుకని వారికి సమస్య తీవ్రత తెలియకపోవచ్చు. కాని ఇది చాలా సన్నితమైన, తీవ్రమైన విషయం. అందరు కలిసి కుంపటిని రగిలించారు. ఆ నిప్పు దావాలనంలా వ్యాపించే ప్రమాదాన్ని ఎవరూ ఊహించడం లేదు. సామాన్యులు ఇందులో సమిధలు కాకుడదన్నది, ప్రాణ, ఆస్తి నష్టం జరగకూడదన్నది అందరి ఆకాంక్షగా ఉండాలి. 1952 ముల్కి ఉద్యమాన్ని గుర్తుకు తెచ్చుకోవాలి. ప్రభుత్వాల వైఫల్యాలు, పాలకుల పక్షపాత ధోరణి, ప్రాంతీయ అభిమానాలు, కులప్రీతి, ఇత్యాది విషయాలను దృష్టిలో ఉంచుకొని కొత్త విధానాలను రూపొందించుకోవాలి.

4

ఉద్యమాలను ప్రారంభించాక ముఖ్యంగా సెంటిమెంట్‌తో ముడిపడిన ఉద్యమాలు నాయకుల అదుపు అజ్ఞల్లో ఉంటాయి అనుకోవడానికి ఎంతమాత్రం వీలులేదు. ముఖ్యంగా మీడియా అందులోను ఎలాక్ట్రానిక్ మీడియా విచక్షణతో వ్యవహరించాలని ఏమీ లేదు. దాని స్వభావం వేరు. ఆ క్షణానికి వీక్షకుడిని ఆకర్షించి, రంజింప చేయడమే దాని లక్ష్యం. ఆ మీడియా అగ్నికి ఆజ్యంలా తోడవుతుంది. అప్పుడు పరిస్థితిని అదుపుచేయడం మరింత కష్టం అవుతుంది. ఈ విషయంలో విజ్ఞులైన వారు అప్రమత్తంగా ఉండాల్సిందే.

యాభై ఏళ్లల్లో కొందరు కోట్లకు పడగలెత్తారు, వందలు, వేల ఎకరాలకు యజమానులయ్యారు. భాగ్యనగరం నడిబొడ్డున ఎకరాలకొద్దీ భూమిని స్వాధీనంలోకి తీసుకున్నారు. ఐమాక్స్‌లు, సినీస్టుడియోలు, స్టార్ హోటల్స్, హాస్పిటల్స్ ఇలా ప్రతి ఐదు ఆస్తుల్లో నాలుగు వారివే ఉన్నాయి. భాగ్యనగరంలోనే కాదు భాగ్యనగరం చుట్టుపక్కల భూములన్నీ వారి హస్తగతం అయ్యాయి. చట్టబద్ధంగా సాంకేతికంగా వారు తప్పు చేయలేదు కానీ, నైతికంగా, ధర్మబద్ధంగా వారు వాటికి యజమానులు కాదు. భూమి యజమాన్య హక్కుల బదిలి చట్టాలను రూపొందించే, అమలు పరిచే యంత్రాంగం వారి చేతుల్లో ఉంది కాబట్టి వారు వాటికి యుక్తితో యాజమానులయ్యారు. కోట్లకు పడగలెత్తారు. దీంతో ఇవతలి వారిలో అసంతృప్తి ప్రబలింది. దీనికి ఏ ఒక్కరినో తప్పుపట్టలేం. 'తిలా పాపం తలా పిడికెడు' అన్నట్లు చాలా మందికి ఇందులో ప్రమేయం ఉంది. ఈ పరిస్థితిపై కనీసం పాలకులకు అయినా శాస్త్రీయ అవగాహన ఉండాలి కదా?

ఒక్క చెవికి 16 రకాల ఆభరణాలు ధరించిన సంపన్న సంస్కృతి తెలంగాణ వారిది. పంపన, భీమన్న, పోతన్న, గోపన్న, చెర్విరాల బాగయ్య, మొన్నటి దాశరథి, కాళన్న సాహిత్య సృష్టి నేపథ్యం ఏమిటో వారికి తెలియదా? పంచాంగ రచనా శాస్త్రాన్ని 90 శ్లోకాల్లో పొదిగి, అంతర్జాతీయ ప్రామాణిక కాలరేఖను వరంగల్ మీదుగా గీసిన ప్రముఖ ఖగోళశాస్త్రవేత్త వావిలాల కూచన్న వరంగల్ వాసియేకదా! వీటినన్నింటిని కాదని మీరు వెర్రి బాగులోల్లు అని అన్నారు. తెలంగాణలో కవులే లేరు అని దెప్పిన వారికి, ఊరికి ఒకరు కాదు గల్లీకి ముగ్గురు కవులున్నారని గొల్కొండ కవుల సంచిక ద్వారా మొహం మీద కొట్టినట్టు సమాధానం చెప్పిన ప్రతాపరెడ్డి గారి సంగతి మరిచిపోయారు.

తెలంగాణ వారి అమాయకత్వాన్ని, స్నేహ తత్వాన్ని స్వార్థానికి వాడుకున్న వారిని ఏం చేస్తారు? వందల ఏళ్లు నిజాం కింద ఉర్దూ భాషతో నలిగిన తెలంగాణ వారు తెలుగు మాట్లాడే వారు, తమవారు అనుకున్నారు. 1956లో నెహ్రూ నెత్తినోరు కొట్టుకొని చెప్పినా అప్పుడు బూర్గుల తదితరులు చేసిన తప్పిదం అది. కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చేస్తారు అనే బూచి చూపి, బూర్గుల తదితరులు విశాలాంధ్ర వాదుల మాయలో పడి తెలంగాణకు ఇంతటి సంకటాన్ని తెచ్చి పెట్టారు. తెలంగాణ వారు ఇంత భారి మూల్యాన్ని చెల్లించాల్సి వచ్చింది. స్వంత ఇంట్లో అవమానానికి గురి అయ్యారు. తెలంగాణ భాషను, యాసను వారు వెక్కిరించారు. ఐదు వందల రకాల వడ్లతోపాటు ఉప్పు తప్ప

సమస్త దినుసులను పండించిన తెలంగాణ వారికి వ్యవసాయం రాదన్నారు.

మొదట్లో ఆంధ్ర మీడియా మిత్రులు మేం తెలంగాణకు వ్యతిరేకం కాదు బాస్, ప్రత్యేక రాష్ట్రానికి కూడా వ్యతిరేకం కాదు అనేవారు. ఒక భాష మాట్లాడే రెండు రాష్ట్రాలు ఉంటే నష్టం ఏమీ లేదు కాకపోతే గొడవలొద్దు అని అన్నారు. కేసిఆర్ కేంద్రమంత్రిగా కొనసాగినన్ని రోజులు ఇంకెక్కడి తెలంగాణ బాస్ అని అరనవ్వులు నవ్వారు? ఇప్పుడు మళ్లీ మనం మనం ఒకటి బాస్ గొడవలు వద్దు అంటున్నారు.

చతురత, మ్యానిపులేషన్ కెపాసిటి ఉన్న వ్యక్తి ఆంధ్రవాడయినా, తెలంగాణ వాడయినా ఎప్పుడు కిందబడ్డా బంచోత్ పైన బడ్డ బంచోత్ అని అంటారు. జరిగే నష్టమల్లా అమాయకులకే. అలాంటి అమాయకులకు అండగా ఉండే కొత్త తెలంగాణ రాష్ట్రం ఆవిష్కృతం కావాలని ఆశిద్దాం.

తెలంగాణ వస్తే ఏమవుతుంది?

రెంట్ కంట్రోల్, టెనెంట్ ప్రొటెక్ట్ యాక్ట్‌లను సవరణలతో మళ్లీ అమలు చేస్తారా? భూమి యాజమాన్య హక్కులు, రిజిస్ట్రేషన్ చట్టాలను సవరిస్తారా? హౌసింగ్ బోర్డు తన తప్పులను దిద్దుకుంటుందా? ఆంధ్ర వారికి, సింధి, మర్వాడి, గుజరాతీలకు ఫేవర్ చేసిన అధికారులు గుంజీలు తీస్తారా? హుడా తుడా (తెలంగాణ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి) అవుతుందా?

1948-49లో పోలీస్ యాక్షన్ తర్వాత, ముస్లీం నవాబులు వదిలేసి పోయిన భూములను ఎవరెవరు ఎలా ఆక్రమించుకొన్నారో విచారణ జరిపించగలరా? ధోతి, లోటతో నెత్తిమీద కుండలతో వచ్చిన ఒక సుబ్బరాజు మెదక్ జిల్లాలో ఐదువేల ఎకరాల భూమికి యజమాని ఎలా అయ్యాడో విచారణ జరుపుతారా? తెలంగాణ భూములు ఎలా అన్యాక్రాంతం అయ్యాయో విచారించి, నష్టపోయిన వారికి పరిహారం ఇవ్వగలరా? ఆంధ్ర సెటిలర్స్ గురించి మాట్లాడుతున్నారు కాని, ఇక్కడి కోమటోళ్లలను వెర్రోల్లను చేసి అన్ని వ్యాపారాల్లో తిష్ట వేసుకున్న మార్వాడీ, గుజరాతీలను ఏం చేస్తారు? సింధీలను బంద్ చేస్తారా? సర్దార్‌జీలను పంజాబ్ పంపిస్తారా?

నిజంగా తెలంగాణ కావాలి అనుకున్న వారికి ఒక తృప్తి మిగులుతుంది. ఇంకా ఏమవుతుంది? అప్పుడు కూడా ప్రజల తిప్పలు ఇట్లనే ఉంటాయి. పరిస్థితుల్లో పెద్ద మార్పులేమీ ఉండవు. ఊర్లలో పోరలు బర్ల దగ్గరకు పోతూనే ఉంటారు. ఆ సర్కార్ బడులు గట్లనే ఉంటాయి. ఆ దవఖానాలు మురికి కూపాలుగానే ఉంటాయి. వీరు జాగ్రత్తగా ఉండకపోతే, ఇప్పుడు ఆంధ్రనాయకులు, అధికారులు తింటున్నారు. తెలంగాణ వచ్చాకా తెలంగాణ నాయకులు, అధికారులు తింటారు.

కొత్త రాష్ట్రంలో అవినీతి ఉండదా? రూలింగ్ క్లాస్ వారు స్వార్థాన్ని తగ్గించుకుంటారా? వారి విలాసాలు తగ్గుతాయా? సంపద సమంగా వినిమయం అవుతుందా? బ్యూరోక్రాట్లు వారి ధోరణి మార్చుకుంటారా? ఇంజనీర్లు పర్సెంటేజీలు తీసుకోరా? ఎం.ఎల్.ఏ.ల అధికారాలు తగ్గుతాయా? గ్రామ సచివాలయాలు చట్టబద్ధంగా హక్కులు సాధించుకుని పనిచేయగలవా? మీడియా తప్పుడు రాతలు, కూతలు మానుతుందా?

కొత్తగా ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వ క్యాబినెట్‌లో బీసి, ఎస్సీ కులాల వారు 80 శాతం ఉంటారా? వారి చేతికి నిజమైన అధికారం వస్తుందా? ఎన్నికల్లో రిగ్గింగ్‌లుండవా? ఇందులో ఏ ఒక్కటీ జరగకుండా వచ్చే తెలంగాణ వల్ల ఏ వర్గాలకు ప్రయోజనం కలుగుతుందో ఆలోచించాలి. అధికారం కులాల వారీగా, జిల్లాల వారీగా, ప్రజాస్వామ్య బద్ధంగా పంపిణీ అవుతుందా? కొత్త రాష్ట్రంలో నక్సలైట్లు ఉండరా? ఎన్‌కౌంటర్‌లు ఉండవా? రైతులు, సాలోల్లు ఆత్మహత్యలు చేసుకోరా? గ్రామీణ, పట్టణ ప్రాంత నిరుద్యోగులకు కనీస పని గ్యారంటి ఇవ్వగలరా? రిజర్వేషన్లు సరిగా అమలు అవుతాయా? ప్రభుత్వ నిర్ణయాలు, ఖర్చులు పారదర్శకంగా ఉంటాయా? ఏ ఒక్క ప్రశ్నకు ధైర్యంగా అవునని సమాధానం ఎవరూ చెప్పలేరు.

1949లో పోలీస్ యాక్షన్ తర్వాత, నిజాంకు వత్తాసు పలికిన స్థానిక నాయకులు, జమిందారులు, దేశ్‌ముఖ్‌లు, రూమిటోపి తీసి, ఖద్దరు టోపి పెట్టుకుని షెర్వానీ వదిలి ఖద్దరు కుర్తా వేసుకొన్నారు. కాంగ్రెస్ పంచన చేరారు. వారే నిజపోరాటం చేసిన వారిని పక్కకు నెట్టారు. అందుకే ఈ రోజు తెలంగాణ ప్రజలు ఇంత దుష్టత్వాన్ని భరించాల్సి వస్తున్నది. నిజాం, బ్రిటిష్ గవర్నమెంట్‌లో అధికారం నెరిపిన వారే తర్వాత అధికారం నెరిపారు. రేపు తెలంగాణ వచ్చాకా అదే జరగకుండా అప్రమత్తంగా ఉండాలి.

తెలంగాణ వస్తే, ఆంధ్ర-తెలంగాణ రాష్ట్రాల మధ్య రహదారులు మూసేయరు కదా? ఎంట్రీఫీజు పెట్టరుకదా? పాస్‌పోర్టు వీసాలు అడగరు కదా? ఇక్కడి ఇండ్లను, వ్యాపార సంస్థలను, కార్యాలయాలను ఖాళీ చేయించి మూసేయరు కదా? మరి సెటిలర్స్ ఎందుకు భయపడుతున్నారు?

తెలంగాణ భక్తులు తిరుపతి వెంకన్న హుండీలో డబ్బును వేయకుండా ఉంటారా? బెజవాడ దుర్గమ్మను దర్శించుకోరా, అన్నవరం సత్యనారాయణ స్వామి వారి సత్యసంధతను విశ్వసించరా? శ్రీకాకుళం సూర్యదేవుడి గుడికి వెళ్లరా? ఇలాంటివేమి జరగవు కదా? మరీ సమస్య ఎవరికి? సమస్యల్లా సంపదలు, భూములు అక్రమంగా సాధించుకొన్న వారికే? ఇంకా ఇంకా సంపాదించాలి అనుకునే వారికే?

5

కేవలం బతకడానికి వచ్చిన వారితో ఏ ప్రాంతంలోనూ స్థానికులకు పేచీ ఉండదు. అలాగే కాళోజి గారు అన్నట్లు కేవలం బతుకు తెరువు కోసం ఆంధ్ర నుంచి వచ్చిన వారితో ఇక్కడి వారికి ఎలాంటి గొడవ లేదు. గొడవల్లా ఇక్కడి భూములపై, వనరులపై గుత్తాధిపత్యం కావాలి అనుకుంటున్న వారితోనే. ఇన్ని చట్టాలు ఉండగా రెండు మూడు ఊర్ల శివారు భూములను వేల ఎకరాలను వాటి మధ్య ఉండే చెరువులు, కుంటలు, గుట్టలతో సహా రామోజీరావు ఎలా స్వంతం చేసుకోగలిగాడు. ఇలాంటి చిన్నా పెద్ద రామోజీరావుల వల్లనే ఈ గొడవంత. అలాగే సత్యం కంప్యూటర్స్ వారు, పున్నారావు, జనచైతన్య, జయభేరి, రామానాయుడు, ఇతర రిసార్ట్స్‌ల వారు ఇలాంటి వారితోనే తెలంగాణా వారికి పేచీలన్ని వారే ఇక్కడి భూములను అనైతికంగా ఆక్రమించుకొని రాజకీయాల్లో తలదూర్చి, అధికార పీఠానికి దగ్గరయి స్థానికులకు ద్రోహం చేస్తున్నది. మరి ఇలాంటి వారి గురించి లోతుగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది.

ఈ క్రమంలో పొట్ట చేత పట్టుకొని బతకడానికి వచ్చిన వారిని

నిందించకూడదు. అయితే ముందుగా వీరినే పై వారు రెచ్చగొట్టి తమ పబ్బం గడుపుకోవాలని అనుకుంటారు. ఈ విషయంలో ఇటు తెలంగాణ ఉద్యమకారులు, అటు వలసవాదులు పూర్తి సంయమనం పాటించాల్సిందే.

ఈ విషయంలో సెటిలర్స్ ప్రథమ ప్రాధాన్యత వాటిని కాపాడుకోవడం, రక్షించుకోవడం పైనే ఉంటుంది. ఆ తర్వాతనే వారి ప్రాంతీయత, కులం అనేవి ఉంటాయి. ఇలాంటి అంశాల మీద కొత్త ప్రభుత్వం పూర్తి క్లారిటితో, లోతైన ముందు చూపుగల ఆలోచనతో విధాన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది.

రామోజీఫిల్మ్ సిటి తెలంగాణ సంస్కృతిక కేంద్రం అవుతుందా? ఈనాడు యాసను భాషను మార్చుకుంటుందా? ఆంధ్రజ్యోతి ఆరిపోతుందా? ఆంధ్రుల పత్రికలు బిచాణ ఎత్తేస్తాయా? జయభేరి ఆగిపోతుందా? బంజారా హిల్స్‌ను సగం ఆక్రమించుకున్న నెల్లూరు రెడ్లు గజం భూమినైనా వదులుకుంటారా? రాజుల రియల్ ఎస్టేట్ వ్యాపారాలు వట్టి పోతాయా? మా టివి మూతపడుతుందా? సత్యం కంపెని అసత్యం అవుతుందా? ఆంధ్రప్రదేశ్ ప్రపంచ బ్యాంకు దగ్గర చేసిన అప్పు మాఫి అవుతుందా? పోతిరెడ్డిపాడు సైజు తగ్గుతుందా? పోలవరానికి పాతర వేస్తామా? రైతులు, సాలోళ్ల ఆత్మహత్యలు ఆగిపోతాయా? నాగార్జునసాగర్ రైట్ కెనాల్ ఫ్లో తగ్గుతుందా?

తెలంగాణలో గుంటెడు భూమి పచ్చగా ఉంటే చాలు రివ్వున వచ్చివాలిన గుంటూరు కొంగలు ఎగిరిపోతాయా? కూకట్‌పల్లి ఇళ్లలోని పొయ్యిల్లో పిల్లి పడుకుంటుందా? అక్కినేని, ఐమాక్స్, రాఘవేంద్రరావు, రామానాయుడు, కృష్ణ, ఎం.ఎస్.రెడ్డి, ఎల్.వి. ప్రసాద్‌లు ఉత్తినే చౌకగా పొందిన సినిమా భూములను తెలంగాణ ప్రభుత్వానికి స్వాధీనం చేస్తారా? కోకాపేటతో సహా రంగారెడ్డి జిల్లాల్లో వై.ఎస్. సర్కారు అమ్మిన భూమి అమ్మకాలను కొత్తగా ఏర్పడే తెలంగాణ ప్రభుత్వం రద్దు చేస్తుందా? వెంకయ్యనాయుడి సదరన్‌స్పైస్, హర్షటయోటల నాడి ఆగిపోతుందా? హైదరాబాద్‌లో వైఎస్ ప్రభుత్వం అమ్మజూపుతున్న గాంధి వైద్య కళాశాల, నెహ్రూ జులాజికల్ పార్క్, ఆలియా కళాశాల అమ్మకాల యత్నాలు రద్దు అవుతాయా? బ్రహ్మానందరెడ్డి పార్కులో రాయలసీమ రెడ్లు ఆక్రమించిన భూములను కొత్త రాష్ట్రం గుంజుకోగలదా? హుస్సేన్‌సాగర్ విస్తీర్ణాన్ని యథాస్థితికి తీసుకురాగలరా? అవుటర్ రింగ్‌రోడ్డు భూ నిర్వాసితులకు తగిన న్యాయం కలుగుతుందా?

గోరటి వెంకన్నకు ఏడాదికో హంస అవార్డు ఇస్తామా? రసమయి బాలకృష్ణకు సాంస్కృతిక మంత్రిత్వశాఖ వస్తుందా? గద్దరన్నకు భద్రత దొరకుతుందా? వెన్నుపూసలో ఉన్న బుల్లెట్ బయటకు వస్తుందా? సమైక్యవాద జపం చేస్తున్న మన శాసనసభ్యులు ఏమవుతారు?

రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ విద్యాసాగర్ గారినే నీటి మంత్రిని చేద్దాం. జూరాల, నాగార్జునసాగర్ మధ్య కృష్ణానదిపై ఇంకో ప్రాజెక్టును ఎన్ని రోజుల్లో నిర్మించగలం? బాసర భద్రాచలం మధ్య మరో ఆనకట్ట కట్టగలమా? గత యాభై ఏళ్లుగా తెలంగాణ వనరులైన నీరు, బొగ్గులను కొల్లగొట్టిన వారి నుండి నష్టపరిహారం వసూలు చేయగలరా? చెన్నారెడ్డి చేసిన మోసాన్ని కొత్తరీతిలో కాబోయే తెలంగాణ ముఖ్యమంత్రి చేయదని ఎవరైనా హామి ఇవ్వగలరా?

సగంపైగా ఖమ్మం జిల్లా వారి ఆధీనంలో ఉంది. నల్గొండలో నాగార్జునసాగర్ కాలువ వెంబడి వారే ఉన్నారు. కోదాడ, మిర్యాలగూడ వారి చెప్పు చేతుల్లో ఉన్నాయి. నిజాం సాగర్ కింద అనాదిగా వారే ఎక్కువ లబ్ధి పొందుతున్నారు. సింగూరు కింద వారే స్థిరపడ్డారు. ఖడెం ప్రాజెక్ట్ కింద వారే పాతుకు పోయారు. పేరు వెనక 'రెడ్డి' పదాన్ని చేర్చుకొని పాలమూరులో ఉన్న నాలుగు పచ్చని పల్లెల్లో వారే తిష్టవేసుకున్నారు. ఎర్రజెండా అండతో సాయుధ రైతాంగ పోరాటం వంకతో వేలాది మంది వరంగల్ ఖమ్మంలో తిష్ట వేసుకున్నారు. వేరే వారుగా గుర్తించలేనంతగా కలిసిపోయిన వారినే ఏం చేస్తారు. మెదక్ జిల్లా దుద్దెడ పక్కనున్న గుంటూరు పల్లెను పెరికి వేస్తారా? ఇంతగా విస్తరించిన వీరిని ఇలాగే ఉండనిచ్చి తెలంగాణా సాధించుకుంటే. ఆ తెలంగాణలో వారి పనులు అవుతాయా? ఇక్కడి పనులు అవుతాయా?

ఇంకో ప్రమాదం కూడా ఉంది. అదేమిటంటే, రావాల్సిన తెలంగాణ ఎలాగు వచ్చేసింది. ఇంకా వీరు ఏమి చేయలేరు అని రెట్టించినఉత్సాహంతో కొత్తగావచ్చే సెటిలర్స్‌ను ఎలా నిలువరించగలరు.

1949-56 మధ్య ఏం జరిగింది. సమైక్య వాదం వల్ల ఎవరికి ప్రయోజనం జరిగింది. తెలంగాణ అభివృద్ధి మండలి ఏం చేసింది. వారి మూడు నివేదికలు ఏమయ్యాయి. పెద్ద మనుషుల ఒప్పందాన్ని ఎందుకు అమలు చేయలేదు. చెన్నారెడ్డి చేసిన ద్రోహం ఏమిటి? బిపిఆర్ విఠల్ కమిటి రిపోర్ట్‌ను ఎందుకు అటక ఎక్కించారు. 610జి.ఓ ఎందుకని అమలు కాలేదు. గిర్‌గ్లాని కమిటీ రిపోర్టు ఏం చెబుతున్నది. ఒక్క గుంటూరు జిల్లాలో ఉన్నన్ని కాలువలు మొత్తం తెలంగాణలో ఎందుకని లేవు. ఇది ఎంతటి అన్యాయం. దీనికి కారకులెవరో ఆరా తీయాలి.

6. ఆవిష్కృతమయ్యే నూతన తెలంగాణలో...

గ్రామస్థాయి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి. మండలానికో ప్లానింగ్ అట్లాస్ తయారు చేయాలి. ఒక్కో మండలానికి సంబంధించి, అక్కడి ప్రజల ఆచార వ్యవహారాలు, కులాల కంపోజిషన్, కుటుంబాల ఆర్థిక పరిస్థితి, భూ యాజమాన్య వివరాలు శాస్త్రీయ పద్ధతిలో సేకరించాలి. సహజవనరులు, నేల స్వభావం, మానవ వనరుల, వర్షపాతం, సాగునీరు, భూగర్భ జలాలు, తాగునీరు, విద్యుత్, పరిశ్రమల స్థాపన అవకాశాలు, రోడ్లు, పంటలు, పశుసంపద, పౌల్ట్రీ, ప్రాథమిక పాఠశాలలు, వైద్యసౌకర్యాలు ఇత్యాది అంశాల ప్రాతిపదికన సూక్ష్మస్థాయి ప్రణాళికలు తయారు చేయాలి. అభివృద్ధిలో, పరిపాలనలో, సంక్షేమ కార్యక్రమాల్లో స్థానికులనే భాగస్వాములను చేయాలి. కేంద్ర, రాష్ట్ర జిల్లా పరిపాలనపై గ్రామస్థాయిల్లో అవగాహన కల్గించాలి. జనాల్లో పనిచేసే స్వభావాన్ని అభివృద్ధి పరిచి, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించాలి. ఇలా మండలం యూనిట్‌గా అభివృద్ధి ప్రణాళికలు రచించి నిజాయితి గల నాయకులు, అధికారుల సహాయంతో ప్రజల భాగస్వామ్యంలో కొత్త పాలన, జీవన రీతులను రూపొందించాలి. అభివృద్ధి ప్రణాళికల రచనలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి నిపుణుల సేవలు వినియోగించుకోవాలి.

గాంధీ, నెహ్రూ కలలు గన్న స్వయం సమృద్ధ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ఏర్పర్చుదానికి నిజాయితితో యత్నాలు మొదలవ్వాలి. పాలనలో

వికేంద్రీకరణ, నిధుల ఖర్చులో నిజాయితీ, సమర్థమైన స్థానిక స్వపరిపాలన, బడులను బాగుపరచడం, ప్రాథమిక వైద్యశాలలను అభివృద్ధి పర్చడం లాంటి కార్యక్రమాలు నిజాయితీగా చేపడితే తప్ప కొత్త తెలంగాణ రాష్ట్రంలో సామాన్యులకు ప్రయోజనం కలుగదు.

నీటి పారుదల రంగంలో అత్యంత జాగ్రత్త వహించాలి. కురిసిన ప్రతి వర్షం చుక్కను సద్వినియోగం చేసుకునే దిశలో నిపుణుల సూచనల మేరకు శాస్త్రబద్ధ ప్రయత్నాలు జరగాలి. పాత దశబంద చెరువులను పునరుద్ధరించాలి.

మెదక్, నిజామాబాద్ రైతుల పొట్ట కొడుతున్న హైదరాబాద్‌కు సింగూర్ జలాల్ని వెంటనే ఆపివేయాలి. నిజాంసాగర్ పూడిక తీయాలి. శ్రీరాంసాగర్ వరద కాలువను నిర్మించాలి. శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్‌ను నిర్మించాలి. ఆదిలాబాద్ జిల్లాలో చెక్‌డ్యాంలు, కొండువాగులకు అడ్డంగా చిన్న చిన్న ఆనకట్టలు నిర్మించాలి. కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో జలవనరుల వినియోగం పెరగాలి. ముఖ్యంగా పాలమూరు జిల్లాకు ప్రత్యేక శ్రద్ధతో కృష్ణా జలాన్ని వినియోగించాలి. కృష్ణా నది ఈ జిల్లాలో దాదాపు 200 కి.మీ. పారుతుంది. 700-800 వందల టిఎంసిల నీరు ఆ నదిలో ఉంటే అందులో ఒక శాతం నీటిని కూడా ఆ జిల్లాకు ఇవ్వడానికి ఇచ్ఛగించని పాలకుల వల్ల ఇన్నాళ్లు జరిగిన నష్టాన్ని, అన్యాయాన్ని కొత్త రాష్ట్రం పూరించాలి. ఇచ్చంపల్లి విషయాన్ని తేటతెల్లం చేయాలి. నల్గొండలో ఫ్లోరైడ్ సమస్యను సమూలంగా పరిష్కరించాలి. గోదావరి జలాలతో ఖమ్మంను హరితవనంగా మార్చాలి. తెలంగాణలో ప్రతి ఊరికి సాగు, త్రాగునీరు సమస్య తీరినాకానే నీటిని కిందికి వదలాలి. ఇది సహజ న్యాయం కూడా కదా? ఒక ఊరి మీదుగా నీళ్లు వెల్తుంటాయి. ఆ ఊరికి నీళ్లు ఇవ్వకుండా ఎవరికో నీరు ఇస్తామంటే ఎలా? లాభాలు వస్తున్నాయంటే రిలయన్స్ టాటా తదితర కంపెనీలు ఒక్కో రోడ్డును పది సార్లు త్రవ్వి రాష్ట్రం నిండా జడకొప్పులాగా, వలలాగ ఒఎఫ్‌సి పైపులను వేశారు కదా? అలాగే మంచినీరు సరఫరాను యుద్ధ ప్రాతిపదికగా చేపట్టాలి. ప్రతి ఊరికి ముందు త్రాగునీరు తర్వాత సాగునీరు అందించాలి.

వీటన్నిటికంటే ముందు గ్రామాల్లో సర్కారు బడుల నాణ్యత, ప్రాథమిక ఆరోగ్య సేవల లభ్యత, వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్, రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలి. జిల్లా కేంద్రం యూనిట్‌గా ఆధునిక వైద్యం, ఉన్నతవిద్య, పరిశ్రమలను అభివృద్ధి చేయాలి. విద్య, వైద్యం కోసం ఎవరూ రాజధానికి రానవసరం కల్పించకూడదు. తెలంగాణలో పశుసంపద, పౌల్ట్రీ అభివృద్ధికి ఎంతో అవకాశం ఉంది. ప్రతి ఊరిని 'అంకాపురం' లా మార్చాలి. (అంకాపురం నిజామాబాద్‌లో జిల్లాలో ఉన్న అభివృద్ధి చెందిన గ్రామం. దీన్ని భారతదేశంలోనే ఒక సంపన్న గ్రామంగా చెప్పుకుంటారు. రైతులు విత్తనపంటను, కూరగాయలను, మొక్కజొన్నను పండిస్తారు. పెద్దగా నీటి పారుదల వసతులు లేని ఈ ఊరికి ప్రభుత్వం చేసిన మేలు కన్నా రైతుల సమైక్యంగా ఉండి పరస్పర సహకార పద్ధతిలో ఈ ఊరిని అభివృద్ధి చేసుకున్నారు) ఈ దిశలో నిజాయితీ గల అధికారుల, స్థానిక నాయకుల చిత్తశుద్ధి తప్ప మరో ఉపాయం పనిచేయదు.

తెలంగాణ కాంగ్రెస్ శాసనసభ్యులను సమైక్య వాదులను, ట్రాక్ చేయాలి. కేసిఆర్ చెప్పినట్లు వారిని తెలంగాణ పొలిమేరలకు తరమలేరు. కాని వారిని ఒకకంట కనిపెట్టి ఉండాలి. రాజశేఖరుడి చలవతో ఇప్పుడు పదవుల్లో ఉండి అధికారాన్ని అనుభవిస్తున్న వాళ్లని ఇంకోకంట కనిపెట్టాలి. సమైక్య నినాదం చేస్తున్న పాత్రికేయుల్ని, రాజకీయ వాదుల్ని గమనించాలి. కష్టపడిన వాడికి, కష్టపడేవాడికి కష్టానికి తగిన ఫలితం దక్కేలా చూడాలి. ◆

ఉన్నత విద్యార్జన దళితుల జన్మహక్కు కాదా?

-నాగం కుమారస్వామి

డా. బాబా సాహెబ్ అంబేద్కర్ అన్నట్లు మనదేశ సామాజిక స్వరూపం 'వర్గ-కుల' స్వభావం కలది. అందుకే పూర్వకాలంలో ఆధిపత్య కులాలైన బ్రాహ్మణ, క్షత్రియులు, శూద్ర, దళిత ఆదివాసీ కులాలకు విజ్ఞానానికి పునాదైన విద్యార్జనను శాసనబద్ధంగా దూరం చేశారు. మనువులాంటి ఆధిపత్యకులాల ధర్మకర్తలు అప్పటికాలంలో జ్ఞానానికి పునాదైన వేదాలను ఆదివాసీ దళిత బహుజనులు వింటే చెవిలో సీసం పోయాలని, చదివితే నాలుకలు తెగ్గోయాలని సూత్రీకరించారు. దీనికి శంబూకుని ఉదాహరణ చరిత్రలో ఉండనే ఉంది. పై కులాలను విద్యకు దూరం చేసే కుట్ర 19వ శతాబ్ద చివరి వరకు మనదేశ పాలకవర్గాల చేత పరోక్షంగా అమలులో ఉంచబడింది. మహాత్మ జ్యోతిరావ్ పూలే, ఆయోతిదాస్, అయ్యంకాలి, నారాయణగురు, డా. అంబేద్కర్, పెరియార్ రామస్వామి నాయకర్ వంటి దళిత బహుజన తాత్విక నాయకుల ఆధ్వర్యంలో జరిగిన అనేక సామాజికోద్యమాల ఫలితంగా ఆదివాసీ, దళిత, బహుజనులు విద్యార్జనకు పాక్షికంగా చేరువయ్యారనేది చారిత్రక సత్యం.

1950 లో మనదేశం రాజ్యాంగరీత్యా సార్వభౌమాధికార రాజ్యంగా అవతరించింది. అయితే అప్పటి రాజకీయ పరిస్థితుల దృష్ట్యా రాజ్యాంగం 'ఒక మనిషి - ఒక ఓటు - ఒక విలువ' అనే సిద్ధాంతం ద్వారా కేవలం రాజకీయ సమానత్వాన్నే ప్రజలకు వాగ్దానం చేసింది. సామాజికంగా దేశప్రజలు వేల కులాలుగా, వివిధ మతాలుగా విభజించబడి, ఆదివాసీ దళిత బహుజనుల సాంఘిక వెలివేతకు గురవుతున్నారు. సామాజిక సహజ సంపదలపై కొన్ని ఆధిపత్యకులాలే ఆధిపత్యం కలిగి, మెజారిటీ ప్రజలను ఆర్థిక దోపిడి చేస్తున్నాయి. ఈ స్థితి దేశ సాంఘిక, ఆర్థిక అసమానతలకు అద్దం పడుతుంది. అందుకే డా. అంబేద్కర్ మన రాజ్యాంగంను రాజ్యాంగ సభకు సమర్పిస్తూ 'రాజ్య పాలకులు వీలైనంత త్వరగా దేశంలో సామాజిక, ఆర్థిక ప్రజాస్వామ్యాలను నెలకొల్పుటకు కృషిచేయాలని, లేని పక్షంలో ప్రజలే ఈ రాజ్యాంగాన్ని తిరస్కరిస్తారని' హెచ్చరించాడు. అందుకేనేమో బహుశా మన దేశ పాలకవర్గాలు సామాజిక, ఆర్థిక అంతరాలను తగ్గించటం కోసం రాజ్యాంగరీత్యా ఆదివాసీ దళితులకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో ప్రవేశించడానికి కొన్ని ప్రత్యేక అవకాశాలను 'రిజర్వేషన్'లుగా కల్పించారు. ఈ మూడింట్లో విద్యావకాశం అత్యంత ప్రధానమైనది. ఎందుకంటే ఏ పౌరసమాజంలోనైనా రాజ్యాంగం కల్పించిన ఉద్యోగ, రాజకీయ అవకాశాలను అణిచివేయబడిన కులాలు/వర్గాలు సద్వినియోగం చేసుకోవడానికి విద్యనే ప్రధాన సాధనం.

ఉన్నత విద్య (డిగ్రీ స్థాయినుంచి పిఎచ్.డి. వరకు) వ్యక్తిలో వ్యక్తిత్వ వికాసంను కల్గించి, గౌరవప్రదంగా జీవించుటకు అవకాశాలను ఏర్పరుస్తుంది. అలాంటి ఉన్నతవిద్యను మనదేశంలో ఆదివాసీ దళితులకు కల్పించడంలో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు గత 50 సంవత్సరాలలో పూర్తిగా విఫలమైనాయి. ఈ విషయాన్ని నేషనల్ శ్యాంపుల్ సర్వే ఆర్గనైజేషన్ (ఎన్.ఎస్.ఎస్.ఒ) తన 55వ నివేదిక (1999-2000) లెక్కల ద్వారా రుజువుచేస్తుంది.

ఉన్నతవిద్యలో అసమానతలు (1999-2000)

(శాతం)

కులాలు/మతాలు	గ్రామీణ భారతం	పట్టణ భారతం
ఎస్.టి.	1.1	10.9
ఎస్.సి.	1.2	4.7
ముస్లింలు	1.3	6.1
హిందూ-ఓ.బి.సి	2.1	8.6
సిక్కు	2.8	25.0
క్రిస్టియన్స్	4.7	23.7
హిందూ-అగ్రకులాలు	5.3	25.3
ఇతర మతాలు (జైన్,పార్శీ, బుద్ధిస్ట్)	5.4	31.5
మొత్తంగా ఇండియాలో	2.6	15.5

మూలం : ఎన్.ఎస్.ఎస్.ఒ 55వ రౌండ్ సర్వే 1999-2000

అంకెలు 20 సంవత్సరాలు లేదా ఆపై వయస్సు గల గ్రాడ్యుయేట్స్ శాతాన్ని తెల్పుతుంది.

పట్టిక ఆధారంగా చేసుకొని పరిశీలిస్తే ఎస్.సి., ఎస్.టి., ముస్లింల నుండి కేవలం 1% మాత్రమే గ్రామీణ ప్రాంతాలనుండి ఉన్నతవిద్యకు అందుబాటులో ఉండగా; హిందూ అగ్రకులాలనుంచి 5% పైగా ఉన్నతవిద్యకు అందుబాటులో ఉన్నారు. అంటే హిందూ అగ్రకులాలు 4% ఎక్కువగా ఉన్నతవిద్యను అభ్యసిస్తున్నారు. ఎస్.సి., ఎస్.టి., ముస్లింలతో పోలిస్తే. పట్టణ ప్రాంతాలవారిగా చూసినా ఎస్.సి., ఎస్.టి., ముస్లిమ్స్, హిందూ-ఓ.బి.సి.లను ఇతర హిందూ అగ్రకులాలు, ఇతర మతాలవారితో పోలిస్తే ఉన్నతవిద్యకు చాలా దూరంగా ఉన్నారని స్పష్టమౌతుంది. అలాగే మొత్తంగా భారత గ్రామీణ, పట్టణ ప్రాంతాలరీత్యా పోల్చిచూసినా ఎస్.సి., ఎస్.టి., ముస్లిం, ఓబిసిల ఉన్నత విద్యాభ్యాసం శాతం తక్కువగానే ఉంది. అంటే ఆదివాసీ దళిత బహుజనులు ఉన్నతవిద్య విషయంలో ఇప్పటికీ సాంఘిక వివక్షకు గురౌతున్నారని చెప్పక తప్పదు. దీనికి తరతరాలుగా ఆదివాసీ దళితులను వెంబడిస్తున్న వర్గ, కుల, ఆర్థిక వెనుకబాటుతనం ఒక కారణమైతే, 1950 నుంచి దేశపాలకులుగా తెరమీదికొచ్చిన అగ్రకుల, వర్గ రాజకీయ నాయకులు, ప్రభుత్వాధికారులు కల్పించిన కారణాలు అనేకం.

1950 నుంచి 1970 వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాదాపు ఎల్.కె.జి. నుండి పి.జి. వరకు 'సామాజిక అభివృద్ధి' పేరిట కోట్లాది

రుపాయలు విద్యారంగంపై వెచ్చించాయి. ఈ కాలంలో ఆదివాసీ, దళితుల ప్రాతినిధ్యం ఉన్నతవిద్యలో 1% కూడా లేదు. 1980 నుంచి విద్యారంగాన్ని పూర్తిగా ప్రైవేటుపరం చేయడం ప్రారంభించాయి. ఈ కాలంలోనే ఆదివాసీ, దళితులు ఉన్నతవిద్యకు దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు ప్రారంభించాయి. అయితే ప్రస్తుతకాలంలో ఉన్నతవిద్యను అంగట్లోసరుకుగా మార్చి దానిని ఆదివాసీ, దళిత బహుజనులకు అందని ద్రాక్షలాగా ప్రభుత్వాలు మార్చాయి. ప్రైవేటీకరణ, సరళీకరణల నేపథ్యంలో సామాజిక, భౌతిక, జీవ, భాషా శాస్త్రాలు మొదలుకొని, వృత్తి విద్యాకోర్సులైన లా, ఎం.సి.ఎ., ఎం.బి.ఎ., ఇంజనీరింగ్, మెడిసిన్‌ల వంటి ఉన్నతవిద్యల వరకూ ప్రైవేట్ యాజమాన్యం చేతుల్లోకి తీసుకుపోవడంలో మన రాష్ట్రపాలకులు దేశంలోనే ముందంజలో ఉన్నారు. ప్రైవేట్ యాజమాన్యాల ఒత్తిడిమేరకు అన్నిస్థాయిలలో రాష్ట్ర ప్రభుత్వం అడ్మిషన్, ట్యూషన్, నాన్-యూనివర్శిటి, మెయింటనెన్స్, కాలేజ్ డెవలెప్‌మెంట్ లాంటి రకరాకల ఫీజులను వేలరూపాయల్లో పెంచుతూపోతోంది. ఉదాహరణకు జూలై 4న ఎం.సి.ఎ., ఎం.బి.ఎ (ముప్ఫై వేల సీట్లు) కోర్సుల ఫీజులను కన్వీనర్ కోటాలో రు. 20 వేలు ల నుండి రు. 23 వేలు వరకు; యాజమాన్యం కోటాలో రు. 60 వేల నుండి రు. 63 వేల వరకు పాలకవర్గాలు పెంచాయి. పాలకవర్గాలు ప్రైవేటు యాజమాన్యాల కనుకూలంగా ఫీజులు పెంచడంలో చూపిన శ్రద్ధ ఆదివాసీ దళిత బహుజన విద్యార్థుల స్కాలర్‌షిప్స్, ట్యూషన్‌ఫీజులను మారుతున్న కాలనుగుణంగా పెంచడంలో చూపడంలేదు. చూపకపోగా 2003 సంవత్సరంలో చంద్రబాబునాయుడి ప్రభుత్వం జి.ఓ.ఎం.ఎస్. నెం. 56 ను తెరమీదికి తెచ్చి దళితబహుజనుల ట్యూషన్‌ఫీజు చెల్లింపుకు రు. 20వేల పరిమితి విధించింది. అంటే జి.ఓ. ప్రకారం ఆదివాసీ, దళిత విద్యార్థులు ఉన్నతవిద్యలో ఏ కోర్సులో చేరినా సంబంధిత కోర్సు ఫీజు రు. 20 వేలకి పైన ఎన్ని వేలు ఉన్నా సదరు విద్యార్థులే చెల్లించాలి. ఇది దళిత బహుజన విద్యార్థి యువతను ఉన్నతవిద్యకు అగ్రకుల వర్గపాలకులు దూరం చేయడం కాదా?

మనదేశంలో యూనివర్శిటీలు గతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సామాజిక,ఆర్థిక,రాజకీయసమస్యలను పరిష్కరించడంలో ముందుండేవి. ముఖ్యంగా ఆర్థికంగా పేదవారైన విద్యార్థులకి సహకార సంస్థలుగా సహాయపడేవి. కాని గత కొద్దికాలంగా మన రాష్ట్రంలోని యూనివర్శిటీలు ప్రభుత్వ వైఖరి వల్లనో, అధికారగణంలో ప్రజాస్వామిక విలువలు నశించడం వల్లనో, మొత్తంమీద సంక్షేమ విలువలకి తిలోదకాలిస్తున్నాయి. ఆ క్రమంలోనే వెంకటేశ్వర, పద్మావతి, ఉస్మానియా యూనివర్శిటీలు ఆదివాసీ, దళిత విద్యార్థులను బయటకు గెంటేసే దుస్థితికి చేరుకొన్నాయి. మరీ ముఖ్యంగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఉస్మానియా యూనివర్శిటీలో అస్పష్టమైన అడ్మిషన్ విధానం అవలంబించడంవలన స్కాలర్‌షిప్ పొందే ఆదివాసీ దళితబహుజన విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురౌతున్నారు. అస్పష్టమైన అడ్మిషన్స్ విధానంగా ప్రతీకోర్సులో మొత్తం సీట్లను రెగ్యులర్, సెల్ఫ్‌ఫైనాన్స్, పేమెంట్ కోటాలుగా అధికారులు విభజించి భర్తీచేస్తున్నారు. సాంఘిక సంక్షేమశాఖ అధికారులు మాత్రం కేవలం రెగ్యులర్ కోటా విద్యార్థులకు మాత్రమే ట్యూషన్ ఫీజులు ఇస్తామని, సెల్ఫ్ ఫైనాన్స్ కోటాకు సంబంధించిన కోర్సులోని మొత్తం సీట్లు సెల్ఫ్‌ఫైనాన్స్ అయితేనే జి.ఓ.ఎం.ఎస్. నెం. 56 ప్రకారం రు. 20 వేలు మాత్రమే ట్యూషన్ ఫీజు ఇస్తామని, పేమెంట్ సీట్ల విషయంలో ప్రభుత్వానికి సంబంధంలేదని చేతులెత్తేస్తున్నారు.

ఈ విధంగా రాష్ట్రంలోని ఇతర యూనివర్శిటీల అధికారులు, ప్రభుత్వ అధికారులు అవలంబిస్తున్న అస్పష్ట, ద్వంద వైఖరుల వలన ఆదివాసీ దళిత బహుజన విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. 1)సకాలంలో స్కాలర్‌షిప్‌లురాక యూనివర్శిటీలకు బకాయిలు పడ్డ విద్యార్థులు సంబంధిత కోర్సులో ఉత్తీర్ణత సాధించారో లేదో తెలుసుకోలేకపోతున్నారు. 2) ఒకవేళ మొదటి సంవత్సరంలో ఉత్తీర్ణులైనప్పటికీ విద్యార్థులని రెండో సంవత్సరంలోకి ప్రవేశించడానికి అడ్డుపడి ఫీజులు వసూలు చేయడంలో యూనివర్శిటీల అధికారులు పాతకలపు పటేల్‌దొరలను మరిపిస్తున్నారు. 3) సదరు విద్యార్థులచేత కోర్సు పూర్తైన చివరలో ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోతే తామే చెల్లిస్తామనే కండీషనల్ అనుమతిపై అడ్మిషన్ పొందడంద్వారా విద్యార్థులు నిరంతరం మానసిక క్షోభకు గురౌతున్నారు. 4) సెల్ఫ్ ఫైనాన్స్, పేమెంట్ కోటాల్లో కోర్సులు పూర్తిచేసినప్పటికీ అటు ప్రభుత్వాలు ట్యూషన్ ఫీజు చెల్లించక, ఇటు కుటుంబ ఆర్థిక పరిస్థితులు అధ్వానంగా ఉన్నందున విద్యార్థులు ఫీజులు చెల్లించకపోయేసరికి, ఉస్మానియా యూనివర్శిటీ అధికారులు ఏకంగా 'రెవెన్యూ రికవరీయాక్ట్' ప్రకారం ఫీజులు చెల్లించకపోతే తల్లిదండ్రుల ఆస్తులను జప్తుచేస్తామని హెచ్చరిక నొటీసులు పంపించారు. 6) పిహెచ్.డి. కోర్సులకు సంబంధించి 3 సంవత్సరాల తర్వాత కూడా సంబంధిత గైడ్స్ అంగీకరిస్తే మరో 2 సంవత్సరాలు విద్యార్థులు పరిశోధనచేసే అవకాశం ఉన్నప్పటికిని, యూనివర్శిటి అధికారులు మాత్రం స్కాలర్‌షిప్స్ విద్యార్థులు వెంటనే హాస్టల్స్‌ను ఖాళీ చేయాలని నొటీసులు ఇవ్వడం జరిగింది. ఈ విషయమై విద్యార్థులు ఓ.యు. వైస్-ఛాన్సలర్‌తో చర్చిస్తుండగా దళిత విద్యార్థులను అవమానపరిచే విధంగా మాట్లాడి, తిరగబడిన దళిత విద్యార్థినాయకులపై పోలీసుకేసులు పెట్టి కోర్టుచుట్టూ తిప్పుతున్నారు.

ఈ విధంగా ఆదివాసీ దళిత విద్యార్థులు ప్రతినిత్యం మానసికక్షోభకు గురౌతున్నప్పటికీ అగ్రకుల పాలకవర్గాలు మాత్రం 'నిమ్మకు నీరెత్తినట్లు' వ్యవహరించడం వెనుక ఆధిపత్య అణిచివేత భావజాలం ఉందని భావంచకతప్పదు. మొన్నటికి మొన్న ఓ.... విద్యార్థులు స్కాలరషిప్‌లు రాకపోవడం వలన రక్తాన్ని బజారులో అమ్ముకుంటున్నారన్న విషయం పత్రికల్లో పతాక శీర్షికల్లో వస్తే తప్ప ప్రత్యేకప్యాకేజ్ ప్రకటించలేదు. న్యాయంగా, సామాజికపరంగా విద్యార్జనలో రావాల్సిన హక్కులకోసం ఆదివాసీ దళితబహుజనులు నిరంతరం తమ ప్రాణాలను పణంగా పెట్టవల్సిందేనా? రక్తాన్ని నడిబజారులో అమ్మవల్సిందేనా? కొద్దికాలం క్రితం కేంద్రప్రభుత్వం ఓ.బి.సిలకు కేంద్రీయ విద్యాలయాల్లో 27% రిజర్వేషన్‌లు, ప్రకటన చేసిన సందర్భంగా అగ్రకుల విద్యార్థులు మీడియా ముందు చేసిన హంగామాను శాంతింపజేయడానికి కేంద్రప్రభుత్వ పాలకవర్గాలు రు. 800 కోట్లు పెట్టి అదనపు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ప్రకటించింది. కాని బీద ఆదివాసీ, దళిత బహుజన విద్యార్థులకు

కొత్త విశ్వసనీయతా యత్నం లోక్‌సత్తా

- జి.ఎస్. రామ్మోహన్

లోక్‌సత్తా సంస్థ ప్రజల మదిలోనుంచి చెరిగిపోకుండా ఉండడంలో జయప్రకాశ్ నారాయణ్, ఆయన సహచరుల యత్నం తక్కువదేమీ కాదు. ఇపుడు ఆ ఉద్యమం అనుకున్న ఫలితాలనివ్వలేదని దాన్ని రాజకీయపార్టీగా మార్చడంలోనూ వారి చిత్తశుద్ధిని శంకించనక్కర్లేదు. జయప్రకాశ్ నారాయణ్ నాయకత్వం, ఆయన అనుచరుల ఉత్సాహం అన్నీ కొత్త పార్టీ రూపకల్పనలో ఉన్న మాట వాస్తవమే. కానీ లోక్‌సత్తాను ఈ కోణం నుంచి మాత్రమే అర్థం చేసుకోకూడదు. ఇంతకంటే ప్రధానమైన కోణం ఇంకోటుంది. ప్రస్తుతం భారత రాజకీయవ్యవస్థ చిన్నపాటి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. రాష్ట్రపతిగానూ ప్రధానిగానూ రాజకీయేతరులను ఎన్నుకోవాల్సిన పరిస్థితి ఏర్పడినప్పుడే ఈ విషయం తేటతెల్లమైంది. రాజకీయరంగం విశ్వసనీయతను కోల్పోవడమో, లేక విశ్వసనీయత బాగా తగ్గిపోయి ఈ రంగం కంటే మిగిలిన రంగాల నిపుణులే మెరుగు అనే భావన ఏర్పడడమో దీనికి కారణమైఉండాలి. చిన్నపాటి అనే పదం ఎందుకంటే ఈ సంక్షోభం మరీ వ్యవస్థను పూర్తిగా కూల్చివేసేంతటి పీకలలోతు సంక్షోభం కాదు. మన రాజకీయరంగంలోనే దీన్ని ఎదుర్కోగలిగిన మెకానిజమ్స్ ఉన్నాయి. ప్రజాస్వామ్యపు ప్రత్యేకత అది.

సంక్షోభాన్ని రాజకీయరంగం గుర్తించి అంతే చిన్నపాటి సర్దుబాటు యత్నాలు మొదలెట్టినట్టే కనిపిస్తోంది. సాధారణంగా పాలకులకు ప్రత్యర్థి శిబిరం కావాల్సిన అరుణారాయ్‌లు, కజ్రీవాల్‌లు, జయప్రకాశ్ నారాయణ్‌లను రాజకీయ, పాలనా సంస్కరణల కమిటీల్లో చేర్చుకోవడం దీనికి సూచికగా చెప్పుకోవచ్చు. అయితే దీన్నంతటినీ పూర్తిగా మన పాలకుల వివేచనకే కట్టబెట్టలేం. రోజురోజుకూ ప్రాబల్యం పెంచుకుంటున్న మార్కెట్‌ది కూడా కీలక పాత్రే. భారతీయ సమాజం పూర్తిస్థాయి పెట్టుబడిదారీ దశకు వేగంగా చేరుకుంటున్న దశలో పాలనపైనా, పాలకులపైనా ప్రజల విశ్వాసం పూర్తిగా సడలిపోవడం మార్కెట్‌కు అంత శుభప్రదం కాదు. పాలకులు తమకు లోబడి ఉండాలనుకోవడం వేరు. వారు పూర్తిగా విలువలేని వారుగా మారాలని కోరుకోవడం వేరు. మార్కెట్ ఫలాలు పైతరగతి వారికి, మధ్యతరగతిలో పై మెట్ల రహస్యాన్ని కనుక్కోగలిగిన మరికొద్దిమందికి మాత్రమే అందుతున్నాయి. ఎక్కువమంది మధ్యతరగతికి కేవలం ఆశలు మాత్రం చూపించి ఊరిస్తున్నాయి. ఈ పీరియడ్ ఎక్కువ కాలం కొనసాగుతుండడంతో పైకెగిరి ద్రాక్షగుత్తిని అందుకోవాలని విపరీతమైన కోర్కె ఉండి అందుకోలేకపోతున్న ఈ బాపతు నగర మధ్యతరగతి తీవ్ర అసహనానికి లోనవుతున్నది. ఈ అసహనం రోడ్డుపక్కన ఉచ్చపోసే వాళ్లమీద, ఆఫీసుమూలల్లో కిళ్లీ ఊసేవారిమీద, రాంగ్‌సైడ్ బండినడిపే వారిమీద చూపిస్తున్నారు. ఈ అసహనం అక్కడే ఆగిపోదు. పైపెచ్చు ఇలా వీరిని కేవలం ఊరిస్తూ మార్కెట్ ఎక్కువకాలం ఆకర్షణీయ రూపాన్ని కాపాడుకోలేదు. వినియోగదారుల సంఖ్యనూ ఆశించినంతగా పెంచుకోలేదు. మరికొద్దిమంది మధ్యతరగతికి సంపదలో ఎంతో కొంత వాటా ఇవ్వక తప్పదు. అలాగే ఈ యేడాది భారత్‌కు రుణాలు మంజూరు చేయడానికి 'అవినీతి రహిత సమర్థ పాలన'కు ప్రపంచబ్యాంక్ మెలిక పెట్టింది. ఇవన్నీ వర్తమాన పరిస్థితిని తెలియజేస్తున్నాయి. కాబట్టి పాలకుల్లోనూ, పాలనలోనూ సంస్కరణలపై మార్కెట్ ఒత్తిడి కూడా ఉంది. పాలనా సంస్కరణల కోసం జరుగుతున్న యత్నాలను కానీ, లోక్‌సత్తా రాజకీయస్వరూపం సంతరించుకోవడాన్ని కానీ ఆ నేపథ్యం లోంచే చూడాల్సి ఉంటుంది. ఇటువంటి ప్రయత్నాలు మన రాష్ట్రానికే పరిమితం కావు. రాజస్థాన్‌లో రాజ్ పురోహిత్ లోక్ పరిత్రాణ్ పార్టీ మన లోక్‌సత్తా పార్టీ కంటే ముందే ఏర్పాటైంది. ఐఐటి గ్రాడ్యుయేట్ అయిన పురోహిత్ లక్షలాది రూపాయల జీతభత్యాల విలాసాల జీవితం వదిలేసి, కొందరు మిత్రులతో కలిసి రాజకీయరంగ ప్రక్షాళన కోసం రంగంలో దిగారు.(సందేశ్ సినిమాలో షారూఖ్‌ఖాన్ పాత్ర రూపుదిద్దుకోవడానికి ముందే ఈ ఐఐటియన్ రంగంలోకి దూకారని గమనించ ప్రార్థన) ఒరిస్సాలో మహంతి ఐఏఎస్ కొలువును వదులుకొని

చెల్లించవలసిన స్కాలర్‌షిప్పులను ఇవ్వడానికి సాహసించకపోవడంలోని ఉన్న ఆంతర్యం ఏంటి? బహుశా అగ్రకుల వాత్సల్యమేమో. ఇందిరమ్మ రాజ్యస్థాపనే లక్ష్యంగా పనిచేస్తున్నాని చెప్పున్న రాజశేఖర రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో దళిత విద్యార్థులకు తక్షణం అవసరం అయిన రు. 120 కోట్లను మంజూరు చేయకపోగా, కేవలం కేంద్రంనుండి రు. 18.14 కోట్లు మాత్రమే తీసుకోవడానికి సిద్ధంకావడం విస్మయం కల్గిస్తుంది. ఆదివాసీ దళిత విద్యార్థులకు చెల్లించాల్సిన స్కాలర్‌షిప్పులను నిలిపివేసి వాటిని ప్రాజెక్టుల నిర్మాణం కోసం మళ్లించిన ఘనత రాజశేఖర్‌రెడ్డికే దక్కింది. 2006-07 విద్యాసంవత్సరం ప్రారంభమైనా 2005-06 విద్యాసంవత్సర స్కాలర్‌షిప్పులు రాకపోవడం సిగ్గుచేటు. ఇది దళితులకు ఉన్నతవిద్యను అంటరానిది చేయడంకాదా?

ఈ నేపథ్యంలో వివిధ రాజకీయపార్టీల అనుబంధ విద్యార్థి సంఘాలు విద్యాసంవత్సరం ప్రారంభంలో భాగంగా నిర్వహించే కార్యక్రమాల్లో స్కాలర్‌షిప్‌ల విషయంలోకూడా మొక్కుబడి కార్యక్రమాలుగా తీసుకోవచ్చు. అయితే ఆయా విద్యార్థిసంఘాలలో కార్యకర్తలుగా పనిచేస్తున్న మెజారిటి ఆదివాసీ దళితబహుజన విద్యార్థులు సంబంధిత సంఘ రాష్ట్ర నాయకులపై ఒత్తిడి తెచ్చి స్కాలర్‌షిప్‌ల విడుదలకై కృషిచేయాలి. మరీ ముఖ్యంగా ఉన్నతవిద్యను అభ్యసిస్తున్న ఆదివాసీ, దళిత విద్యార్థులు అణగారిన జాతులను చైతన్యపరిచే సందర్భంగా డా. బి.ఆర్. అంబేద్కర్ చెప్పిన 'హక్కులకై భిక్షమెత్తకండి, పోరాడి సాధించుకోండి' అనే మాటలు స్ఫూర్తిగా తీసుకొని 'ఉన్నత విద్యార్జన దళితుల జన్మహక్కని' నినదిస్తూ సామాజిక పోరాటాలకు సిద్ధపడి ఆధునిక అగ్రకుల-వర్గ కుట్రలను భగ్నంచేసేలా ఉద్యమించాలి. ◆

జయప్రకాశ్ నారాయణ్‌లాగే సామాజిక కార్యాచరణలో అడుగుపెట్టారు. ఇంకా అక్కడక్కడా ఇలాంటి శక్తులు కనిపిస్తున్నాయి. వీళ్లంతా రాబోయే తరానికి కాబోయే నాయకులు. వీళ్లు అంటే యథాతథంగా వీళ్లు అని కాదు. ఈ లక్షణాలు అని. వీళ్లు పాలకులు కావచ్చు, కాలేకపోవచ్చు. తల నెరిసిన జయప్రకాశ్ నారాయణ్‌ను కూడా మనమిలాగే చూడాల్సి వచ్చినా ఆశ్చర్యం లేదు. కానీ వీరి మార్గం మాత్రం భారత రాజకీయాల్లో ఒక స్రవంతిగా కొనసాగే దశకు చేరుకోవడం తథ్యం. ఎంతో కొంత ప్రభావం వేయడం తథ్యం.

రాజకీయాల్లోనే కాదు, ఇతరత్రా రంగాల్లో దీని ప్రతిఫలనాలు కనిపిస్తున్నాయి. నక్సల్బరీ ఉద్యమం ఎగిసినపుడు ఒక న్యూ వేవ్ సినిమాలు వచ్చినట్టుగానే ఇప్పుడూ ఈ రాజకీయ వాతావరణానికి తగిన న్యూవేవ్ సినిమాలు రావడం గమనించాల్సిన విషయం. లగాన్, రంగ్‌దే బసంతి, సందేశ్, లగేరహో మున్నాభాయ్ తదితర సినిమాలు కొత్త తరంలోని కొందరిలో తలెత్తుతున్న కొత్త ఆశలకు ప్రతిరూపాలు. దిల్ చాహ్‌తా హై ఇవాల్టి చష్మే బద్దూర్. కొవ్వొత్తులు, గులాబీలతో ఆందోళనలు కూడా అందంగా తయారవుతున్నాయి. చెప్పుల్లేని మొరటుకాళ్లు, తైలసంస్కారం లేని జుట్ల ఆందోళనలను చూసీ చూసీ ఉన్న మీడియాకు(ప్రత్యేకించి టీవీ మీడియా) రోడ్లమీదకు అందంగా అడుగేస్తున్న చక్కటి బుగ్గలు కలిగిన బాబ్డ్‌హెయిర్-జీన్స్ అమ్మాయిలు, అబ్బాయిల ఆందోళనలు తెగ ముచ్చటేస్తున్నాయి. రాజకీయ శిక్షణ పేరిట నాయకులను తయారుచేసేందుకు సంస్థలు కూడా పుట్టుకురావడం మరో అనుబంధ లక్షణం. టి ఎన్ శేషన్ ఇప్పటికే ఒక సంస్థను నెలకొల్పి నాయకులను ఉత్పత్తి చేస్తున్నారు. ఇపుడు జయప్రకాశ్ నారాయణ్ కూడా అటువంటి శిక్షణ సంస్థ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు (హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో 15-10-2006న జరిగిన లోక్‌సత్తా బహిరంగసభ). వీటన్నింటికి తోడు దేశంలోని పాలకులు తమకంటే ఎన్జీవోలు సమర్థమైనవని తమకు తామే చాటుకుంటున్నారు. అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు అలాంటి షరతులు పెట్టడం మాత్రమే కాదు. కేంద్రం రాష్ట్రాలకు ఇచ్చే నిధుల అమలు విషయంలో కూడా ఎన్జీవోల భాగస్వామ్య నిబంధన పెడుతున్నది. ఈ కొత్త సామాజిక వాతావరణం కొత్త రాజకీయాలను డిమాండ్ చేస్తుంది. భూస్వామ్య బుద్ధులు పోని పాతకాపుల పాలన పశ్చిమదేశాల తరహా పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యం దిశగా అడుగులు వేయక తప్పదన్న సంకేతాలివి. ఆ దిశగా పెరుగుతున్న ఒత్తిడి ఇది. దేన్నైనా కలుపేసుకుని పోగలిగిన హిందూ మతం లాంటి కాంగ్రెస్, ముఖ్యంగా దాని నాయకత్వం దీన్ని గుర్తించింది. ఇటువంటి శక్తులను సర్కారు కమిటీల్లో భాగస్వాములను చేసింది. కెసిఆర్ గతంలో పదే పదే చెప్పినట్టు సోనియాగాంధీ నిజంగానే కొత్త తరహా నాయకురాలు! జాతీయ గ్రామీణ ఉపాధి పథకం, సమాచార హక్కు చట్టం వంటివి తేవడంలో ఈ సంస్కరణ వాదుల పాత్ర ఉంది. కాకపోతే తమకు తక్షణం నష్టం కలిగించని సంస్కరణలను మాత్రం సహించగలిగిన పాతకాపులు తమ సంపదలో వాటా ఇవ్వాల్సిన సంస్కరణలను మాత్రం అడ్డుకొని తీరుతారు. అప్పుడు వీరు బయటకు రాకా తప్పదు. తమ గొడవ తాము సొంతంగా వినిపించకా తప్పదు. ఇపుడదే సాగుతున్నది. ఒత్తిడికి తలొగ్గి సంక్షేమ పథకాలను ఆర్భాటంగా ప్రకటించిన కేంద్రం పేదలకు ఈ మాత్రం నిధులు కేటాయించాల్సిరావడంపై ఇపుడు పునరాలోచనలో పడినట్టు కనిపిస్తున్నది. ప్రజానుకూల పథకాలకు నిధుల్లో భారీగా కోత విధించనున్నట్టు తెలుస్తున్నది. అభివృద్ధి వేగానికి ఇవి ఆటంకంగా తయారయ్యాయంటూ ఈ కోత ప్రతిపాదనలను చిదంబరం-అహ్లూవాలియా బృందం ప్రధాని ముందుంచినట్టు అక్టోబర్ 17న ఆవాజ్ బిజినెస్ చానల్ ఎక్స్‌క్లూజివ్ రిపోర్ట్ పేర్కొంది. కాసింత గొంతు వినిపిస్తున్నా ఈ సంస్కరణవాదులింకా మైనారిటీయే అనేది గుర్తించాలి. మైనారిటీయే కాని మార్జినలైజ్డ్ కాదు. అది వీరి ప్రత్యేకత. రాజ్యం వీరిని అసుంట అని మార్జిన్స్‌లోని నెట్టివేయలేదు. ఆ అవసరం కూడా దానికి లేదు. కాసింత స్పేస్ కల్పిస్తుంది. వీరిని వింటుంది. కొద్దోగొప్పో వీరి ఆలోచనలను భాగస్వామ్యం చేసుకుంటుంది. చేసుకున్నట్టు కనిపించడానికి ప్రయత్నిస్తుంది. వీరి మధ్యతరగతి ఆహార్యం, మధ్యతరగతి భాష రాజ్యానికి శత్రుపూరితమైనవి కావు. ఒక రకంగా ఇది మిత్ర వైరుధ్యం.

ఇది మన ప్రజాస్వామ్యంలోనే ఉన్న ఇన్‌బిల్ట్ కరెక్షన్ సిస్టమ్. దీన్నే సాధారణంగా సేఫ్టీవాల్వ్ మెకానిజమ్ అని పిలుస్తుంటారు. సాధారణంగా ఈ పదాన్ని ప్రతికూల అర్థంలో వాడుతుంటారు. సమూల మార్పుల కోసం ఉద్యమించేవారు వ్యవస్థను నిలిపి ఉంచడానికి ఉపకరించే ఇలాంటి శక్తులు శత్రువు కంటే మరీ ప్రమాదకారులని భావిస్తూ అంతే తీవ్రంగా వ్యతిరేకిస్తుంటారు. కానీ పూర్తి వ్యవస్థ మార్పు కనుచూపు మేరలో కనిపించట్లేదని భావించేవారూ, భావించనివారూ కూడా వీటిని సానుకూలంగానే చూడాల్సి ఉంటుంది. ఎందుకంటే ఇలాంటి మార్పులన్నీ ప్రజలకు అంతో ఇంతో ఉపశమనాన్ని కలిగిస్తాయి. ప్రజలకు ఉపశమనాలు కూడా అవసరమే. రిజర్వేషన్లు ఉపశమనమే కానీ శాశ్వత పరిష్కారం కాదనే అవగాహనను పార్టీల డాక్యుమెంట్లలో మాత్రం ప్రకటించుకుని అన్ని కమ్యూనిస్టు పార్టీలు వీటికి పూర్తి మద్దతు నిస్తూనే ఉంటాయి. కొన్ని విప్లవపార్టీలైతే మండల్ ఉద్యమంలో కీలకపాత్ర పోషించాయి. అక్కడ ప్రయోజనం ప్రత్యక్షంగా, తక్షణంగా కనిపిస్తుండడం వల్ల దాని పట్ల పూర్తి సానుకూలంగా స్పందిస్తారు. చాలా సందర్భాల్లో వాటి పరిమితులను బయటకు చెప్పడానికి కూడా సాహసించరు. ఎక్కడ ప్రతికూలంగా అర్థమై ప్రజామద్దతు పోతుందో అన్నభావనతో పరిమితుల గురించిన చర్చను డాక్యుమెంట్లకు, అంతర్గత చర్చలకు మాత్రమే పరిమితం చేస్తారు. ప్రజలకు ఉపశమనం కలిగించే ఏ చర్యనైనా సమర్థించడం మంచిదే. అది నిజంగా ఉపశమనమే అయితే! వ్యవస్థలో సమూల మార్పులు కాకుండా ఉన్న చట్రంలోనే ప్రయోజనాలు సాధించవచ్చు అనే భ్రమను ప్రజల్లో వ్యాపింపజేస్తుంది కదా, దాని ప్రశ్నేమిటి అనొచ్చు. అంతగా ప్రజలు పూర్తిస్థాయి సామాజిక మార్పును కోరుకుంటూ ఉంటే లోక్‌సత్తా వచ్చి వారిని దారిమళ్లించి భ్రమలు వ్యాపింపజేయడం లాంటి పరిస్థితేమీ ఉండదు. (ఎప్పుడు వస్తుందో తెలీని ఆ సామాజిక మార్పు కోసం ప్రజలు ఏ ఉపశమనాలు లేకుండా బక్కచిక్కి కృంగి కృశించి ఇక ప్రాణాలకు తెగించి ఆయుధం పట్టకపోతే లాభం లేదు అనుకునే పరిస్థితి తలెత్తాలి అని ఆశించినట్టుగా ఉంటుంది, ఈ వాదనను లాజికల్ ఎండ్‌కు తీసికెళితే.) కాకపోతే సమాజంలో

సమూల మార్పులు కోరుకునే వారు బాధ్యతగా భర్తీ చేయాల్సి ఉండి చేయక పఠ్రలు పఠ్రలుగా వదిలేసిన ప్రధాన సామాజిక రంగంలో కొంతభాగాన్ని వీరు పైనించి పూరించే అవకాశాలున్నాయి.

కాబట్టి చర్చించాల్సింది లోక్‌సత్తా చిత్తశుద్ధిని కాదు. ప్రజల్లో భ్రమలను పెంచగల ప్రభావాన్నీ కాదు. అసలు ఏ ప్రభావమైనా చూపగల శక్తిగా అది ఎదగగలదా? తాను చెపుతున్న లక్ష్యాలను చేరగల విధానాలు- శక్తి దానికున్నాయా? అది చెపుతున్న మార్గంలో అది చెపుతున్న లక్ష్యాలను చేరడం సాధ్యమేనా?మౌలికమైన అంశాల్లో దాని అవగాహనేమిటి? అనేవి ఇపుడు వేసుకోవాల్సిన ప్రశ్నలు. ఎందుకంటే సామాజిక వాతావరణంలో వస్తున్న మార్పులు లోక్‌సత్తా, లోక్‌పరిత్రాణ్ వంటి సంస్థలు పూర్తిస్థాయిలో తమ లక్ష్యాలను చేరుకోగలిగినంత బలంగా ఉన్నాయా లేక ఊర్కే ఇలాంటి సంస్థలు తలెత్తి ఇపుడున్న రాజకీయవాతావరణంపై ఎంతో కొంత ఒత్తిడి తేగలదానికి పరిమితం చేసే స్థాయిలో మాత్రమే ఉన్నాయా? అనేది కీలకమైన విషయం.

ఇతర ఉదారవాద సంస్థల్లాగే లోక్‌సత్తా కూడా వ్యక్తి కేంద్రంగానే హక్కులకు ప్రాధాన్యమిస్తుంది. వారి అవగాహనకు నమూనాగా భావించదగిన చర్చాపత్రం(మాగ్నాకార్టా!)కూడా ఈ కోణంలోనే ఉంది. కాబట్టి దీన్ని ఆ పరిధిలోనే అర్థం చేసుకుని, ఆ పరిధిలోనే చర్చించాలి. వాళ్ళెంచుకున్న పద్ధతిలోనైనా వారు చెపుతున్న లక్ష్యాన్ని సాధించే అవకాశముందా అనేదే ప్రధానం. ఈ రాజ్యాంగం పరిధిలోనే పాలనా విధానాలు, అధికార యంత్రాంగం బాధ్యతగా ప్రతిస్పందిస్తే చట్టబద్ధపాలన సాగించవచ్చుననేది స్థూలంగా లోక్‌సత్తా భావన. అంతటా పాతుకుని పోయిన అవినీతిని నిర్మూలిస్తే మేలు జరుగుతుందన్న చైతన్యం ప్రజల్లో పెంపొందించి ఆ రకంగా కొత్త రాజకీయ సంస్కృతికి బాటలు వేయాలన్నది లోక్‌సత్తా సంకల్పం. రాజకీయాలను 'ప్రజల హితం కోసం పనిచేసే పవిత్ర వ్యాసంగం'గా మార్చడం ద్వారా దీన్ని సాధించాలన్నది వారి అభిలాష. సిద్ధాంత పరంగా ఇందులో ఇబ్బందేమీ లేదు. దీని ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందన్నది వాస్తవం. కానీ ఇలాంటి ప్రతి వాస్తవం ఆచరణ సాధ్యమే నన్న పూచీ లేదు. సమస్యల్లా అక్కడే.

అవగాహన విషయానికే వస్తే లోక్‌సత్తా చర్చాపత్రం స్థూలంగా బాగుంది. చక్కని వాక్య నిర్మాణం, చెప్పిన విషయం వరకూ స్పష్టత అన్నీ ఉన్నాయి. సైద్ధాంతిక పటాటోపం కూడా లేదు. అవినీతిని గురించి మాట్లాడేవారెవరైనా ఉదహరించినట్టుగానే వీరు కూడా చివర్లో క్లిట్ గార్డ్ కొటేషన్ జోడించినా అది కూడా వారి వాదానికి ఆభరణంగానే ఉంది. అతుకు లాగా లేదు. ఆటగాళ్లను కాదు ఆట నిబంధనలను మార్చడం మా లక్ష్యం అని వారు స్పష్టంగా చెప్పుకున్నారు. తమను తానులో వేరొకముక్కగా చూడొద్దు అని ఈ రకంగా ముందుగానే స్పష్టం చేశారు. అధికార వికేంద్రీకరణ గురించి నొక్కి చెప్పారు. ఇక ప్రజాస్వామ్య విధానాల సంగతి ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. అది జయప్రకాశ్ నారాయణ్ గార్కి చాలా ఇష్టమైన పదం. అయితే ఇక్కడో చిన్న సందేహం! చర్చాపత్రం జూన్ మొదటి రెండు వారాల మధ్య విడుదల చేసినట్టుగా లోక్‌సత్తా వారి వెబ్‌సైట్‌లో ఉంది. ఈ చర్చాపత్రంపై ప్రజల అభిప్రాయాలను కోరారు. అంటే అర్థమేమిటి? జనాభిప్రాయసేకరణ జరిపి పార్టీ పెట్టడం గురించి, దాని స్వరూప స్వభావాల గురించి ఒక నిర్ణయం తీసుకోవడం వారి ఉద్దేశ్యమని దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. కానీ జరిగిందేమిటి? ఆగస్టు 9నే పార్టీ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఇంత తొందరలోనే చర్చాపత్రంపై ప్రజాభిప్రాయం వెల్లడైందా? అసలు చర్చాపత్రం జనంలోకి వెళ్లడానికే కొన్ని నెలలు పడుతుందే! మరి ఇంత త్వరగా ప్రజాభిప్రాయం క్రోడీకరించుకోవడం, దానిపై నిర్ణయానికి రావడం వీరికెలా సాధ్యమైంది? అంటే ముందుగానే ఒక నిర్ణయం తీసేసుకుని ఊర్కే నామమాత్రంగా ఆ పత్రాన్ని చర్చకు పెట్టారనుకోవాలా? పై స్థాయిలో ఒక నిర్ణయానికి వచ్చి దానికి కింది స్థాయిలో ప్రత్యక్ష పద్ధతుల ద్వారానో లేక అంగీకార సృష్టి(మాన్యుఫాక్చరింగ్ కన్సెంట్) ద్వారానో ఆమోదం పొందేందుకు కసరత్తులు చేసే ది గ్రేట్ కేంద్రీకృత ప్రజాస్వామ్యమేనా వీరిది కూడా అనే అనుమానం రావడం సహజం. అయితే చేసే పనిలో [illegible]శుద్ధిని తప్పు ఇలాంటి అంశాలను పట్టించుకోకూడని స్థితిలో మ[illegible]వాళ ఉన్నాం. నిజంగా ప్రజాస్వామిక విధానాలు నిర్ణయాలు తీసుకోవడం ఈ పరిస్థితుల్లో సాధ్యమేనా అనేంత స్థితిలో ఉన్నాం. కాబట్టి మామూలుగా ఇది పెద్ద అంశం కాదు. కానీ ప్రజాస్వామ్య సంస్కరణలే ఊపిరని చెపుతున్న సంస్థ కనుక దీనిగురించి ఈ మాత్రమైనా!. అలాగే జయప్రకాశ్ నారాయణ్ మాట్లాడే తీరు కూడా ఉపదేశించే పద్ధతిలో ఉంటుంది. తాను చెప్పే విషయంపై సంపూర్ణ విశ్వాసం ఉన్నప్పుడు వ్యక్తి టోన్‌లో కనిపించే గట్టిదనంగా మాత్రమే కనిపించదు. 'ఇది సత్యమని భావిస్తున్నాను కాబట్టి నేను చెపుతున్నాను' అనే పద్ధతిలో ఉండదు. 'నేను చెపుతున్నాను కాబట్టి ఇది సత్యం' అనే పద్ధతిలో ఉంటుంది. ఇది కొంచెం ఆలోచించాల్సిన అంశం.

"లోక్‌సత్తా ప్రారంభించినపుడు జనబలాన్ని చూపెట్టి రాజకీయపార్టీల్లో మార్పులు తెద్దామనుకున్నాం. అప్పట్లో అసెంబ్లీ నియోజకవర్గంలో 15 లక్షలు ఖర్చుపెడితే ఎక్కువనుకునే వారు. ఇవాళ కోటిరూపాయలు ఖర్చుపెట్టినా తక్కువంటున్నారు. ఒక ఉద్యమంగా లోక్‌సత్తా ఈ విషయంలో విఫలమైంది" అని జయప్రకాశ్ నారాయణ్ చిత్తూరు జిల్లాలో విలేఖరులతో అన్నారు. ఇందువల్లే పార్టీ ఏర్పాటు అవసరం ఏర్పడిందని తెలిపారు. లోక్‌సత్తా ఒక ఉద్యమంగా తన లక్ష్యసాధనలో విఫలమైందని చెప్పడంలో చిత్తశుద్ధికి జయప్రకాశ్ నారాయణ్‌ను అభినందించాలి. ఇపుడు చేపట్టిన కొత్త రాజకీయపార్టీ మాత్రం విజయం సాధిస్తుందా అనేది అందరిలోనూ ఆసక్తి రేకెత్తిస్తున్న ప్రశ్న. ఒక ఆటగాడిగా మైదానంలో అడుగుపెట్టి ఆట నిబంధనలను మార్చడమనే అతిపెద్ద గెంతు ఇపుడున్న పరిస్థితుల్లో సాధ్యమయ్యేపనేనా అనేది ఇపుడు చాలామంది వేస్తున్న ప్రశ్న. అయితే ఈ ఎరుక లోక్‌సత్తా నేతలకూ ఉంది. ఇది కష్టసాధ్యమే కానీ దుస్సాధ్యం కాదని వారంటున్నారు. కానీ లోక్‌సత్తాతో సహానుభూతి కలిగిన వారు సైతం దాని విజయావకాశాలపై ప్రస్తుతానికి పెదవి విరుస్తున్నారు. 20 మంది పాత్రికేయ విద్యార్థులున్న ఒక సంస్థలోనూ, ఎనిమిది మంది విద్యార్థులున్న మరో సంస్థలోనూ ఈ విషయమై చిన్నపాటి అభిప్రాయసేకరణ జరిపితే అందులో ఎక్కువమంది జయప్రకాశ్ నారాయణ్‌ది చిత్తశుద్ధి కలిగిన యత్నంగా అభిప్రాయపడ్డారు. అయితే కనీసం ఒక్కరు కూడా ఆయన విజయంపై విశ్వాసం వ్యక్తం చేయలేదు. ఒక్కరంటే ఒక్కరు మాత్రం చెప్పలేం అన్నారు. వీళ్లంతా దాదాపు

మధ్యతరగతి అని చెప్పుకోదగిన వర్గానికి చెందినవాళ్లే. ఇంత చిన్న సమాచారం ఆధారంగా మొత్తం సమాజ స్థితిని అంచనావేయబోవడం లేదు. కాకపోతే సమాజంలో నెలకొన్న స్థితి దీనికి పూర్తి భిన్నంగా లేదని మాత్రం చెప్పొచ్చు. ఇదొక విచిత్ర స్థితి. మిగిలిన రాజకీయ పక్షాలతో(ఎన్నికల రాజకీయాల గురించి మాట్లాడుతున్నప్పుడు పార్లమెంటరీ రాజకీయ పార్టీలు అని ప్రత్యేకంగా చెప్పుకోనక్కర్లేదు) పోలిస్తే ఇది మెరుగైనదే అనే అభిప్రాయానికి బుల్‌డోజింగ్ మెజారిటీ ఉన్నప్పటికీ విజయావకాశాలపై ఏ ఒక్కరు ఓటు వేయకపోవడం భారత్ లాంటి దేశాల్లో మాత్రమే కనిపించే అంశమేమో! లోక్‌సత్తా ముందున్న అతి పెద్ద సవాల్ కూడా ఇదే.

మామూలు ఎన్నికల భాషలో మాట్లాడుకుంటే లోక్‌సత్తా రాష్ట్రంలో మీడియాతో పరిచయమున్న అతికొద్దిమందికి తెలిసిన సంస్థ మాత్రమే. దానిని విశాల ప్రజానీకానికి పరిచయం చేయగలగిన శక్తి ఇపుడు దానికి అవసరం. ఒక ముక్కలో రాష్ట్రమంతటా పరిచయమున్న 'ఆకర్షణీయమైన' వ్యక్తి కావాలి. చిరంజీవి పేరు ఆమధ్య వినవచ్చింది. సామాజిక సమీకరణాల రీత్యా కూడా అది మంచి కూడిక అవుతుంది. కానీ సుదీర్ఘమైన తమ నిరీక్షణకు ముగింపు పలికి తమ సామాజిక వర్గానికి అధికారం కట్టబెట్టేనేతగా, తమ ఆశాదీపంగా చూసుకుంటున్న వారు ఆయన సొంతంగానే బరిలోకి దిగాలని కోరుకోవచ్చు. జయప్రకాశ్ నారాయణ్ జన్మించిన సామాజిక వర్గానికి, చిరంజీవి జన్మించిన సామాజిక వర్గానికి గోదావరి జిల్లాల్లోనూ, కృష్ణా,గుంటూరు జిల్లాలోనూ ఉన్న తీవ్రమైన వైరం రీత్యా, ప్రత్యేకించి రంగా హత్యానంతరం ఏర్పడ్డ వైమనస్యాల రీత్యా ఈ కూడిక సాధ్యమేనా అనిపిస్తున్నది. అదొక్కటే కాకుండా అటువంటి ఆకర్షణీయమైన వ్యక్తి నాయకత్వ స్థానంలోకి వస్తే జయప్రకాశ్‌నారాయణ్ అనివార్యంగా రెండో స్థానానికి వెళ్లాల్సి ఉంటుంది. ఇది వ్యక్తిగతంగా ఆయనకు ఆయన వెనుక ఉన్న సామాజికవర్గంలోని పెద్దమనుషులకు అంగీకారమవుతుందా! విలువల రీత్యా కూడా జయప్రకాశ్ నారాయణ్ ఏ లక్ష్యాలతో నైతే, ఏ మార్గంలోనైతే అధికార సంబంధాలను మారుస్తానని చెపుతున్నారో అది కూడా సాధ్యపడుతుందా!. కాబట్టి ఇది సందేహాస్పదమే. ఎన్నికలకు కొంత సమయం ముందు చిరంజీవి లోక్‌సత్తాలోకి అడుగుపెడతారని, జయప్రకాశ్ నారాయణ్ జాతీయరాజకీయాల్లోకి వెడతారని, ఈ ప్రణాళిక ముందే తయారైందని ప్రచారం మాత్రం బలంగా ఉంది. ఏమైనా చిరంజీవి ఏదో రకంగా రాజకీయాల్లోకి వచ్చే అవకాశాలైతే ఉన్నాయి. ఆ ప్రస్తావన వచ్చినపుడు ఆయన ఖండించడంలేదు. సమయం వచ్చినపుడు దాని గురించి మాట్లాడదాం అని మాత్రమే అంటున్నారు. పైపెచ్చు గత కొంతకాలంగా నటిస్తున్న సినిమాల తీరు కూడా ఈ అంచనాలకు బలం చేకూర్చేదిగా ఉంది. ఎన్టీఆర్ రాజకీయరంగ ప్రవేశానికి ముందు ఎలాంటి సినిమాల్లో నటించారో ఇప్పుడు చిరంజీవి కూడా దాదాపు అదే రకమైన సినిమాల్లో నటిస్తున్నారు. అయితే ఎన్టీఆర్ కాలానికి ఇప్పటికీ సమాజంలో మార్పులున్నాయి. సరిగ్గా అదే పరిస్థితిని రిపీట్ చేయడం సాధ్యం కాకపోవచ్చు. అది వేరే కథ! ఏది ఏమైనా అధికారం కోసం ఇప్పటికే రకరకాల కాంబినేషన్లతో కూడికలు-తీసివేతల్లో తలమునకలై ఉండి అందుకోసం బిసి సంఘాలతో కూడా కలిసి పనిచేయడానికి సిద్ధపడుతున్న కాపుల నుంచి ఒత్తిడి తీవ్రతరమవుతూనే ఉంది కాబట్టి ఆయన రాజకీయ ప్రవేశం మరీ ఆలస్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

లోక్‌సత్తా వేదికలపై అడపాదడపా సినీ నిర్మాతలు కనిపిస్తున్నారు. నిర్మాతలతో పాటు 'హీరో'లు కూడా కనిపించే స్థాయికి లోక్‌సత్తా ఎదగగలదా! ప్రత్యామ్నాయ విలువలని చెప్పుకునే పార్టీ ఎన్నడూ సరైన ఆదాయ లెక్కలు చూపనటువంటి, సామాజిక సంస్కారాన్ని దిగజార్చే సినిమాలను తీసేటువంటి సినీ వ్యాపారులను వెంటేసుకోవడమేమిటి అనే అనుమానాన్ని కొద్దిసేపు పక్కన బెడదాం. ఇతరులకు వ్యక్తిగతంగా నష్టం కలిగించని(!) అవినీతిని సహజమైనదిగా భావించే మధ్యతరగతి మధ్యతరహా సర్దుబాటుగానే భావిద్దాం. ఎంత నిజాయితీ పరుడు కూడా(దాదాపు!) ఇల్లు, లేదా ఫ్లాట్‌కొనేప్పుడు సరైన లెక్కలు కాగితంపై చూపరు కదా! అని కూడా సరిపెట్టుకుందాం. మామూలుగా ఎన్నికల రాజకీయాల గురించి మాట్లాడేటప్పుడు ఇలాంటి చిన్నచిన్న అంశాలను పట్టించుకోలేంత స్థితి ఉంది. కానీ ఇది పూర్తిగా విలువల మార్పు లక్ష్యంగా నెలకొల్పుతున్న పార్టీ కాబట్టి ఈ మాత్రం ప్రస్తావన!

ఎన్నికల్లో ఒక కొత్త రాజకీయ పార్టీ అధికారంలోకి రావాలన్నా కనీసం బలమైన శక్తిగా రంగంలో నిలదొక్కుకోవాలన్నా అది జనాల(మాస్) ప్రయోజనం కోసం ఉన్నట్టుగా కనిపించాలి. జనాలకు కూడా అలా అనిపించాలి. లోక్‌సత్తా దిగువశ్రేణి ప్రజలకు పరిచయం కావడమే కష్టమైన విషయం. దాని పరిభాష అటువంటిది. మధ్యతరగతికి అలా అనిపించినా అది సానుభూతైతే చూపగలదు కానీ దాన్ని ఓట్ల రూపంలో ప్రదర్శిస్తుందా అనేది సందేహం. పైగా అది గెలుపు గుర్రాల వెంటే ఉండడం ఆనవాయితీ. గెలిచే అవకాశం లేని పార్టీకి బహిరంగంగా మద్దత్వివడం ద్వారా ప్రస్తుత పార్టీలతో తమకున్న సాన్నిహిత్యం వల్ల వచ్చే, వస్తాయనుకునే ప్రయోజనాలను అదెందుకు కోల్పోతుంది? లోక్‌సత్తా గెలుపు గుర్రం అనిపించుకోవడం అంత సులభం కాదు. ఎందుకంటే హైదరాబాద్ లాంటి నగరాల్లోనేమో మధ్యతరగతిని దాటిపోయిన పై తరగతి గణనీయంగా ఉండడం వల్ల ఇక్కడ వారు ఒక రకమైన ఉక్కపోతను ఎదుర్కొంటున్నారు. వల్గర్ షో ఆఫ్ వెల్త్ ఒక రకమైన కసివి పెంచుతున్నది. నిజమైన చట్టబద్ధపాలన వస్తే బాగుండుననే ఆకాంక్ష ఇలాంటి చోట్ల కొంత బలపడుతున్నది. కానీ చిన్నచిన్న పట్టణాల్లో, పల్లెటూళ్లలో మధ్యతరగతి- ఉద్యోగవర్గం ఇంకా ప్రివిలేజ్డ్ సెక్షన్స్ గానే ఉన్నాయి. కాబట్టి వారికి అర్జెంట్‌గా పరిపాలన మార్పు కోరాల్సిన అగత్యమేమీ కనిపించడం లేదు.

ఇక్కడింకో చిన్న తిరకాసు ఉంది. ఆకర్షణీయమైన నేత అడుగుపెడితే లోక్‌సత్తా ఆదర్శాలు పలుచబడతాయి. అడుగుపెట్టకపోతే లోక్‌సత్తా గెలుపుగుర్రం హోదా సంపాదించుకోవడం కష్టమవుతుంది. కేవలం మెరుగైన పార్టీ, నిజాయితీ గలిగిన వ్యక్తులున్న పార్టీ అనిపించుకోవడమే అయితే కమ్యూనిస్టు పార్టీలు ఎప్పుడో విజయం సాధించివుండేవి. అలాగే మా వాళ్లు అనిపించుకునే వాళ్లు ప్రతిగ్రామానా పట్టుమని పదిమందైనా ఉండాలి. కులపెద్దల్లో పట్టు, గ్రామాల్లో ఉండే సమీకరణాలు వగైరాల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కాంగ్రెస్‌కు, తెలుగుదేశంకు అలాంటి పరిస్థితి ఉంది. కమ్యూనిస్టు పార్టీలక్కూడా

రెండు మూడు జిల్లాల్లో అటువంటి పరిస్థితి ఉండబట్టే అక్కడ అవి కొద్దోగొప్పో ఫలితాలు సాధిస్తున్నాయి. ఈ సమీకరణాలన్నింటినీ వమ్ముచేయాలంటే ఎన్టీఆర్‌లాంటి సుడిగాలేదైనా రావాలి. లోక్‌సత్తా అంత సుడిగాలిలా మారే అవకాశం లేదు. మీడియా కూడా లోక్‌సత్తాకు ఏ స్థాయిలో మద్దతుగా నిలుస్తుందనేది ఆసక్తికరంగానే ఉంది. తొలిరోజు మెయిన్ పేజీలో కొద్దోగొప్పో చోటు కల్పించినా తర్వాత జయప్రకాశ్ నారాయణ్ పర్యటనలను లోపలిపేజీలో సింగిల్‌కాలానికి, డబుల్ కాలానికి పరిమితం చేస్తున్నాయి. టీవీలు కూడా అప్పుడప్పుడు ఒక బైట్ ఇస్తే సరిపోతుందిలే అనుకున్నట్టే ఉంది. చంద్రబాబు మరీ అంత తీసివేయదగిన స్థాయిలో లేరు అని మీడియా ఒక నిర్ణయానికి వచ్చినట్టే కనిపిస్తోంది. వారదే అవగాహనతో ఉంటే లోక్‌సత్తాకు మరీ ఎక్కువ మద్దతు వారినుంచి ఆశించలేం. లోక్‌సత్తా సత్తా మీది అనుమానంతోనో లేక అంతగా బలపడితే తర్వాత రంగంలోకి దిగవచ్చులే అనుకునో జయప్రకాశ్ నారాయణ్ సామాజిక వర్గానికి చెందిన బలమైన గ్రూప్ ఒకటి ఆయనకు మద్దతుగా నిలిచే విషయంలో వెనుకడుగు వేసినట్టు సమాచారం. వారు కూడా చంద్రబాబును పూర్తిగా విస్మరించగలరా అనేది సందేహమే. బహుశా వచ్చే ఎన్నికల్లోనూ చంద్రబాబు గెలవకపోతే అప్పుడు వీళ్లంతా లోక్‌సత్తాకు వెన్నుదన్నుగా నిలవవచ్చు. ఒకవేళ చిరంజీవి లోక్‌సత్తాలో అడుగుపెడితే, అప్పటికి చంద్రబాబు ఆశించినంతగా బలపడకపోతే, కోస్తాలోని రెండు బలమైన కులాల మధ్య సామరస్యమే కుదిరితే మీడియా ఇటే మొగ్గొచ్చు.

ఇవన్నీ వ్యాపార రాజకీయాల లెక్కలు. మేం ప్రత్యామ్నాయ రాజకీయ సంస్కృతికోసం ప్రయత్నిస్తున్న వాళ్లం కనుక సైద్ధాంతిక బలంతోనే గద్దెనెక్కుతాం అని లోక్‌సత్తావారనవచ్చు. కానీ ఆ విధానంలో వీరి ప్రచారానికి ఎన్నికల సమీకరణాలను మార్చేంత శక్తి ఉందా అనేది చాలా పెద్ద ప్రశ్న. నిజమే. రాజకీయాల్లో అస్సాం మహంత, ఆంధ్రా ఎన్టీఆర్‌ల తర్వాత మళ్లీ అటువంటి గ్యాప్ ఉన్న మాట వాస్తవం. కానీ ఎటువంటి ఆకర్షణ లేకుండా కేవలం భావజాల ప్రచారంతో గద్దెనెక్కే స్థాయిలోనైతే అది లేదు.

ఇక అవగాహన విషయానికి వస్తే విద్య, వైద్య రంగాలకు సంబంధించి స్థూలంగా సరైన అవగాహననే చర్చాపత్రం ప్రదర్శించింది. 'సమాజ అవసరాలకీ చదువుకీ మధ్య సంబంధం పూర్తిగా తెగిపోయింది' అని స్పష్టం చేసింది. 'పుట్టిన ప్రతిబిడ్డకీ కుల మత లింగ వివక్ష లేకుండా ఉన్నత ప్రమాణాలు గల విద్యనందించడం' కొత్త రాజకీయ పార్టీ లక్ష్యంగా పేర్కొంది. 'అనారోగ్యం వల్ల ఆందోళనకు గురికాకుండా ప్రతి కుటుంబానికి ఆరోగ్యసేవలందించే విధంగా ప్రజారోగ్యవ్యవస్థను తీర్చిదిద్దడం' లక్ష్యంగా పేర్కొంది. 'వ్యవసాయాన్ని గిట్టుబాటు నుంచి లాభసాటి వ్యవహారం'గా మార్చగలమని పేర్కొంది. సాధారణంగా సామాజిక కార్యకర్తలు వేదికల మీదనుంచి మాట్లాడే మాటలే లిఖిత రూపంలో పెట్టారు. ఎట్లా అనేది కదా అసలు విషయం. విద్యారంగాన్నే తీసుకుందాం. అందరికీ ఉన్నత ప్రమాణాల విద్య అందివ్వాలంటే ఏం చేయాలి? విద్యను పూర్తిగా జాతీయం చేసి అందరికీ ఒకటే విద్య అందించాలి. లేదంటే కనీసం ప్రభుత్వ పాఠశాలల్లో కార్పోరేట్ స్థాయి సదుపాయాలు కల్పించాలి. ఈ రెంటిలో ఏది చేయాలన్నా ఇపుడున్న వ్యవస్థ మౌలిక సూత్రాలను తల్లకిందులు చేయాల్సి ఉంటుంది. 'ప్రైవేటు విద్యాసంస్థలు తప్పుకాదు, అవి వ్యాపారమయం కావడమే తప్పు' అంటున్నారు జయప్రకాశ్ నారాయణ్ (టీవీ9 ఇంటర్వ్యూ). అడపాదడపా కార్పొరేట్ కాలేజీలపైనా కార్పొరేట్ ఆస్పత్రుల మీదా విరుచుకుపడుతూనే ఉన్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగిన లోక్‌సత్తా తొలి బహిరంగసభలో కూడా ఆయన ఈ అంశానికి ప్రాధాన్యమిచ్చారు. బహుశా వాటిని చట్టబద్ధంగా నియంత్రించి దారిలో పెట్టవచ్చని ఆయన భావనగా కనిపిస్తున్నది. ఈ వ్యాపార యుగంలో విద్య, వైద్యంలో ప్రైవేట్ ప్లేయర్లకు అనుమతినిచ్చి అవి వ్యాపారం చేయకుండా చూడగలమనడంలోనే ఇబ్బంది ధ్వనిస్తోంది. ఎన్నికల సంస్కరణలతోనే భారత దేశంలో సామాజిక మార్పులు తీసుకురావచ్చనే అవగాహనతో బయలు దేరిన పార్టీ నుంచి ఇంత తీవ్రమైన పరిణామం ఆశించొచ్చా! ఇక రైతాంగం సంగతి సరేసరి!! లోక్‌సత్తా చెపుతున్న మార్పులు చాలావరకూ మౌలిక స్వభావం కలిగినవి. ప్రకటించుకున్న లక్ష్యాలకు, అందుకు ఎంచుకున్న మార్గానికి మధ్య అంత సమతుల్యత కుదిరినట్టు కనిపించడం లేదు. ఎక్కడెంత పెట్టుబడి పెట్టాలో ఏఏ రంగాలను ఎప్పుడు ప్రైవేటీకరించాలో బయటి శక్తులు నిర్దేశిస్తున్న మార్కెట్ ప్రపంచంలో నిలబడి ఎన్నికల సంస్కరణలతోనో లేదా అవినీతి వ్యతిరేక ప్రచారంతోనే అధికారంలోకి రావచ్చని, వచ్చి ఇవన్నీ సాధించవచ్చని చెప్పుకోవడం చూసినపుడు ఎవరికైనా సందేహం కలగడం సహజం.

సంపూర్ణ మద్యనిషేధంపై ఆచరణాత్మకంగా ఆలోచించగలిగిన వారు ఇతరత్రా విషయాల్లో తమ పరిధిని శక్తిని దాటి లక్ష్యాలను ప్రకటిస్తున్నారేమో నన్న శంక కలుగుతున్నది. "మద్యం వ్యాపారాన్ని ప్రభుత్వ ఆదాయ మార్గంగా భావించడం, ఎంత ఎక్కువ మద్యం అమ్మితే అంత ఎక్కువ ఆదాయం వస్తుందన్నది లక్ష్యం కావడం, అందుకోసం చేస్తున్న ప్రయత్నాలు క్షమించరాని నేరం" అని చెపుతూనే దీని పరిష్కారానికి "మద్యనిషేధం మార్గం కాదని అందరూ అంగీకరిస్తారు" అని పేర్కొన్నారు(చర్చాపత్రం). అందరూ అంగీకరిస్తారు అనేది కొంచెం ఎక్కువ చేసి చెప్పిన మాట కావచ్చు కానీ అది పరిష్కారం కాదనేది మాత్రం వాస్తవమే. మద్యం తీసుకోవడం అనేది సంస్కృతీ సంప్రదాయాలు, వ్యక్తిగత ఇచ్ఛ తదితర అంశాలతో ముడిపడిన సంక్లిష్ట సామాజిక సమస్య. అది చాలా సందర్భాల్లో కుటుంబాలను గుల్ల చేస్తున్న మాట వాస్తవం. ఎక్కడైనా స్థానికులు మాకు మద్యం దుకాణాలు వద్దు అని ఆందోళన చేస్తే కచ్చితంగా దాన్ని పాటించాలి. అదే సమయంలో నిషేధాన్ని సార్వత్రికం చేయడం ఆచరణ సాధ్యం కాదు. ఎన్నడూ అధికారంలోకి రాము అని కచ్చితమైన విశ్వాసమున్న వారు మాత్రమే సంపూర్ణ మద్యనిషేధం హామీ ఇవ్వగలరేమో!. మాట తప్పడం మంచినీళ్ల ప్రాయమైన వారూ అవసరార్థం ఇలాంటి హామీలు ఇవ్వవచ్చు. కానీ నిజంగానే అధికారం లోకి వస్తామనుకునే వారూ, బాధ్యతగా మాట్లాడే వారూ ఇలాంటి ఉత్తుత్తి హామీ ఇవ్వలేరు. కాబట్టి మద్యం సేవించడాన్ని నాగరికతగా ప్రచారం చేసే, విచ్చలవిడి వినియోగం వైపు ప్రజలను మళ్లించే ప్రస్తుత విధానాల స్థానంలో దాని వినియోగాన్ని అదుపు చేసే

(మిగతా 58వ పేజీలో...)

పాలకవర్గాలకు పట్టని హైదరాబాద్ సుస్థిర పట్టణాభివృద్ధి

- ఎం. వేదకుమార్

ప్రణాళికా రహితంగా చేపట్టే ఏ పనిలోనూ విజయం సాధించలేం. నగరాభివృద్ధి విషయానికీ ఇది వర్తిస్తుంది. మూసీకి దక్షిణం వైపుగా చార్మినార్ కేంద్రస్థానంగా 415 ఏళ్ల క్రితం హైదరాబాద్ ప్రణాళికాబద్ధంగానే రూపుదిద్దుకుంది. నాటి నుంచీ దాని విస్తరణ మొదలై నేడది ఓ మెట్రోపాలిటన్ నగరంగా ఎదిగింది. ఆంధ్రప్రదేశ్‌కు రాజధానిగా మారింది. నేడు ఈ నగరంలో దాదాపు 70 లక్షల మందికి పైగా నివసిస్తున్నారు. 1973లో దీని విస్తీర్ణం 245 చ.కి.మీ కాగా, 1991 నాటికి అది రెట్టింపై 522 చ.కి.మీ.కు చేరుకుంది. ప్రతిపాదిత గ్రేటర్ హైదరాబాద్‌తో దీని విస్తీర్ణం ఊహించనలవి కానిరీతిలో 1864 చ.కి.మీ.కు చేరుకోనుంది. 172.6 చ.కి.మీ ప్రాంతాన్నే సక్రమంగా నిర్వహించలేని హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ (ఎంసిహెచ్) ఇక 1864 చ.కి.మీ వైశాల్యపు నగరాన్ని ఎలా నిర్వహించగలదో ఊహించతరం కాదు.

1975 నుంచీ ఎంసిహెచ్‌లో మాస్టర్ ప్లాన్‌ల రూపకల్పన మొదలైంది. 1980 నుంచి మిగిలిన పట్టణ ప్రాంతానికి హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హుడా) మాస్టర్‌ప్లాన్‌లను రూపొందించడం మొదలుపెట్టింది. 1994 నాటికి ఎంసిహెచ్, ఇతర మెట్రోజోన్‌లను కలిపి హుడా 18 జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్‌లను కూడా ప్రకటించింది. విజన్ 2020ని దృష్టిలో ఉంచుకొని 2000 నాటికి రూపొందించిన డ్రాఫ్ట్ మాస్టర్‌ప్లాన్ ఫర్ మెట్రోపాలిటన్ ఏరియాను నేటికీ నోటిఫై చేయలేదు.

మాస్టర్‌ప్లాన్ భూ వినియోగం, భవనాలు, లేఅవుట్, ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ రేషియో సంబంధించి జోనల్ రెగ్యులేషన్స్ (నియంత్రణలు)ను పేర్కొంటుంది. మాస్టర్ ప్లాన్ అనేది భవిష్యత్తు అభివృద్ధిని, అవసరాలను దృష్టిలో ఉంచుకొని అందుకు తగ్గట్టుగా వాటికి వీలు కల్పిస్తుంది. రోడ్ల వెడల్పు, పెరిగిన జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను పటిష్టం చేయడం లాంటి అంశాలనూ ఈ సందర్భంగా అది పరిగణనలోకి తీసుకుంటుంది. భవిష్యత్తు విస్తరణ పథాన్ని అది నిర్దేశిస్తుంది. అంతా దానికి కట్టుబడి ఉండాలి. భవిష్యత్తు అవసరాల కోసం కొన్ని నిర్దిష్ట స్థలాలను అది మినహాయిస్తుంది. ఏ మాస్టర్‌ప్లాన్ విజయం అయినా రూపకర్తల అంకితభావం, అధికారంలో ఉన్నవారి నిబద్ధత, నిబంధనలను పాటించాలన్న ప్రజల అభిమతంపైనే ఆధారపడి ఉంటుంది. ఒకసారి మాస్టర్‌ప్లాన్‌ను నోటిఫై చేసిన తరువాత, అది ఇక చట్టంగా మారుతుంది.

దుర్వినియోగమవుతున్న తీరుకు, ఆక్రమణలకు, అక్రమాలకుజవాబుదారీ లేకపోవడం వల్ల పట్టణ అక్రమాలకు మాస్టర్‌ప్లానే ఒక ఉపకరణంగా మారడం నిజంగా దురదృష్టకరం. జలాశయాలు, అటవీ ప్రాంతాలు, విశాల మైదానాల్లాంటివి నగరానికి ఎన్నో పర్యావరణపరమైన ప్రయోజనాలను చేకూరుస్తాయి. అలాంటివి క్రమంగా అంతరించిపోవడం, మౌలిక సదుపాయాల కల్పనలో విఫలం కావడం లాంటివి తీవ్రసమస్యలకు దారి తీస్తున్నాయి.

'నగరాభివృద్ధి' నగరానికే పరిమితం కాదు

నగరాభివృద్ధికి రూపొందించే ప్రణాళికలు నేటి, రేపటి అవసరాలను సమన్వయం చేసేవిగా రూపొందించాలి. సరైన సమయంలో సరైన రీతిలో మౌలికవసతులను అందించే విధంగా ఉండాలి. ఈ ప్రణాళికలను కేవలం నగరాన్ని మాత్రమే దృష్టిలో ఉంచుకునే రూపొందించకూడదు. నగరంపై ప్రభావం చూపగలిగే భౌగోళిక ప్రాంతీయ అంశాలనూ దృష్టిలో ఉంచుకోవాలి. నగరవాసుల భవిష్యత్తు అవసరాలనూ పరిగణనలోకి తీసుకోవాలి. ప్రాంతీయ అసమానతలు నగరంపై ఒత్తిడి పెంచేవిగా ఉండకూడదు. అభివృద్ధి అంతా ఇక్కడే కేంద్రీకృతం కాకూడదు. అందుకు అనుగుణంగా ఇతర ప్రాంతాలనూ అభివృద్ధి చేయాలి. లేనిపక్షంలో నగరంపై పడే ఒత్తిడిని తట్టుకోవడం సాధ్యం కాదు. హైదరాబాద్‌కు దీటుగా ఇతర పట్టణాలను అభివృద్ధి చేయకుండా మనల్ని నిరోధిస్తున్నదెవరు? అక్కడ గనుక సౌకర్యాలు వృద్ధి చెందితే, హైదరాబాద్ నుంచే ప్రజలు ఆయా నగరాలకు వలస వెళ్లే అవకాశం కూడా వస్తుంది కదా! హైదరాబాద్ నగరానికి అత్యుత్తమ స్థాయిలో రోడ్లు, విమానయాన సదుపాయాలు ఉండాల్సిందే. అవన్నీ కూడా సక్రమ మార్గాల్లో, సమగ్ర అభివృద్ధి ప్రణాళికలతో నిర్దిష్ట లక్ష్యాలను సాధించేవిగా రూపొందాలి.

ప్రాంతీయ ప్రణాళిక, అభివృద్ధి లేకుండా సమస్త అధికార, ప్రణాళికా, అభివృద్ధి వనరులను నగరంపైనే కేంద్రీకరించడం వల్ల భారీ ఎత్తున వలసలు చోటు చేసుకుంటున్నాయి. ఫలితంగా నగర మౌలిక వసతులపై ఒత్తిడి పెరిగిపోతోంది. అన్ని రకాల ఆదాయ వర్గాల వారూ అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారు. పెరిగిపోతున్న జనాభాతో జల, శబ్ద, వాయు కాలుష్యాలు కూడా పెరిగిపోతున్నాయి.

నగరాలు సుస్థిరాభివృద్ధి సాధించాలంటే, వికేంద్రీకరణ కూడా ఎంతో ముఖ్యం. స్థానికులను భాగస్వాములుగా చేస్తూ జరిగే స్థానిక పాలనే ఇందుకు మార్గం. వ్యయాలను తగ్గించేందుకు కూడా ఈ వికేంద్రీకరణ తోడ్పడుతుంది. పెద్ద పెద్ద నగరాలకు దీటుగా చిన్న చిన్న పట్టణాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

పారదర్శకత, ప్రజలకు భాగస్వామ్యం లేవు

నగరాభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో అత్యంత కీలకాంశాలు పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం. దురదృష్టవశాత్తూ మన ప్రణాళికల రూపకల్పనలో ఇవే లోపించాయి. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. ఈ విషయంలో అనుసరించాల్సిన నియమ నిబంధనలను 73వ, 74వ సవరణలు,11వ షెడ్యూల్ స్పష్టంగా పేర్కొన్నాయి. ప్రణాళిక ప్రక్రియలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించాలన్న సూచన మాత్రం ఆమోదం పొందలేదు. ఆ సూచన ఆమోదం పొంది ఉంటే ప్రణాళికా సంఘం,అభివృద్ధి సంఘం పనితీరులో ఎంతో మార్పు కన్పించేది.

తాత్కాలిక ప్రాతిపదికన, అహేతుకంగా నిర్ణయాలు తీసుకోవడం ప్రభుత్వ విధానంగా, పాలకవర్గాల లక్షణంగా మారిపోయింది. పలు సందర్భాల్లో స్వార్థపూరిత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, నియమ నిబంధనలకు వక్రభాష్యాలు చెబుతూ నిర్ణయాలను తీసుకుంటున్నారు. ఫలితంగా లక్షలాది ప్రజలు ఇక్కట్లకు గురి కావాల్సివస్తోంది. మధ్యవర్తుల జోక్యంతో తీసుకునే నిర్ణయాలు ప్రజలకు కష్టాలను మిగులుస్తున్నాయి. అప్పుడప్పుడూ ప్రజావిచారణలు జరిగినా, వాటిని మొక్కుబడిగా, ఏదో లాంఛనంగా అన్నట్లుగా ప్రజలకు సరైన సమాచారం అందించకుండా నిర్వహిస్తున్నారు.

ఎంసిహెచ్ పనితీరులో పారదర్శకత కొరవడినందున, దాని కార్యకలాపాలను ప్రశ్నించేందుకు ఆస్కారం లేకుండా పోతోంది. ప్రజల నుంచి వసూలు చేస్తున్న లైబ్రరీ సెస్సును రోడ్డు నిర్మించేందుకు దారి మళ్లిస్తున్నారు. వసతుల మెరుగుకు వసూలు చేస్తున్న పన్నులను ఇతరత్రా వెచ్చిస్తున్నారు. ఈ దారి మళ్లింపులు జరుగకుండా ఉండాలంటే, అధికారులను జవాబుదారీ చేయడమొక్కటే మార్గం.

గ్రేటర్ హైదరాబాద్ ఎవరి బాగుకోసం?

ప్రజల ప్రయోజనాలను ఏ మేరకు నెరవేర్చగలదో అన్న అంశంపై స్పష్టత లేకుండానే, చుట్టుపక్కల ఉన్న మునిసిపాలిటీలను అన్నింటినీ విలీనం చేయాలన్న గ్రేటర్ హైదరాబాద్ ప్రతిపాదన సమంజసం కాదు. చుట్టుపక్కల ఉన్న మునిసిపాలిటీలన్నీ కూడా ఎంసిహెచ్‌తో పోలిస్తే ఎంతో విభిన్నంగా పని చేస్తున్నాయి. విలీనమైన తరువాత, 'గ్రేటర్' పరిధిలో మెలగడం వాటికి తలకుమించిన భారం. వివిధ గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు ఒక్కసారిగా విలీనమై కార్పొరేషన్‌గా ఎలా పని చేయగలుగుతాయి? ఈ చర్య సక్రమంగా పనిచేస్తున్న మున్సిపాలిటీల పనితీరును నేలమట్టం చేయడమే అవుతుంది. ఈ పరిస్థితిని మరో విధంగా చక్కదిద్దవచ్చు. నగరం కోసం మెట్రోపాలిటన్ ప్లానింగ్ అథారిటీని, మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేసి ప్రణాళికల రూపకల్పన, అమలు బాధ్యతలను వేర్వేరుగా వాటికి కేటాయించాలి. అప్పుడు మాత్రమే నాణ్యతలో రాజీ లేకుండా సేవలను అందించే విధంగా కార్పొరేషన్‌ను, మున్సిపాలిటీలను, పంచాయతీలను తీర్చిదిద్దడం సాధ్యపడుతుంది.

చిన్న పట్టణాలనెందుకు అభివృద్ధి చేయడం లేదు?

రియో, సియోల్, జకర్తా, మెక్సికో, కైరో, ఢిల్లీ వంటి పెద్ద పెద్ద నగరాలు ఎదుర్కొంటున్న సమస్యలను చూస్తూ కూడా వాటినే పాలకవర్గం, అధికార గణం ఎందుకు ఆదర్శంగా తీసుకొంటున్నాయో ఎవరికీ అర్థం కాదు. ఈ సమస్యల పరిష్కారానికి ఏకైక మార్గం చిన్న చిన్న పట్టణాలను అభివృద్ధి చేయడమేనని పట్టణాభివృద్ధి ప్రణాళికా రూపకర్తలు ఘోషిస్తున్నారు. ప్రజలను ఆకట్టుకునేలా సకల సదుపాయాలతో చిన్న చిన్న పట్టణాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని వారంటున్నారు. 20 లక్షల కంటే తక్కువ జనాభాతో ఉండే ఈ పట్టణాలు దగ్గర్లోనే కార్యస్థలాలను కలిగిఉంటాయి. ఎక్కడ ఉండే వారి పిల్లలకు అక్కడే పాఠశాలలూ ఉంటాయి. అక్కడ జీవన వ్యయం కూడా తక్కువగానే ఉంటుంది. కిక్కిరిసినట్లుగా ఉండదు. కాలుష్యమూ తక్కువగానే ఉంటుంది. ఇలా చిన్న చిన్న పట్టణాలను అభివృద్ధి చేయడం ద్వారా చెత్త తొలగింపు, ఘనవ్యర్థాల నిర్వహణ, గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌లు, మంచినీటి కొరత, ఇళ్ల కొరత లాంటి సమస్యలను చాలా వరకు పరిష్కరించుకోవచ్చు.

శాంతిభద్రతలూ కరువే

నగరం విస్తరిస్తున్న కొద్దీ శాంతిభద్రతలూ కరవవుతుంటాయి. కారణం, ఒకప్పుడు చిన్నపాటి ప్రాంతానికి పరిమితమయ్యే పోలీసు వ్యవస్థ, మరెంతో ప్రాంతంలో శాంతిభద్రతలను పరిరక్షించాల్సి రావడం. పరిధి తక్కువగా ఉండే ప్రాంతాల్లో పోలీసులు తమ విధులను చక్కగా నిర్వర్తించగలుగుతారు.

ప్రాజెక్టుల లాభాల్లో స్థానికులకూ వాటా దక్కాలి

తమ గమ్యస్థానాలను వేగంగా, సజావుగా చేరుకోవాలని, అందుకు అనుగుణంగా ట్రాఫిక్, రహదారుల వ్యవస్థలు ఉండాలని నగరవాసులు ఆశించడం సహజం. అందుకు గాను అధికార యంత్రాంగం చేపడుతున్న చర్యలు మాత్రం నియమ నిబంధనలను పూర్తిస్థాయిలో ఉల్లంఘించేవిగా ఉంటున్నాయి. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ మంచినీటి జలాశయాల తీరపరీవాహక ప్రాంతాల్లో కాలుష్యకారక నిర్మాణాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం జీవో నెం. 111ను జారీ చేసింది. అందులో పేర్కొన్న బయో కన్జర్వేషన్ జోన్ నిబంధనలను తుంగలో తొక్కుతూ నూతన అంతర్జాతీయ విమానాశ్రయం రూపుదిద్దుకొంటున్నది. తరతరాలుగా అక్కడ వ్యవసాయం చేసుకుంటున్న ఎంతోమందిని అది నిరాశ్రయులుగా మార్చింది. ఔటర్ రింగ్‌రోడ్డు విషయంలోనూ ఇలాగే జరిగింది. నోటిఫికేషన్‌ను ఎన్నో సార్లు మార్చారు. చివరకు జరిగింది స్థానికులు నష్టపోవడమే. వారికి ఇచ్చిన నష్టపరిహారం అతి తక్కువ. ఇలాంటి సందర్భాల్లో నష్టపరిహారం చెల్లింపునకు తోడుగా 'భూమికి బదులుగా భూమి' ఇచ్చే పథకాన్ని కూడా అమలు చేయాలి. ఇలా భూమిని, ఉపాధిని కోల్పోతున్న వారికి ఎంత ఇచ్చినా తక్కువే. అందుకే, ఆయా అభివృద్ధి ప్రాజెక్టుల అమలు వల్ల కలిగే లాభాల్లో వారినీ వాటాదారులుగా వాటా చెల్లించాలి. అక్కడ వారికి భూములు ఉండే పక్షంలో వచ్చే విధంగా శాశ్వత రాబడికి వీలు కల్పించాలి. అభివృద్ధి పథకాలు అమలు చేయవద్దని ఎవరూ అనడం లేదు. అందుకు ముందుగా స్థానికులు, 'ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్' వంటి స్వచ్ఛంద సంస్థలు వెలిబుచ్చే అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది.

బొట్టుబొట్టుగా సగటుజీవికి - కోరుకున్నంత 'కార్పొరేట్'కి

ప్రకృతి ప్రసాదిత అమూల్య వనరుల్లో ముఖ్యమైంది నీరు. దాన్ని జాగ్రత్తగా వాడుకుంటూ పరిరక్షించుకోవాల్సిన అవసరముంది. సాధారణ ప్రజానీకానికి మంచినీటిని అందించడంలో నిర్లక్ష్యం వహించే వాటర్ బోర్డ్, కొద్ది హెచ్చు రేటుకు కార్పొరేట్ సంస్థలకు, ప్రముఖుల కాలనీలకు కావాల్సినంతగా అందిస్తోంది. ఇలా అందించే నీటికి వెల కడుతున్నామని అంటున్నా, అది తక్కువ మొత్తమే. కృష్ణా జలాల తరలింపునకు అదింకా ఎక్కువ మొత్తాన్నే వెచ్చిస్తోంది. సాధారణ ప్రజల ప్రయోజనాలను పణంగా పెడుతూ ఈ నీటిసరఫరా జరుగుతోంది. సాధారణ ప్రజల నీటి అవసరాలు నేటికీ తీరడం లేదు.

కనుమరుగు కానున్న జలాశయాలు

పర్యాటకం, అభివృద్ధి, సుందరీకరణ పేరిట హుడా, ఎంసిహెచ్‌లు నగరవాసులకు దీర్ఘకాలంలో కీడును, దుష్ఫలితాలను కలుగజేసే ప్రాజెక్టుల

అమలుకు శ్రీకారం చుడుతున్నాయి. బుద్ధపూర్ణిమ ప్రాజెక్టునే ఉదాహరణగా తీసుకుంటే, చారిత్రక జలాశయం హుస్సేన్‌సాగర్ చుట్టూతా రెస్టారెంట్లు, ప్రముఖుల సమాధులు, అమ్యూజ్‌మెంట్ పార్కులు, ఐమాక్స్ తదితరాల పేరిట ఓ భయంకర భౌగోళిక వికృతాకృతిని సృష్టించారు. ఓ అందమైన సరస్సు కాలుష్యం కారణంగా ఉనికి కోల్పోయేలా చేస్తున్నారు. రోజూ 115 మిలియన్ లీటర్ల పారిశ్రామిక వ్యర్థజలాలు ఇందులోకి చేరుతున్నాయి. ఇందులో కాలుష్య శుద్ధి ప్లాంట్ ద్వారా శుద్ధి అవుతున్నది కేవలం 35 మిలియన్ లీటర్లు మాత్రమే. అన్ని రకాల నిబంధనలనూ తుంగలో తొక్కుతూ ఈ వ్యవహారం సాగుతోంది.

నోటిఫై చేసిన 169 జలాశయాలలో ఇప్పటికే ఎన్నో ఉనికిని పూర్తిగా కోల్పోయాయి. మరెన్నో అంతరించిపోయే దశలో ఉన్నాయి. చెరువు కట్టలు ఇళ్లకాలనీలుగా, ల్యాండ్‌స్కేప్ గార్డెన్‌లుగా మారుతున్నాయి. చెరువులు, కుంటలు, సరస్సులు లాంటివి ఓ నిర్దిష్ట ప్రయోజనాన్ని కలిగిఉన్నాయి. భూగర్భజలాలను అవి తిరిగి సమకూరుస్తాయి. పక్షులకు, ఇతర క్రిమికీటకాదులకు ఆవాసం కల్పిస్తాయి. పరిసర ప్రాంతాల వాతావరణాన్ని చల్లగా ఉంచుతాయి. దీన్ని విస్మరించి అభివృద్ధి, సుందరీకరణ పేరిట ప్రభుత్వం, అధికారయంత్రాంగం పర్యావరణ విధ్వంసానికి పూనుకోవడం సమంజసం కాదు.

మూసీ సుందరీకరణ?

మూసీ సుందరీకరణ పథకం తీరు కూడా ఇలానే ఉంది. అభివృద్ధి, సుందరీకరణ పేరిట నదీతీరం పొడవునా దుకాణాల సముదాయాలు, మల్టీప్లెక్స్‌లు, రోడ్లు, వినోద కేంద్రాలు నిర్మించారు. ఇవన్నీ మూసీ ఉనికికే ముప్పు తెస్తున్నాయి. నగర అవసరాలను తీర్చేందుకు, వరదలను నిరోధించేందుకు, ప్రాణనష్టాన్ని అరికట్టేందు కు ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌ల వద్ద ఈ నదిపై అడ్డుకట్టలు నిర్మించారన్న విషయాన్ని పాలకులు విస్మరిస్తున్నారు. నదీతీరం పొడవునా రియల్‌ఎస్టేట్ అభివృద్ధిపై కన్నేసిన కొంతమంది దురాశాపరుల ఆకాంక్షలు నెరవేర్చేదిగానే ఈ మూసీ సుందరీకరణ పథకం కన్పిస్తోంది. చుట్టుపక్కల ఉన్న మురికివాడల్లోని వేలాది ప్రజానీకాన్ని, తరతరాలుగా అక్కడే గడ్డిభూములపై ఆధారపడిన పేదవారిని కిలోమీటర్ల దూరానికి తరమడం జీవనోపాధికి వారిని దూరం చేయడమే అవుతుంది. ఉపాధి పొందేందుకు వారికి గల ప్రాథమిక హక్కుకు విఘాతం కల్పించినట్లే అవుతుంది.

మురికివాడవాసుల అభ్యున్నతి ప్రభుత్వ బాధ్యతా కాదా?

గ్రామీణ ప్రాంతాల్లో బతుకుతెరువు కరవై ఉపాధి కోసం నగరానికి తరలివస్తున్న పేదలతో మురికివాడలు వెలుస్తున్నాయి. ఇందుకు వారిని తప్పు పట్టాల్సిన అవసరం లేదు. ఉపాధి దొరికితే వారు పల్లెల్లోనే ఉండేవారు. వారిలో అత్యధికులు అతితక్కువ వేతనాలకు వివిధ రంగాల్లో కార్మికులుగా పని చేసేవారే. ఎలాంటి కనీస వసతులూ వీరికి ఉండవు. నగరంలో ఉన్న 70 లక్షల మందిలో దాదాపు 12.5 లక్షల మంది ఈ మురికి వాడల్లో ఉంటున్న వారే. మొత్తం మురికివాడలు దాదాపు 2000కు పైగా ఉండగా, ప్రభుత్వం 811 మురికివాడలను మాత్రమే అధికారికంగా నోటిఫై చేసింది. నోటిఫై చేసిన వాటిల్లోనే ప్రభుత్వ పథకాలు అమలవుతాయి. అలా అమలవుతున్నవీ మొక్కుబడిగానే ఉన్నాయి. మిగతా వాటిల్లో అది కూడా గతి లేదు. నగరంలో ప్రభుత్వానికి పోగుపడుతున్న సంపదలో మురికివాడ వాసుల శ్రమకు కూడా గణనీయ భాగం ఉంది. అలాంటప్పుడు మురికివాడల వాసుల అభ్యున్నతి ప్రభుత్వ బాధ్యత కాదా?

ముప్పేట కాలుష్యం - భూగర్భజలాలు విషతుల్యం

నాచారం, మల్లాపూర్, మియాపూర్, పటాన్‌చెరు, జీడిమెట్ల, కాటేదాన్ పారిశ్రామిక వాడలు వాతావరణ కాలుష్యం, భూగర్భ జలాల కలుషితం, శుద్ధి చేయని పారిశ్రామిక వ్యర్థ జలాలను నాలాలు, కుంటలు, జలాశయాల్లో కలపడం లాంటి సరికొత్త ప్రమాదాలను తీసుకువస్తున్నాయి. కాలుష్య నియంత్రణ మండలి, అటవీ శాఖ తదితర అధికార యంత్రాంగం వైఫల్యానికి ఇవి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి. జీడిమెట్లలోని పారిశ్రామిక వ్యర్థజలాల ఉమ్మడి శుద్ధి కర్మాగారం పనితీరును సుప్రీంకోర్టు తీవ్రంగా అభిశంసించిన తీరు తెలిసిందే. పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి డంపింగ్ యార్డ్‌ల నిర్వహణ తీరుతెన్నులు కూడా సక్రమంగా లేవు. నగరంలో రోజుకు 2200 టన్నుల వ్యర్థాలు వెలువడుతున్నట్లు ఓ అంచనా. ఈ వ్యర్థాల తరలింపు, నిర్వహణలకు సంబంధించి జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. రీసైక్లింగ్ లాంటివాటిని ప్రోత్సహించాలి.

ఒకనాటి నందనవనం - నేటి కాంక్రీటు కీకారణ్యం

ఓ యాభై ఏళ్ళ క్రితం దాకా హైదరాబాద్ పచ్చదనంతో విలసిల్లుతూ నందనవనంలా ఉండేది. జాతీయ పార్కులు, పబ్లిక్ పార్కులు ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందిస్తుండేవి. నేడు 'బాగ్' అని వ్యవహరితమయ్యే పలు ప్రాంతాల్లో ఒకప్పుడు పెద్దపెద్ద ఉద్యానవనాలు ఉండేవి. వాటివల్లే హైదరాబాద్‌ను ఉద్యానవనాల నగరంగా కూడా అభివర్ణించేవారు. నేడు ఈ పచ్చదనమంతా హరించుకుపోయింది. ఫలితంగా ఏటేటా వేసవిలో నగర ఉష్ణోగ్రత పెరిగిపోతూనే ఉంది. 'చెట్టు చట్టం' ఉన్నప్పటికీ పచ్చదనం హరించుకుపోతూనే ఉంది.

నిర్వీర్యమైపోయిన రవాణా వ్యవస్థ

నగరంలో వాహనాల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడం నగర రవాణా వ్యవస్థను కూప్పకూల్చింది. కొద్దిపాటి దూరాలకూ గంటల తరబడి సమయం పడుతోంది. ఒకప్పుడు దూరాన్ని కి.మీ.లలో లెక్కవేసుకునే వారం. ఇప్పుడు దాన్ని నిమిషాలు, గంటల్లో లెక్కేసుకోవాల్సి రావడం పరిస్థితి తీవ్రతకు దర్పణం పడుతోంది. రోడ్డును ఉపయోగించుకునే వారిలో కార్ల యజమానులు 30 శాతం మందే అయినా, 70 శాతం మేరకు రోడ్డు వ్యవస్థను వారే ఉపయోగించుకుంటు న్నారు. మిగిలిన 30 శాతాన్ని 70 శాతం ప్రజలు వినియోగించుకోవాల్సి వస్తోంది. ఫ్లైఓవర్లు నిర్మించడమొక్కటే ఈ సమస్యకు పరిష్కారం కాదు. నిజానికది సమస్య తీవ్రతను మరింత పెంచుతుంది. ఈ సమస్యను పరిష్కరించగలిగేది దీర్ఘకాలిక దృష్టితో రూపొందే సమగ్ర ట్రాఫిక్ నిర్వహణ విధానం మాత్రమే.

మాయమవుతున్న చారిత్రక, వారసత్వ కట్టడాలు

విచక్షణారహితంగా రూపుదిద్దుకుంటున్న ఆకాశహర్మ్యాలు హైదరాబాద్ నగర స్వాభావితకను పూర్తిగా మార్చేస్తున్నాయి. తలెత్తి చూస్తే ఆకాశం కన్పించని రీతిలో ఆకాశహర్మ్యాలు ఉంటున్నాయి. నేల ఎలాగూ కన్పించడం లేదు. ఇక ఇప్పుడు నింగీ కన్పించడం లేదు. నగరానికి వన్నె తెచ్చిన, సుందర రూపాన్ని ఇచ్చిన నిర్మాణాల రూపురేఖలు మారిపోతున్నాయి. ఎన్నో నిర్మాణాలు పూర్తిగా కనుమరుగై పోతున్నాయి.

ఈ అంశాలను పరిశీలించేందుకు అర్బన్ ఆర్ట్స్ కమిషన్‌ను నియమించాల్సిన అవసరం ఉంది. వారసత్వ సంపదగా పేర్కొనే కట్టడాలకు వాటిల్లే ముప్పును హుదా సమన్వయంతో కొనసాగే హెరిటేజ్ కన్జర్వేషన్ కమిటీ పరిశీలించాలి. నగరంలో, చుట్టుపక్కల ఉన్న కొండలు, గుట్టలు, ప్రకృతి సహజంగా ఏర్పడిన వివిధ ఆకృతులు ఇప్పుడు కనుమరుగవుతున్నాయి. వాటిని పరిరక్షించుకోవాల్సిన అవసరముంది.

రాళ్ళలో దాగిఉన్న అమూల్య వారసత్వాన్ని మనం ఎలా నిర్లక్ష్యం చేయగలం? తమ సమకాలీన భావావేశాలకు దర్పణం పట్టేలా, వాటిని ప్రతిఫలించేలా భవన నిర్మాణాల్లో రాళ్ళను ఆయా భవనాల రూపశిల్పులు రూపుదిద్దారు. ఆ విధంగా, గతించిన కాలానికి సంకేతంగా నిలిచిన ఎన్నో అద్భుత కట్టడాలు హైదరాబాద్‌లో ఉన్నాయి. కళాభిరుచికి, కళాత్మకతకు, సౌందర్యరూపాలకు అవి అద్దం పడుతాయి. చారిత్రక వారసత్వాన్ని కాపాడుకోవడంలో మొదటినుంచీ హైదరాబాద్ అగ్రస్థానంలోనే ఉంది. 1985లో, ఈ విషయమై ఫోర్డ్ ఫౌండేషన్ ఓ అధ్యయనం నిర్వహించింది. తదనంతరం, ప్రభుత్వం, అసాధారణ రూపురేఖలు గల కొండరాళ్ళతో పాటు గోల్కొండ, చార్మినార్ తదితర ప్రాంతాల్లో మొత్తం 137 వారసత్వ కట్టడాలను గుర్తించింది. ముంబయిలో 1700, భువనేశ్వర్‌లో 2772 కట్టడాలను ఈ విధంగా వారసత్వ కట్టడాలుగా ప్రకటించిన నేపథ్యంలో వాటి కంటే ఘనచరిత్ర గల హైదరాబాద్‌లో వాటి సంఖ్య అంతకు మించి ఉండదా? ఒక అంచనా ప్రకారం జంటనగరాల్లో 2000కు మించే వారసత్వ నిర్మాణాలు, భవనాలు, కట్టడాలు, ప్రకృతి సహజసిద్ధ నిర్మాణాలూ ఉన్నాయి. వాటిని వారసత్వ కట్టడాలుగా ప్రకటించే ప్రతిపాదనలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి.

ఎన్నెన్నో వెతలు...మనసుంటే మార్గం

నేడు హైదరాబాద్‌ను ఎన్నెనో సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. సూక్ష్మస్థాయిలో సమగ్ర సమాచారం లేనిదే దారిద్ర్య నిర్మూలన అసంభవం. ఇందుకోసం సమగ్ర అవగాహన, సర్వే నిర్వహించడం అవసరం. అప్పుడే దారిద్ర్య నిర్మూలన పథకాల అమలులో విజయం సాధించడం సాధ్యపడుతుంది. మంచినీటి సరఫరా, మురుగునీరు, భూగర్భజలాల రీఛార్జ్, ఘనవ్యర్థాల నిర్వహణకు సంబంధించి ఎంసిహెచ్ నోడల్ ఏజెన్సీగా వివిధ విభాగాలతో ఓ సమన్వయ బృందాన్ని ఏర్పాటు చేయాలి. ట్రాఫిక్, రవాణా సమస్యల పరిష్కారానికి తక్షణ, దీర్ఘకాలిక దృష్టితో తగు చర్యలు తీసుకోవాలి. ఎంతటి ఖర్చుకైనా వెనుకాడకుండా, మాస్ ట్రాన్స్‌పోర్టేషన్ వ్యవస్థలను ఏర్పరచాలి. అన్ని వర్గాలకూ చెందిన వారూ వీటిని ఉపయోగించుకోగలగాలి. ప్రజల ఆరోగ్య సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కానవస్తోంది. వైద్య సదుపాయాలను కల్పించే బాధ్యత నుంచి వైదొలుగుతూ, నియంత్రణ బాధ్యతకే అది పరిమితమవుతోంది. పట్టణ ఆరోగ్య సదుపాయాలను మెరుగుపర్చాల్సిన అవసరం ఉంది.

పెరుగుతున్న సవాళ్లు

2021 నాటికి హైదరాబాద్ జనాభా ఒక కోటిని దాటుతుందని అంచనా. రాష్ట్ర స్థూల వస్తూత్పత్తిలో నగర వాటా 12 శాతం కంటే ఎక్కువే. ఆస్తి పన్ను వసూలు మొత్తంలో భారీ పెరుగుదల చోటు చేసుకొంటోంది. ఎంసిహెచ్ పరిధిలో ఆవాసాల సంఖ్య అధికం కావడం, ప్రకటనల స్థలాల నుంచి వచ్చే ఆదాయాలు అధికం కావడం ఇందుకు కారణం కావచ్చు.

పట్టణ దారిద్ర్యం, గ్రామీణ ప్రజల వలసలు నగర ఆర్థిక వ్యవస్థ ఎదుర్కోబోయే ముప్పునకు సంబంధించి ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయి. సరైనా దిశానిర్దేశం ఉన్న అభివృద్ధి కార్యక్రమం మాత్రమే సుస్థిర, సమగ్ర నగరాభివృద్ధికి దోహదపడగలదు. వికేంద్రీకరణ, మునిసిపల్ ఫైనాన్స్, పర్యావరణ సమస్యలు, పారదర్శకత, జవాబుదారీతనం, పేదల సమగ్రాభ్యున్నతి, శక్తిసామర్థ్యాల నిర్మాణం లాంటి అంశాలను ఈ సందర్భంగా పరిగణన లోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పట్టణ పేదలకు సరైన ఆరోగ్యం, ఉపాధి, విద్య, రుణసదుపాయాల్లాంటివి కల్పించినప్పుడు మాత్రమే హైదరాబాద్ నగరం సుస్థిర అభివృద్ధిని సాధించగలుగుతుంది.

ప్రణాళికా సంఘాలు సరైన అంచనా లేకుండా చేపట్టిన అభివృద్ధి కార్యకలాపాల వల్ల ఏర్పడిన పర్యావరణ సమస్యలు సృష్టించిన ఆర్థిక, పర్యావరణ ప్రభావాలను ప్రముఖంగా చాటిచెప్పడం ద్వారా నగర సుస్థిర అభివృద్ధికి మనం కృషి చేయాల్సి ఉంటుంది. లేని పక్షంలో మన భవిష్యత్తు తరాల వారు ఈ పర్యావరణ సమస్యలకు బలి కావాల్సి ఉంటుంది.

నూతన నిర్మాణాలు (టౌన్‌షిప్‌లు, ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లు, కాలనీలు, కమర్షియల్ కాంప్లెక్సులు, ఆసుపత్రులు, కార్యాలయ ఆవరణలు, వెయ్యికి మించి జనాభా ఉండే లేదా పని చేసే ఆవరణ ఏదైనా, రోజుకు 50 వేల లీటర్ల మురుగునీటిని విడుదల చేసే నిర్మాణమేదైనా, లేదా రు. 50 కోట్లకు మించి వ్యయంతో కూడుకున్న కట్టడమేదైనా) వేటికైనా, నిర్మాణానికి ముందే, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి నుంచి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్‌ను తీసుకునేలా తగు చర్యలు తీసుకోవాలి. బహుళ అంతస్తుల నిర్మాణాలను అనుమతించేందుకు ముందుగా, అవి కలుగజేసే పర్యావరణ ప్రభావాలను పరీక్షించాలి.

18వ లేదా 19వ శతాబ్దపు హైదరాబాద్ నగరం అత్యంత సుందరమైనదని అనడంతో చరిత్రకారులంతా ఏకీభవిస్తారు. రత్నాలను వీధుల్లో రాశులుగా పోసి అమ్మేవారనడం అతిశయోక్తి ఏమీ కాదు. అప్పటి సంపద, వైభవం అలాంటివి. తావెర్నీర్ లాంటి నాటి పర్యాటకులు ఎంతో మంది కుతుబ్‌షాహీ పాలకులను ప్రశంసించారు. హైదరాబాద్ స్థాపకుడైన మహ్మద్ కులీ కుతుబ్ షా , 'సముద్రంలో చేపల వలే నా నగరం ప్రజలతో నిండిపోనీ' అని ప్రార్థించాడట. అదంతా గతమైనా, ప్రస్తుత పాలకులు కూడా అదే మాదిరి స్వప్నాన్ని కలిగి, సరైన ప్రణాళికలతో, లక్ష్యాన్ని సాధించాలన్న పట్టుదలతో పని చేస్తే, ప్రపంచంలో సుస్థిర అభివృద్ధితో కూడిన, స్వయంసమృద్ధమైన, అందమైన నగరంగా హైదరాబాద్ రూపుదిద్దుకునే అవకాశం ఉంది. ◆

ఔటర్ రింగ్ రోడ్డు - ఒక మానవ విధ్వంస రచన

- ఎస్. జీవన్‌కుమార్

హైదరాబాద్ నగరం చుట్టూ ఒక బ్రహ్మాండమైన వలయాకారపు రహదారి నిర్మించడానికి ప్రభుత్వం పూనుకుంది. ఈ ఔటర్ రింగ్ రోడ్డు వార్తలు పత్రికల్లో రాని రోజు లేదు. ప్రతిపక్షాలు ప్రస్తావించని దినం కూడా లేదు. 162 కి.మీ. రింగ్‌రోడ్డు రంగారెడ్డి జిల్లాలో పన్నెండు మండలాలగుండా, మెదక్‌లో మూడు మండలాలగుండా దాదాపు 86 గ్రామాలను ఛేదిస్తూ వెళ్తుంది. ఈ రోడ్డు నిర్మాణంలో నష్టపోయే గ్రామాల సంఖ్య ప్రభుత్వం చెప్పిందే కాని దాని ప్రభావంతో దెబ్బతినే గ్రామాల సంఖ్య కలిపితే ఇంకా ఎక్కువే అవుతుంది. 500 అడుగుల వెడల్పుగల ఈ రోడ్డు ఆసీయా దేశంలోనే అతిపెద్ద రోడ్డుగా ప్రచారంలో వుంది. ఈ రోడ్డు నిర్మాణానికి హైదరాబాద్ అభివృద్ధి సంస్థ (హుడా) 2005 డిసెంబర్‌లో ప్రతిపాదించింది. గత రెండు సంవత్సరాలుగా ఆనోట, ఈనోట ఒక పెద్ద రోడ్డు రాబోతుందని వింటున్నాం. చాలా హడావిడిగా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో వున్న వ్యక్తులు, కొందరు అధికార్లు, కొందరు రాజకీయ నాయకులు భూములు కొనే ప్రక్రియలో వున్న విషయం తెలుస్తూనే ఉంది. శంషాబాద్‌లో అంతర్జాతీయ విమానాశ్రయం కోసం భూసేకరణ జరుగుతున్న సమయంలోనే ఈ వార్త విన్నాం.

మొదటి ఫేజ్‌లో శంషాబాద్ నుండి గచ్చీబౌలి వరకు 22 కి.మీ. దూరం, రు. 500 కోట్ల వ్యయంతో నిర్మింపబడుతుంది. ఇందుకోసం హూడా సంస్థ కొంత తను భూములు అమ్మి సంపాదించిన డబ్బుతో బాటు కొంత ఆంధ్ర బ్యాంకు, ఇండియన్ ఓవర్సీస్, బ్యాంక్ ఆఫ్ బరోడాల నుండి రుణంను సేకరించింది. వచ్చే సంవత్సరం జనవరి మొదటి దశ పూర్తి అవుతుందని, 140 కి.మీ. పొడవుగల రెండవ దశ రోడ్డు 2009 సంవత్సరానికి పూర్తి చేస్తామని చెపుతున్నారు. రెండవదశకు అవసరమయ్యే రు. 2,500 కోట్లు హూడా స్వయంగా తమ సంస్థకు ప్రభుత్వం కెటాయించిన భూములను మార్కెట్‌లో వేలం వేసి సంపాదిస్తానని చాలా గర్వంగా ప్రకటనలు చేస్తోంది.

మొదటి దశలో నిర్మాణమవుతున్న గచ్చీబౌలి నుండి శంషాబాద్ రోడ్డు అత్యుత్తమ ప్రమాణాలతో రూపొందించామని చెప్పుతున్నారు. నానక్‌రాంగూడ నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు నిర్మించే రోడ్డును యాక్సెస్ కంట్రోల్ అనే నూతన పద్ధతిలో నిర్మిస్తారట. ఎనిమిది భాగాలుగా విభజింపబడే ఈ రోడ్డు రెండు చివరలలో రెండు సర్వీసు రోడ్లకు వదిలేసి, మధ్యలో నాలుగు రోడ్లను యాక్సెస్ కంట్రోల్ అంటారు. అంటే నానక్‌రాంగూడ నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు దాదాపు 19 కి.మీ. దూరం వాహనాలు ఎక్కడా ఆగకుండా వేగంగా పోతాయి, ఈ రోడ్డు అడ్డంగా దాటడానికి అసలే వీలుండదు. రింగ్‌రోడ్డులోని ఏడు పెద్ద జంక్షన్లలో ఎట్లాపడితే అట్లా వెళ్లడానికి వీలుండదు. ఒక్కొక్క జంక్షన్ దాదాపు 500 మీటర్లలో నిర్మిస్తారట. ఒక వాహనాన్ని ఔటర్ రింగ్‌రోడ్డులోకి తీసుకెళ్లాలన్నా, రింగ్‌రోడ్డు నుండి బయటకి రావాలన్నా అందుకోసమే డిజైన్ చేసిన ప్రత్యేక మార్గాల ద్వారా వెళ్లవలసి ఉంటుందట. అవసరాన్ని బట్టి ఈ జంక్షన్లలో, రింగ్‌రోడ్డు మధ్యలో ఫ్లైఓవర్లు కూడా నిర్మిస్తారట. అంతర్జాతీయ విమానాశ్రయంకు వెళ్లే కార్లు 22 కి.మీ. దూరం 15 నిమిషాల్లో పోతాయి. దాదాపు గంటకు 100 కి.మీ. వేగానికి తగ్గకుండా వాహనాలన్నీ ప్రయాణిస్తాయి. ఈదంతా విని వార్త పత్రికల్లో, కంప్యూటర్ గ్రాఫిక్స్‌లో తయారు చేసిన చిత్రాలు చూసి నిజంగా అబ్బురపడవలసిందే. ఇంగ్లీషు సినిమాలో చూపించే పెద్ద నగరాలు, మెలికలు తిరిగి పుష్పాకారంలో ప్రయాణించే రోడ్డు మన ముందు మెదులుతాయి.

ఇంత అందంగా నిర్మించ తలపెట్టిన ఈ రోడ్డు వెనక ఉన్న నేపథ్యాన్ని, ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాల్లో అభివృద్ధి నమూనాను మనం అర్థం చేసుకుంటే తప్ప ఈ రంగుల దృశ్యం వెనక ఉన్న అదృశ్య హస్తాలు, మన పాలకులు చొంగ కారుస్తూ కనే కలలు మనకు అర్థం కావు. ఈ రోడ్డు అలైన్‌మెంట్‌ను (పత్రికల్లో వచ్చిన వార్తల ప్రకారమే) 15 సార్లు మార్చారు. పెద్ద రోడ్లు నిర్మించినప్పుడు వాటి అనుసంధానం ఎట్లాచేయాలనే విషయంలో అంతర్జాతీయ సూత్రాలు వున్నాయని, నియమాలు ఉన్నాయని నిపుణులు చెప్పుతున్నారు. అయితే ఈ నిపుణులను సంప్రదించారా, సూత్రాలను పాటించారా అనే విషయంలో అధికార్లు ఏమీ స్పష్టం చేయడంలేదు. వాళ్లు చేసిందల్లా 'గూగుల్ ఎర్త్' అనే వెబ్‌సైట్‌ను ఇంటర్‌నెట్‌లో తెరిచి ఒక పెద్ద వలయాన్ని గీసారు. ఈ వలయంలో వచ్చే భూముల్ని పరిశీలిస్తూ చాలా జాగ్రత్తగా అలైన్‌మెంట్ మార్చుతూపోయారు. రైతులు, ప్రజలు ఆందోళన చేసిన అంశాల విషయంలో అలైన్‌మెంట్ మార్పు జరిగినట్టు మనకు కనపడదు. సరిగ్గా చాలా మంది పెద్ద మనుషుల, రాజకీయ నాయకుల, పెద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారుల భూముల్ని కాపాడటానికి మార్పులు చేసారన్న విషయంలో ఎటువంటి సందేహం అవసరం లేదు. అలైన్‌మెంట్ మార్పుల పేరుతో జరిగిన భూభాగోతం పత్రికల్లో చాలానే వచ్చింది. నాదర్‌గుల్ సమీపంలో తలపెట్టిన హార్డ్‌వేర్ పార్క్ నిర్మాణం విషయంలో ఇబ్బందులు ఏర్పడతాయని, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల రక్షణ విషయంలో, ఘట్‌కేసర్, వరంగల్ రోడ్డు పై ఎక్కువ సంఖ్యలో నివాస గృహాలు కోల్పోయే విషయంలో అలైన్‌మెంట్ మార్పులు చేసిన విషయం మనకు సహేతుకంగా కనిపిస్తుంది. కానీ తక్కిన 12 అలైన్‌మెంట్ మార్పుల విషయంలో అధికారులు ఎటువంటి సహేతుక వివరణలు ఇవ్వలేకపోతున్నారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయానికి సంబంధించిన రెవెన్యూ, హుడా అధికార్లు, 'ముందుచూపు' గలిగిన భూ వ్యాపారస్తులు ప్రజలతో చాలా కుట్రగా వ్యవహరించారు. భూసేకరణ చట్టం ప్రకారం నోటీసు ఇచ్చిన తర్వాత ఆ ప్రాంతంలో భూ కొనుగోళ్లు, అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు చేయరాదనే నిబంధన వుంది. అయినా రహస్యంగా అధికార్ల అండతో రైతులకు తప్పుడు సమాచారం ఇచ్చి తక్కువ ధరలో భూములు కొన్నారు.

అట్లాగే లాభాలు వస్తాయని భూములు కొని అలైన్‌మెంట్ మారడంతో నష్టపోయిన వారు కూడా ఉన్నారు. ఈ మొత్తం కార్యక్రమం భూమి కోసం జూదం ఆడే ప్రక్రియగా మారిపోయింది.

ప్రభుత్వం ఇచ్చిన గణాంకాల ప్రకారమే ఈ రోడ్డు వల్ల 113 గ్రామాలలో 80 వేల ఎకరాల భూమికి నష్టం వాటిల్లుతుంది. 500 ఎకరాలు పట్టా భూములు, 950 ఎకరాల ప్రభుత్వ భూమి, 300 ఎకరాలు అటవీభూమి, 3000 ఎకరాలు వ్యవసాయ సాగులో వున్న భూమి, 500 ఎకరాల పూల, పండ్లతోటలు, వాణిజ్య అవసరాలకు సంబంధించిన 50 ఎకరాల భూమి, 20 ఎకరాల నివాసితప్రాంతాలు, 450 ఎకరాల అనధికార లే అవుట్‌లు, 1500 ఎకరాల ఖాళీస్థలం ఈ రోడ్డులో కనుమరుగైపోతున్నాయి. ఇంకా అంచనా వేయని గ్రోత్ కారిడార్‌గా చెప్పబడుతున్న ప్రాంతం వల్ల దాదాపు 40 గ్రామాలు విధ్వంసం అవుతాయి. ఇంకా ఊహించి అంచనా వేయని పెద్ద నష్టం జంటనగరాల్లోనించి రింగ్ రోడ్డును కలిపే 32 రేడియల్ రోడ్ల వల్ల నిర్వాసితులయే కుటుంబాలు, కూల్చివేయబడే నివాసాలు. అందంగా ప్రపంచబ్యాంక్ పదజాలంలో వర్ణిస్తున్న 'గ్రోత్ కారిడార్'లో రోడ్డుకిరువైపుల దాదాపు ఒక కిలోమీటర్ వరకు నిర్మాణాలుండరాదు. నిర్మాణాలుంటే 1240 గజాలకు తక్కువకాని స్థలంలో ఇళ్లు నిర్మించుకోవచ్చు. 15 వేల ఎకరాల భూమిని మాత్రమే నివాస స్థలాల కోసం అభివృద్ధి చేయడానికి అనుమతి లభిస్తుంది. ఈ మొత్తం నిర్మాణ ప్రక్రియలో దళితులెంతమంది భూమి కోల్పోతారు, బక్కరైతులెంతమంది ప్రభుత్వ భూముల్లో బతుకుతున్నారు, అసైన్డ్ భూములు ఎన్ని లెక్కలు చూస్తే ఈ రోడ్డు భయంకర స్వభావం మనకు ఇంకా బాగా అర్థం అవుతుంది. ఈ రోడ్డుపై నుండి చూస్తే కనుచూపు మేరలో గుడిసెలు కాని, చిన్న ఇండ్లు కాని కనపడరాదు. గ్రోత్ కారిడార్ విషయంలో ఏర్పరచిన ప్రత్యేక సూచన ప్రకారం చాలా పెద్ద స్థలంలో భవనాలు మాత్రమే నిర్మించే అవకాశం కల్పించారు.

ప్రతిపక్షాలు, నష్టపోతున్న ప్రజల ఆందోళన వల్ల ప్రభుత్వం సి.బి.సి.ఐ.డి. విచారణకు ఆదేశించింది. ఈ విచారణ నిర్మాణపరమైన సాంకేతిక అంశాలను పరిశీలించదు. ఈ విచారణ భూసేకరణ ప్రొసీజర్ సరిగా అమలు చేసారా, ఏ మేరకు నిర్దేశిత నిబంధనలను పాటించారు అనే విషయాన్ని విచారించి చెపుతుండవచ్చు. ఈ మొత్తం అభివృద్ధి క్రమం యొక్క తాత్విక ధోరణి, అందుకోసం కుట్రపూరితంగా ప్రభుత్వ ఆలోచనలను బయటపెట్టలేదు. ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా ఒక రకమైన అభివృద్ధి నమూనాను ధనిక దేశాలు కోరుకుంటున్నాయి. గ్లోబల్ పెట్టుబడి స్వేచ్ఛగా పయనించడానికి, ఈ రకమైన అభివృద్ధి కావాలి. ఇట్లా వుండాలని ఆశక్తులేవీ ప్రభుత్వానికి నేరుగా చెప్పే అవసరం లేదు. గత పదేళ్లుగా ప్రపంచబ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు, బహుళజాతి వ్యాపార సంస్థలు వాళ్ల ఆలోచన విధానాన్ని, వాళ్లు కాంక్షించే ప్రపంచ స్వరూపం యొక్క దృశ్యాన్ని, రాజకీయ నాయకుల్లో, మధ్య ధనిక తరగతి వర్గాలల్లో, 'గుడ్ గవర్నెన్స్' అని సున్నితమైన భాషను వాడే అధికార్ల మనోభావాల్లో చాలా బలంగా శాశ్వతంగా ముద్రించబడింది. ఎమర్జెన్సీలో తలవంచమంటే కొందరు మేధావులు మోకాళ్లతో నడిచారు అని అనంతమూర్తి అన్నట్లుగా, ఇట్లచేయండి అని అనకముందే అంతర్జాతీయ శక్తులకు అనుగుణంగా పథకాలు రూపొందించ బడుతున్నాయి.

ప్రపంచ బ్యాంక్ భారతదేశం లోని భూముల నిర్వహణలు ఒక ప్రత్యేకమైన అధ్యయనం చేసి, నివేదిక తయారు చేసింది. అందులో మన దేశంలో అస్తవ్యస్తంగా ఉన్న భూమి రికార్డుల గురించి, భూమి విషయంలో నిర్లక్ష్యంగా, చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న ప్రభుత్వం గురించి చాలా విషయాలు చెప్పింది. భూ యాజమాన్యం నిర్వహణ, ప్రైవేట్ భాగస్వామ్యంతో ఎంత బాగా చేసుకోవచ్చో చెప్పింది. ఇంతే కాకుండా భూమి జీవనాధారానికి ఒక వనరు అసలేకాదు, అది అతి విలువైన వ్యాపార వస్తువు అనే రహస్యాన్ని కూడా ప్రభుత్వాల చెవుల్లో గుసగుసగా చెప్పింది.

నిజంగా ప్రభుత్వం చెబుతున్నట్టుగా ఇరవై సంవత్సరాల దూరదృష్టితో ఈ పని చేస్తున్నాం, అన్న వాదనలో ఏ మాత్రం నిజాయితీ వున్నా, ఈ రోడ్డు నిర్మాణం విషయంలో పెద్ద ఛర్చ, అభిప్రాయ సేకరణ చేయవలసి ఉండే. ప్రపంచంలోనే పెద్ద రోడ్డు అంటున్నారు కాబట్టి ఈ రంగంలో నిష్ణాతుల్ని, నిపుణుల్ని సంప్రదించి సూచనలు, సలహాలు సేకరించివలసి ఉండే. కొన్ని యూనివర్సిటీల్లో, జాతీయ పరిశోధక సంస్థల్లో ఇటువంటి నిర్మాణాలకు సంబంధించిన ప్రత్యేక శాఖలున్నాయి. బోలెడంత పరిశోధన అనుభమున్న వ్యక్తులున్నారు. ఇవన్నీ ఏవీ ప్రభుత్వం చేయలేదు. నిజానికి అస్తవ్యస్తమైన నగరంలోని రోడ్లు, డ్రైనేజి వ్యవస్థను ప్రక్షాళణం చేసి ఈ రోడ్లను అనుసంధానం చేసి ట్రాఫిక్ సజావుగా పోవడానికి కావలసిన ఒక రోడ్డు నిర్మాణం గురించి ఆలోచించవలసి ఉండే. ఇదివరకే ఉన్న రింగ్ రోడ్డు వెడల్పు చేసే కార్యక్రమాన్ని మానుకొని ఈ పథకం తయారుచేసారు. బహుళజాతి సంస్థలు, కార్పొరేషన్లు దేశంలోని రాష్ట్రాలను, మూడవ ప్రపంచ దేశాలను బ్లాక్‌మెయిల్ చేస్తున్నాయి. ఈ రాష్ట్రంలో కాకుంటే, ఇంకొక రాష్ట్రంలో, ఈ దేశం కాకుంటే ఇంకో దేశం అనే ధోరణితో అనారోగ్యమైన పోటీని పెంచుతున్నాయి. రాష్ట్రాలు, దేశాలు ఈ ఉచ్చులో పడిపోతున్నాయి. పెట్టుబడులను ఎట్లా ఆకర్షించాలన్నదే ప్రభుత్వాల తపనగా వుంది. ప్రజలు, వాళ్ల అవసరాలు, వాళ్ల సంక్షేమం అసలు ఎజెండాలోనే లేదు. ఎటువంటి నగరం కావాలి, అందులో ప్రజలు ఎట్లా వుండాలి, వాళ్ల అవసరాలు ఎట్లా తీర్చాలి అనే ప్రశ్నలు ప్రభుత్వం వేసుకోవడం లేదు. 20 ఏళ్లలో అంత జనాభా పెరిగితే రోడ్డు కాదు వాళ్ల జీవనోపాధి విషయంలో ఆలోచన వుండాలి. బహుళజాతి సంస్థలకు కావలసిన వసతుల్ని, నమూనాను తయారుచేసి, వాళ్లకు ద్వారాలు తెరిచి, వారు దొచుకునిపోతుంటే చేతులెత్తేయడం అంటే ప్రజల హక్కులను కాలరాయడమే. సౌకర్యవంతమైన రోడ్లు, అవసరాలకు సరిపోయే రవాణా మార్గాలు అవసరమే, కాని ఆ నిర్మాణాల వల్ల ప్రజల జీవితం సుఖదాయం కావాలి, హక్కుల్ని సంపూర్ణంగా అనుభవించే అవకాశాలు పెరగాలి.

ప్రతిపక్షాలన్నీ సరియైన నష్టపరిహారం గురించి, మంచి పునరావాసం కావాలని, భూకుంభకోణాల పై విచారణ కోసం ఆందోళన చేస్తున్నారు. కాని మనం ఇక్కడ ఒక్క మౌలికమైన అంశం పై ఛర్చ లేవదీయవలసి ఉంది. అసలు ఈ అభివృద్ధి ఎవరి కోసం? ఈ అభివృద్ధిలో పేదల వాటా భాగస్వామ్యం ఎంత? ఏ అభివృద్ధి పథకమైనా ఆలోచనైనా ప్రజలందరిని దాంట్లోకి ఇముడ్చుకొని వాళ్ల జీవనోపాధికి,

పెరుగుతున్న హైదరాబాద్ మహానగరం

- డా. సి. రామచంద్రయ్య

దేశంలోని పెద్ద నగరాలలో హైదరాబాద్ ఆరవది (బెంగళూరు కంటే కొంత తక్కువ జానాభాతో). 1961 నాటికి పన్నెండు లక్షలకు పైగా వుండిన జనాభా 2001 నాటికి యాభై ఏడు లక్షలకు పెరిగింది. గత మూడు దశాబ్దాలలో నగరం వేగంగా పెరిగింది. హైదరాబాద్ నగరమంటే ముఖ్యంగా నగరపాలక సంస్థ, నగరంతో కలిసిపోయి చుట్టూ వున్న పది మునిసిపాలిటీలు, సికిందరాబాద్ కంటోన్మెంట్ ప్రాంతం, ఉస్మానియా విశ్వవిద్యాలయం. వీటితోపాటు పటాన్‌చెరు, రామచంద్రాపురం (ఈ రెంటిని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మునిసిపాలిటిలగా ప్రకటించింది), బి.ఎచ్.ఇ.ఎల్., మీర్‌పేట్ టౌన్, పట్టణాల అంచున వున్న బయటి ప్రాంతాలు (అవుట్ గ్రోత్) గా పరిగణించ బడే గ్రామీణ ప్రాంతాలు కలిసి హైదరాబాద్ మహానగర ప్రాంతం (మెట్రోపాలిటన్ ఏరియా) గా పరిగణించబడతాయి (పట్టిక చూడండి). దీనికి మొత్తం వైశాల్యం 778 చ.కి.మీ. గమనించ వలసిన విషయమేమంటే ఇంత వైశాల్యంలో నగర పాలక సంస్థ ప్రాంతం (మునిసిపల్ కార్పొరేషన్) వాటా 22.2 శాతమే అయినప్పటికీ జనాభాలో 63.2 శాతం వాటా ఉన్నది. అందుకే జన సాంద్రత దాదాపు 21 వేలు ఉన్నది. (హైదరాబాద్ నగరాభివృద్ధి సంస్థ - హుడా వైశాల్యం చాల ఎక్కువ. 1800 చ.కి.మీ. పైగా ఉంటుంది). మహానగరానికి నడిబొడ్డు, ఆయువు పట్టు అయిన ఈ ప్రాంతంలో జనసాంద్రత చాల ఎక్కువగా ఉండడం వలన అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సమస్య తీవ్రతను పెంచే మరొక విషయమేమంటే చుట్టూ ఉండే చిన్న పట్టణాల నుంచి ప్రతిరోజు లక్షల సంఖ్యలో ప్రజలు ఈ నడిబొడ్డుకు రావడం కాని, దాని గుండా ప్రయాణించడం కాని జరుగుతూ ఉంటుంది. దేశంలోని అనేక ఇతర పెద్ద నగరాలతో పోలిస్తే ఈ నడిబొడ్డులోని జనసాంద్రత చాల ఎక్కువ. (గడ్డిఅన్నారంలో ఇంతకంటే ఎక్కువ ఉన్నప్పటికీ అది రాష్ట్రంలోనే అతి చిన్న మునిసిపాలిటి).

మహానగరం పెరుగుదలను గమనించండి. 1990వ దశకంలో 31 శాతం పెరిగితే నడిబొడ్డు ప్రాంతం 20 శాతం లోపుగానే పెరిగింది. చుట్టూ వున్న పది మునిసిపాలిటీలు కలిపి 70 శాతం పైగా పెరిగాయి. ఇది చాల ఎక్కువ. నగర పరిసరాలుగా భావించే ఈ పది పట్టణాలలో గత రెండు దశాబ్దాలలో నగరం ఎక్కువగా విస్తరించింది. ఇందులో కొన్ని మరీవేగంగా పెరిగాయి. శేరిలింగంపల్లి మునిసిపాలిటీలో దాదాపు నగభాగం, రాజేంద్రనగర్ మండలంలోని మణికొండ గ్రామ పంచాయితిని కలిపి 52 చ.కి.మీ. విస్తీర్ణంతో సైబరాబాద్ అభివృద్ధి ప్రాంతంగా 2001లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐ.టి.) రంగానికి చెందిన అనేక జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు ఈ ప్రాంతం లోనే వెలిశాయి, వెలుస్తున్నాయి. ఇటీవల అనేక రియల్ ఎస్టేట్ కంపెనీలు, వ్యక్తులు ఇక్కడ కార్యకలాపాలు సాగిస్తున్నారు. భవిష్యత్తులో ఎక్కువగా పెరిగే ప్రాంతాలుగా 'అవుట్ గ్రోత్' ను గుర్తించవచ్చు. శంషాబాద్‌తో సహా అనేక గ్రామాలు ఇందులో ఉన్నాయి. వీటితో పాటు అనేక ఇతర గ్రామాలను కలిపి 400 చ.కి.మీ పైగా విస్తీర్ణంతో 'హైదరాబాద్ విమానాశ్రయ అభివృద్ధి ప్రాంతం' గా ప్రభుత్వం ప్రకటించింది. వందల ఎకరాలలో భూమిని ప్రైపేట్ కంపెనీలకు ముట్ట చెబుతున్నది. ఇప్పుడు ముఖ్యంగా ఈ ప్రాంతంలోనే (సైబరాబాద్, విమానాశ్రయం) ఔటర్ రింగ్ రోడ్డు గొడవలు కూడా ఎక్కువగా జరుగుతున్నది.

ఏ నగరమైనా జనాభా పెరిగే కొద్ది వాళ్లకు కావలసిన సదుపాయాల కల్పన కోసం ఖాళీ స్థలాల ఆక్రమణ జరుగుతుంది. అది ఒక పద్ధతి ప్రకారం జరగడానికి ప్రణాళికా విభాగాలు ఉన్నాయి. తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, ప్రజా రవాణా మొదలగునవి ప్రభుత్వ రంగంలో ఉండగా ఇళ్ల సదుపాయాలు కల్పించడంలో ప్రైవేట్ రంగమే ప్రధాన పాత్ర వహిస్తున్నది. నగరంలో ప్రధానమైన వనరుగా కనిపించేది భూమి. డిమాండు ఎక్కువయ్యే కొద్దీ భూముల ధరలు విపరీతంగా పెరుగుతాయి. ఇందులో అనేక రకాల లావాదేవీలు, ప్రభుత్వాలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించక పోవడంతో మామూలు ఉద్యోగాలు చేసే వాళ్లు కూడ ఒక అపార్ట్‌మెంట్ ఫ్లాట్ కూడ కొనలేని పరిస్థితి నేడు నెలకొన్నది (సొంత ఇల్లు గురించి ఆలోచించడమే అనవసరం). పేదల పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది. పెరిగే నగరాలు అనేక విధాల జీవనోపాధి అవకాశాలు కల్పిస్తాయి. గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి లేనివాళ్లు, సాంఘిక పీడనకు గురైన వాళ్లు లక్షల సంఖ్యలో ప్రతిరోజు నగరాలకు తరలివెళ్లుతున్నారు. నగరాలలో చౌకగా లభించే కార్మికులు, పాచీపని చేసేవాళ్లు, తోపుడు బండ్ల వ్యాపారులు, పాలు, పత్రికలు ఇళ్లకు వేసేవాళ్లు, ముఠా కార్మికులు, పారిశుధ్య పనివాళ్లు అలా వలసవచ్చిన వారే. వాళ్లు లేకుండా నగరంలో ఆర్థిక వ్యవస్థ ముందుకు

అవసరాలను తీర్చేవిగా ఉండాలి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ స్థిరీకరణ' పథకం, రైతుల నోళ్లలో మట్టికొట్టి పెట్టుబడులు ఆకర్షించడానికి తలపెట్టిన 'ప్రత్యేక ఆభివృద్ధి మండలాలు' పథకం వెలుగులో ఈ రోడ్డు నిర్మాణాన్ని చూడాలి. ప్రస్తుతం నిర్మిస్తున్న ఈ రోడ్డు పేదలను, చిన్న రైతులను అభివృద్ధి చట్రంలోంచి బయటకు తోసివేసే ప్రయత్నం తప్ప మరొకటికాదు. అసలు ఇది ఒక రోడ్డు నిర్మాణం కాదు, ఒక పెద్ద ప్రాజెక్ట్. ప్రభుత్వం మానవాళిపై చేస్తున్న నేరం. ఈ మానవ విధ్వంస రోడ్డును ఆపడానికి ప్రతిపక్షాలేకాక, ప్రజాస్వామిక శక్తులు, మేధావుల జోక్యం కావలసి ఉంది. ఉద్యమం తీవ్రతరమైతే ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిన మొదటి ఫేజ్, శంషాబాద్ నుండి గచ్చీబౌలి వరకు, పూర్తి చేసి ఆపుతుంది. (నిజానికి వాళ్లకు ఈ రోడ్డే చాలా అవసరం) లేకుంటే మానవాళిపై ఈ విధ్వంసం కొనసాగిస్తుంది. ◆

...డవదు. కాని మౌలిక సదుపాయాల విషయంలో వాళ్లది ప్రతిరోజు ఒక సంఘర్షణే. కలుషిత నీరు, పారిశుధ్యం లేని కారణంగా చనిపోతున్న వాళ్లు, ప్రభుత్వ ఆసుపత్రులలో చేరుతున్న వాళ్లు, డెంగీ వ్యాధికి గురవుతున్న వాళ్లు వీళ్లే. (చికున్ గున్యా కు కారణమైన దోమకు వీళ్లంటే కొంత చులకన భావన కలిగిందేమో, మధ్యతరగతి డబ్బున్న వాళ్ల వైపు దృష్టి సారించింది. ఇది ఒక శుభ పరిణామంగా భావించాలి).

ప్రపంచీకరణ నేపథ్యంలో నగరాల పాత్ర ఎక్కువైంది. నగరాలను సుందరంగా తీర్చి దిద్ది పెట్టుబడుల ఆహ్వానం కోసం పోటీలో

నగర జీవనానికి ఆయువుపట్టు లాంటివి తాగునీటి సరఫరా, మురికినీటి వ్యవస్థ, ప్రజా రవాణా. రోజుమార్చి రోజు వస్తున్న (చాల చోట్ల మూడు నాలుగు రోజులకొక సారి) తాగునీరు. (సంవత్సరంలోపు ప్రతిరోజు సరఫరా చేస్తామని అధికారులు చెపుతున్నారు, మంచిదే). శుభ్రమైన నీరు ప్రతిరోజు ప్రతి ఇంటికి సరిపడా అందినపుడే అది నాగరికతకు ఒక చిహ్నంగా ఉంటుంది. ఆ నీరు అల్పాదాయ వర్గాలకు, పేదవారికి వీలైనంత చౌకగా అందాలి. మురుగునీటి వ్యవస్థ కూడ అధ్వాన్నంగానే ఉన్నది. లోతట్టు ప్రాంతాలలోను, బస్తీలలోను మురుగునీరు

పట్టిక

మహానగర ప్రాంతం లోని భాగాలు	వైశాల్యం (చ.కి.మీ) 2001	జనాభా 1991	జనాభా 2001	పెరుగుదల శాతం 1991-01	జనసాంద్రత (చ.కి.మీ.కు జనాభా) 2001
ఎ) హైదరాబాద్ నగర పాలక సంస్థ (ఎం.సి.హెచ్)	172.68	30,43,896	36,12,427	18.7	20,920
	(22.2)	(69.8)	(63.2)		
బి) **చుట్టుపక్కల గల మునిసిపాలిటీలు**					
అల్వాల్	26.32	66,471	93,206	40.2	3,541
కాప్రా	43.81	87,747	1,59,002	81.2	3,629
కూకట్‌పల్లి	43.12	1,86,963	2,92,289	56.3	6,779
ఎల్.బి.నగర్	64.61	1,55,514	2,68,689	72.8	4,159
మల్కాజ్‌గిరి	16.75	1,27,178	1,93,863	52.4	11,574
కుత్బుల్లాపూర్	52.02	1,06,591	2,31,108	116.8	4,443
రాజేంద్రనగర్	50.87	84,520	1,43,240	69.5	2,816
శేరిలింగంపల్లి	96.99	72,320	1,53,364	112.1	1,581
ఉప్పల్	21.97	75,644	1,17,217	55.0	5,335
గడ్డిఅన్నారం	2.12	35,187	52,835	50.2	24,922
బి) **మొత్తం**	**418.58**	**9,98,135**	**17,04,813**	**70.8**	**4,073**
	(53.8)	**(22.9)**	**(29.8)**		
సి) సికిందరాబాద్ కంటోన్మెంట్	40.17	1,71,148	2,06,102	20.4	5,131
	(5.2)	(3.9)	(3.6)		
డి) ఉస్మానియా యూనివర్సిటి	2.85	10,153	11,224	10.5	3,938
ఇ) ఇతర టౌన్స్					
1. పటాన్‌చెరు	15.06	26,862	40,273	49.9	2,674
2. రామచంద్రాపురం	19.28	46,129	52,363	13.5	2,716
3. రామచంద్రాపురం (బి.హెచ్.ఇ.ఎల్)	11.21	17,707	14,815	-16.3	1,322
4. మీర్‌పేట్	4.04	5,089	12,935	154.2	3,202
ఇ) **మొత్తం**	**49.59**	**95,787**	**1,20,386**	**25.7**	**2,428**
	(6.4)	**(2.2)**	**(2.1)**		
ఎఫ్)ఔట్ గ్రోత్స్	94.38	44,191	62028	40.4	657
	(12.1)	(1.0)	(1.1)		
మొత్తం	**778.17**	**43,63,310**	**57,16,980**	**31.0**	**7,347**

గమనిక : బ్రాకెట్లలో ఉన్న సంఖ్యలు మొత్తంలో శాతం

ఆధారం : 1. జనాభా లెక్కలు 1991, 2001 (ఆంధ్రప్రదేశ్), 2. హుడా మాస్టర్ ప్లాన్ (2003)

ఒడ్డుతున్నాయి ప్రభుత్వాలు. పేదవాళ్లు, వాళ్లుండే బస్తీలు, గుడిసెలు కనపడకుండా వుండే విధంగా కొత్త కాలనీలు, కంపెనీలు వెలుస్తున్నాయి. (ముంబాయిని షాంఘై నగరంగా మలచాలనే అత్యుత్సాం లేదా మానసిక దాస్యం తో ముంబాయిలో ఎనభై వేల గుడిసెలను కూల్చివేయడం జరిగింది). పేదవాళ్ల సేవలు చౌకగా కావాలి, కాని వాళ్లు దరిదాపుల్లో ఉండకూడదు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో పెద్ద నగరాలలోకి పరిస్థితి ఇది. ఇంతేకాదు, ధనవంతులు, మధ్యతరగతి వాళ్ల మనస్థత్వం కూడ ఇప్పుడు ఇలాగే తయారైంది.

బయటనే ప్రవహిస్తూ రోగాలకు నిలయంగా వుంటున్నది. ఏ నగరమైనా మురికి నీటిని శుద్ధి చేసిన తరువాతనే బయటకు వదలాలి. ఈ విషయంలో హైదరాబాద్ నిర్వాకం మరీ అధ్వాన్నం. నగరంలో విడుదలయ్యే మురుగునీటిలో ఇరవైశాతం మాత్రమే అరకొరగా అంబర్‌పేట్ వద్ద శుద్ధి చేస్తున్నది. మొత్తం మురికి మూసీనదిలో చేరి ఆ నది ఒక మురికి కాలువగా మారిపోయింది. తద్వారా మూసీకి ఇరువైపులా ఉన్న అనేక గ్రామాలలో భూగర్భజలాలు కలుషతమైనాయి. భారతదేశంలోని నగ్రాల గుండా ప్రవహించే అనేక నదుల పరిస్థితి ఇంతే.

ఇక నగరంలో ప్రజా రవాణా వ్యవస్థ గురించి ప్రభుత్వాలకు ఏ మాత్రం చిత్తశుద్ధి లేదు. అసలు హైదరాబాద్ నగరానికి ఒక అంతర్గత రవాణా విధానమే లేదు. ప్రతిరోజు ముప్పై లక్షలకు పైగా వ్యక్తులకు రవాణా కల్పిస్తున్న ఆర్టీసి బస్సులు గత పది సంవత్సరాలలో వివక్షకు గురైనాయి. ప్రైవేట్ వాహనాల సంఖ్య విపరీతంగా పెరుగుతున్నది. మహానగర పరిధిలో ఇరవై లక్షల వరకు వాహనాలు వున్నట్లు అంచనా. కిక్కిరిసిన ఆర్టీసి బస్సు ఆటోతో పోటీ పడవలసి వస్తున్నది. గంటల తరబడి ట్రాఫిక్ నిలబడిపోవడం, బాధ్యతారహితమైన రాస్తా రోకోలు. పర్యవసానం అత్యంత కాలుష్యమైన నగరాల జాబితాల్లో హైదరాబాద్ చేరిపోతున్నది. శ్వాసకోశ వ్యాధులు పెరిగిపోతున్నాయి. పెరుగుతున్న వత్తిడి, చికాకుల వలన చక్కెరవ్యాధి (డయాబెటీస్) వేగంగా పెరుగుతున్న నగరంగా కూడ హైదరాబాద్ (అప) కీర్తి పొందుతున్నది. పనిచేయని ట్రాఫిక్ సిగ్నళ్లు, పనిచేసే చోట నియమాలు ఏ మాత్రం పాటించని వాహనదారులు, నిస్సహాయంగా ఏదో కొంత నియంత్రించే ప్రయత్నంలో ట్రాఫిక్ కానిస్టేబుళ్లు. కనీసం మూడు వేల మంది ట్రాఫిక్ సిబ్బంది వుండవలసిన నగరంలో కేవలం పదకొండు వందల మంది తోనే (ఇంకొంత మంది హోమ్ గార్డులతో) నెట్టుకు రమ్మనే రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యం. ఇదీ నగర ట్రాఫిక్ పరిస్థితి. మరి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం ఏమిటి అంటే మెట్రోరైలును తెస్తామంటున్నారు నాయకులు, అధికారులు. అరవై కి.మీ. దూరం మూడు మార్గాలలో వెళ్లే ఉపరితల (30 అడుగుల ఎత్తులో) రైలుమార్గాలకు, ఎనిమిది వేల కోటు రూపాయలు ఖర్చు చేయనున్నారు. కాని అందులో పదిశాతం ఖర్చుతో బస్సు రవాణానే చాల మెరుగు పరచవచ్చునంటే పై వాళ్లు ఒప్పుకోవడం లేదు. వేల కోట్లు ఖర్చు చేసే మెగా ప్రాజెక్టులపైనే (మెట్రోరైళ్లు, రింగ్ రోడ్లు, విమానాశ్రయాలు, షాపింగ్ మాల్స్ మొదలగువి) నేడు నాయకులు, అధికారుల దృష్టి అంతా. సామాన్యుడి పరిస్థితే దుర్భరం అవుతున్నది. ◆

(5వ పేజీ తరువాయి)

రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులే అమలు జరగడంలేదు. ఒక లోకసభ సభ్యుడిగా, ఒక మంత్రిగా, డిప్యూటి స్పీకర్‌గా పనిచేసిన చంద్రశేఖర గారికి అలాగే తెలంగాణాలో వున్న మేధావులకి, రాజకీయ నాయకులకు తెలియదనుకోవడం సబబుకాదు. తెలుసు, అయినా ప్రజలలో విద్వేషాన్ని రెచ్చగొడుతున్నారు. ఈ రాష్ట్రానికి తెలంగాణాకు చెందిన పి.వి. నరిసింహారావుగారు, జలగం వెంగళరావుగారు, చెన్నారెడ్డి గారు, టంగుటూరి అంజయ్య గారు ముఖ్యమంత్రులుగా వున్నారు. అనేక మంది తెలంగాణ నాయకులు రాష్ట్ర మంత్రులుగా, కేంద్ర మంత్రులుగా పనిచేశారు. పి.వి. నరసింహారావు గారు ఈ దేశ ప్రధానిగా పనిచేశారు. తెలంగాణ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారు. ఇంకా కృషి చేస్తూనే ఉన్నారు. ఈ దేశ ప్రజలకోసం కూడా తెలంగాణ నాయకులు కృషిచేస్తున్నారు.

కొంత మంది కోరుకున్నట్లు తెలంగాణ రాష్ట్రమొస్తే శ్రామికవర్గ దృక్పథముగల మంత్రి వర్గం ఏమీ ఏర్పడదు. సోషలిస్టు వ్యవస్థ ఏమీ రాదు. ఈ దోపిడి పాలనే కొనసాగుతుంది. నిజంగా తెలంగాణాలో సోషలిస్టు పాలనే వస్తుందంటే ఆంధ్ర శ్రామిక వర్గం, ఈ దేశ శ్రామిక వర్గం ప్రపంచ శ్రామిక వర్గం జేజేలు పలుకుతుంది. పండగలు చేసుకుంటుంది. పాఠాలు నేర్చుకుంటుంది. అలా కానప్పుడు ఎందుకు విడిపోవాలి.

ప్రకృతిని మానవుడు సృష్టించలేదు. ప్రకృతి వనరుల వలన ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కోరకంగా అభివృద్ధి జరుగుతుంది. సింగరేణి ప్రాంతంలో బొగ్గువుంటే, కోస్తా జిల్లాల్లో వ్యవసాయం వున్నది. ఇలా ప్రకృతి వనరుల వలన ప్రాంతాలు ఒక్కోరకంగా అభివృద్ధి చెందుతాయి. అభివృద్ధి జరిగిన ప్రాంతాలు, అభివృద్ధి జరగని ప్రాంతాలకు సహాయకారిగా వుండాలి. ఈ రాష్ట్రాన్ని, ఈ దేశాన్ని పరిపాలిస్తున్న పాలకవర్గాలు ఆ బాధ్యత తీసుకోవాలి. అంతేకాని ప్రజల్లో అనుమాన బీజాలు, విద్వేషాలు, భావోద్వేగాలు పెంచటం, రెచ్చగొట్టడం, ఏ మాత్రం సరియైనది కాదు. శ్రమజీవులు ఈ పాలకవర్గాలు సృష్టిస్తున్న భావోద్వేగాలలో పడిపోకూడదు. తెలంగాణ శ్రమజీవులకు, తెలంగాణ పాలకులేమి ఆత్మగౌరవాన్ని అందించలేదు. పాకీపని చేసే పనిమనిషిని, శ్రమజీవులను గౌరవంగా ఏమండి అనిగాని వారి మాండలికంలో ఈ రాజకీయ నాయకులు కాని, పోలీసులు కాని, ఈ భూస్వాములు కాని, పెట్టుబడిదారులు కాని పిలవగలరా. స్వార్థ గౌరవమే తప్ప, ఆత్మ గౌరవం కోసం ఈ పాలకవర్గాలు పోరాటాలు చెయ్యలేరు. ప్రజలని చైతన్యవంతులను చేయలేరు. ఆ పని వర్గదృక్పథం గల కమ్యూనిస్టులే చేయగలరు. ఈ విషయాలన్నిటిని దృష్టిలో వుంచుకొని తెలంగాణ శ్రమజీవులు విడిపోవడం సరికాదని, కలిసే కృషి చేయాలి, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడాలి, ఆంధ్రప్రదేశ్ విడిపోకుండా చేయ్యాలి. విడిపోవడం గొప్పకాదు కలిసి ఉండటమే గొప్ప.

– కాము

గుంటూరు.

వందేమాతరం నినాదం మీద, పాట మీద కుప్పలుగా విశ్లేషణలు, విమర్శలు, భాష్యాలు ఈ రోజుల్లో వెలువడుతున్నాయి. వీటిని, రాసిన వారిలో ఎవరైనా దేశ స్వాతంత్ర్యోద్యమం రోజుల్లో పుట్టి పెరిగారా అన్నది అనుమానమే. వందేమాతరం అని అరిచి నందుకే లాఠీ దెబ్బలు తిని, తలలు బద్దలై, చనిపోయినవారు ఎంత మందో. ఆ అరుపులో, ఆపాట (మొదటి రెండు చరణాల) లో ఆనాటి ప్రభుత్వానికి గాని, బ్రిటిషు వారికి గాని వ్యతిరేకంగా ఒక్క మాట కూడ లేదు. అయినా కూడ, ఆ నాటి పోలీసులు వారి లాఠీలు వాడడానికి ఎటువంటి సందేహం చూపలేదు. అంటే ఆ అరుపు, ఈ పాట రెండింటికి వాటి అర్థం, తాత్పర్యం, సందర్భోచిత వ్యాఖ్యానానికి మించిన ఒక ప్రత్యేకత ఉన్నది. ప్రజలను ఉత్సాహం, ఉద్రేకం, ఉద్వేగపరచడంలో ఈ రెండు ఎంతో తోడ్పడ్డాయి. మేము విద్యార్థులుగా ఉన్న రోజుల్లో (1931-1944) కుల మత భేదాలు పాటించకుండా అందరం వందేమాతరం అని అరిచాం. ఆ పాట పాడాం. ఆ రోజుల్లో మాకు బంకించంద్ర గురించి గాని, ఆనందమఠం గురించిగాని తెలియదు. వాటి మీద విశ్లేషణలు ఇప్పుడు చేయడంలో అర్థం లేదు. రేపెప్పుడయినా ఒక వంద మంది భారతీయులు ఏ విదేశంలోనయినా బందీలవడం జరిగితే తమను తాము ఉత్సాహపరచుకోవడానికి వందేమాతరం అని అరుచుకుంటారనడానికి నాకెటువంటి సందేహం లేదు.

డా. ఎం. కృష్ణమూర్తి

సికిందరాబాద్

చిచ్లం నుంచి సైబరాబాదు దాకా

- ఎన్. వేణుగోపాల్

తెలుగు ప్రజల మహానగరంగా, ఆంధ్రప్రదేశ్ రాజధానిగా, 400 ఏళ్ల చరిత్రగల సంకీర్ణ సంస్కృతుల మిశ్రమ నగరంగా, దేశంలో ఐదో ప్రధాన నగరంగా, ఇటీవల ప్రపంచీకరణ శక్తుల దృష్టిని ఎక్కువగా ఆకర్షిస్తున్న నగరంగా హైదరాబాద్‌కు చాలా ప్రాధాన్యత ఉంది. చరిత్రలో హైదరాబాద్ అనేక మలుపులు తిరిగి అనేక స్వభావాలు సంతరించుకుని ఇవాళ ఉన్న స్థితికి వచ్చి నిలిచింది. 400 సంవత్సరాలకింద పుట్టిన నాడు ఇది కేవలం ఒక సంపన్నమైన రాజ్యపు రాజధాని గోల్కొండకు పొరుగునున్న చిన్న చిన్న, బహుశా ఆదివాసి గ్రామాల సముదాయం మాత్రమే. మహమ్మద్ కులీ కుతుబ్ షా మూసీ నది దాటి వచ్చి భాగమతిని చూసి మనసు పడ్డాడని చెప్పే గాథలో చిచ్లంగా నమోదైన గ్రామం హైదరాబాద్ తొలి పాదు అనుకుంటే, ఆ మాట ఏ చెంచులగూడానికో దక్కనీ, ఉర్దూ రూపమై ఉంటుంది. కొందరు రచయితలు దాన్ని చంచలం అని కూడా పిలిచారు. ఇవాల్టికీ చంచల్‌గూడాగా మిగిలిన ఆనవాలు అదే అయి ఉంటుంది.

ఆ 1580లలోని చిచ్లంనుంచి ఇవాల్టి సైబరాబాద్ దాకా హైదరాబాద్ చేసివచ్చిన ప్రయాణం కాలంలో 400 పైచిలుకు సంవత్సరాలు మాత్రమే కావచ్చు. స్థలంలో కొన్ని వందల ఎకరాలకు మించని గ్రామంనుంచి ఇవాళ 1864 చదరపు కిలోమీటర్ల (నాలుగు లక్షల అరవై వేల ఎకరాల) నగరం కావచ్చు. 'నదిలో చేపలు నింపినట్లుగా, ప్రభూ, నా నగరంలో మనుషుల్ని నింపు' అని స్థాపకుడు మహమ్మద్ కులీ కుతుబ్ షా కోరుకున్నట్లుగా చిచ్లంలో వందల మందికి మించని జనాభా ఇవాళ అరవై ఐదు లక్షలు దాటిపోయి ఉండవచ్చు. ఆయన కవితలో చెప్పిన జీవనది మూసీ ఇప్పుడొక చేపలు బతకజాలని మురికి కాలువ! మరి ఈ అంకెల్లో కనబడుతున్న 'అభివృద్ధి' నిజంగా అభివృద్ధేనా? ఈ నాలుగు శతాబ్దాలలో హైదరాబాద్ మానవ స్వభావంలో, సామూహికతలో, సౌకర్యాలలో, సౌకర్యాల కొరతలో, అంతరాలలో, సంపదలో, పేదరికంలో, అధికారంలో, పీడనలో, అలంకారాలలో, ఆకర్షణలలో, భ్రమలలో సాగిన ప్రయాణం సుదీర్ఘమైనది. ఎంత విస్తృత వివరణలోనైనా సంపూర్ణంగా చెప్పడం సాధ్యం కానిది.

హైదరాబాద్ అంటే ఒక పదహారో శతాబ్దపు కుగ్రామం చిచ్లం కావచ్చు. బందరు ఓడరేవును గోల్కొండతో కలిపే మధ్యయుగాల ప్రధాన రహదారిమీద గొల్కొండ కోటలో ప్రవేశించబోయేముందు విడిదిగా పెరిగిన వ్యాపార స్థలం కావచ్చు. ఒక పేదపిల్లమీద మనసుపడిన యువరాజుకోసం జీవనది మూసీకి అడ్డంగా పురానాపూల్ నిర్మించి ఆ వంతెనచుట్టూ ప్రోత్సహించిన జనావాసం కావచ్చు. ఆ తర్వాత ఒక శతాబ్దానికి పైగా కుతుబ్ షాహీల రాజధానిగా వెలిగి ఉండవచ్చు. కుతుబ్ షాహీల పాలన కూలిపోయిన తర్వాత కొంతకాలం మొఘల్ చక్రవర్తుల గవర్నర్ల రాజధాని కావచ్చు. ఆ తర్వాత స్వాతంత్ర్యం ప్రకటించుకున్న అసఫ్ జాహీల రాజధాని కావచ్చు. ఫ్రెంచి, బ్రిటిష్ పాలకుల కుట్రల లక్ష్యం కావచ్చు. ఆధునికతలోకి ప్రవేశించాలనే కోరిక ఒకవైపు, ఫ్యూడల్ అధికార లాలస మరొకవైపు పోటీపడగా వికసిస్తూనే నలిగిపోయిన పందొమ్మిదో శతాబ్దపు నగరం కావచ్చు. హైదరాబాదు ఈ మూడు శతాబ్దాలలో ఎంత చరిత్రను అనుభవించిందో అంతకన్న ఎక్కువ ఘర్షణనూ, అభివృద్ధినీ, పెనుగులాటనూ ఆ తర్వాత ఒక్క శతాబ్దంలోనే చవిచూసింది. ఒకపక్క ఆధునిక విద్యా, వైద్య ఆరోగ్య, రవాణా, పాలనా పద్ధతులు, కొత్తజీవనశైలులు ప్రవేశించిందీ ఇరవయ్యో శతాబ్దంలోనే. మరొకపక్క జనజీవనం అతలాకుతలమై, అన్ని రంగాలలో అసంతృప్తి పెల్లుబికి రాచరికానికీ, భూస్వామ్యానికీ, నిలువనీటి జీవనశైలికీ, వలసవాదానికీ, బాధ్యతలేనిపాలనకూ వ్యతిరేకంగా నిరసనలూ పోరాటాలూ రగుల్కొన్నదీ ఆ శతాబ్దంలోనే. మట్టిమనుషులు స్వేచ్ఛకోసం లేచినిలిచిన, వీరోచితంగా పోరాడిన శతాబ్దం అది. చివరికి అసఫ్‌జాహీ పాలన కూలిపోయింది. తెలుగు, మరాఠీ, కన్నడ, ఉర్దూ, కాయస్థ, పఠాన్, మొఘల్, తదితర సకలభాషల, జాతుల, వర్ణాల మిశ్రమనగరంగా విలసిల్లిన హైదరాబాదు కేవలం తెలుగువాళ్ల రాజధానిగా మారిపోయింది. ఆ తర్వాత ఐదు దశాబ్దాలలో హైదరాబాదు ఎన్నో గుణాత్మక మార్పులకు వేదిక అయింది. క్రమక్రమంగా పాత హైదరాబాదురాష్ట్రవాసులు పరాయితనం అనుభవించేంతగా హైదరాబాదు పెరిగిపోయింది.

మరీ ముఖ్యంగా నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వం ప్రపంచబ్యాంక్ నిర్దేశిత నూతనఆర్థిక విధానాలను అమలు చేయడం మొదలుపెట్టిన తర్వాత హైదరాబాదు స్వభావం మరింత వేగంగా మారిపోవడం మొదలయింది. ఆ విధానాలనే ప్రస్తుతం డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడ కొనసాగిస్తుండడంతో ప్రపంచీకరణ సుడిగుండంలో హైదరాబాదు ఇంకా లోతుకి జారిపోతోంది. నిజానికి ఈ పరిణామాలకు మూలాలు హైదరాబాదు చరిత్రలోనే ఉన్నాయిగనుక ఆ చరిత్ర లోని ప్రధానాంశాలనయినా అధ్యయనం చేయవలసి ఉంటుంది. ఇక్కడ అంత విస్తృతంగా పరిశీలనకు అవకాశంలేదుగాని భూమి, సంస్కృతి, నగర సౌకర్యాలు అనే మూడు అంశాలను పరిశీలించవచ్చు.

హైదరాబాదు మీద బహుళజాతి సంస్థల, దేశదేశాల పెట్టుబడిదారుల, రియల్ ఎస్టేట్ ఏజెంట్ల దృష్టి పడడానికి ఉన్న ప్రధానకారణాలలో భూమి ఒకటి. హైదరాబాదు ఆంధ్రప్రదేశ్ రాజధానిగా మారేనాటికి ఆ నగరానికి దేశంలో మరేనగరానికీ లేని ఒక ప్రత్యేకత ఉండింది. అది స్వయంగా ప్రభుత్వానికి కొన్నివేల ఎకరాల భూమిమీద యాజమాన్యం ఉండడం. దేశంలోని రాచరిక భూస్వామ్యవ్యవస్థలో మొదటినుంచీ కూడ రాజ్యంలోని మొత్తం భూమిమీద అధికారం రాజుదే అనే భావన ఉందిగాని, హైదరాబాదు

రాజ్యంలో, ముఖ్యంగా అసఫ్‌జాహీ పాలకులకు సొంతఖర్చుల కోసం రాజ్యంలో పదోవంతు భాగం కేటాయించడం జరిగింది. దాన్ని సర్ఫ్-ఎ-ఖాస్ (సొంతనిధి) అనేవాళ్లు. మొత్తం రాజ్యం 2,14,187 చదరపు కిలోమీటర్లు (ఐదు కోట్ల ముప్పై లక్షల ఎకరాలు) కాగా, ఈ సర్ఫ్-ఎ-ఖాస్ 21,000 చదరపు కిలోమీటర్లు (యాభై రెండు లక్షల ఎకరాలు) గా ఉండేది. సర్ఫ్-ఎ-ఖాస్ కింద మొత్తం రాజ్యంలో 1961 గ్రామాలు ఉండేవి. వీటిలోనూ ప్రభుత్వ నిర్వహణలో 698 గ్రామాలు, నిజాం సొంత నిర్వహణలో 1263 గ్రామాలు ఉండేవి. అందులో తెలంగాణలోని 789 గ్రామాల్లో 573 గ్రామాలు అత్రాఫ్ బల్దా జిల్లాలోనే, అంటే ప్రస్తుత హైదరాబాదు, రంగారెడ్డి జిల్లాలలోనే ఉండేవి. అంటే ఇవాళ్టి హైదరాబాదులో భాగమైపోయిన భూమిలో అతి ఎక్కువభాగం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ సొంత ఆస్తి అన్నమాట. ఆ ఆస్తి మీద ఆయన అధికారం రద్దయిన తర్వాత అది చెల్లాచెదురు అయిపోయింది. పేరుకు మొదట హైదరాబాదు ప్రభుత్వానికీ, 1956 తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికీ చేజిక్కింది గాని ప్రభుత్వపు సొమ్ముగా అది అంగబలం, అర్థబలం, అధికారం ఉన్న వాళ్లందరి ఉమ్మడి ఆస్తి అయిపోయింది.

స్వయంగా రాజుకు ఉండిన ఈ సొంత ఆస్తితో పాటు, నిజాం రాజ్యంలో ప్రభువర్గంలో భాగమైనవారికి పాయెగాలు, ఉమ్రాలు, జాగీర్లు, సంస్థానాలు, ఎస్టేట్లు, ఇనాంలు మొదలయిన పేర్లతో రాజ్యంలో మూడోవంతు భూమి మీద అధికారం ఉండేది. అందులో గణనీయమైన భాగం హైదరాబాదు నగరంలోనూ, పరిసర గ్రామాలలోనూ ఉండేది. 1948 సెప్టెంబర్ 18 తర్వాత నిజాం ప్రభువుకూ, ఆయన ఆశ్రితులకూ భూమి మీద ఉండిన ఆ అధికారానికి గండి పడింది.

ఫిబ్రవరి 22, 1949న జారీ అయిన ఒక ఫర్మాన్ ద్వారా సర్ఫెఖాస్ భూములను నిజాం అధీనం నుంచి హైదరాబాదు ప్రభుత్వానికి బదలాయించారు. అప్పుడు ఆ ఆస్తుల విలువ రెండున్నర కోట్ల నుంచి మూడు కోట్ల రూపాయల మధ్య ఉంటుందని అంచనా వేశారు. కొందరు హిందూ జాగీర్దార్లు రూమీ టోపీలు తీసేసి ఖద్దరు టోపీలు పెట్టుకుని గ్రామాలకు తిరిగి వెళ్లగలిగారు గాని, హైదరాబాదులో ఆస్తి ఉండిన కొందరు ముస్లిం జాగీర్దార్లు దేశం వదిలి పాకిస్తాన్ వెళ్లిపోయారు. వారి స్థిరాస్తులు లావారిస్ (వారసులు లేని) ఆస్తిగా మిగిలిపోయాయి. ది హైదరాబాద్ (అబాలిషన్ ఆఫ్ జాగీర్స్) రెగ్యులేషన్ 1356 ఫస్లీ అనే చట్టం ద్వారా 1949 ఆగస్టులో హైదరాబాదు రాజ్యంలో అప్పటికి ఉండిన 967 జాగీర్ల అధీనంలోని, 6,536 గ్రామాలలోని 25,600 చదరపు మైళ్ల (ఒక కోటీ అరవైనాలుగు లక్షల ఎకరాల) భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఆ భూమికి ఆయా జాగీర్దార్లనూ, సర్ఫెఖాస్ భూమికి ఏడవ నిజాంనూ యజమానులుగా గుర్తించి వారికి నష్టపరిహారం చెల్లించడం జరిగింది గాని అది సరయినదా కాదా అనే చర్చను అలా ఉంచి, ఇక్కడ గుర్తించవలసిన విషయం, ఆంధ్రప్రదేశ్ ఏర్పడేనాటికి, ఆ రాష్ట్ర రాజధానిలోనూ, దాని చుట్టుపట్లా ప్రభుత్వానికి సొంత ఆస్తిగా వేలాది ఎకరాల భూమి సమకూరిందనేది.

ఆ భూమిలో ప్రభుత్వం తన అవసరాలకోసం, ప్రజా ప్రయోజనాలకోసం ఉపయోగించినంత ఉపయోగించగా కూడ మరికొన్ని వేల ఎకరాల భూమి మిగిలి ఉండిపోయింది. అటువంటి భూమికి లెక్కాపత్రం లేకుండాపోయింది. ప్రభుత్వ అధికారులు, వారితో మిలాఖతయిన రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు తమ పారిశ్రామిక, వ్యాపార, సేవా సంస్థలకోసం వందల ఎకరాల భూమిని ప్రభుత్వం నుంచి లీజుకు తీసుకోవడం మొదలుపెట్టారు. ఈ లీజులు పేరుకు 24 ఏళ్లు, 49 ఏళ్లు, 99 ఏళ్లు అని ఏదో ఒక కాలవ్యవధి ఉండేదిగాని, అవి ఆయా సంస్థలకు, వ్యక్తులకు సొంతమైపోతాయని ఇచ్చేవాళ్లకూ, తీసుకునేవాళ్లకూ కూడ తెలుసు. మరొక పరిణామంగా, 1960లలో, 1970లలో ఎన్నో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, సంయుక్త రంగసంస్థలు, విద్యా, పరిశోధనాసంస్థలు, ప్రభుత్వ శాఖలు హైదరాబాదుకు తరలివచ్చి వేలాది ఎకరాల భూమిని ఆక్రమించుకున్నాయి. 1990లు వచ్చేసరికి ఈ పారిశ్రామిక, వ్యాపార సంస్థలలో కొన్ని మూతబడడమో, ప్రభుత్వవాటా అమ్మివేయడమో జరిగి, ఆ భూమి అన్యాక్రాంతం కావడం మొదలయింది. మొత్తంగా హైదరాబాదు వేలాది ఎకరాలభూమి తేరగా అన్యాక్రాంతం కావడానికి సిద్ధంగా ఉన్న నగరంగా మారిపోయింది.

ఆ స్థితిలో చంద్రబాబునాయుడు పాలన వచ్చేసరికి, లీజు అనే నామమాత్రపు ముసుగు కూడ తొలగిపోయి, ఆ భూమిని బహుళజాతి సంస్థలకు, పెట్టుబడిదారులకు ఉచితంగానో, అతిస్వల్పమైన ఖరీదుకో ఇవ్వడం మొదలయింది. అప్పటికి ప్రపంచీకరణ విధానాలలో భాగంగా, దేశాభివృద్ధి కొరకు, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం కొరకు పెట్టుబడిదారులకు రాయితీలు ఇవ్వడంలో తప్పులేదనీ, అవసరమేననీ మధ్యతరగతి మేధావులు, ప్రచారసాధనాలు నమ్మడం మొదలయింది. అందులోనూ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంస్థలు బెంగళూరు, బొంబాయి, నోయిడా, మద్రాసుల తర్వాత చౌకగా భూమి దొరికేచోటుగా, చౌకగా మానవవనరులు దొరికేచోటుగా హైదరాబాదును గుర్తించి హైదరాబాదు వైపు చూడడం, అమెరికాకు వెళ్లి స్థిరపడిన కోస్తా జిల్లాల ప్రవాసాంధ్రులు, హైదరాబాదులో తమ ఆస్తులు పెంచుకోవాలని అనుకోవడం, చంద్రబాబునాయుడు ప్రభుత్వం ఉచితంగానో, తక్కువధరలకో భూమిని కట్టబెట్టడం అనే మూడు పరిణామాలు ఒకేసారి జమిలిగా సాగి హైదరాబాదు అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ చిత్రపటం మీద ప్రాముఖ్యతను సంతరించుకుంది.

చంద్రబాబునాయుడు ప్రకటించిన, ఇప్పటికీ అమలులో ఉన్న, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ విధానం 2002 – 07 ప్రకారం, ఒక ఐటి పారిశ్రామిక సంస్థకు ప్రతి 333 ఉద్యోగాలకూ ఒక ఎకరం భూమి ఇస్తామని ప్రకటించారు. నిజానికి, అంతకుముందు, ఇటువంటి నిబంధన ఏదీ అమలులో లేకముందు, ఒక్కొక్క బహుళజాతి సంస్థకు, అమెరికాలో ఒక చిన్న గదిలోనో, కారు గారేజిలోనో నడుస్తూ, హైదరాబాదులో 'డెవలప్‌మెంట్ సెంటర్' పెడతామని అన్న ప్రతి వారికి డజన్ల కొద్దీ, వందల కొద్దీ ఎకరాల భూమి కట్టబెట్టారు. నిజానికి అంతర్జాతీయంగా ఉన్న సంప్రదాయం ప్రకారం ఒక ఐటి ఉద్యోగికి 100 చదరపు అడుగుల నిర్మిత స్థలం కావాలంటారు. ఆ లెక్కన చూస్తే 100 మంది ఉద్యోగులకు 0.30 ఎకరాలు(13,063 చదరపు అడుగులు) ఇవ్వడం ఒక అంతస్తు మాత్రమే నిర్మించినా చాల ఎక్కువ. ఐటి సంస్థలు సాధారణంగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తాయని అందరికీ

తెలుసు. అలా ప్రభుత్వం నుంచి ఉచితంగానో, చౌకగానో సంపాదించిన అవసరమయిన దానికన్న చాల ఎక్కువ పరిణామంలో భూములన్నీ ఇప్పుడు రియల్ ఎస్టేట్‌గా మారిపోయాయి. ఒకవైపు రాష్ట్ర ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధి కోసం అవసరమనే పేరుతో ఐటి సంస్థలకు విద్యా, పరిశోధనా సంస్థలకు భూమి ఇవ్వడంతో పాటు మరోవైపు మత ధార్మిక సంస్థలకు, క్రీడాకారులకు, కళాకారులకు, న్యాయమూర్తులకు, శాసనసభ్యులకు, పాత్రికేయులకు, ప్రభుత్వోద్యోగులకు ప్రభుత్వం వందలాది ఎకరాల భూమిని ఇచ్చింది. ఈ క్రమం కొనసాగి నగరం చుట్టూ ఉన్న గ్రామాలలో చిన్న రైతుల పట్టాభూములను కూడ ప్రభుత్వమే సేకరించి బహుళజాతి సంస్థలకు ఇవ్వడం మొదలుపెట్టింది. ఈ పరిణామాలతో నగరంలో డజన్లకొద్దీ రియల్ ఎస్టేట్ సంస్థలు పుట్టుకొచ్చి హిరణ్యాక్షులలాగ వందలాది ఎకరాల భూమిని ఆక్రమించడం మొదలుపెట్టాయి. పాత జాగీర్దార్ల నుంచి బదలాయింపులలో కచ్చితమైన సమాచారం ఎక్కడా లేకపోవడంతో హైదరాబాదులో భూమి క్రయవిక్రయాలంటే వివాదాస్పద కోర్టుకేసులకు పర్యాయ పదాలయిపోయాయి. కోర్టుబయట పంచాయితీల పరిష్కారం కోసం వెంపరలాట పెరిగిపోయి హైదరాబాదులో భూ వివాదాలు, సెటిల్మెంట్ల మాఫియా భయంగొలిపే స్థాయికి పెరిగిపోయింది.

ఈ పరిణామానికి చాల దుష్ఫలితాలున్నాయి. అవి - హైదరాబాదులో నివాస భూముల ధరలు డాలర్ - రూపాయి మారకపు రేట్లతో పాటుగా విపరీతంగా పెరిగిపోవడం, నగరంలోని ఖాళీ, అనుపస్థిత స్థలాలన్నీ దురాక్రమణలకు గురికావడం, భూమి క్రయవిక్రయాలలో నేరం, మోసం పెరిగిపోవడం, పేద, మధ్యతరగతి వర్గాలకు భూమి అందుబాటులో లేకుండాపోవడం. నగరం పొలిమేరల్లోని ఆదివాసులు, చిన్న రైతులు, వృత్తిదారులు, ముఖ్యంగా పశువుల పెంపకం, నిర్మాణపనులు వంటి వృత్తులలో ఉన్నవారు చితికిపోయి, తమ భూములను మధ్య దళారీలకు అమ్ముకుని కూలీలుగా మారిపోవడం, నగరపు జీవనవిధానంలో అనూహ్యమైన, అర్థంకాని మార్పులు వచ్చి, తరతరాలుగా నగరంలో నివసిస్తున్న వారికి నగరం పరాయిదిగా మారిపోవడం, అందువల్ల అసహనం, కోపం పెరిగి నగరంలో హింసా దౌర్జన్యాలు పెరిగిపోవడం - వంటి ఎన్నో వ్యక్తీకరణలు పొందుతున్నాయి.

నగరంలో ప్రధానంగా భూమి పరాయీకరణ వల్ల జరిగిన ఈ దుష్ఫలితాలవల్ల నగర సంస్కృతి విధ్వంసమైపోతోంది. ముందే చెప్పుకున్నట్టు హైదరాబాదు ఒక ముస్లిం యువరాజుకూ, ఒక పేద నాట్యకత్తెకూ మధ్య ప్రేమతో పుట్టింది. ఆ యువరాజు తండ్రి ముస్లిం అయి ఉండికూడ మల్కిభరాముడు అని హిందూకవుల చేత ప్రశంసలందుకున్నవాడు. అటువంటి నైసర్గిక మానవసంబంధాల మీద వికసించిన ఈ నగరం, మర్యాద, మన్నన, స్నేహం, సానుభూతి వంటి స్వభావాలను తన తెహజీబ్ గా చెప్పుకున్నది. ఆ తెహజీబ్ క్రమక్రమంగా ధ్వంసమవుతూ వచ్చి చివరికి మానవ సంబంధాల స్పర్శే లేని అమ్మకం - కొనుగోలు సంబంధాల విపణిగా మారిపోయింది. ఇవాళ సైబరాబాదులో ఎంత ఎక్కువ సంపాదించగలవు, ఎన్ని విదేశీ సంస్థలతో సంబంధాలు పెట్టుకోగలవు, ఒక చదరపు గజం నేలకు ఎన్ని లక్షల రూపాయల పాటపాడి కొనగలవు, ఎన్ని వందల ఎకరాలు ఆక్రమించగలవు, ఎన్ని లక్షల, కోట్ల రూపాయల ఆస్తులు, భవనాలు, కార్లు సొంతం చేసుకోగలవు, ఒక్కరోజులో ఎన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేయగలవు, ప్రజోపయోగ కార్యక్రమాలలో కూడ ఎన్ని అక్రమాలకు పాల్పడగలవు, ఎంత హింసను, దౌర్జన్యాన్ని అవలీలగా చేయగలవు అనేవే ఒక వ్యక్తి సమర్థతకు గీటురాయిగా నిలిచే ప్రశ్నలయిపోయాయి.

సంస్కృతి విషయంలో హైదరాబాదు సాధించిన జయాపజయాలను ఈ దృష్టితో అంచనా వేయవలసి ఉండగా, నగర సౌకర్యాల విషయంలో చిచ్లం నుంచి సైబరాబాదు ప్రయాణంలో మిరుమిట్లుగొలిపే వెలుగులూ ఉన్నాయి. కన్నుపొడుచుకున్నా కానరాని చీకట్లూ ఉన్నాయి. జనాభా పెరిగింది. వైశాల్యం పెరిగింది. రహదార్ల నిడివి పెరిగింది. రవాణా సౌకర్యాలు పెరిగాయి. నివాసగృహాలు పెరిగాయి. తాగునీరు, పారిశుధ్యం, విద్యుచ్ఛక్తి, టెలిఫోన్, ఇంటర్నెట్ వంటి ఆధునిక సౌకర్యాలు పెరిగాయి. విద్యా వైద్య అవకాశాలు పెరిగాయి. వినోద సౌకర్యాలు పెరిగాయి. కాని ఇవాల్టికీ నగర జనాభాలో కనీసం ఐదోవంతు మురికి వాడల్లో నివసిస్తున్నారు. సగానికి పైగా జనాభాకు సరైన నివాస సౌకర్యం లేదు. నగర వైశాల్యం పెరిగింది గాని నాగరికుల హృదయ వైశ్యాలంలో ఆ పెరుగుదల కనబడడంలేదు. ప్రధాన రహదారులు అద్దాలలాగయ్యాయి గాని అవి దిగి పక్కసందులోకి తిరిగితే మురికి కూపాలే ఉన్నాయి. ప్రైవేటు వాహనాలు పెరిగి రహదారులు ఇరుకయ్యాయి. పబ్లిక్ వాహనాలు తగినన్ని లేవు. ఆధునిక సౌకర్యాలు నగర జనాభాలో సగానికయినా సరిపోయినంత లేవు. విద్య, వైద్యం, వినోదం అత్యల్ప సంఖ్యాకులు గుత్తసొమ్ము అయిపోయింది.

ఇది అభివృద్ధా, పతనమా? నాలుగువందల సంవత్సరాల ప్రయాణంలో చిచ్లం నుంచి సైబరాబాదు దాకా హైదరాబాదు ముందుకు పయనించిందా, వెనక్కి పయనించిందా?

(హైదరాబాదు చరిత్రపై రాస్తున్న పుస్తకం నుంచి ఒక భాగం) ◆

వచ్చే సంచికలో...

- ★ ఫోకస్ - ప్రత్యేక ఆర్థిక మండలులు (స్పెషల్ ఎకనామిక్ జోన్స్)
- ★ అఫ్జల్ మరణశిక్ష న్యాయాన్యాయాలు - కె. బాలగోపాల్
- ★ ఐదేళ్ల డిగ్రీ కోర్సు ఎవరికోసం - స్ఫూర్తి
- ★ సంస్కరణలకు బాబు కిటికీ మాత్రమే తెరిచాడా? - వి. చలపతిరావు
- ★ తెలంగాణ చరిత్రంతా ప్రజా పోరాటాల చరిత్రే - చిక్కుడు ప్రభాకర్
- ★ చేనేత సంక్షోభానికి కారణమైన జౌళి విధానాలు - పులుగుజ్జు సురేష్

భీంగల్ డిపో సాధించుకున్న మహిళా లోకం

- తుర్లపాటి లక్ష్మి, ఎనిశెట్టి శంకర్

'ఆడవాళ్లు వీళ్లు ఏం చేస్తారులే - ఏ పార్టీలూ, మగవాళ్లు కలిసినా సాధించలేని ఈ మహాకార్యాన్ని, ఇంటికే పరిమితమైన ఆడోళ్లు ఏం చేయగలరులే?' అన్న మాటలకు, అనుమానాలకు తెరదించారు.

నిజామాబాద్ జిల్లాలోని భీంగల్ బస్సుడిపో - కష్టాల్లో నడుస్తుందని ఎత్తేసినా భీంగల్, ఆ చుట్టు ప్రక్కల గ్రామాల్లోని మహిళలందరూ కలిసి ఏకగ్రీవంగా సాధించుకున్నారు. నాలుగు రోజులు నిరంతర ఉద్యమం ద్వారా సాధించుకున్నారు. వాళ్ల విజయోత్సానికి తిరుగులేదు. ఇప్పుడు ఏదైనా సాధించుకోగలమనే ధీమా, విశ్వాసం వారిలో గూడు కట్టుకుంది.

డిసెంబర్ 1994 లో నిజామాబాద్ కేంద్రానికి అరవై కిలోమీటర్ల దూరాన, మండల కేంద్రమైన భీంగల్‌కు నాటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి చేతుల మీదుగా డిపో మంజూరయింది. వేల్పూర్, సిరికొండ, ఆర్మూర్ మండలాలతో బాటు కరీంనగర్ జిల్లాలోని కోరుట్ల, మెట్‌పల్లిలకు ఈ డిపో ద్వారా సౌకర్యాలు మెరుగుపడ్డాయి. పది బస్సులతో ప్రారంభమై నలభై మూడు బస్సులతో సేవలందిస్తున్న ఈ డిపోకు అన్ని చోట్లా వుండే సమస్యలే ప్రధాన అడ్డంకి.

భీంగల్ మండల కేంద్రంలో లెక్కకు మించిన ఆటోలు, జీపులుండడం. దానితో డిపోకు రావలసిన ఆదాయానికి గండి పడుతోంది. ఆగస్టు 2005 వరకు నలభై తొమ్మిది లక్షలు నష్టంగా వుంటే ఈ ఆర్థిక సంవత్సరానికి మరో 19 లక్షల నష్టమని అంచనా.

ఇలా నష్టాలబాట నడుస్తున్నామని చెప్పే కార్పోరేషన్ వారు (అంటే ప్రభుత్వం) రాష్ట్రంలోని ఇరవై రెండు డిపోలను ఎత్తి వేయాలని నిర్ణయించిన నేపథ్యంలో భీంగల్ డిపోను ఎత్తి వేయకుండా ఆపుకోవాలని కొందరికి ఆలోచన రావడం, దానికి అన్ని పార్టీలు విడివిడిగా రకరకాల ఉద్యమాలునడిపారు.కాని కార్పోరేషన్ ససేమిరా వినే అవకాశన్నివ్వలేదు. ఆరిపోతున్న దీపానికి నూనె పోసినట్లు నడుం బిగించి ఉద్యమాన్ని నడిప అందరి ఊహలను, అంచనాలను తారుమారు చేసినది ఒక మహిళ. ఆమె ముప్పై ఏండ్ల వయసున్న భద్రి జలజ, స్థానిక డ్వాక్రా మహిళల నాయకురాలు.

ఇందిరా క్రాంతి పథం మీటింగ్ జరుగుతుండగా ఎదుమాల కమల అనే మహిళ 'మనం పొదుపు చేసుకుంటున్నాం. తినడానికి అన్నం దొరుకుతుంది. ఇగ మనమేం పట్టించుకోవద్దా? భీంగల్ డిపో నష్టాల్లో నడుస్తోందని వెళ్లిపోయింది. మనం ఏమీ చేయలేమా?' అని ప్రశ్నించింది. ఆ ప్రశ్న విన్న అధికారులు 'మనమేం చేయలేం. ప్రభుత్వమే తీసికెళ్లింది' అని సమాధానం చెప్పారు. అన్ని పార్టీల వాళ్లు, అందరూ ఉద్యమాలు చేసి ఆశకు నీళ్లొదిలిన పిదప జలజకు ఆలోచన రావడం, తక్షణమే ఆచరణకు దిగింది. మరునాడే సుమారు నలభై మందిని కలిస్తే ఓ ముగ్గురు తప్ప అందరూ ఆమెకు నెగెటివ్ జవాబు ఇచ్చారు. కొంతమంది అవమానపరిచారు. మరికొంతమంది 'రిస్కు' తీసుకోవడమెందుకులే అంటే, కొందరు 'చూద్దాంలే' అన్నారు.

చివరికి సి.ఐ.ను కలువడం జరిగింది. అతను 'చూడమ్మా వినాయక నిమజ్జనానికి బందోబస్తుకు, కరెంటు ధర్నాల వద్దకు పోలీసులందర్నీ పంపాం. కేవలం ఒక గంట మాత్రం 'ధర్నా' కు పర్మిషనిస్తాను, ఆ తర్వాత ధర్నా శిబిరాన్ని ఖాళీ చేయాలి' అని ఆర్డరు ఇచ్చాడు. సరేలే అనుకొని ఎం.ఆర్.ఓ. గారికి, సి.ఐ. గారికి మరుసటి రోజు నాలుగు వందల మంది మహిళలతో ధర్నా అని లెటర్ ఇవ్వడం జరిగింది.

ధర్నాకు ప్రజలు, వ్యాపారస్తులు, భీంగల్ గ్రామ కమిటీ సభ్యులు స్వచ్ఛందంగా బంద్ పాటించి మద్దతు ఇవ్వాలని కోరగా అందరూ ఒప్పుకున్నారు. భీంగల్ చరిత్రలో మరువరానిది, సెప్టెంబర్ 4న సంత కూడా బంద్ పెట్టి జలజ సారథ్యాన జరిగిన ధర్నాకు మద్దతు పలికారు.

ధర్నా దృష్ట్యా ఆర్మూర్ డిపో బస్సులను భీంగల్ నుండి రెండు కిలోమీటర్ల దూరాన వున్న బడా భీంగల్ వరకు నడపడంతో మహిళలందరూ వెళ్లి అక్కడ వున్న బస్సుల టైర్లన్నింటిలో గాలి తీసేశారు. ఒక బస్సును దారి మళ్లించి భీంగల్‌కు పంపించారు.

పదకొండు గంటలకు ధర్నా ప్రారంభిస్తే నాలుగు వందల మంది మహిళలనుకుంటే, ఎనిమిది వందల మంది వరకు వచ్చారు. ఎంతమంది మహిళలున్నారో అంతమంది మగవారున్నారు.'అన్ని పార్టీలు ధర్నా చేశాయి. అయినా డిపో తరలిపోయింది. ప్రస్తుతం మహిళలే చొరవతో ధర్నా చేస్తున్నారు. అందరం స్పందించాలి' అంటూ గల్లీ గల్లీలో ఒకే ప్రచారం.

భద్రిజలజ 'డిపో మనకు దక్కేవరకు నేను నిరాహార దీక్ష చేస్తాను' అని చెప్పింది. ధర్నా శిబిరం రోజురోజుకూ ఉద్రిక్తంగా మారుతోంది. 5వ తేది నాడు స్వచ్ఛందంగా 'బంద్' పాటించారు. ట్రాక్టర్లలో చుట్టూ పది పన్నెండు గ్రామాల ప్రజలు ధర్నాకు మద్దతుగా వచ్చారు. మహిళలు గుంపులు గుంపులుగా వెళ్లి ప్రభుత్వ కార్యాలయాలకు తాళాలు వేయించారు.

వ్యాపారస్తులు 'భీంగల్‌కు బస్సు (డిపో) వచ్చినాకే మీరు లేవండి. మీరు లేచాకే మేం షాపులు తెరుస్తాం' అని హామీ యిచ్చారు. అంతవరకూ దూరదూరంగా వున్నవారందరూ శిబిరానికి రావడం మొదలైంది. జిల్లా కేంద్రంలో అలజడి మొదలైంది. శిబిరంలో మాత్రం ఒకటే మాట - మాకు డిపో కావాలి డి.ఎం. గాని, కలెక్టర్ గాని శిబిరానికి రావాలి, అందరి ముందూ ప్రకటన చేయాలి.

శిబిరం రోజురోజుకూ ఉద్రిక్తంగా మారుతోంది. జలజ బలహీనమైపోయింది. జిల్లా కేంద్రం నుండి డాక్టర్లు వచ్చి రోడ్డుమీదే పరీక్షలు నిర్వహించడంతో ప్రజల్లో ఇంకా ఇంకా పట్టుదల, దృఢ సంకల్పం పెరగడం జరిగింది. అదే రోజు రాత్రి పోలీసులు వచ్చి జలజను అరెస్ట్ చేయబూనుకుంటే నలభై మంది మహిళలు, ఇరవై

ప్రజలు పాల్గొనని ప్రత్యేక తెలంగాణ ఉద్యమం

– వి. హనుమంతరావు

ఆంధ్రప్రదేశ్ 50వ పడిలో ప్రవేశిస్తున్న సందర్భంలో వీక్షణం పత్రిక గత నవంబర్ నెలలో ఒక ప్రత్యేక సంచిక ప్రచురించిన తర్వాత గత సంవత్సర కాలంలో మిన్ను విరిగి మీద పడేటంత పరిణామాలేమీ లేవు. కేంద్రం నుంచి ముఖ్యమంత్రికి ఘనంగా కితాబులు, వాటితో పాటు నిధులు, వాగ్దానాలు ఘనంగానే ముట్టాయి. మావోయిస్టు ఉద్యమాన్ని అణిచివేసిన ముఖ్యమంత్రిగా కేంద్రం నుంచి మరో కితాబు లభించింది. ఉద్యమాలన్నీ గతుకుల రోడ్ల మీదే నడుస్తుంటాయి. ఎక్స్‌ప్రెస్ హైవేల మీద పరుగులెత్తవు. మావోయిస్టు ఉద్యమమూ అంతే. 1969లో ప్రత్యేక తెలంగాణా ఉద్యమం ఉధృతంగా నడిచింది గాని నాయకత్వానికి నాలుగు రొట్టెముక్కలు విసిరేయటంతో చల్లారింది. 1972లో ఆంధ్రోద్యమం కొన్నాళ్లు చిందులు తొక్కి ఆ తర్వాత ఆవిరైపోయింది. మంత్రివర్గ స్థానం దక్కలేదని అలిగి తెలుగుదేశం నుంచి బయటకు వెళ్లిన చంద్రశేఖర రావు రెండేళ్లపాటు లెఫ్ట్‌రైట్ కొట్టి ఇప్పుడు మార్చ్ అంటున్నారు. ఇలా ఉద్యమాలు అటుపోట్లకు గురవుతుంటాయి. మావోయిస్టు ఉద్యమం అందుకు మినహాయింపు ఏమీకాదు. ఈ ఉద్యమం ఈ సంవత్సరంలో తగ్గు ముఖం పట్టిందని అనుకొనేసరికి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మళ్లా తెరమీదకు వచ్చింది.

తెలంగాణ వస్తే, అధికార పదవులు దొరుకుతాయేమోనని ఆశించే రాజకీయ నాయకులు, తెలంగాణాలోని కొంత మంది మేధావులు పత్రికల్లో చేసే హడావుడి తప్ప, ఏ ఉద్యమానికైనా పునాదిగా వుండే సామాన్య ప్రజల్లో కదలిక కనపడటం లేదు. సరిగ్గా ఈ సమయంలో పార్లమెంట్ ఉపఎన్నిక రావటం, అలాగే రింగ్ రోడ్డు ఉద్యమంతో దృష్టి అంతా ఎన్నికలకు మరలింది. ప్రజలను సమీకరించాలనే ప్రయత్నానికి బ్రేక్ పడింది. 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ప్రభావంతో ఆ తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ 14 సీట్లకు గాను 10 సీట్లు సాధించుకోగలిగింది. కాని, ఇప్పుడు మునిసిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో తెరాస అట్టడుగు స్థాయిలో, ప్రజల్లో పలుకుబడిలేదని స్పష్టమైంది. సెంటిమెంట్ బలంగా వుందంటారు గాని, సెంటిమెంట్ ఆధారంగా ఏదో సాధించేస్తామని కలలు కనే మేధావులనేమనాలి? 'రెండు రోజుల అమరణ నిరాహార దీక్ష' చేసే నాయకుల మీద తమకు విశ్వాసం లేదని ప్రజలు తమ అభిప్రాయాన్ని విస్పష్టంగా ప్రకటించారు.

ఇదిలా వుండగా రాష్ట్రప్రభుత్వం తన తంటాలేవో తను పడుతోంది. నీటి పారుదల పథకాలు, రింగ్ రోడ్, విశ్వవిద్యాలయాల ఏర్పాటులాంటి అభివృద్ధి పథకాలతో ఈ ప్రాంతాన్ని వెనుకబాటుతనాన్నుంచి బయట పడవేయడానికి ప్రయత్నిస్తుంది. ఇలాంటి పథకాల అమలులో అవకతవకలు, ఇచ్చి పుచ్చుకోవటాలు అవినీతి, అక్రమాలు రాత్రికిరాత్రే మార్పులు, చేర్పులు షరా మామూలే. కాంగ్రెస్ కానివ్వండి, టిడిపి కానివ్వండి, అవి పరిపాలనా వ్యవస్థలో అంతర్భాగమైపోయాయి. ఇరువురూ ఒకరినొకరిని త్వంశుంత అంటే త్వంశుంత అని ఎత్తిపొడుపులు చేసుకోనక్కర్లేదు. అత్యంత వివాదాస్పదంగా మారిన రింగ్‌రోడ్ పథకం గురించి కూడా అసలా రహదారి, అంత వెడల్పయిన, అంత దూరం రహదారి అవసరమా, కాదాలాంటి ప్రాథమిక విషయాల గురించి ఎవరూ చర్చించక పోవటం విశేషం. అవునుమరి, ఈ రింగ్‌రోడ్ పథకం చంద్రబాబు హయాంలోనే రూపుదిద్దుకొంది. అయన పరిపాలనలో కొనసాగి వుంటే, అయన పార్టీ వారు సొమ్ము చేసుకొని వుండేవారు కాదా? ఆ ఛాన్స్ పోయిందనే అక్కసుతోనే కాంగ్రెస్ పార్టీ మీద దుమ్మెత్తి పోస్తున్నారని వ్యాఖ్యానించుకోవచ్చు కదా.

సారీ, బండి దారి తప్పినట్లుంది. అభివృద్ధి కార్యక్రమాలు ఎంతోకొంత విజయాన్ని సాధిస్తే, అది రాజశేఖర రెడ్డి ఖాతాలో జమ అయిపోతుందేమోనని తెలంగాణా మేధావులు ముందరి కాళ్లకు బంధాలు వేయటం ప్రారంభించారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ లక్ష్యం అభివృద్ధి కోసం కాదట! అంకెల్లో అభివృద్ధి చూపించి, తెలంగాణను, ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందట! తెలంగాణ కేవలం అభివృద్ధితో ముడిపడిన అంశం మాత్రమే కాదట! తెలంగాణ

మంది పురుషులు అడ్డం పడి మహిళా పోలీసులు రావాలని పట్టుబట్టి వారిని వెనక్కు పంపించారు.

భీంగల్‌లోని పాఠశాలలోని వందలాది మంది విద్యార్థినీ విద్యార్థులు 'ధర్నా'కు మద్దతు పలుకుతూ భీంగల్ లో ఒక్కొక్కరి చేతులు బట్టుకొని చుట్టూ నిలబడి మిన్ను ముట్టేట్లు నినాదాలు చేశారు. చిన్నలు, పెద్దలు అందరి నోటా ఒకటే మాట - మాకు బస్ డిపో కావాలి. అదే సమయానికి డి.ఎం. వచ్చారు. సుమారు పదివేలమంది దాకా శిబిరం చుట్టుముట్టారు. ప్రజల ప్రగాఢ ఆకాంక్ష, వారి మొక్కవోని ధైర్యం, త్యాగం, ఐకమత్యం ముందు అనివార్యంగా డిపో రప్పిస్తానని ప్రకటించారు.

అనివార్యంగా అందరిముందూ కాగితం మీద రాసి సంతకం పెడ్తున్న ఆ దృశ్యాన్ని వీడియోలు బంధించగా, డి.ఎం. ప్రకటనను అక్కడే వున్న వందలాది మంది సెల్‌ఫోన్లో రికార్డు చేశారు. మహిళల ఐకమత్యంతో, జలజ మొక్కవోని ధైర్యంతో డిపో మళ్లీ వచ్చింది అని అన్ని పేపర్లలో, మీడియాలో ప్రచారం జరిగింది.

ఈ రిపోర్టు రాసేప్పటికి సుమారు 20 బస్సులు డిపో నుండి నడుస్తున్నాయి. గ్రామ కమిటీ ఆధ్వర్యాన ఆటోలు వాటి వాటి స్టాండ్లలో మాత్రమే వుండాలని పహారా కాస్తున్నారు. ప్రజా సంక్షేమం కోసం పని చేస్తున్నామని చెప్పే కుటిల ప్రకటనలకు భీంగల్ మహిళా ఉద్యమం చెక్ పెట్టినట్లయింది. ◆

స్వయంపాలన వనరులపై అధిపత్యాన్ని కోరుతున్నదట! ఓ సిద్ధిపేట శంఖారావం విజయవంతమైతేనే ఇంత ఉద్రేకమా? ఆ లెక్కన అలాంటి సభలు ఓ నాలుగో, పదో జరిపితే తెలంగాణ వచ్చేస్తుందా? అయినా ఈ వాదనలు విడ్డూరంగా వున్నాయి. తెలంగాణ వేరే రాష్ట్రం కావాలనే డిమాండే తెలంగాణ ప్రాంతం అన్ని రంగాల్లో వెనుకబడివుందని, తెలంగాణ ప్రాంతం వివక్షకు గురవుతుందని, కేటాయించిన నిధులు ఖర్చు చేయటం లేదని, ఆంధ్ర ప్రాంతంలో అంత జరిగితే, తెలంగాణలో ఇంతే జరిగిందనే కదా. ఈ కారణం చూపించే కదా, ఢిల్లీలో తెరాస పైరవీ చేసి వివిధ ప్రాంతీయ పార్టీల మద్దతును సంపాదించానని చెబుతూ వచ్చింది? మరి ఇప్పుడిదేమిటి తెలంగాణ లక్ష్యం అభివృద్ధి మాత్రమే కాదంటారేమిటి? రేపు తెలంగాణ రాష్ట్రమే ఏర్పాటైతే, ప్రభుత్వంలో కూర్చొని ఏం చేస్తారట? నీటి పారుదల మీద శ్రద్ధ చూపించరా? అలా చూపిస్తే జరిగేది మరిన్ని లక్షల ఎకరాలకు నీరుపారుతుంది. తెలంగాణలో పచ్చదనం వెల్లివిరుస్తుంది. గ్రామాలు కళకళలాడుతాయి. అదంతా అభివృద్ధి కాదా? మరి అభివృద్ధే మా లక్ష్యం కాదంటారేమిటి? అంకెల్లో చూపించే అభివృద్ధి ఫలితాలు ప్రజలకు దక్కటం లేదని అనటం సబబైన విమర్శ, లేదా, అభివృద్ధిలో సింహభాగం సంపన్నులకే దక్కుతూందని అనటం సద్విమర్శ అవుతుంది. ఈ ప్రభుత్వం అధికారంలో వున్నంతకాలం అభివృద్ధి ఫలితాలు మీకు దక్కవు, మమ్మల్ని అధికారంలోకి పంపిస్తే మీ ఒళ్లంతా బంగారంతో నింపేస్తాం అని అనడాన్ని అర్థం చేసుకోవచ్చు. అలా ఇప్పటి ప్రభుత్వాన్ని అధికారంలోనుంచి దింపేయడానికి ఇంకో రెండున్నర సంవత్సరాల్లో వచ్చే ఎన్నికల్లో అవకాశం వుండనేవుంది. అప్పుడు కేవలం తెలంగాణ వెనుకబడిన జిల్లాలే కాదు, రాష్ట్రంలో వెనుకబడి వున్న రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల సమస్యలను పరిష్కరించే మొనగాడుగా ముందుకు నిలబడవచ్చు, బొర్రలు పెంచుకొన్న సర్కారు జిల్లాల పీచమణచవచ్చు.

అంకెల్లో అభివృద్ధి చూపించేది అభివృద్ధి కాదట! తెలంగాణ ఉద్యమ బుద్ధి జీవులు ఆంధ్రలో ఎన్ని విశ్వవిద్యాలయాలున్నాయో, తెలంగాణలో (హైదరాబాద్ మినహాయించి) ఒక్కటే విశ్వవిద్యాలయం ఉందని విమర్శిస్తూ రచించిన పుస్తకాలున్నాయి. అసలు ఓ పుస్తకం అంతా తెలంగాణకు ఎంత అన్యాయం జరిగిందోనని, అన్ని రంగాలను గణాంకాలతో విశ్లేషించారు. అభివృద్ధి లేమిని ఎత్తిచూపారు. ఆ పని చేసింది అంకెల్లోనే కదా. మూడు శాతం దగ్గరనే కుదేలైపోయిన దేశ స్థూల జాతీయాదాయం ఎనిమిది శాతానికి పెరిగి ప్రపంచ దేశాల దృష్టి నాకర్షిస్తూందంటే అది అంకెల్లోనే కదా. మీ జీతం పదేళ్ల క్రితంతో పోలిస్తే అభివృద్ధి కనపడిందంటే అది అంకెల్లోనే కదా. ఇలా ఎన్ని ఉదాహరణలైనా ఇవ్వవచ్చు. పైనే చెప్పినట్లు అభివృద్ధి జరిగినంత మాత్రాన సరిపోదు, అది గుణాత్మకంగా వుందా? ఎవరినుద్దేశించి? అభివృద్ధి జరిగింది ఇప్పటికి అభివృద్ధి జరిగిన ప్రాంతంలోనా, జరగని ప్రాంతంలోనా? ఏ వర్గ ప్రజలను అభివృద్ధి ఫలితాలందుతున్నాయి అనే అనేక రకాల కొల బద్దలుపయోగించాలి. ఉదాహరణకు ప్రభుత్వోద్యోగి ఆదాయం పెరిగి వుండవచ్చు. కాని అదే సమయంలో ధరల పెరుగుదల, కుటుంబ సభ్యులు పెరగటం, చదువుసంధ్యల ఖర్చు పెరగటంలాంటి కారణాలవల్ల అతని నిజ ఆదాయం తగ్గిపోతుంది. ఇదే వివిధ రాష్ట్రాలు, రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాల మధ్య ప్రాంతీయ అసమానతలకు వర్తిస్తుంది.

దేశంలో పారిశ్రామికంగా, ఇతరంగా మారాష్ట్రం వెనుకబడి వుందంటూ కాబట్టి ఎక్కువ నిధులు, ఎక్కువ పరిశ్రమలు కావాలంటూ కేంద్రాన్ని అర్థిస్తూ వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాలు, ప్రాంతాలు వచ్చేసరికి, ఈ అసమానతలను సరిచేసే చర్యలు ఏమీ తీసుకోలేదు. ధనవంతమైన జిల్లాలే సింహభాగం నిధులు కాజేసాయి. 1956లో శ్రీకాకుళం (తర్వాతి కాలంలో విజయనగరం కూడా), రాయలసీమ జిల్లాలు, తెలంగాణ లో మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాలు, ఈ నాటికీ ఈ వివక్షాపూరిత దృష్టికి గురవుతున్నాయి, అప్పటికీ, ఇప్పటికీ వెనుకబడేవున్నాయి. ఈ విషయంలో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలను బోనులో నిలబెట్టాల్సిందే. వివిధ రంగాల్లో ఈ వివక్ష స్వరూప స్వభావాలను నీలం రాజశేఖర రెడ్డి పరిశోధనా కేంద్రం ఒక మంచి అధ్యయనాన్ని పుస్తక రూపంలో విడుదలచేసింది. (డెవలెప్‌మెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ 1956-2001, ఎ స్టడీ ఆఫ్ రీజియనల్ డిస్పారిటీస్). వేరే కుంపటి వెలిగిస్తే ఈ ప్రాంతీయ అసమానతలు తొలిగిపోతాయా? అసమానతలు కావాలని, తెలిసే సృష్టించివుంటే, తెగతెంపులు తప్ప మరో మార్గం లేదనటంలో అర్థంవుంది. ఉదాహరణకు అవిభక్త మద్రాసు రాష్ట్రం నుంచి తెలుగు జిల్లాలు విడిపోయి వేరే రాష్ట్రం కావాలనే డిమాండు ఉద్దేశపూర్వకంగా జరుగుతూ వచ్చిన అన్యాయాన్ని ఎదిరించే ప్రయత్నంలో భాగంగా జరిగింది. ఆంధ్రా నాయకుల ధాష్టీకం కింద తెలంగాణ ప్రజలు నలిగిపోతున్నారని విమర్శించేవారు జలగం వెంగళరావు, మర్రి చెన్నారెడ్డి, టి. అంజయ్య ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు, ఇప్పుడు ప్రత్యేక తెలంగాణ కావాలని కోరుతున్న తెలంగాణ రాజకీయ నాయకులు, మేధావులకు తెలంగాణ ప్రజలు నలిగిపోవటం కనబడకపోవటం విడ్డూరం. అంతవరకూ ఎందుకు? తెరాస నాయకులు ప్రస్తుత రాజశేఖర రెడ్డి ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్నంతకాలం గప్‌చుప్. వైఎస్‌ఆర్ అప్పుడూ ఇప్పుడూ ఒకే పాట పాడుతూ వచ్చారు, అంతా సోనియా గాంధీ చేతిలో వుందని. కాగా అప్పుడెందుకు చేరారు, ఇప్పుడెందుకు బయటకు వచ్చారు అని ప్రశ్నించటం అప్రస్తుతం కాదనుకొంటా. ఈ చర్యలో అధికారలాలసత్వమేగాని, ప్రత్యేక తెలంగాణ కావాలనే పట్టుదలద్యోతకం కావటంలేదు.

ఒక బలమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తే తప్ప, త్యాగాలు చేస్తే తప్ప పాలకులు అధికారాన్ని అప్పగించిన దాఖలాలు ప్రపంచ చరిత్రలోనే ఎక్కడా లేవని చరిత్ర చెప్పిన, చెబుతూన్న సత్యం. కె.సి.ఆర్. ప్రత్యేక తెలంగాణ నినాదం ఇచ్చిన నాటి నుంచి ఈ నాటి వరకు అప్పుడప్పుడు ర్యాలీలు, బహిరంగ సభలు జరిపి, రాజశేఖర రెడ్డి మీద విరుచుకపడి విమర్శలు చేయటం తప్ప, ప్రజలను నేరుగా ఉద్యమంలోకి తీసుకొని వచ్చిన దాఖలాలేమైనా వున్నాయా అని భూతద్దం పెట్టి చూడాల్సిందే.

ప్రాంతీయ అసమానతలు చంద్రబాబు గాని, రాజశేఖర రెడ్డి గాని ప్రవేశ పెట్టలేదు. పెట్టుబడిదారీ వ్యవస్థలో అసమానతలు అతి సామాన్య చిత్రం. ధనికులు-పేదలు, గ్రామీణులు-పట్టణవాసులు,

అభివృద్ధి-అభివృద్ధిలేమి మనమంతా నిత్యం చూస్తూనేవున్నాం. అలాంటివి లేకపోతే, వాటిని సృష్టించటం, పెంచిపోషించటం పెట్టుబడిదారీ వ్యవస్థ ఉపయోగించే ఆయుధం. విభజించి పాలించే బ్రిటిష్ విధానాన్ని వారసత్వంగా అందిపుచ్చుకొన్న దేశపాలకులు, అదే విధానాన్ని కొనసాగిస్తున్న దాని ఫలితాలే పెరుగుతున్న ప్రాంతీయ అసమానతలు. రేపు చంద్రశేఖర రావు అధికారంలోకి వస్తే దక్షిణ, ఉత్తర తెలంగాణా ప్రాంతాల మధ్య వున్న అసమానతలను తన కనుకూలంగా మలచుకోరా? ఎందుచేతనంటే చంద్రశేఖర రావు కూడా ఆ తానులో ముక్కే ఆ వ్యవస్థలో భాగమే. కార్మికులు సమ్మె చేస్తే వారిలో కలతలు సృష్టించి సమ్మెను విచ్ఛిన్నం చేయటం పెట్టుబడి దారీ విధానానికి వెన్నతో పెట్టిన విద్య. కాంగ్రెస్‌లోనూ తెలంగాణ వాదులున్నారు. బయట నుంచి వారిని ప్రకటనల ద్వారా, సవాళ్ల ద్వారా రెచ్చగొట్టి ఆ పార్టీలో విభజన తీసుకొని రావడానికి టి.ఆర్.ఎస్. నాయకులు ప్రయత్నించటం లేదా? అలాగే రాజశేఖర రెడ్డి టి.ఆర్.ఎస్. లో చీలికలను సృష్టించడానికి కొంతమందిని దువ్వటంలేదా? ఇలాంటి కుత్సిత రాజకీయాలను దూరంగా పెట్టి ప్రాంతీయ అసమానతల మీద అందరూ కలిసి దండయాత్ర సాగిస్తే, ఏ సమస్యా వుండదు, కాని ఏం చేస్తాం? పెట్టుబడిదారీ విధానం అనే కుక్క తోక వంకర, ఎంత సాపు చేసినా వంకర పోదు.

ద్రవ్యపరంగా తెలంగాణ రాష్ట్రం ఆదాయ వ్యయాలు, రెవెన్యూ లోటు, ద్రవ్యలోటు లాంటి విషయాల గురించి తెలంగాణ మేధావులు దృష్టి సారించినట్లు లేదు. అటువంటి విశ్లేషణాత్మక వ్యాసాలు పత్రికల్లో చూచిన గుర్తులేదు. అలాగే ఎన్.డి.ఎ పాలనలో ఏర్పడిన నాలుగు చిన్న రాష్ట్రాలు ఎలా వారి ఆర్థిక స్థితిని మానేజ్ చేసుకొంటున్నాయి అని విశ్లేషిస్తూ తెలుగు పత్రికల్లో వ్యాసాలు చదవలేదు. అటు కేంద్రం, ఇటు రాష్ట్రాలు అన్ని లోటు బడ్జెట్లతో కుస్తీలు పడుతున్నాయి. ఆర్థిక వనరుల కోసం కటకటలాడుతున్నాయి. మన రాష్ట్రమే తీసుకొంటే ఈ సంవత్సరం ఆఖరుకు రుణభారం (పెన్షన్ నిధులు, చిన్న మొత్తాల పొదుపు ఉద్యమం, ప్రభుత్వం ఇచ్చే గారంటీలతో సహా) లక్షకోట్లు దాటనున్నది. తెలంగాణ వేరే రాష్ట్రంగా ఏర్పడితే సుమారు రు. 30 - 33 వేల కోట్ల అప్పుతో శ్రీకారం చుట్టాల్సి వస్తుంది. పెళ్లినాడు బ్రాహ్మణుడు పెళ్లి కొడుకును అరుంధతి నక్షత్రం అదిగో చూడు అంటే అరుంధతి నక్షత్రమేమోగాని, ఆరు వేల అప్పు కనపడుతుందనే సామెత గుర్తుకు వస్తుంది. అప్పుతో పాటు ఆదాయం వివరాలు కూడా తెలుసుకోవాల్సిన అవసరముంది. ఇటీవల ఏర్పడిన చిన్న రాష్ట్రాలు ద్రవ్య సమస్యను సమర్థవంతంగా పరిష్కరించుకొనివుంటే, ఆ విషయాన్ని తెలంగాణ వాదులు తమ ప్రచారంలో వినియోగించుకోవచ్చు కదా. విడిపోవాల్సి వస్తే సరిహద్దు సమస్యలు, ఆస్తి అప్పుల పంపకాల సమస్య, హైదరాబాద్ నగర భవిత్యం, ఇలాంటి విషయాలన్నింటిపైన తెరాస ఏమి ఆలోచిస్తోంది? వైఖరి ఏమిటి? ముందు రాష్ట్రం ఇవ్వండి, మా తిప్పలేవో మేము పడతాం అని అనబోతున్నారా? విడిపోతే, కేంద్రం చట్టం చేయాలి. అలా చేయాల్సినప్పుడు ఇలాంటి విషయాలన్నిటి మీద స్పష్టమైన నిర్ణయాలు చట్టంలో పొందుపరచాల్సి వుంటుంది.

లోతుగా, నిర్దిష్టంగా ఆలోచిస్తూంటే ఏమో. ఏమిటో, ఎలాగో, ఎపుడో, ఏం జరుగుతుందో అని అనిపిస్తుంది. ◆

(50వ పేజీలో ఈ పుస్తకం ఉపోద్ఘాతం చదవండి)

14 కుట్ర కథలు

- కొణతం దిలీప్

(ప్రఖ్యాత న్యూయార్క్ టైమ్స్ కరస్పాండెంట్ స్టీఫెన్ కింజెర్ రచన 'ఓవర్‌త్రో' త్వరలో వీక్షణం పబ్లికేషన్స్ తెలుగులో ప్రచురిస్తోంది. ఆ పుస్తకం ఉపోద్ఘాతం ఇది)



ఒక బలమైన దేశం బలహీనమైన దేశంపై ఎందుకు దాడి చేస్తుంది? సాధారణంగా అయితే ఈ పని తన సిద్ధాంతాన్ని రుద్దడానికో, తన ప్రాబల్యం పెంచుకోవడానికో, లేక విలువైన వనరులను స్వంతం చేసుకునేందుకో చేస్తుంది. మారుతున్న పాళ్లలో ఈ మూడు కారణాలే అమెరికాను పురికొల్పినవి. ఈ పుస్తకం ఇతర దేశాల వ్యవహారాలలో అమెరికా నేరుగా జోక్యం చేసుకున్న వివిధ సందర్భాలను పరిశీలిస్తుంది.

2003లో ఇరాక్ పై దాడి ఒక ఒంటరి పరిణామం కాదు. గడిచిన 110 ఏళ్లుగా అప్రతిహతంగా కొనసాగుతున్న అమెరికా బీభత్సకాండకు ఇది పరాకాష్ట. ఈ కాలంలో తనకు సిద్ధాంతరీత్యానో, రాజకీయ కారణాల వల్లో, లేదా ఆర్థిక లావాదేవిలలో భేదాభిప్రాయాలు వచ్చిన పధ్నాలుగు దేశాల ప్రభుత్వాలను అమెరికా కూల్చేసింది. అయితే ఇరాక్‌లో జరిగినట్లుగానే - ఇలాంటి జోక్యం చాలా స్వల్ప కాలం పాటు సత్ఫాలితాన్నిచ్చినట్టే అనిపించేది. అయితే ఇప్పుడు ఇరాక్‌లో జరుగుతున్నట్టుగానే ఇలాంటి జోక్యాలన్నీ తరువాత అనేక ఊహించని దుష్ఫలితాలనిచ్చాయి.

విదేశీ ప్రభుత్వాలను తన దారికి తెచ్చుకోవడానికి అమెరికా అనేక పద్ధతులను ఉపయోగిస్తుంది. తన ప్రయోజనాలు నెరవేర్చే దేశాలకు తాయిలాలు ఇవ్వడం, మాటవినని దేశాలను బెదిరించడం - ఇలా చాలా సందర్భాలలో అమెరికా పాత దౌత్యనీతినే అవలంబిస్తుంది. కొన్ని సార్లు తన మిత్రదేశాధినేతలను ప్రజాగ్రహం నుండి కూడా కాపాడుతుంది. పలుచోట్ల ఇతర దేశాల్లో జరిగిన ప్రభుత్వ వ్యతిరేక కుట్రలకు అది రహస్యంగా మద్దత్తిచ్చింది.

ఆధునిక ప్రపంచాన్ని రూపుదిద్దిన ఈ అమెరికన్ చర్యల గురించి కాదు ఈ పుస్తకం. ఇది మరింత తీవ్రమైన విషయాల గురించి - విదేశీ పాలకులను కూలదోయడానికి అమెరికా పన్నిన కుట్రల గురించి.

తలలు మార్చే కార్యక్రమాల గాథలు చాలా ఉత్సుకత కలిగిస్తాయి. ఇవి దేశభక్తుల గురించి, నీచుల గురించి, ఉన్నతమైన ఆశయాల గురించి, తుచ్ఛమైన ద్వేషాల గురించి, ధైర్యసాహసాల గురించి, క్రూర వెన్నుపోట్ల గురించి మనకు చెబుతాయి. మొట్టమొదటి సారిగా ఆ సంఘటనలన్నీ ఒక చోట కూర్చి చెప్పటమే కాక ఈ పుస్తకం ఈ సంఘటనలన్నిటిలోనూ సారూప్యత ఏమిటో వివరించే ప్రయత్నం చేస్తుంది. ఇవన్నీ సంబంధం లేని విడివిడి సంఘటనలు కావని, ఒక క్రమంలోనే ఇవన్నీ జరుగుతున్నాయని చెబుతూ ఈ పుస్తకం రెండు మౌలికమైన ప్రశ్నలకు జవాబిచ్చే ప్రయత్నం చేస్తుంది. మొదటిది అసలు అమెరికా ఈ పనులకు ఎందుకు పాల్పడింది? రెండోది అమెరికా చర్యల ఫలితంగా సంభవించిన దీర్ఘకాలిక పరిణామాలేమిటి?

అమెరికా కూలదోసిన ప్రభుత్వాల జాబితా తయారు చేయడం అనుకున్నంత సులభం కాదు. ఒక విదేశీ ప్రభుత్వాన్ని పడగొట్టడంలో అమెరికా నిర్ణయాత్మక పాత్ర పోషించిన ఉదంతాలనే ఈ పుస్తకంలో ప్రస్తావించడం జరిగింది. చిలీ లో 1973లో జరిగిన సైనిక కుట్రకు ఈ పుస్తకంలో స్థానం దొరికింది. ఆనాటి కుట్రకు అనేక కారణాలు ఉన్నా, నిర్ణయాత్మక పాత్ర పోషించింది మాత్రం అమెరికానే. అదే ఇండోనేషియా, బ్రెజిల్, కాంగోలలో కూడా ఇటువంటి పరిణామాలే సంభవించినా వాటి గురించి ఈ పుస్తకంలో చర్చించలేదు. 1960లలో ఈ మూడు దేశాల్లో ప్రభుత్వాలను పడగొట్టడంలో అమెరికన్ ఏజెంట్లు కేవలం 'సహాయం' మాత్రమే చేశారు. అదే విధంగా అమెరికా దాడి చేసి కూడా దేశాధ్యక్షులను మార్చని మెక్సికో, డొమెనికన్ రిపబ్లిక్, హైతీ లకు కూడా ఈ పుస్తకంలో స్థానం దొరకలేదు.

అమెరికా 'తలలు మార్చే' శతాబ్దం 1893లో హవాయి రాచరికాన్ని కూలదోయడంతో మొదలైంది. నానా కంగాళీగా జరిగిన ఈ కూల్చివేత హాస్యనాటికలాగా ఆవిష్కృతమైన ఒక సాంస్కృతిక విషాదం. అది ప్రత్యక్ష సైనిక చర్య కాకపోయినా, అమెరికన్ సేనలు ఆ గడ్డపై కాలు మోపకపోతే ఆ కుట్ర ఎన్నటికీ విజయవంతమయ్యేదికాదు. అప్పటి అమెరికా అధ్యక్షుడు ఈ కుట్రకు ఆమోదముద్ర వేస్తే, ఆయన తదనంతరం వచ్చిన అధ్యక్షుడేమో దాన్ని ఖండించాడు. మొదటి కుట్ర జరిగిన కొన్నాళ్లకే అసలు విదేశీ ప్రభుత్వాలను కూల్చడం సరైనదేనా అనే చర్చ అమెరికన్లలో ప్రారంభమయ్యింది.

1893లో హవాయ్ విప్లవంగా చెప్పబడే సంఘర్షణలో స్పానిష్ వలసవాదులకు వ్యతిరేకంగా పోరాడుతున్న కొద్దిమంది 'దేశభక్తులకు' సాయం చేసిన అమెరికా, అయిదేళ్లు తిరిగే సరికి ఆ దేశభక్తులు తన చెప్పుచేతలలో ఉండేట్టు చేసుకోవడానికి మరోసారి యుద్ధం చేసింది.

ఈ సంఘర్షణల ఫలితంగా మున్నెన్నడూ లేని ఒక అమెరికన్ గ్లోబల్ ఆకాంక్షకు తెరలేచింది. విదేశీ ప్రభుత్వాలను అదిలించో, బెదిరించో తన దారికి తెచ్చుకోవడమే కాక తనకు చిత్తం వచ్చిన దేశాల ప్రభుత్వాలను పడగొట్టడానికి కూడా సిద్ధపడే స్థాయికి అమెరికాను చేర్చాయా రెండు సంఘర్షణలు.

హవాయ్‌లో, స్పెయిన్ పై తిరుగుబాటు చేసిన ఇతర దేశాల్లో, అమెరికన్ దేశాధ్యక్షులు తాము కొత్తగా కనుగొన్న జోక్యం చేసుకునే విధానాన్ని బాగా పదను పెట్టారు. ఇక్కడ గమనించాల్సిందేమిటంటే పై ఉదాహరణలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అమెరికా ప్రతిస్పందించింది. 1909 కి వచ్చేసరికి పరిస్థితి మారిపోయింది. అప్పటి అమెరికన్ అధ్యక్షుడు విలియం హోవార్డ్ టాఫ్ట్ మొట్టమొదటి సారిగా తనంతట తానే నికరాగువా అధ్యక్షుడు జాన్ సాంటోస్ జిలాయా ప్రభుత్వాన్ని కూలదోయమని ఆర్డరు చేశారు. తానీ పనిని అమెరికా భద్రత కోసం, ప్రజాస్వామ్య విలువలు పరిరక్షించడం కోసం చేశానని టాఫ్ట్ ఆనాడు చెప్పుకున్నాడు. అతని అసలు లక్ష్యం నికరాగువాలోని అమెరికన్ కంపెనీలకు ఇష్టారాజ్యంగా పనిచేసే వీలు కల్పించడం. విస్తృతార్థంలో చూస్తే ఇతర దేశాలపై తనకు నచ్చినటువంటి స్థిరత్వాన్ని రుద్దే అమెరికా హక్కును ఆనాడు టాఫ్ట్ పునరుద్ఘాటించాడు.

తదనంతరం ఇది ఒక రివాజుగా మారింది. ఇరవయ్యవ శతాబ్దం పొడుగూతా, ఇరవయ్యొకటో శతాబ్దం ప్రారంభమయ్యాకా కూడా అమెరికా అనేక పర్యాయాల తన సైనిక శక్తినీ, రహస్య దళాలనూ వాడి అమెరికన్ ప్రయోజనాలు కాపాడ నిరాకరించిన అనేక విదేశీ ప్రభుత్వాలను కుట్ర ద్వారా కూల్చేసింది. ఇలా చేసిన ప్రతిసారీ అది జాతీయ భద్రత, స్వాతంత్ర్యం వంటి ఉదాత్తమైన లక్ష్యాలనే వల్లె వేసింది. వాస్తవం మాత్రం ఇంకోలా ఉంది. అమెరికా విదేశీ ప్రభుత్వాలపై దాడికి దిగిన చాలా సందర్భాలలో దానికి కారణం ఆర్థికపరమైనదే ఉండేది. ప్రపంచంలో ఏ మూలనయినా అమెరికన్లు వ్యాపారం చేసుకునే హక్కును కాపాడేందుకే ఈ సంఘర్షణలు, కుట్రలు జరిగేవి.

ఇరవయ్యవ శతాబ్దంలో అనేక భారీ శక్తులు ప్రపంచ గమనాన్ని నిర్దేశించాయి. అందులో ముందుగా చెప్పుకోవలసింది బహుళజాతి కంపెనీల గురించి. ఒక దేశంలో నెలకొల్పబడి ఇతర దేశాల్లో ఎక్కువగా లాభాలు ఆర్జించేవి ఈ కంపెనీలు. వీటికి, వీటిని నడిపే వ్యక్తులకు గుట్టలుగా సంపద, ఎంతో రాజకీయ పలుకుబడి సమకూరాయి. ఇదే సమయంలో ఇంకోవైపున ప్రజా ఉద్యమాలు, కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు ఆవిర్భవించినా అమెరికాలో ఈ శక్తులన్నీ బహుళజాతి కంపెనీల శక్తి ముందు చాలా అల్పమైనవి. యాదృచ్ఛికంగా అమెరికా ఎదుగుదల తో పాటే ఈ బహుళజాతి కార్పొరేషన్లు కూడా ఎదిగాయి. అమెరికన్ ప్రభుత్వం తమ ప్రయోజనాలను ఎల్లవేళలా కాపాడాలని, అవసరమైతే అది తమకోసం విదేశీ ప్రభుత్వాధినేతలను మార్చేయాలని ఆ కంపెనీలు కోరుకోవడం మొదలైంది.

బహుళజాతి కంపెనీల ప్రయోజనాలొక్కటే ఈ అమెరికన్ సామ్రాజ్యవాదానికి కారణం కాదు. చరిత్ర ప్రారంభం నుండీ బలమైన రాజ్యాలూ, తెగలూ బలహీనులపై దాడి చేస్తూనే ఉన్నాయి. అవి అలా చేయడానికి ఒకటే మౌలిక కారణం. కోరుకున్న వనరును పొందటమే అంతిమ లక్ష్యం. అమెరికన్లు ఏదైన దేశాధ్యక్షుడిని తప్పించాలంటే ఆ దేశంపై తన హక్కును నిర్ధారించుకోవడంతో పాటు ఆ చర్య ద్వారా ఇతర దేశాలకు ఒక సంకేతం కూడా పంపిస్తారు.

తమ ద్వీపాలు అమెరికాలో విలీనం చేస్తే దిగుమతి సుంకాలు లేకుండా చక్కెర ఎగుమతి చేయవచ్చని కొద్ది మంది తెలివైన హవాయ్ భూస్వాములకు ఆలోచన వచ్చిన రోజుల నుండీ అమెరికన్ విదేశాంగ విధానం పై ఆర్థిక అంశాల ప్రభావం పెరుగుతూ వచ్చింది. ఇరవయ్యవ శతాబ్దం పురోగమిస్తున్న కొద్దీ ఈ పెద్ద పెట్టుబడిదారులూ, వారి వకాల్తా పుచ్చుకున్నవారూ ఒక అడుగు ముందుకువేశారు. విధానాల రూపకర్తలను ప్రభావితం చేసే దశ నుండి తామే విధాన రూపకర్తలుగా మారే ఒక నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. ఇలాంటి మార్పుకు చక్కని ఉదాహరణ జాన్ ఫాస్టర్ డల్లెస్. అనేక బహుళజాతి కంపెనీల్లో పనిచేసిన ఆయన తదనంతరం అమెరికా సెక్రటరీ ఆఫ్ స్టేట్ అయ్యాడు. 1953లో ఇరాన్‌లో సైనిక కుట్రకు ఆదేశించి మధ్యప్రాచ్యం అమెరికన్ ఆయిల్ కంపెనీలకు సురక్షితంగా ఉండేందుకు ప్రణాళిక రచించిన డల్లెస్, సంవత్సరం తిరగకుండానే యునైటెడ్ ఫ్రూట్ అనే ఒక బహుళజాతి కంపెనీని ఎదిరించిన పాపానికి గ్వాటెమాలలో ఒక జాతీయవాద ప్రభుత్వాన్ని కూలదోయమని ఆదేశించాడు!

స్వదేశంలో ప్రజా, రాజకీయ మద్దతు సంపాదించుకున్న అమెరికన్ బహుళజాతి కార్పొరేషన్లు తమ వాణిజ్య కార్యకలాపాలకు విదేశీ ప్రభుత్వాలనుండి ఏ చిన్న అడ్డంకి ఎదురైనా అమెరికన్ సైన్యాన్నో, సి.ఐ.ఏ నో చాలా సులభంగా రంగంలోకి దింపే స్థాయికి చేరుకున్నాయి. అయితే వాస్తవాలు ప్రజలకు చెబితే కార్పొరేషన్లు కానీ వారికి దన్నుగా నిలిచిన అమెరికన్ దేశాధ్యక్షులు కానీ ఈ పని చేయగలిగే వారు కాదు. అనాదిగా అమెరికన్ ప్రజలు ఆదర్శవాదులు. వారు తమ దేశం ఎప్పుడూ స్వచ్ఛమైన ఉద్దేశ్యాలతోనే ఏదైనా కార్యం తలపెట్టాలనుకుంటారు. కేవలం వాణిజ్య ప్రయోజనాలను రక్షించేందుకే విదేశాల వ్యవహారాల్లో తమ దేశం జోక్యం చేసుకుంటుందని తెలిస్తే వారా పనికి ఎన్నటికీ ఆమోదం తెలుపరు. అందుకే దేశాధ్యక్షులు తమ చర్యలకు ప్రజామోదం పొందడం కోసం రెండు ఎత్తుగడలు అవలంబించేవారు. విదేశీ ప్రభుత్వాలను కూలదోసినప్పుడు కొన్ని సార్లేమో ఆ దేశాల నుండి అమెరికాను రక్షించేందుకు, అక్కడి స్థానికులను విముక్తి చేసేందుకు అనే కారణం చెప్పేవారు. మరి కొన్ని సార్లయితే అసలా దేశంలో జరిగిన సంఘటనలతో తమ దేశానికి ఏ సంబంధం లేదని బుకాయించేవారు.

అమెరికా విదేశీ ప్రభుత్వాలను పడగొట్టిన చరిత్రను మూడు దశలుగా విభజించొచ్చు. మొదటిది సామ్రాజ్యవాద దశ – ఈ దశలో అమెరికా బహిరంగంగానే తన పనులు కానిచ్చేది. హవాయ్‌లో రాచరికాన్ని కూలదోసిన వారెవరూ ఆ కుట్రలో తమ పాత్రను కప్పిపుచ్చాలనుకోలేదు. స్పెయిన్ – అమెరికా యుద్ధం కూడా బహిరంగంగానే జరిగింది. ఇక నికరాగువా, హొండురాస్‌లపై ప్రత్యక్ష చర్యలు తీసుకున్నప్పుడు అప్పటి అధ్యక్షుడు టాఫ్ట్ అందరికీ చెప్పే ఈ పనులకు శ్రీకారం చుట్టాడు. ఈ కుట్రలు కుతంత్రాలు 'ఎందుకు' జరుగుతున్నాయో చెప్పకపోయినా జరిగిన వాటికి అమెరికన్లు పూర్తి బాధ్యత వహించిన దశ ఇది.

రెండో ప్రపంచయుద్ధం తరువాత పరిస్థితిలో చాలా తేడా వచ్చింది. నచ్చని ప్రభుత్వాలపై అమెరికా నేరుగా చర్యలు తీసుకోకుండా ఇప్పుడో బలమైన శక్తి సోవియెట్ యూనియన్ రూపంలో అవతరించింది. ప్రచ్ఛన్న యుద్ధం రోజుల్లో ఏదైనా దేశం పై అమెరికా దండెత్తితే వెంటనే బాధిత దేశం తరపున సోవియెట్ రంగంలోకి దిగే ప్రమాదం పొంచి ఉండేది.


ఈ పరిస్థితుల్లో అమెరికా ప్రత్యక్ష చర్యలకు స్వస్తి పలికి రహస్య కుట్రలకు పాల్పడడం మొదలుపెట్టింది. ఇరాన్, గ్వాటెమాల, దక్షిణ వియత్నాం, చిలీ వంటి దేశాల్లో అమెరికన్ దౌత్యవేత్తలు, గూఢచారులు కలిసి అమెరికన్ సైనిక జనరల్స్ చేసే పనిని చక్కగా నిర్వర్తించారు.

ఇరవయ్యో శతాబ్దం చివరికి వచ్చేసరికి పరిస్థితి మళ్లీ మారిపోయింది. విదేశీ ప్రభుత్వాలకు అమెరికా సైనిక కుట్రలను ఎలా ఎదుర్కోవాలో అర్థమయ్యింది. అంతేకాదు సోవియెట్ యూనియన్ విచ్ఛిత్తి తరువాత ఇలా కష్టపడి సైనిక కుట్రలు చేయవలసిన అవసరం కూడా తప్పింది. దీంతో అమెరికా మళ్లీ విదేశీ గడ్డపై సైన్యాన్ని దింపే తన పాత పద్ధతులకే మళ్లింది.

అమెరికా 'తలలు మార్చే' కార్యక్రమం అనేక దేశాల్లో తాత్కాలికంగా మొదలుపెట్టినప్పటి ప్రయోజనాలు నెరవేర్చింది. ఉదాహరణకు గ్వాటెమాలలో సిఐఏ కుట్రచేసి అర్బెంజ్ ప్రభుత్వాన్ని కూలదోసిన తదనంతరం అక్కడ యునైటెడ్ ఫ్రూట్ స్వేచ్ఛగా వ్యాపారం చేసుకోగలిగింది. అయితే చారిత్రక దృక్కోణం నుంచి నిశితంగా పరిశీలిస్తే, ఈ చర్యలు వాస్తవంగా అమెరికా రక్షణను బలహీనం చేశాయనే చెప్పాలి. ఈ కుట్రలు, యుద్ధాల ఫలితంగా ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో రాజకీయ పరిస్థితులు తలక్రిందులయ్యాయి. తద్వారా తలెత్తిన అనిశ్చిత పరిస్థితులు మున్నెన్నడూ ఊహించని ప్రమాదాలకు హేతువులయ్యాయి.

శతాబ్దం పై చిలుకు అమెరికా 'తలలు మార్చే' కుట్రల కథలు ఒక చోట చేరిస్తే – అమెరికా ఈ చర్యలకు ఎందుకు ఒడిగట్టిందో స్పష్టమవడమే కాక తద్వారా అది కొనితెచ్చుకున్న పరిస్థితి కూడా మనకు అవగత మవుతుంది. ఆ కుట్రకథలు చక్కని భవిష్యత్ పాఠాలు కాగలవు. ◆

బొమ్మారెడ్డి



ఐదు దశాబ్దాలకు పైగా తెలుగు పత్రికారంగానికీ, తెలుగులో వామపక్ష భావజాల ప్రచారానికీ అసాధారణమైన సేవలందించిన సీనియర్ పాత్రికేయులు బొమ్మారెడ్డి వెంకటేశ్వర రావు అక్టోబర్ 13న విజయవాడలో కన్నుమూశారు. కృష్ణాజిల్లా తెలప్రోలులో 1917లో పుట్టిన బొమ్మారెడ్డి బందరు, మద్రాసులలోచదువుకున్నారు. 1945లో ప్రజాశక్తితో ఆయన పాత్రికేయ వృత్తి ప్రారంభమైంది. ఆ తర్వాత జనత, జనవాణి, ప్రజాశక్తి వారపత్రిక, విశాలాంధ్ర, జనశక్తి మొదలయిన పత్రికలలో పని చేశారు. ప్రజాశక్తి దినపత్రిక సంపాదకులుగా 1997లో పదవీవిరమణ చేశారు. స్వతంత్ర రచనలు, అనువాదాలు అన్నీకలిపి యాభైకి పైగా పుస్తకాలు రచించారు. తొంబయ్యవ పడిలో ప్రవేశిస్తున్న సమయంలో కూడా చివరి నిమిషం దాకా చదువుతూ, రాస్తూ, ఆలోచిస్తూ, చర్చిస్తూ గడిపారు. సమకాలీన సంఘటనల పట్ల యువకుల కన్న ఎక్కువ తీవ్రంగా, నిశితంగా వ్యాఖ్యానించేవారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంపై పుచ్చలపల్లి సుందరయ్య రాసిన ఇంగ్లీషు గ్రంథం అనువాదకులలో ఒకరుగా బొమ్మారెడ్డికి ఆ పోరాటం గురించి ఒక పుస్తకాన్ని సంకలనం చేయాలని కోరిక ఉండేది. అందుకోసం వేర్వేరు రచయితల నుంచి వ్యాసాలు కోరుతూ ఆ పనిలో ఉండగానే మరణించారు. తెలుగు సమాజానికీ, సాహిత్యానికీ, పత్రికా రచనకూ బొమ్మారెడ్డి అందించిన సేవలను 'వీక్షణం' వినమ్రంగా సంస్మరించుకుంటోంది.

కె. నరసింహాచారి



కోణార్క, సూర్యానువర్తి వంటి కలంపేర్లతో కవిగా, పత్రికారచయితగా సుప్రసిద్ధుడైన సీనియర్ జర్నలిస్టు కె. నరసింహాచారి (47) అక్టోబర్ 21న మెదడులో రక్తస్రావం వల్ల మరణించారు. మహబూబ్‌నగర్ జిల్లా తంగెళ్లపల్లిలో పుట్టిన కె.ఎన్. చారి వనపర్తి, హైదరాబాదులలో చదువుకున్నారు. విద్యార్థి దశలో ఎస్ఎఫ్ఐ కార్యకర్తగా ప్రారంభించి ఆయా కాలాలలో ఉస్మానియా యూనివర్సిటీ రైటర్స్ సర్కిల్, విప్లవరచయితల సంఘం, తెలంగాణ సాంస్కృతిక వేదిక వంటి ఎన్నో సాహిత్య, ప్రజా సంస్థలలో పనిచేశారు. హైదరాబాద్ (ఊరు-వాడ, ఆంధ్రభూమి, ప్రజాతంత్ర, ప్రభవ), కరీంనగర్ (జీవగడ్డ, ఆంధ్రభూమి) మహబూబ్‌నగర్ (జీవగడ్డ), విజయవాడ (ఆంధ్రభూమి), తిరుపతి (ఆంధ్రజ్యోతి) వంటి ఎన్నో చోట్ల పత్రికా రచయితగా పని చేశారు. కవిత్వం, కథ, సాహిత్య విమర్శ, పుస్తక ప్రచురణ, అనువాద రంగాలలో కృషి చేశారు. నాలుగు సంవత్సరాల కింద తొలిసారి మెదడులో రక్తస్రావం జరిగినప్పటి నుంచి అనారోగ్యంతో ఉన్నప్పటికీ పాలమూరు సేవాసమితి పేరుతో మహబూబ్‌నగర్ అభివృద్ధి కార్యక్రమాలలో పాలుపంచుకున్నారు. తెలంగాణ అస్తిత్వ ఆకాంక్షలను ప్రచారం చేయడంలో పాల్గొన్నారు. కె.ఎన్. చారి మరణానికి 'వీక్షణం' తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తోంది.

హీరాలాల్ మోరియా



ఉర్దూ, తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషలలో వందలాది రచనలు చేసిన బహుభాషా సాహితీవేత్త హీరాలాల్ మోరియా అక్టోబర్ 13న ఖమ్మంలో తుదిశ్వాస విడిచారు. ఉత్తరాది నుంచి వచ్చి ఖమ్మంలో స్థిరపడిన కుటుంబంలో 1924లో పుట్టిన హీరాలాల్ హైదరాబాద్ సంస్థాన స్వాతంత్ర్య పోరాటంలో కార్యకర్తగా, ఉపన్యాసకుడిగా రాజకీయ జీవితం ప్రారంభించి, నిజాం ప్రభుత్వం విధించిన కఠిన కారాగార శిక్షను వరంగల్లు, నిజామాబాదు జైళ్లలో ఏడాదిన్నర పాటు అనుభవించారు. కవిత్వం, కథ, నవల, నాటకం, వ్యాసం, అనువాదం వంటి సాహిత్య ప్రక్రియలన్నిటిలోనూ, నాలుగు భాషలలోనూ కృషి చేశారు. 1950 దశకంలోనే ప్రఖ్యాత రచయితగా పేరు గడించారు. ఖమ్మం నుంచి మా భూమి వంటి పత్రికలను నడిపారు. ఆరు దశాబ్దాల పాటు ప్రజా ఉద్యమాలతో, సాహిత్య సృష్టితో, పత్రికారచనతో ఖమ్మం ప్రజా జీవితంతో అసాధారణమైన మైత్రి నెరపిన హీరాలాల్ మోరియాకు 'వీక్షణం' వినమ్రంగా నివాళి ఘటిస్తోంది.

సుఖదేవ్‌కు భగత్‌సింగ్ ఉత్తరం

(విచారణ పూర్తయి, తీర్పుకోసం ఎదురుచూస్తూ జైలులో ఉన్న సమయంలో, యావజ్జీవశిక్ష పడుతుందేమోననే అనుమానంతో సుఖదేవ్ ఆ శిక్ష కన్న ఆత్మహత్య మేలనిపిస్తున్నదని భగత్‌సింగ్‌కు ఉత్తరం రాశాడు. ఆ ఉత్తరానికి జవాబుగా భగత్‌సింగ్ ఈ ఉత్తరం రాశాడు. హిందీలో రాసిన తేదీలేని ఈ ఉత్తరం అనువాదాన్ని భారత ప్రభుత్వ ప్రచురణల విభాగం ప్రచురించిన 'జ్ఞాపకం చేసుకోండి ఎప్పుడైనా...' అమరవీరుల ఉత్తరాలు నుంచి తీసుకున్నాం.)

ప్రియ సోదరా,

నేను నీ ఉత్తరాన్ని ఒకటికి పదిసార్లు జాగ్రత్తగా చదివాను. మారిన పరిస్థితులు మనపైన వేరు వేరు ప్రభావాలు చూపినట్లు నాకు అనిపిస్తోంది. జైలు బయట ఉన్నప్పుడు నీవు ఏ విషయాలను అసహ్యించుకుంటూ వచ్చావో, వాటినే నీవిప్పుడు తప్పనిసరిగా భావిస్తున్నావు. అదే విధంగా నేను జైలు బయట వేటినైతే ముఖ్యంగా సమర్థిస్తూ ఉండేవాణ్ణో ఇప్పుడు వాటికి నా దృష్టిలో ఎక్కువ ప్రాముఖ్యం లేదు. ఉదాహరణకు నేను వ్యక్తిపరమైన ప్రేమను ముఖ్యమైన దానిగా భావించేవాణ్ణి. కానీ, ఇప్పుడు నా హృదయంలో ఈ భావనకు పెద్దగా స్థానం లేదు. బయట ఉన్నప్పుడు నీవు దీనికి (ప్రేమకు) ప్రబల విరోధివిగా ఉండేవాడివి. కాని, ఇప్పుడు దీని విషయంలో మీ ఆలోచనలలో గొప్ప మార్పు, విప్లవాత్మకమైన మార్పు వచ్చింది. దీన్ని నీవు మానవ జీవితంలో ఒక అత్యవసరమైన, అనివార్యమైన భాగంగా భావిస్తున్నావు. ఈ అనుభూతి వల్ల నీకు ఒక విధమైన ఆనందం ప్రాప్తించింది కూడా.

ఒక రోజు నేను ఆత్మహత్య గురించి నీతో చర్చించాను. అది నీకు జ్ఞాపకం ఉంటుంది. అప్పుడు నేను ఆత్మహత్య కొన్ని పరిస్థితుల్లో సమర్థనీయం కాగలదని నీతో అన్నాను. కానీ, నీవు నా అభిప్రాయాన్ని తోసిపుచ్చావు. ఆ చర్చ జరిగిన స్థలం, సమయం నాకు బాగా జ్ఞాపకం ఉన్నాయి. మన ఈ చర్చ శాహంశాహి కుటీరంలో ఒక సాయంత్రం జరిగింది. అప్పుడు నీవు హేళనగా నవ్వుతూ ఇలాంటి పిరికి పనిని ఎన్నడూ సమర్థనీయంగా భావించకూడదని అన్నావు. ఇలాంటి పని భయంకరమైనది, జుగుప్సాకరమైనది అని కూడా అన్నావు. కానీ ఈ విషయంలో కూడా నీ అభిప్రాయం పూర్తిగా మారినట్లు నాకు తోస్తూంది. ఇప్పుడు నీవు కొన్ని కొన్ని పరిస్థితుల్లో దాన్ని సమర్థనీయంగానే కాక అవసరంగానూ, అనివార్యంగానూ భావిస్తున్నావు. ఈ విషయంలో నీకు మునుపు ఉన్న అభిప్రాయమే ఇప్పటి నా అభిప్రాయం. అంటే ఆత్మహత్య ఒక జుగుప్సాకరమైన అపరాధం అని. అది పూర్తిగా పిరికితనంతో కూడిన పని. విప్లవకారులే గాదు, ఏ వ్యక్తి కూడా ఇలాంటి పనిని సబబైనదిగా భావించలేడు.

కేవలం కష్టాలు సహించడం ద్వారా దేశసేవ చేయడం ఎవరికైనా ఎలా సాధ్యమవుతుంది అనే విషయం నీకు బోధపడడం లేదని నీవు అంటున్నావు. నీలాంటి వ్యక్తి నుండి ఇలాంటి ప్రశ్న రావడం చాలా ఆశ్చర్యం కలిగించింది. ఎందుచేతనంటే – 'సేవ చేయడంకోసం కష్టాలు సహించడం, త్యాగం చేయడం' అనే 'నౌజవాన్ భారత సభ' ధ్యేయాన్ని గురించి మనం ఎంతగా ఆలోచించలేదు? దాన్ని ఎంతగా ఇష్టపడలేదు? దేశానికి ఎంత సేవ చేయడం సంభవమో అంత సేవా నీవు చేశావని నేను భావిస్తున్నాను. నీవు చేసిన ఆ సేవకంతకూ కష్టాలు సహించే సమయం ఇప్పుడు వచ్చింది. మరో విషయం ఏమిటంటే నీవు సమస్త దేశ ప్రజల నాయకత్వం వహించవలసిన తరుణం కూడా ఇదే.

మనిషి తాను చేసే ప్రతి పనీ సమంజసమని భావించే చేస్తాడు. మనం లెజిస్లేటివ్ అసెంబ్లీలో బాంబు పేల్చే పని చేసినట్లుగానే. పని చేసిన తర్వాత దాని పరిణామాన్ని, ఫలితాల్ని అనుభవించే పరిస్థితి వస్తుంది. మనం ఒక వేళ క్షమాభిక్ష పెట్టమని బతిమాలి బామాలి శిక్షనుండి తప్పించుకోనేందుకు ప్రయత్నం చేసి ఉంటే మన ఈ చర్య సరైనదిగా ఉండేదా? కాదు. అప్పుడు ప్రజలపైన దాని ప్రభావం చెడుగా ఉండేది. ఇప్పుడు మనం అనుకున్న లక్ష్యాన్ని సాధించడంలో పూర్తిగా సఫలత పొందాం.

మనం అరెస్టు అయినప్పుడు మన సంస్థకు చెందిన రాజకీయ ఖైదీల పరిస్థితి చాలా దుర్భరంగా ఉండేది. దాన్ని మెరుగుపరచడానికి నిరాహార దీక్ష ద్వారా ప్రయత్నం మొదలుపెట్టాం. మనం బహుకొద్ది కాలంలోనే చనిపోతామనే నమ్మకం అప్పుడు మనకు ఉండేది. ఈ మాట నేను నీకు చాలా సీరియస్‌గా చెబుతున్నాను. నిరాహార దీక్ష పూనినప్పుడు కృత్రిమంగా ఆహారం ఇవ్వవచ్చుననే విషయం మనకు అప్పట్లో తెలియదు. ఇది సంభవమనే ఆలోచన కూడా మనకు తట్టలేదు. అప్పుడు మనం చావడానికి సిద్ధంగా ఉన్నాం. అది మన ఆత్మహత్యా ప్రయత్నమని నీ అభిప్రాయమా? కాదు కదా! క్రియాశీలత కలిగి శ్రేష్ఠమైన, ఉత్కృష్టమైన ఆదర్శం కోసం జీవితాన్ని అర్పించడం ఎన్నటికీ ఆత్మహత్య అనిపించుకోదు. మన మిత్రుని (యతీంద్రనాథ్ దాస్) మృత్యువులాంటి మృత్యువు మాత్రం కోరుకోదగిందే. దాన్ని నీవు ఆత్మహత్య అంటావా? మనం కష్టాలు సహించడం సఫలమైంది. దేశమంతటా ఉధృతమైన ఒక గొప్ప సంచలనం చెలరేగింది. మన లక్ష్యం సిద్ధించింది. ఇలాంటి పోరాటంలో వచ్చే మృత్యువు ఒక ఆదర్శ మృత్యువే.

ఇంతే కాకుండా, ఉరిశిక్ష పడుతుందనే నమ్మకం ఉన్న మన వాళ్లందరూ ఆ శిక్ష పడే రోజు కోసం, ఆ తర్వాత ఉరికంబమెక్కే రోజు కోసం ధైర్యంగా ఎదురు చూడాలి. అలాంటి చావు కూడా అందమైందే. కానీ, ఆత్మహత్య చేసుకోవడం కేవలం కొన్ని కష్టాల నుండి తప్పించుకోవడం కోసం తన జీవితాన్ని రూపుమాపడం మాత్రం పిరికితనమే. నేను నీకు చెప్పేదేమిటంటే ఆపదలు వ్యక్తికి పరిపూర్ణతనిచ్చేవిగా ఉంటాయి. నేనుగానీ, నీవుగానీ, ఇంతెందుకు, మనలో ఎవరుగానీ, అనుభవించిన కష్టాలు ఏమీ లేవని నేను గట్టిగా చెప్పగలను. మన జీవితాల్లో ఆ భాగం ఇప్పుడిప్పుడే మొదలవుతోంది.

నీకు జ్ఞాపకం ఉందనుకుంటాను. ఎన్నోసార్లు రష్యన్ సాహిత్యంలో

అడుగడుగునా కనిపించే వాస్తవికత మన సాహిత్యంలో ఎక్కడా కనిపించదనే విషయాన్ని గురించి మనం ఎన్నోసార్లు మాట్లాడుకున్నాం. మనం వాళ్ల కథల్లోని కష్టాలను దు:ఖదాయకమైన పరిస్థితుల వర్ణనలను ఎంతో మెచ్చుకుంటాం. కానీ కష్టాలు అనుభవించే ఆ భావన మన అంతర్యంలో జన్మించదు. మనం వారి ఉన్మాదాన్ని, వ్యక్తిత్వంలోని అసాధారణతను మెచ్చుకుంటాం. అయితే వాటికిగల కారణాల గురించి ఆలోచించం. నా అభిప్రాయం ప్రకారం – కేవలం ఆపదలు సహించిన వారని పేర్కొన్నందువల్లే ఆ కథలో సహృదయత, మార్మికమైన వేదన పుట్టుకొచ్చాయి. ఆ పాత్రలో, సాహిత్యంలో ఔన్నత్యం చోటు చేసుకొంది. మన జీవితాల్లో మనం అకారణంగా, సహజసిద్ధమైన లేక దృఢమైన ఆధారం లేకుండా ఎప్పుడైతే రహస్య వాదాన్ని ప్రవేశపెడతామో అప్పుడే మన పరిస్థితి దయనీయంగానూ, హాస్యాస్పదంగానూ మారుతుంది. అన్ని విధాలా విప్లవకారులమని గర్వపడే మనలాంటి వాళ్లం స్వయంగా ఆరంభించిన పోరాటం ద్వారా తెచ్చిపెట్టుకున్నటువంటివీ, మనలను విప్లవకారులుగా చెప్పుకోవడానికి ఆస్కారం కలిగిస్తున్నవీ అయిన ఎన్నో రకాల ఆపదలు, దిగుళ్లు, దు:ఖాలు, కష్టాలు సహించడానికి ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉండాలి.

నేనిక్కడ ఒక విషయం చెప్పదలచుకున్నాను. అదేమిటంటే జైళ్లలో, కేవలం జైళ్లలోనే ఎవరికైనా నేరం, పాపంలాంటి సామాజిక సమస్యలను గురించి ప్రత్యక్షంగా తెలుసుకొనే అవకాశం లభిస్తుంది. నేను ఈ విషయాలకు సంబంధించిన సాహిత్యం కొంత చదివాను. నిజానికి జైళ్లే ఇలాంటి విషయాల గురించి అధ్యయనం చేయడానికి అన్నిటికంటే ఎక్కువ అనువైన చోట్లు. అధ్యయనం చేయడంలోని సర్వశ్రేష్ఠమైన అంశమేమిటంటే తానుగా కష్టాలు సహించడం.

రష్యా జైళ్లలో రాజకీయ ఖైదీలు ఎన్నో ఘోరమైన యాతనలు సహించి ఉండడమే జార్ ప్రభుత్వ విధ్వంసం తర్వాత అక్కడి జైళ్ల పరిపాలనా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురాబడడానికి అతి ముఖ్య కారణమని నీకు బాగా తెలుసు. మరి భారతదేశానికి జైళ్ల యమయాతలను పూర్తిగా అర్థం చేసుకున్న వాళ్లు, ఈ యాతనల స్వానుభవం ఉన్న వాళ్లు, అవసరం లేదా? కేవలం ఇంకొకరెవరో ఈ పని చేస్తారని గానీ లేక ఈ పని చేయడానికి ఇంకా చాలా మంది ఉన్నారని గానీ దాటేయడం ఏ విధంగానూ సముచితం కాదు. అలాగే ఎవరైతే విప్లవరంగానికి చెందిన పనుల భారాన్ని ఇతరుల పైకి తోసేయడాన్ని అవమానకరంగానూ, ఏహ్యంగానూ భావిస్తారో వారు సంపూర్ణ కార్యదీక్షతో ప్రస్తుత వ్యవస్థకు విరుద్ధంగా పోరాటం ఆరంభించాలి. ఈ వ్యవస్థ నిబంధనలను ఉల్లంఘించాలి. కాని, వారు ఔచిత్యాన్ని మరువకూడదు. ఎందుచేతనంటే అనవసరమైన, అనుచితమైన ప్రయత్నం ఎప్పుడూ న్యాయోచితమైందిగా భావించబడజాలదు. ఇలాంటి ఉద్యమం విప్లవం కొనసాగించవలసిన కాలాన్ని చాలా వరకు తగ్గిస్తుంది. ఇంతవరకు మొదలైన ఉద్యమాలన్నింటి నుండీ దూరంగా ఉండి పొమ్మని చెప్పడానికి నీవు లేవదీస్తున్న తర్కాలను నేను అర్థం చేసుకోలేకపోతున్నాను. మిత్రులలో కొందరున్నారు. వారు మూర్ఖులయినా అయి ఉండాలి, లేదా అజ్ఞానులయినా అయి ఉండాలి. వాళ్లు నీ ఈ ప్రవర్తనను (నీవు వాళ్లకంటే ఎంతో ఎత్తున, వారి గ్రహణ శక్తికి అతీతంగా ఎదిగి ఉండడం వల్ల మాకు ఏమీ అర్థం కావడం లేదని వారే స్వయంగా అంటున్నారు) విచిత్రమైనదిగా, అద్భుతమైనదిగా భావిస్తున్నారు.

నీవు నిజంగానే జైలు జీవితాన్ని అవమానకరంగా భావిస్తూ ఉంటే దానికి విరుద్ధంగా ఉద్యమం లేవదీసి దాన్ని బాగుపరచేందుకు ఎందుకు ప్రయత్నించవు? బహుశా నీవు ఈపోరాటం సఫలం కాదని అంటావేమో. కాని, ఈ తర్కం కూడా బలహీనులు మామూలుగా ప్రతి ఉద్యమం నుండి తప్పించుకొనేందుకు ఆధారంగా చేసుకునే తర్కమే. ఇది విప్లవ ప్రయత్నాలలో చేరకుండా తప్పించుకునే వారి నోటి నుండి జైలు బయట మనం ఎప్పుడూ వింటూ వస్తున్నమాటే. ఈ మాటే నేను నీ నోటి నుండి కూడా వినాలా? బహుకొద్ది మంది కార్యకర్తల సహకారంతో సంఘటితమైన మన పార్టీ శక్తి మన లక్ష్యాలతో, ఆదర్శాలతో పోల్చి చూస్తే ఏపాటిది? మరి దీన్ని బట్టి ఈ పని మొదలుపెట్టడం పెద్ద పొరపాటనే తేల్చవచ్చా? లేదుగదా! ఇలాంటి నిర్ణయానికి రావడం సబబు కాదు. ఇలాంటి ఆలోచన ఆ వ్యక్తిలోని బలహీనతను వెల్లడి చేస్తుంది.

ఆపైన నీవు పధ్నాలుగు సంవత్సరాలపాటు కష్టాలతో నిండిన జైలు జీవితం సాగించిన తర్వాత కూడా ఏ వ్యక్తిలోనైనా జైలుకు వెళ్లకముందు ఉన్న అభిప్రాయాలే ఉంటాయని ఆశించకూడదని, జైలు వాతావరణం అతని ఆలోచనా ధోరణిని నామరూపాలు లేకుండా చేస్తుందని రాశావు. మరి, ఇక్కడ జైలు వెలుపలి వాతావరణం మన ఆలోచనలకు అనుకూలంగా ఉందా అనే ప్రశ్న నేను అడగవచ్చా? అయినా, వైఫల్యాల కారణంగా మనం కార్యాచరణ మానగలమా? మనం ఈ రంగంలోకి దిగి ఉండకపోతే విప్లవానికి సంబంధించిన ఏ పనీ జరిగి ఉండేది కాదని నీ అభిప్రాయమా? ఇదే నీ అభిప్రాయమైతే, నీవు పొరపాటు పడుతున్నావు. దేశంలోని వాతావరణాన్ని మార్చడానికి మనం కొంత వరకు తోడ్పడిన మాట నిజమే అయినా, నిజానికి మనం కాలం తన అవసరాల కోసం సృష్టించుకున్న వాళ్లం మాత్రమే.

సామ్యవాద పితామహుడుగా భావించబడే మార్క్స్ మాత్రమే ఈ భావాలను వికసింపచేసినవాడు కాదని కూడా నేనంటాను. నిజానికి యూరపులో జరిగిన పారిశ్రామిక విప్లవమే కొన్ని ప్రత్యేకమైన భావాలుగల వ్యక్తులను జన్మింపజేసింది. వారిలో మార్క్స్ కూడా ఒకడు. మార్క్స్ తన పద్ధతిలో కొంత వరకు కాల చక్రానికి ఒక ప్రత్యేకమైన ఒరవడిని కలిగించేందుకు తోడ్పడ్డాడని మాత్రం నిస్సందేహంగా చెప్పవచ్చు.

నేనుగానీ, నీవుగానీ ఈ దేశంలో సమాజవాదానికీ లేక సామ్యవాదానికీ చెందిన భావాలను సృష్టించలేదు. నిజానికి అవి మన కాలం, మన పరిస్థితులు మనపైన ప్రసరింపజేసిన ప్రభావ ఫలితాలు. మనం ఈ భావాలను ప్రచారం చేయడానికి కొన్ని సాధారణమైన, అల్పమైన పనులను కూడా చేసామనడంలో సందేహం లేదు. అందువల్లనే ఇలాంటి కష్టమైన పనిని చేపట్టినప్పుడు దాన్ని కొనసాగించాలనీ, ఇంకా పై ఎత్తుకు తీసుకుపోవాలనీ నేనంటాను. ఆపదల నుండి తప్పించుకునేందుకు ఆత్మహత్య చేసుకుంటే ప్రజలకు దారి చూపినట్లుగా ఉండదు. అది కేవలం ప్రతిక్రియాత్మక చేష్టే అవుతుంది.

జైలు నిబంధనలకు లోబడే జీవితంలో నిరాశలను ఒత్తిళ్లను, హింసతో కూడిన దుర్భర పరీక్షామయ వాతావరణాన్ని ఎదిరించి మనం

పనిచేస్తూ వచ్చాం. పని చేస్తున్న రోజుల్లో ఎన్నో రకాల కష్టాలపాలయాం. ఇది ఎంతవరకు కొనసాగిందంటే తమ్ము తాము గొప్ప విప్లవకారులుగా చెప్పుకుని గర్వపడే వారు సయితం మనలను వదిలిపెట్టి వెళ్లిపోయారు. మరి ఈ సమయం మనకు క్లిష్టమైన పరీక్షా సమయం కాదా? అలాంటప్పుడు మన ఉద్యమాన్ని, ఆందోళనను కొనసాగించేందుకు మనకేం మిగిలింది? ఏ తర్కబలంతో, ఏ కారణం చూపి దీన్ని సమర్థించుకుంటున్నాం?

ఇలాంటి తర్కమే మన భావాలకు శక్తినిస్తుంది కదా? జైలు శిక్ష అనుభవించి వచ్చి, ఇప్పుడు కూడా పనిచేస్తున్న విప్లవ కార్యకర్తల ఉదాహరణలు మనముందు ఎన్ని లేవు? ఒకవేళ వాకునిన్ నీలాగే ఆలోచించి ఉంటే అతడు మొదట్లోనే ఆత్మహత్య చేసుకొని ఉండేవాడు. తమ జీవితంలోని ఎక్కువ భాగం శిక్షలు అనుభవిస్తూ జైళ్లలో మగ్గిన తర్వాత ఇప్పుడు రష్యాలో బాధ్యాతాయుతమైన పదవులు అధిష్టించి ఉన్న ఎంతోమంది విప్లవకారులు మనకు కనిపిస్తారు. మనిషి తన విశ్వాసాలపై అచంచలమైన దృఢత్వంతో నిలబడేందుకు ప్రయత్నం చేయాలి. భవిష్యత్తులో ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు.

మన బాంబు ఫ్యాక్టరీలలో అత్యంత తీవ్రమైన, శక్తివంతమూ అయిన విషం కూడా ఉంచాలనే విషయాన్ని గురించి మనం చర్చించినప్పుడు దాన్ని నీవు చాలా దృఢంగా వ్యతిరేకించావు. ఇది నీకు గుర్తుందా? ఇలాంటి ఆలోచన అంటేనే నీకు ఏహ్యాభావం ఉండేది. అలాంటప్పుడు ఇప్పుడేం జరిగిందని ఈ మార్పు? ఇక్కడ (జైలులో) అంత క్లిష్ట పరిస్థితులు కూడా ఏమీ లేవే! నా మటుకు నాకు ఈనాడు ఈ ప్రశ్న గురించి ఆలోచించాలంటేనే జుగుప్స పుడుతుంది. ఒకప్పుడు నీవు ఆత్మహత్యను ఆమోదించే చిత్తవృత్తిని కూడా అసహ్యించుకొనేవాడివి. ఒకవేళ నీవు అరెస్టు అయే సమయంలోనే ఈ భావాలకు అనుగుణంగా వ్యవహరించి ఉంటే (అంటే అప్పుడు విషం తిని నీవు ఆత్మహత్య చేసుకుని ఉంటే) విప్లవకార్యానికి ఎంతో సేవ చేసిన వాడివయి ఉందువు. కానీ, ఇప్పుడు ఈ పనిని గురించి ఆలోచించడం కూడా విప్లవోద్యమానికి హానికరమని నేను అంటున్నందుకు నన్ను క్షమించు.

మరో ముఖ్యమైన విషయం నీ దృష్టికి తీసుకు రావాలనుకుంటున్నాను. అదేమిటంటే దేవుడు, పునర్జన్మ, స్వర్గం, నరకం, శాపం, వరం - అంటే దేవుని ద్వారా ప్రాప్తించే కర్మఫలం, మొదలైన వాటిపై మనకు విశ్వాసం లేదు. అందుచేత మనం పుట్టుక, చావులను గురించి కూడా విశుద్ధ భౌతికవాద దృష్టితోనే ఆలోచించాలి. ఒక రోజు నన్ను గుర్తు పట్టడానికి ఢిల్లీ నుండి ఇక్కడి తీసుకొని వచ్చినప్పుడు కొందరు గూఢచారి విభాగపు అధికారులు మానాన్న ఎదుటనే ఈ విషయం గురించి మాట్లాడారు. నాకు తెలిసిన రహస్యాలను బయటపెట్టడానికీ, తద్వారా నా ప్రాణాన్ని కాపాడుకోవడానికీ సిద్ధంగా లేను కాబట్టి నేను జీవతం పట్ల పూర్తిగా విరక్తి చెందిపోయిన విషయం రుజువు అవుతుందని వారన్నారు. వాళ్ల తర్కం ఏమిటంటే నా ఈ చావు ఆత్మహత్యకు సమానమైందని. నేను వాళ్లకు నాలాంటి, భావాలు, నమ్మకాలు ఉన్న వ్యక్తి వృథాగా చావడాన్ని ఎన్నటికీ సహించదనీ, మేము మాత్రం మా జీవితానికి వీలయినంత ఎక్కువ మూల్యం సంపాదించుకోవాలని కోరుకుంటామని జవాబిచ్చాను. మానవాళికి వీలయినంత ఎక్కువ సేవ చేయగలగడమే కదా ఆ మూల్యం. ప్రత్యేకించి నా వంటి నిశ్చింత జీవితం జీవించేవాడు ఆత్మహత్య చేసుకోవడమటుంచి, ఆ ఆలోచన మనసులోకి రానివ్వడం సైతం మంచిది కాదని భావిస్తాడు. ఆ మాటే ఇప్పుడు నీతో చెబుతున్నాను. నన్ను గురించి నేను ఏమి ఆలోచిస్తానో అది నీకు తెలుపడానికి అనుమతి ఇస్తావని ఆశిస్తాను. ఉరిశిక్ష తప్పదనే గట్టి నమ్మకం నాకుంది. నాకు ఏ విధమైన క్షమాభిక్షగానీ, అధికారుల సున్నితమైన ప్రవర్తనగానీ, లభిస్తుందన్న ఆశ ఎంత మాత్రమూ లేదు. ఏదో ఒక విధమైన క్షమాభిక్ష లభించినా దానిని అందరికీ పూర్తిగా వర్తింపచేయరు. పైగా మన విషయంలో ఎట్టి పరిస్థితులలోనూ క్షమాభిక్ష ఇచ్చే అవకాశం లేదు. అయినా మనలను విడుదల చేయించే ప్రతిపాదన విశ్వవ్యాప్తంగా ఉద్యమ స్థాయిలో జరగాలి. నేను కోరుకునేదేమంటే అటువంటి ఉద్యమం చరమ స్థాయికి చేరుకున్న సమయంలో మన ఉరిశిక్ష అమలు జరగాలని. నేను కోరుకునే మరో విషయమేమిటంటే ఎప్పుడైనా గౌరవప్రదము, న్యాయ సంగతము అయిన ఒడంబడిక అంటూ ఏర్పైనా జరగడం సంభవమైనప్పుడు మనలాంటి వ్యక్తుల వివాదాలు ఆ ఒడంబడికకు ఏ ఆటంకంగాని, ఇబ్బందిగాని కలిగించేవిగా ఉండకూడదని. దేశ భవిష్యత్తుపై నిర్ణయాలు జరుగుతున్నప్పుడు వ్యక్తుల భవితవ్యాన్ని పూర్తిగా విస్మరించాల్సి ఉంటుంది. విప్లవకారులవడం మూలంగా గత అనుభవాలు అన్నీ మనకు పూర్తిగా తెలిసినవే. అందుచేత మన పరిపాలకుల్లో, ముఖ్యంగా ఇంగ్లీషు జాతివాళ్ల ఆలోచనల్లో ఇలాంటి అశ్చర్యకరమైన మార్పు వస్తుందని మనం అనుకోవడానికి ఆస్కారం లేదు. ఇలాంటి మార్పు విప్లవం వస్తే తప్పరాదు. విప్లవం అన్నది నిజానికి నిరంతర కృషి, కష్టాలు సహించడం, త్యాగాలు చేయడం వల్లనే వస్తుంది. నా వరకు నేను మాత్రం అందరికీ సమాన సౌకర్యాలు, క్షమాభిక్ష ఇవ్వడాన్ని (వాటి ప్రభావం స్థిరంగా ఉండగలిగినప్పుడు, దేశ ప్రజల మనస్సులపై మన ఉరిశిక్ష వల్ల కొంత చెరగని ముద్ర పడినప్పుడు మాత్రమే) స్వాగతయోగ్యంగా భావిస్తాను. అంతే, అంతకుమించి నేను చెప్పదలచుకున్నది ఏమీ లేదు. ◆

విమర్శ :

వీక్షణం సంచిక (62) సెప్టెంబర్ 2006 లో షహీద్ భగత్‌సింగ్ వ్యాసాన్ని 'విప్లవమంటే' ప్రచురించారు. అది కోర్టు వాంగ్మూలమని ముందుమాటలో పేర్కొన్నారు. అది ఏ కోర్టులో భగత్‌సింగ్ ఇచ్చిన వాంగ్మూలమో పేర్కొనలేదు. 1986లో ప్రచురించబడి ఇప్పటికి మూడు ముద్రణలయిన 'నా నెత్తురు వృథా కాదు – భగత్‌సింగ్ రచనలను' పరిశీలించగా అది 6 జూన్, 1929న ఢిల్లీ సెషన్స్ కోర్టులో తన, బటుకేశ్వ దత్తుల తరఫున భగత్‌సింగ్ రాసివ్వగా వారి లాయరు అసఫాలీ దాన్ని చదివారని తెలిసింది. అంతేకాదు వీక్షణంలో ప్రచురింప బడినది ఆ ప్రకటనలోని చివరి కొద్ది భాగం మాత్రమే. అది కూడా విప్లవమంటే ఏమిటని కోర్టు వారు ప్రశ్నించగా వివరించిన భాగం. ఆ జవాబు

మొదటి పంక్తులను మీరు తొలగించి ప్రచురించినట్టు కూడా అర్థమయింది. ఆ వాక్యాలు ఇవీ - 'విప్లవంలో రక్తపాత సంఘర్షణ తప్పని సరిగా జరగాలని ఎక్కడా లేదు. అంతే కాదు అందులో వ్యక్తి గత కక్ష సాధించే అవకాశమూ లేదు. విప్లవమంటే బాంబుల పిస్తోళ్ల సంస్కృతి కూడా కాదు'.

ఈ వాక్యాలను వదిలేసి దాని తరువాత భాగాన్ని మాత్రమే మీరు ప్రచురించారు. భగత్‌సింగ్ ఖండించిన, వదిలేసిన మార్గాన్ని మీరు ప్రచురించక పోవటంలోని ఆంతర్యమేమిటో మీరే పాఠకులకు చెప్పుకోవాల్సి ఉంటుంది.

అంతేకాక మీరు ప్రచురించిన వాంగ్మూలపు పూర్తి పాఠం అంతకంటే నాలుగురెట్లు ఎక్కువుంటుంది. ఆ విషయాన్ని గానీ, ఏ కోర్టులో ప్రకటించినది గానీ మీరు పాఠకులకు తెలియపర్చలేదు.

ఏ వాక్యాలైతే మీరు వదిలేశాలో వాటిని బ్రిటిష్ రాజ్యపు దిగువ కోర్టులు పరిగనలోనికి తీసుకోలేదంటూ తిరిగి లాహోరు హైకోర్టులో 13 జనవరి, 1930న ఆ విషయాలను భగత్‌సింగ్ స్పష్టంగా పునరుద్ఘాటించాడు. అంతేకాక అవి తమ ప్రకటనలో కీలక భాగాలని కూడా భగత్‌సింగ్ ప్రకటించాడు.

బ్రిటిష్ కోర్టులు వేటిని పరిగనకు తీసుకోలేదో అవే భాగాల్ని మీరు విడిచిపుచ్చటం ఎలా సాధ్యపడిందో నాకర్థం కాలేదు. ఇవే అంశాల్ని రకరకాల సంస్కరణవాదులంతా కప్పిపుచ్చి భగత్‌సింగ్‌కు పడిన టెర్రరిస్ట్ ముద్రను మాసి పోనివ్వకుండా చేస్తున్నారు.

భగత్‌సింగ్ వీలునామా (భారత జాతీయ పోరాటాంశాలు) ను ఇరవై సంవత్సరాల క్రితమే ప్రచురించిన ప్రజాశక్తి ప్రచురణల వారు అందులోని చివరి ఎనిమిది పేజీలను కత్తిరించి ప్రచురిస్తూ వస్తున్నారు. (పూర్తి పాఠం కోసం 'నా నెత్తురు వృధా కాదు' పుస్తకంలో 'భారత జాతీయ పోరాట దిశలు' - చూడండి) ఉపఖండంలో మొత్తానికీ నేటికీ లౌకిక వాద ప్రతీకగా (సింబల్ ఆఫ్ సెక్యులరిజం గా) నిలిచిన కామ్రేడ్ భగత్‌సింగ్‌ను లౌకికవాద ద్వేషులయిన సంఘపరివార్ శక్తులు 'భగత్‌సింగ్ తమ్ములం' అని నినదిస్తూన్నారు.

భగత్‌సింగ్ ను అర్థం చేసుకోవటంలో, వ్యాఖ్యానించుకోవటంలో దృక్కోణ సమస్యలుండవచ్చు గానీ, ఆయనను ముక్కలుగా చూపెట్టటం ద్వారా అది జరగకూడదు. నా నెత్తురు వృధా కాదు పుస్తక సంపాదకుడు నిర్మలానంద దాని రెండవ ముద్రణ ముందుమాటలో చేసిన విజ్ఞప్తిని విజ్ఞులంతా పాటిస్తే బావుంటుంది. 'భగత్‌సింగ్ రచనలను విస్తృతంగా తెలుగువారికి అందించటంలో ఆరోగ్యకరమైన పోటీ పడటం ఆహ్వానించదగ్గదే. అయితే తమకన్నా ముందు వేరెవరైనా ఆ రంగంలో కృషి చేస్తే వారిని అభినందించక పోతే పోయే,వాస్తవాలను వక్రీకరించటం మాత్రం హర్షించ దగ్గ విషయం కాదు'.

దివికుమార్
విజయవాడ

వివరణ

వీక్షణంను నిజమైన ప్రజాపక్ష సామాజిక, ఆర్థిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలనే మా ఉద్దేశ్యాన్ని ప్రతి సంచికలోనూ ప్రకటిస్తుంటాము. వీక్షణంలో అచ్చయిన వ్యాసాల మీద గాని, సంపాదకవర్గపు నిర్ణయాల మీద గాని భిన్నాభిప్రాయం ఉంచుకోవడానికి పాఠకులకు హక్కు ఉందని మేము భావిస్తాము. అందువల్లనే అన్నిరకాల అభిప్రాయాలను వ్యక్తీకరించే ఉత్తరాలను ప్రచురిస్తూ, మా వైపు నుంచి జవాబు చెప్పనవసరం లేదని భావిస్తాము. కాని దివికుమార్ గారి ఉత్తరం మాకు లేని ఉద్దేశ్యాలను వెతకడానికి ప్రయత్నించింది గనుక ఈ వివరణ:

భగత్‌సింగ్ శతజయంతి ప్రారంభం సందర్భంగా ఆయన రచన ఏదయినా అచ్చు వేయాలని అనుకున్నప్పుడు మేం మొట్టమొదట పరిశీలించిన గ్రంథం దివికుమార్ గారు ఉదహరించిన 'నా నెత్తురు వృధా కాదు' మాత్రమే. అందులోనుంచి ఈ కోర్టు ప్రకటనను పునర్ముద్రించ దలచుకుని, చదువుతూపోతే ఆ అనువాదంలో ఎన్నో దోషాలు కనిపించాయి. అందువల్ల ఆ అనువాదం బదులు మరొక అనువాదం దొరుకుతుందా అని వెతికినప్పుడు, ఆ కోర్టు ప్రకటనలో ఒక భాగంగా, 'విప్లవమంటే' భగత్‌సింగ్ ఇచ్చి వివరణను మాత్రం తెలుగుచేసిన అనువాదంగా ఇది దొరికింది. ఇది 'పంజాబ్ యూనివర్సిటీ ఇంగ్లిషు ప్రచురణ భగత్‌సింగ్ జీవిత చరిత్ర నుంచి అనువదించాన'నే నోట్‌తో ముడార్ వేణు అనువాదంగా మొట్టమొదట సృజన మార్చి 1974 సంచికలో అచ్చయింది. ఆ తర్వాత మాకు తెలిసి కనీసం మరొక మూడు సంకలనాలలో అచ్చయింది. ఈ నలుగురు ప్రచురణకర్తలకు ఒకే ఉద్దేశ్యం ఉంటుందనుకోవడానికి వీలులేదు. మేం మా స్థల పరిమితుల దృష్ట్యా దాన్ని యథాతథంగా అచ్చువేశాం గాని దివికుమార్ ఊహిస్తున్నట్టు 'కొన్ని పంక్తులు' 'తొలగించి' అచ్చువేయలేదు. మాకు ఆ అవసరమూ లేదు. మాకు లేని 'ఆంతర్యాలను' ఊహించి, చెప్పుకోవాలని నిలదీయడంలోని ఆంతర్యాలతో కూడా మాకు పనిలేదు. ఉద్దేశ్యాలను వెతకడవే పనిగా పెట్టుకుంటే దేనిలోనయినా ఏదయినా కనిపెట్టవచ్చునని కూడా మేమనుకుంటాం.

- సంపాదకులు

రచయితలకు సూచన

ఏ పత్రికయినా తాను అచ్చువేసే రచనలు తనకే ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటుంది. 'వీక్షణం' కూడ అంతే. ఇటీవల కొందరు రచయితలు తమ రచనలను ఒకేసారి అనేక పత్రికలకు పరిశీలన కోసం పంపుతున్నారు. 'వీక్షణం' పరిశీలనలో ఉన్న రచనలు, రాబోయే సంచికలలో అచ్చుకోసం ఎంపిక చేసి పెట్టుకున్న రచనలు ఇతర దినపత్రికలలోనో, వార పత్రికలలోనో వెలువడడం మా దృష్టికి వస్తోంది. ఇతర పత్రికలకు పంపిన రచనలను 'వీక్షణం'కు పంపించగూడదని రచయితలకు విజ్ఞప్తి చేస్తున్నాము.

- సంపాదకులు

అసహజ మరణాల సూచి

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. ఆ సహజ మరణపు వయోపరిమితి దేశ కాల పరిస్థితులను బట్టి, జీవన ప్రమాణాలను బట్టి అరవైల నుంచి తొంబైల దాకా ఉండవచ్చు. కాని మన సమాజంలో సాధారణ ఆయు ప్రమాణం 63 సంవత్సరాలు అయినప్పటికీ ఎంతోమంది పుట్టుకలోనే మరణిస్తున్నారు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ మరణం అనేక రూపాలలో సంభవిస్తోంది. ఆకలి, అనారోగ్యం, మానసిక ఆందోళనలు, సామాజిక అసమానతలు, వరకట్న మరణాలు, నిర్లక్ష్యం, అంటరాని తనం, వ్యవసాయం, చేనేత వంటి రంగాల్లోని సంక్షోభాలు, పారిశ్రామిక అశాంతి, జీవనోపాధి లేమి అసహజ మరణాలకు లెక్కలేనన్ని కారణాలున్నాయి. మన పక్కనె మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైనపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చుయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే, ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

తేదీ	ఆత్మహత్యలు			హత్యలు				గుర్తు/కారణాలు తెలియని	ప్రమాదాలు			చికిత్స అందక, అనారోగ్యం	పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
	వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు	ఫ్యాక్షన్	కులం	మతం	తగాదాలు		పనిచేసే స్థలంలో	రహదారి	ఇతరాలు		ఉద్యమ కారులు	ఇతరులు			
26-9-2006 నుండి 2-10-2006	3		18	1	-	-	2	6	1	27	14	1	-	-	-	3	-
3-10-2006 నుండి 9-10-2006	-	-	19	-	-	-	5	3	-	20	14	7	2	-	-	1	-
10-10-2006 నుండి 16-10-2006	6	-	23	2	-	-	8	9	1	22	14	43	5	-	-	1	-
17-10-2006 నుండి 25-10-2006	5	-	29	3	-	-	12	6	-	23	11	37	-	1	-	8	-
మొత్తం	**14**		**89**	**6**	**-**	**-**	**27**	**24**	**2**	**92**	**53**	**88***	**7**	**1**	**-**	**13**	**-**

మీ అందరి సహకారంతో అన్ని జిల్లాల పూర్తి సమాచారంతో భవిష్యత్తులో ఈ శీర్షికను మరింత సమగ్రంగా అందించే ప్రయత్నం చేస్తాం.

*ఇందులో 83 మందికి డెంగూగా రిపోర్ట్ అయ్యింది.

ఆంధ్రప్రదేశ్ : నాడు - నేడు

ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ వినియోగ సరళి

సంవత్సరం	గృహ అవసరాలకు	వాణిజ్యం	వ్యవసాయం	పరిశ్రమలు	రైల్లు నడవడానికి	ఇతరులు	మొత్తం
1960-61	10.8	5.16	9.08	72.76	-	2.2	100
1965-66	8.15	8.22	16.05	65.60	-	1.98	100
1970-71	8.17	5.83	18.44	65.44	-	2.12	100
1980-81	10.70	4.23	18.44	63.07	0.98	2.59	100
1985-86	11.59	3.30	25.28	54.78	2.03	3.03	100
1990-91	12.79	3.16	38.62	39.03	2.18	4.22	100
1995-96	14.00	3.01	48.85	27.55	2.70	3.89	100
2000-01	21.71	4.54	40.78	22.84	3.39	6.74	100
2003-04	21.12	4.87	37.07	25.90	3.32	7.72	100

(మూలం : డైరెక్టరేట్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్)

(33వ పేజీ తరువాయి)


విధానాలే ఆచరణాత్మకమైనవి. ఇది ప్రధానంగా ప్రభుత్వం చేతిలోని విషయమే కాబట్టి ఈ రకమైన పరిష్కారానికి ఆస్కారం ఉంది. ఈ విషయంలో లోక్‌సత్తా సరైన దారిలోనే ఉంది. ఇక జయప్రకాశ్ నారాయణ్ ఉద్వేగపూరిత అంశాలపై అటూ ఇటూ మాట్లాడకుండా చాలా జాగ్రత్తలే తీసుకుంటున్నట్టు కనిపిస్తున్నారు. ఏక పద, ఏక వాక్య సమాధానాలు ఆశించి అడిగిన ప్రశ్నలకు కూడా విశ్లేషణాత్మక, తాత్విక ధోరణిలో సమాధానాలివ్వడం ద్వారా నొప్పించక తానొవ్వక వ్యవహరిస్తున్నారు. ఇది మరీ ఎక్కువైతే "గోపి" ముద్రపడే అవకాశముందని ఆయన గుర్తించాలి. కొన్ని సందర్భాల్లో మరీ అతి జాగ్రత్త పాటిస్తున్నారు. చివరకు అఫ్జల్ ఉరి విషయంలో అటూఇటూ కాని విశ్లేషణతోనే సరిపెట్టే ప్రయత్నం చేశారు. నాగరిక దేశంలో ఉరిశిక్ష ఉండదగినదేనా అనే విషయంలో కూడా ఇంత డొంక తిరుగుడు మాట్లాడడం చూస్తే ఆయన వైఖరిలో జాగ్రత్త పాలు ఎంతో అర్థమవుతుంది. సమస్యల్లా ఏమిటంటే అధికారంలోకి రావాలనుకునే రాజకీయపార్టీకి తాము చేయకూడని పనుల గురించి ఉన్నంత జాగ్రత్త , స్పష్టత తాము చేయాల్సిన పనుల గురించి కూడా ఉండాలి.

చివరగా జయప్రకాశ్ మాటల్లో ధ్వనించే అత్యంత ప్రమాదకరమైన ధోరణి ఒకదాని గురించి మాట్లాడుకోవాల్సిన తప్పనిసరి అవసరం ఉంది. ఆయన ఎప్పుడు అవినీతి నిరోధం గురించి మాట్లాడినా టెలిఫోన్ ఉదాహరణ తెస్తుంటారు. ఒకప్పుడు బిఎస్ఎన్ఎల్ కనెక్షన్ కోసం ఎన్ని తిప్పలు పడాల్సి వచ్చేదో ఎలా చేతులు తడపాల్సి వచ్చేదో ఉదహరిస్తూ ఇవాళ మారిన ప్రభుత్వ విధానల వల్ల వాళ్లే మన వెంటబడి కనెక్షన్లు ఎలా ఇస్తున్నారో చెపుతారు. దీనికి అదనంగా గ్యాస్ గురించి కూడా మాట్లాడతారు. లాభానికి, విస్తరణకు అవకాశమున్న కొన్ని రంగాల్లో ప్రైవేట్ వారికి దారులు తెరిస్తే ఇలా పరిస్థితులు మారే అవకాశమున్న మాట వాస్తవమే. వినియోగదారులను బిచ్చగాళ్లలాగా చూసే సర్కారీ సంస్థల ఉద్యోగుల తీరువల్ల, మంత్రినుంచి బంట్రోతు దాకా పాతుకుపోయిన అవినీతి వల్ల, జీతాల గురించి తప్ప పనితీరు గురించి పట్టించుకోని(90ల దాకా) మన దిక్కుమాలిన ట్రేడ్ యూనియనిజం వల్ల, అన్నింటికంటే ముఖ్యంగా పనికట్టుకుని సర్కారీ సంస్థలను దివాళా తీయించడానికి సాగుతున్న రాజ్య వ్యూహం వల్ల, సాంకేతిక పరిణామాల వల్ల ఈ పరిస్థితి తలెత్తింది. కానీ ప్రజల మౌలిక అవసరాల విషయంలో ఈ సూత్రం వర్తించదు. ఇదే వర్తిస్తే వారు పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్టే. వీటిని ఉదాహరణగా చూపించి ప్రజల మౌలిక అవసరాలకు సంబంధించిన రంగాలను కూడా ప్రైవేట్ పరంచేసే, కనీసం ఎన్జీవోల పరం చేసే ప్రయత్నాలను మన ప్రభుత్వాలు వ్యూహాత్మకంగా అమలు చేస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో జయప్రకాశ్ నారాయణ్ మాటలు కూడా అదే కోవలో ధ్వనిస్తున్నాయి. ఆ ధ్వని భయం కలిగిస్తున్నది. ఎందుకంటే ఆయన నేరుగా అధికారంలోకి వచ్చినా, రాలేకపోయినా అధికారంలో ఉన్న వారు ఇలాంటి చర్యలకు పాల్పడడానికి సాధికారత కల్పించిన వారయ్యే ప్రమాదం ఉంది. ఓ వైపేమో కార్పోరేట్ కళాశాలలు, ఆస్పత్రులపై విమర్శలు కురిపిస్తూ మరోవైపు ఇలాంటి ప్రమాదకరమైన సంకేతాలు పంపడం చూస్తే కీలకమైన అంశాల్లో మరింత స్పష్టత అవసరమేమో అనిపిస్తుంది.

ఏమైనా లోక్‌సత్తా పార్లమెంటరీ రాజకీయాల్లో భవిష్యత్ భారతానికి సూచిక. భారత్‌లో పట్టణాలు, పట్టణమధ్యతరగతి పెరుగుతున్నదనడానికి సూచిక. లోక్‌సత్తా తరహా ఆలోచనా విధానాలు ఇప్పటికిప్పుడు విజయం సాధించలేకపోవచ్చుగానీ భవిష్యత్తులో మాత్రం అటువంటి సంస్థలు అన్ని రాష్ట్రాల్లోనూ బలంగా వేళ్లూనుకునే అవకాశం ఉంది. ◆

RNI Regn. No. APTEL/2003/11482 Published on 27-10-06

PRINTED BOOK
Postal Regn. No. LII/RNP/H-HD 1029/2004-06



Owned, Printed and Published by V. Hanumantha Rao at 301, Mythri Residency, 3-6-394, Road No. 3, Himayat Nagar, Hyderabad - 500 029. Ph : 66843495. Printed at Charita Impressions, Azamabad, Hyderabad. For Nutan Art Printers, Hyderabad. Working Editor : N. Venugopal

VEEKSHANAM
301, Mythri Residency, 3-6-394, Road No. 3, Himayatnagar, Hyd-29.